# తెలుగు ముస్లిం రచయితలు
# సమాజం - సంస్కృతి


పరిశోధన

**ఎ. సామాన్య**

పర్యవేక్షణ

**డా॥ పిల్లలమర్రి రాములు**



**హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి తెలుగులో**

**పి.హెచ్.డి. పట్టం కోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం**

**2010, ఫిబ్రవరి**

# TELUGU MUSLIM RACHAITALU-SAMAJAM-SAMSKRUTHI

**A. SAMANYA**

*Supervisor :*

**Dr. PILLALAMARRI RAMULU**

*A Thesis submitted to the*

**UNIVERSITY OF HYDERABAD**

in partial fulfillment requirement for the award of the Degree of Ph.D.

**DEPARTMENT OF TELUGU**
**UNIVERSITY OF HYDERABAD**

February, 2010

# కృతజ్ఞతలు

ఈ పిహెచ్‌డి ప్రయాణం అర్ధాంతరంగా ఆగిపోకుండా కొనసాగడానికి కారణమైన పర్యవేక్షకులు శ్రీ పిల్లలమర్రి రాములుగారికి కృతజ్ఞతలు చెప్పుకోవడం చాలా కష్టతరం. ఎందుకంటే ఎంత చెప్పినా అంత మిగిలే ఉంటుంది కనుక. ఏమైనా వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు

నాకు నిజమైన తెలుగు సాహిత్యాన్ని పరిచయం చేసిన మా డిగ్రీ కాలేజ్ తెలుగు లెక్చరర్ శోభాదేవి గారికి ఆమె సహచరుడు సాయి సార్ కి

నా ఎమ్.ఫిల్. పర్యవేక్షకులు ఈ పిహెచ్.డి.కి కూడా నామకరణం చేసిన ఆత్మీయ గురువర్యులు శ్రీ కె.కె.రంగనాథాచార్యులుగారికి,

ఈ ప్రయాణపు ప్రథమంలో అనుకోని ఇబ్బందులు ఎదురైనప్పుడు అండగా నిలిచిన గురువుగారు ముదిగొండ వీరభద్రయ్యగారికి,

ప్రస్తుత శాఖాధ్యక్షులు శ్రీ బేతవోలు రామబ్రహ్మం గారికి,

జీవితంలో నిలదొక్కుకొనే ఆర్థిక ధైర్యాన్నిచ్చిన మేడమ్ శరత్‌జ్యోత్స్నారాణిగారికి

ఆత్మీయంగా పలుకరించే మేడమ్ అరుణకుమారిగారికి

ఇంకా రామనరసింహం మాస్టర్‌కి, రాజుగారికి, దార్ల వెంకటేశ్వర రావుగారికి

అడగకుండానే వరాలిచ్చే ఆత్మీయులు ఎండ్లూరి సుధాకర్‌గారికి

అడిగిన వెంటనే తమ సిద్ధాంత గ్రంథం పంపించిన షేక్ మస్తాన్ గారికి

మొదటి నుండి చివరి వరకు విలువైన సలహాలు అందించిన రసరేఖ సంపాదకులు శ్రీ ముంగర జాషువా గారికి

ఉస్మానియా ప్రొఫెసర్ రుక్నుద్దీన్‌గారికి, సిద్ధిక్ అలీ గారికి, ఎస్.వి. సత్యనారాయణ గారికి,డిజిటల్ లైబ్రరీ ఇంచార్జ్ సురేంద్ర గారికి, హెచ్‌సియు లైబ్రరీ ఇస్తారీ గారికి,

మెటీరియల్ సేకరించి పెట్టిన తమ్ముళ్ళు సుదర్శన్‌కి, రాహుల్‌కి

ఇంకా సహృదయులు శిలాలోలిత, షేక్ కరీముల్లా, హనీఫ్, సలీం, గీత, స్కైబాబా, షాజహానా, స్నేహితురాలు అన్సారీ ఆమె భర్త అన్వర్ గారలకు

ఆత్మీయంగా సహకరించే బోధనేతర సిబ్బంది, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీధర్, నరసింహ రావు, కిషన్ గారలకు

డిటిపి చేసి ఇచ్చిన శ్రీ రాజారపు బ్రహ్మయ్య గారికి, ఎం.జె. సుగుణాకర్ గారికి, చివరిలో తప్పు ఒప్పులు దిద్దిన రామ్ కుమార్ గారికి

నా తమ్ముడు శ్రీకాంత్ ప్రేమ పూర్వక సహన సహకారానికి

ఇంకా ఈ సుదీర్ఘ ప్రయాణంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి నా వినమ్ర సహస్ర నమస్కారాలు.

- సామాన్య

# ఈ పరిశోధన గురించి ...

కాలం ప్రవహిస్తూ ఉంటుందని అంటారు. ఈ కాల ప్రవాహంలో ఎన్నో నాగరికతలు, సంస్కృతులు కాలగర్భంలో కలసిపోతూ ఉంటాయి. కొత్త నాగరికతలు, సంస్కృతులు పుట్టుకొస్తూ ఉంటాయి. కాలగర్భంలో కలసిపోయినవి చెడ్డవి కావు. కొత్తవి అన్నిసార్లు మంచివీ కావు. ఆశ్చర్యకరంగా కొన్నిసార్లు వచ్చు కాలము కంటే గతమే మేలని భావించాల్సిన సందర్భాలు ఉంటాయి.

పి.హెచ్.డి. పరిశోధనకై నేను ఎంచుకున్న అంశం తెలుగు ముస్లిం రచయితలు – సమాజం – సంస్కృతి, నేను ఈ అంశాన్ని ఎంచుకున్నప్పుడు, ఇప్పుడూ ముస్లిం మైనారిటీవాదం ఒక ఉద్యమంగా ఉధృతంగా నడుస్తూ ఉంది. అప్పటికే పలు సమకాలీన పత్రికల్లో ముస్లిం మైనారిటీ రచయితల రచనలు చదువుతూ ఉండడం వల్ల ముస్లిం మతానికి చెందని నాకు అసలేం జరుగుతుందో తెలుసుకోవాలనే ఒక ఆసక్తి ఏర్పడింది.

అసలు ముస్లింలు ఎవరు, భారతీయత వారిలో ఎంతపాళ్ళు, ముస్లింలను భారతీయులు కాదనే భారతీయులు నిజంగా భారతీయులేనా ? మెజారిటీ వర్గ ప్రజలకి, ముస్లింలకి సంస్కృతులలో తేడాలేమిటి, మరీ ముఖ్యంగా స్త్రీలపట్ల, వివాహ సంబంధాల పట్ల వారి దృక్పథం ఎటువంటిది. ఒక కవి ఆనాటి పరిస్థితులను అనుసరించి సులువుగా అనేసినట్లు వారు 'కసాయిబు'లా వంటి ప్రధాన స్రవంతి ప్రజలకున్న అనేక సందేహాలే నాకూ కలిగాయి.

ఇప్పుడు నడుస్తున్న విడి ఉద్యమాల సందర్భంలో మైనారిటీ ఉద్యమం స్థానం ఏమిటి ఇతర ఉద్యమాల పట్లవారి దృక్పథం ఏమిటి, ఇతర ఉద్యమాలకు, మైనారిటీ ఉద్యమం పట్ల ఉన్న దృక్పథం ఏమిటి అని తెలుసుకోవాలని అనిపించింది.

దళితులలాగే మొదట విప్లవ బావుటాను ఎగరేసి కమ్యూనిస్టు గూటికి చేరిన ముస్లింలు ఎంతమంది, విడివడి ప్రత్యేక ఉద్యమంలోకి వచ్చినవారు ఎంతమంది తెలుసుకోవాలని పించింది. పరిశోధించాల్సిన అంశాలు పైన ప్రస్తావించినవి అనేకం ఉన్నా, నేటి సామాజిక

పరిస్థితులలో ముస్లింలు వేయబోయే అడుగు ఎటువైపు అన్నది ప్రధాన పరిశోధనాంశంగా అనిపించింది. దానిపైనే దృష్టి కేంద్రీకరించడం జరిగింది. అందుకే వారి సమాజాన్ని, సంస్కృతిని పరిశీలించటం జరిగింది.

మొదటి అధ్యాయం ప్రవేశికను విడిచిపెడితే ఈ పరిశోధనలో పలు ఆసక్తికరమైన అంశాలు వెల్లడైనాయి. రెండవ అధ్యాయమైన ముస్లిం కవుల సంప్రదాయ, సాహిత్య పరిశీలన వలన పాతతరం ముస్లింలకు అసలు ప్రధాన స్రవంతి ప్రజల పట్ల వ్యతిరేకత లేదని వారు తమను తాము అగ్రవర్ణాలవారిగా భావిస్తూ దళితులను చూసి జాలి పడే స్థితిలో ఉన్నారని అర్థమవుతుంది.

మూడవ అధ్యాయం ముస్లిం రచయితల కథా సాహిత్యం, సామాజిక దృక్పథానికి వచ్చే సరికి ముస్లిం రచయితల కలాలు, గళాలు పదునెక్కి ఆశ్చర్యపెడతాయి. ఆశ్చర్యంగా వారు తాము దళితులమేననడం కనిపిస్తుంది. తమను భారతీయులుగా గుర్తించాలని డిమాండ్ చేయడం ఆశ్చర్యపెడుతుంది. అందుకే గతము మేలు వచ్చుకాలము కంటెన్ అని మొదట ప్రస్తావించింది.

నాలుగవ అధ్యాయం ముస్లిం కవుల మత తాత్విక దృక్పథం, సామాజిక లక్ష్యాలను పరిశీలిస్తే అత్యధిక ముస్లింలకు మత దృక్పథం లేదని తమ మతం విధించిన కఠిన కట్టుబాట్లను కాలరాయాలనే కాంక్షకూడా వారిలో ఉందని అర్థమవుతుంది. దాంతోపాటే తాము ఈ దేశానికి చెందినవారం కామనే వ్యక్తులపట్ల కోపం, వేదన వారిలో కనిపిస్తాయి.

ముస్లింలు మంచి సౌందర్య కాంక్ష కలిగినవారు. ఆ విషయాన్ని వారి కట్టడాలు, అత్తరులు, జిలుగు వస్త్రాలు నిరూపిస్తాయి. తెలుగు మాతృ భాష కాకున్నా ఈ తెలుగు ముస్లిం రచయితలు తమ రచనల్లో అడుగడుగునా మంచి రసవంతమైన సౌందర్యాన్ని గుబాళింప చేశారు. పలు ఉదాహరణలతో ఆ విషయాన్ని నిరూపించడం జరిగింది.

ముస్లిం మతంలో హేతువుకు తావు లేదని అనేకుల విశ్వాసం. ముస్లిం మతంలోనే కాదు ఏ మత ధర్మంలోనైనా హేతువు పాళ్లు స్వల్పమే. కాని నేటితరం ముస్లిం మేధావులు

బలమైన తార్కిక శక్తిని హేతు బుద్ధిని కలిగి ఉన్నారని ముస్లిం రచయితల హేతువాద దృక్పథం అన్న అధ్యాయంలో నిరూపించడం జరిగింది.

చివరిగా నేటి రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ముస్లిం ప్రజల, మేధావుల, కళాకారుల, రాజకీయ దృక్పథం ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం ఇవాళ ఏర్పడి ఉంది కనుక ముస్లిం రచయితల వివిధ రచనల సహకారంతో ఆ విషయాన్ని ప్రస్తావించి వారి దృక్పథాన్ని వివరించడం జరిగింది. దాంతోపాటే వారిలో జాతీయ భావనలను కూడా ఉదహరించి విశ్లేషించడం జరిగింది.

చివరిగా భారతదేశంలో నివసించే ముస్లింలు భారతీయులేనని ఈ దేశంలో ఏ సంస్కృతి ఉందో అదే వారి సంస్కృతి అని ఈ సమాజంలో వారూ భాగస్వాములే అని ముస్లింలు లేని భారతీయ సమాజం లేదనే అవగాహనకు రావడం జరిగింది.

**A. SAMANYA**

*Ph.D. Student,*

*Department of Telugu*

*University of Hyderabad.*

*This is to certify that I, A. Samanya has carried out the research embodied in the present thesis for the full period prescribed under Ph.D. Ordinances of the University of Hyderabad. My topic of the Ph.D. programme is* **"TELUGU MUSLIM RACHAITALU-SAMAJAM-SAMSKRUTHI"**.

*I declare to the best of my knowledge that no part of this thesis was earlier submitted for the award of Ph.D. Degree of any University.*

| | |
|---|---|
| Signature of the | A. Samanya |
| Supervisor | Regd. No.01HTPH03 |

| | |
|---|---|
| Head of the Department | Dean of the School |

# విషయసూచిక

పుట సంఖ్య


| | | |
|---|---|---|
| **I.** | **ప్రవేశిక** | 1 |
| **II.** | **ముస్లిం కవుల సంప్రదాయ సాహిత్యం - భిన్న ధోరణులు** | 17-48 |
| II.1 | బ్రహర్షి ఉమర్ అలీషా | 23 |
| II.1.A | ఉమర్ ఆలీషా గారి రచనలు | 23-24 |
| II.1.B | ఖండ కావ్యములు | 24-33 |
| II.1.C | అనసూయా దేవి | 33-34 |
| II.1.D | మహాభారత కౌరవ రంగము | 34-36 |
| II.1.E | ఉమర్ ఖయ్యామ్ | 36-38 |
| II.1.F | బ్రహ్మ విద్యావిలాసము | 38-40 |
| II.2.A | షేక్ ఖాసిం | 40-41 |
| II.3. | షేక్ బుడన్ సాహెబ్ | 42-48 |
| **III.** | **ముస్లిం రచయితల కథా సాహిత్యం - సామాజిక దృక్పథం** | 51-96 |
| III.1. | రహమతుల్లా 'బా' | 53-54 |
| III.1.A. | బా సంపుటిలోని కథలు | 54 |
| III.1.B. | నర్గీస్ | 55-57 |
| III.1.C. | బోర్డర్స్ | 57-59 |
| III.1.D. | అఫ్జల్ బిచారా | 60-63 |
| III.1.E. | పీపల్ మే నీమ్‌కాపేడ్ | 63-66 |
| III.1.F. | అమ్మీజాన్ | 67-69 |
| III.1.G. | ప్యార్ మీర్జా మహేశ్వరికా | 69-72 |

| | | |
|---|---|---|
| III.1.H. | బందీపింజరేకేబినా | 72-75 |
| III.1.I. | కిరాయ్‌మకాన్ | 75-76 |
| III.1.J. | పుట్‌పాత్ | 76 |
| III.1.K. | "బా" | 76 |
| III.2. | ఖదీర్ బాబు పోలేరమ్మబండ కథలు | 77 |
| III.2.A. | బతికానురా తండ్రి కుమార స్వామీ | 78 |
| III.2.B. | ముక్కాలు, ఆపురేటు, బజ్జి బజ్జి | 78 |
| III.2.C. | మా దాదీమా వాళ్ల నానమ్మ నడుమ బామ్మ | 78 |
| III.2.D. | మంచుకన్న తెల్లనైన మనసులున్నదెవరికి | 79 |
| III.2.E. | కంచంపొత్తు కందుల మాలకొండారావుతోటే... | 80-81 |
| III.2.F. | గణగణ గంటలు మోగెను... | 82-83 |
| III.3. | దర్గామిట్ట కతలు | 83-84 |
| III.3.A. | నా పేరు పెట్టింది మీసాల సుబ్బరాజు | 84 |
| III.3.B. | అలీఫ్, బే,తే మా నాయినమ్మకు గోరీకడితే | 84-85 |
| III.3.C. | మా యిస్కూలు యానివర్సిరీకి దుమ్ము లేపేసినా | 85 |
| III.3.D. | కసాబ్‌గల్లీలో సేమ్యాల ముగ్గు | 86-87 |
| III.3.E. | పండగపూట పలావు ముక్కల కత | 87 |
| III.3.F. | చీదలు పంజారాలు మాగలు కండసుదుములు | 87 |
| III.3.G. | ఇది మా నాయి నిచ్చిన ఆస్తి | 88 |
| III.3.H. | నేరేళ్ల మస్తాన్ సురేష్ నాదేవుడు....88-89 | |
| III.4. | ఖదీర్‌బాబు "ధాకన్" | 89-96 |

| | | |
|---|---|---|
| **IV.** | **ముస్లిం కవుల మత, తాత్త్విక ధృక్పథం - సామాజిక లక్ష్యాలు** | **99-166** |
| IV.1. | మెహజబీన్ - ఆకురాలు కాలం | 103-111 |
| IV.2. | షాజహానా - నఖాబ్ | 111-121 |
| IV.4. | ఖాదర్‌మొహిద్దీన్ - పుట్టుమచ్చ | 121-136 |
| IV.4. | షేక్ కరీముల్లా - సాయిబు | 137-147 |
| IV.5. | దిలావర్ 'కర్బలా' | 147-157 |
| IV.6. | సలీం : నీలోకి చూసిన జ్ఞాపకం | 157-159 |
| IV.7. | యాకూబ్ - సరిహద్దురేఖ | 159-166 |
| **V.** | **ముస్లిం రచయితల సౌందర్యతత్వం** | **169-234** |
| VI. | ముస్లిం రచయితల హేతువాద దృక్పథం | 207-208 |
| VI.1. | షాజహానా సిల్‌సిలా | 208-209 |
| VI.2. | షేక్ చిన మస్తాన్ వలి బ్యాండ్‌ట్రూప్ | 211-212 |
| VI.3. | దూదే"కులం" | 212-215 |
| VI.4. | మహమ్మద్ నిస్సార్ ముల్కి - | 215 |
| VI.5. | గౌస్ మొహిద్దీన్ - గుంగీధడ్కన్ | 215 |
| VI.6. | యాకూబ్ - మన్నత్ | 216-217 |
| VI.7. | దిలావర్ - ధోకా | 217-218 |
| VI.8. | స్కైబాబా - దస్తర్ | 218 |
| VI.9. | షాజహానా-సండాస్ | 218-219 |
| VI.10. | జాకీరా - ముస్నీమాకి కహానీ | 220 |
| VI.11. | బుర్ఖా : యాస్మీన్‌బేగం | 222 |
| VI.12. | ఎం.ఎస్.బేగం - దిల్ ఔర్ జిందగీ | 223 |

# I. ప్రవేశిక

"ఆర్య రక్తంబు వీరి దేహములయందు
స్వచ్ఛమై నేటి దాకయే పారుచుండె
మతము వేరైన జాతి సమ్మతము గాదె
భ్రాతృ వరులార సుగుణ సంపన్నులార !

- ఉమర్ అలీషా

మానవ సమాజం యొక్క రూపు రేఖలను పురావస్తు శాస్త్రవేత్తలు, మానవ శాస్త్రవేత్తలు చరిత్రకారులు అనేక పరిశోధనలు సలిపి సమగ్రంగా నిర్వచించారు. వారి ప్రకారం రూపొందించారు. మానవుడు, మానవ సమాజం బహు మార్పులకులోనై చివరకు నాగరిక సమాజం ఏర్పడింది.

ప్రాచీన సమాజంలో, మనుగడకు అడ్డు గోడలైన కులమత భేదాలుగాని, వర్ణ బేధాలుగాని, వర్గ బేధాలుగాని లేవు. ప్రాచీన శిలాయుగపు మానవుడు, ప్రకృతి వైపరీత్యాలకు, పరిసరాల ప్రభావానికి, సమూహాల మధ్య ఉన్న ఘర్షణలకు ప్రతిస్పందించి, తనమనుగడకు "అన్వేషకుడై" "జిజ్ఞాసి" యై వేల సంవత్సరాల కృషి ఫలితంగా, జంతు దశనుంచి విడివడి తనకో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకొన్నాడు. నాగరికుడై తరువాత సంస్కృతీపరుడైనాడు. సంస్కృతి లేని సమాజము జీవం లేని శరీరము లాంటిది. సమాజానికి సంస్కృతియే ఆత్మ. సంస్కృతీ పరులు ఎక్కువగా ఉన్న సమాజాన్ని ఉత్తమ సమాజంగా మనం గుర్తించవచ్చు. గ్రీకు తాత్వికుడైన ప్లేటో అలాటి ఒక ఆదర్శ సమాజాన్ని 'రిపబ్లిక్' అనే తన రచనలో ఊహించాడు.

మానవ సమాజం గతిశీలత కలిగి ప్రయాణిస్తుంది. ఈ ప్రయాణంలో అనేక సంఘర్షణలకు లోనవుతుంది. ఇందులో భాగంగా, మత ఘర్షణలు, కుల ఘర్షణలు, వర్గ, వర్ణ ఘర్షణలు, జాతుల ఘర్షణలు, దేశాల మధ్య సంఘర్షణలు కలిగివుండి సమాజం నిరంతరం మారుతూ వుంటుంది. ఈ మార్పు సమాజం యొక్క అస్తిత్వానికి గుర్తు. మార్పులేని సమాజాన్ని మనం ఊహించలేము. మనిషికి లేక మనుషులకు మధ్య కొంత సామరస్యము కలిగి వుండి, కలసి మెలసి జీవించే సమూహాన్ని సమాజం అని అంటున్నాం.

అయితే మానవ సమాజం మొత్తంగా  ఒకే సంస్కృతిని కలిగి వుంటుందా? లేక మానవ జాతి లేక దేశం అనుసరించేది అంతా ఒకే సంస్కృతియేనా? అనే ప్రశ్నలు ఉదయించవచ్చు. ఇటువంటి ప్రశ్నలు తలెత్తడం అసహజం కాదు.  ప్రపంచంలోని అనేక జాతులు, మతానుయాయులు భిన్న సంస్కృతులు కలిగి వున్నారు. అయితే మానవజాతి భిన్న సంస్కృతుల సమ్మేళనం, మతరీత్యా, జాతిరీత్యా, దేశరీత్యా సంస్కృతి మారుతుంది. అయితే భిన్న కాలాలలో, భిన్న దేశాలలో  మానవులు/మానవ సమాజం భిన్న సంస్కృతులను కలిగి వున్నప్పటికీ ఈ భిన్న సంస్కృతులను  కలిపే అంతస్సూత్రం ఒకటి వుంటుంది. అందువలన భిన్నత్వంలో ఏకత్వం అనేది సంస్కృతికి సంబంధించిన ఒక అంతస్సత్యం. ఇటువంటి భిన్న సంస్కృతులకు భారత దేశం ఒక మంచి నమూనాగా ప్రశంసించబడింది. ప్రపంచం మొత్తానికి ఒకే మతం వుండాలని ఒకే సంస్కృతి ఉండాలని కొంతమంది మతవాదుల ఆలోచన విధానం సరి అయింది కాదు అసమంజమైనది  కూడా!

'సంస్కృతి' అనే పదం, ఇంగ్లీషు పదం అయిన కల్చర్ నుంచి వచ్చినది. ఇది 'Colere' అనే లాటిన్  పదజనితం. 'సంస్కృతి' అంటే అర్థం సంస్కారం. ఈ సంస్కారం సునిశితమైన ఆలోచనలవలన, సుందరమైన అనుభూతుల వలన, ఇంకా అనేకమైన లలితమైన విషయాల వలన ఏర్పడుతుంది. సంస్కృతులను బట్టి వ్యక్తి యొక్క సభ్యత వుంటుంది. సంస్కృతి ఆంతరంగికమైనదైతే సభ్యత బాహ్యమైనది. ఒక జాతి యొక్క సభ్యతా, సంస్కారాలను బట్టి ఆ జాతి, లేక దేశము యొక్క సంస్కృతి సాంద్రతాసాంద్రతలను నిర్ణయిస్తారు.

సమాజంలో, వ్యక్తిలో ఉన్న సంస్కారాన్ని లేక సంస్కృతిని మూడు విధాలుగా విభజించవచ్చును. అవి (1) వ్యక్తిగత సంస్కృతి, (2) వర్గగత సంస్కృతి, (3) సమాజగత సంస్కృతి  అని  విభజించవచ్చును.

ఈ మూడువిధాలైన సంస్కృతులు కూడా పరస్పరాశ్రితాలు. మనం ఏ సమాజం నుంచి వచ్చామో ఆ సమాజ సంస్కృతి, ఏ వర్గం నుంచి వచ్చామో ఆ వర్గ సంస్కృతి, మనలో నిక్షిప్తమై ఉంటాయి. మనిషికి పాజిటివ్ థింకింగ్ రావడానికి, అతని యొక్క వ్యక్తిత్వ, వర్గ సామాజిక ప్రభావాల సమ్మేళనం దోహదపడుతుంది. గతి శీలంగా ప్రవహించే సంస్కృతిలో ప్రధానంగా రెండు విరుద్ధ ధోరణులు కనిపిస్తాయి. ఒకటి ప్రగతిశీల పురోగమన వాదంగా కనిపిస్తుంటే

రెండవది పరిణామరహిత తిరోగమన వాదంగా కనిపిస్తుంది. ఒకటి ఆధునిక భావజాలాన్ని, పరిణామాలను ఆకళింపుచేసుకొని ఆదర్శసమాజ నిర్మాణం వైపుకి పయనిస్తుంటే రెండవది నిశ్చల భావజాలాన్ని (stagnated ideas) కప్పుకొని ఆటవిక సమాజ నిర్మాణం వైపుకి పయనిస్తుంది.

ఒకనాడు భారతదేశ సంస్కృతి, ప్రపంచ దేశాలకు తత్త్వశాస్త్రంలోనూ, గణితంలోనూ, కళారంగం లోనూ ఓనమాలు దిద్దింది. భారత్, గ్రీకు దేశాలు ప్రపంచానికి విజ్ఞాన భిక్ష పెట్టాయని అనడంలో ఎలాంటిసందేహంలేదు. గ్రీకుతాత్వికులైన సోక్రటీసు, ప్లేటో, అరిస్టాటిల్, అనేక శతాబ్దాలు తమ జ్ఞాన సూత్రాలతో ప్రపంచాన్ని శాసించారు. అదే కాలంలో మన దేశములో ప్రభవించిన, బుద్ధుడు, యాజ్ఞవల్క్యుడు, మహావీరుడు, తరువాత శంకరాచార్యులు ఇంకా అనేక మంది తాత్త్వికులు, ఉపనిషత్ కారులు, దర్శన కారులు, సాంఖ్య, వైశేషిక సిద్ధాంత కర్తలు జ్ఞాన మీమాంసను (Epistemological Enquiry) విస్తృతం చేశారు. ఇరవయ్యో శతాబ్దంలో పుట్టిన మార్క్సిస్టు తత్వ శాస్త్రం కూడా విస్తృతంగా సామాజిక, ఆర్థిక సూత్రాలను విశ్లేషించి ఆచరణాత్మకంగా సమాజంలో పరిణామానికి కృషి చేసింది. గాంధీవాదం కూడా ప్రపంచ వ్యాప్తంగా తన ప్రభావాన్ని చూపగలిగింది.

భారతదేశంలో విభిన్న సంస్కృతులున్నట్లే, అందులో భాగమైన మన ఆంధ్రప్రదేశ్‌లో కూడా విభిన్న సంస్కృతుల సమ్మేళనం రూపు దిద్దుకుంది. ఇందులో భాగంగా మన కళారంగం, సాహితీరంగం భిన్న సంస్కృతులకు ఆలవాలమైంది. హిందూ, బౌద్ధ, జైన, క్రైస్తవ, ముస్లిం సంస్కృతులు ఇక్కడ సహజీవనం చేస్తున్నాయి. ఈ సహజీవనం కాంతిమయంగా, శాంతిమయంగా వికసించడానికి సంస్కృతి తోడ్పడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే సంస్కృతీ పరులందరూ  ఒకేమాట, ఒకేభాష, ఒకే హృదయం కలిగి వుంటారు. సంస్కృతిని విశాలదృక్పథంతో అర్థం చేసుకొనే వారిలో ఈ సమానత్వం సిద్ధిస్తుంది. సంస్కృతీపరుల మధ్య, కులమత భేదాలు, పేద, ధనిక తారతమ్యాలు ఏమీ వుండవు. వారి మధ్య వుండేది ఒక ఉదాత్తమైన, హృదయ సంబంధమైన సురభిళం మాత్రమే!

మహాకవి గురజాడతో ప్రారంభమైన ఆధునిక సాహిత్యయుగంలో ముస్లింకవులు,పండితులు, మేధావులు ఆంధ్రుల సమాజానికి సంస్కృతికి చేసిన మేలు కీళ్లను పరామర్శించడమే ఈ సిద్ధాంత వ్యాసం యొక్క ప్రయోజనమని భావించడం జరిగింది. సామాన్యంగా కొంత విద్యాధికులైన, ముస్లిం కవులు ఛంద్, వ్యాకరణాలకు దూరమై వుంటారని, వారికి మన తెలుగు సాంప్రదాయ పద్య, గద్య రచనలు చేయలేరనే అపోహతో వుండే వారు అత్యధికులు. వాస్తవంగా ముస్లిం కవులు, అచ్చమైన సాంప్రదాయ తెలుగు కవులకు సాటిగా, ధీటుగా, సాంప్రదాయక కావ్యాలను అనేకం రచించారు. అంతే కాక ముస్లిం కవులు, రూపం – సారం అనే వాటిలో కూడా మన సాంప్రదాయ కవులకు ఏ మాత్రం తీసిపోరనే విషయాన్ని ఈ సిద్ధాంత వ్యాసం నిరూపిస్తుంది.

తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియలు వున్నాయి. పద్య, గద్య, వచన, నాటక, ప్రక్రియలు. ఇవేకాకుండా ఇంకా అనేక ప్రక్రియలు సాహిత్యంలో చోటుచేసుకొని ఉన్నవి. యాత్రా రచనలు, వైజ్ఞానిక, తాత్త్విక రచనలు అనువాదాలు అన్నీ వాఙ్మయం విభాగంలోకే వస్తాయి. సాహితీ లేఖలు కూడా ఇందుకు మినహాయింపు కాదు. అసలు బాహ్యదృష్టితో గమనిస్తేనే మిగతా మతాల సాహితీకారులవలెనే అన్ని ప్రక్రియాలలోను ముస్లిం కవులు, రచయితలు, తమ ప్రతిభా పాటవాలను సరి సమానంగా నిరూపించారని తెలుస్తుంది. ఇటువంటి విభిన్న ప్రక్రియలలో ఏవిధంగా ముస్లిం కవులు, పండితులు తమ ప్రతిభావ్యుత్పత్తులను వెల్లడిచేసినది, ఈ సిద్ధాంత వ్యాసంలో చర్చించబడుతుంది.

ఇస్లాం ధర్మాన్ని అవలంబించేవారు ముస్లింలు, ముస్లిం మతస్తులు ఇస్లాం ధర్మాన్ని చాలా నిర్దుష్టంగా అవలంబించడానికి ప్రయత్నిస్తారు అనే విషయం తెలిసిందే. అన్ని మతాల యొక్క అంత ః స్వరూపాన్ని పరిశీలించితే మతాలన్నిటిలోనూ ఆచరణాత్మక వైఖరితో ఉన్నవారు ఉన్నట్లు అవగతమవుతుంది. మతధర్మం సంస్కృతీ సూత్రాలు అనేవి ఇంచు మించుగా వైరుధ్యం కలిగి ఉంటాయి. ఈ వైరుధ్యాన్ని పరిశీలిస్తే అనేక విషయాలు వ్యక్తమౌతాయి. మత సంస్కృతి లేక మత ధర్మాలు " అనుల్లంఘనీయ శాసనాలుగా " " మార్పు చెందని విలువలుగా" గోచరిస్తాయి. అయితే " సంస్కృతి " అనేది ఎప్పటి కప్పుడు మారే " సూత్రాలను ", " విలువలను " , పరిశోధనా ఫలితాలను తనలో ఇముడ్చుకొని విస్తృతి చెందుతుంది. మత సంస్కృతి ఎదుగుదల లేని మార్గంలో పయనిస్తుంటే అసలు శుద్ధ సంస్కృతి (pure cul-

ture) అనేది, విశాలత్త్వంలో, విమలత్వంలో సాగిపోతూ వుంటుంది. అందువలన 'సంస్కృతి' ప్రజాస్వామిక సూత్రాలకు దగ్గరగా ఉంటుంది. అందువల్లనే మనం విరివిగా కల్చర్ మరియు డెమోక్రసీ అనే పదాలను ఉదాత్త సందర్భాల కోసం వాడుతుంటాం. మత సంస్కృతి కొంత కళావిభాగాన్ని, సాంస్కృతిక విభాగాన్ని కలిగి ఉన్నప్పటికీ విశ్వ సంస్కృతి, దేశ సంస్కృతి, అనే వాటికి భిన్నమైనది.

1945లో యునెస్కో ప్రకటించిన చట్టంలో సంస్కృతి గురించి యీ విధంగావుంది. "To develop and maintain mutual understanding and appreciation of the life and culture, the arts, the humanities and the sciences of the people of the world, as a basis for International organisation and world peace" ( సంజీవదేవ్, 1999, P 3) ఈ నిర్వచనం వలన మత సంస్కృతి, సమాజ – సంస్కృతి అనేవి భిన్నమైనవని, ఏ మతంలో పుట్టిన రచయిత/ కళాకారుడైనా, మత భావజాలాన్ని అహేతుకత్వాన్ని, అరాచకాన్ని వీడి మానవ జీవితానికి, సంపూర్ణ సమాజానికి సంబంధించిన సంస్కృతిలో భాగం కావలసిన ఆవశ్యకతవుందని అర్థమవుతుంది. ముస్లిం రచయితలు/ కవులు, మేధావులు కూడా యీ సత్యాన్ని గమనించారు. వారిలో అనేకులు ముస్లిం రచయితలు మత సమాజానికి సంబంధించకుండా, సమాజ, సంస్కృతులకు పునర్జీవం కలిగించే రచనలు, వివిధ ప్రక్రియల్లో చేశారనడం సత్యదూరం కాదు. సంస్కృతిని మత దృక్పథం నుంచి చూడటం సమంజసం కాదు. సంస్కృతికి మతం లేదు.

ముస్లిం కవులు, రచయితలు సాంప్రదాయ దృక్పథంతో అనేక రచనలు చేశారు. వారిలో ఉమర్ ఆలీషా, ఖాసింఖాన్ మొహమ్మద్, ఖాసింఖాన్ సాహెబ్, షేక్ ఖాసిం, మహమ్మద్ గఫూర్‌బేగ్, షేక్ దరియా హుస్సేన్, అచ్చుకట్ల దస్తగిరి, మహ్మద్ సఫీసుదుద్దీన్, తక్కెల్ల పల్లి పాపాసాహెబు, షేక్ ఫరీద్, సయ్యద్ మస్తాన్, ఎస్.ఎమ్ మహబూబ్, షేక్ మహబూబ్ సాహెబ్, షేక్ మహమ్మద్ హుస్సేన్, షేక్ రసూల్, అజ్మదుల్లా, సయ్యద్ ఆలీ. హెచ్. ఖాజా, నఫీజుద్దీన్ మహమ్మద్ (యం.డి.సౌజన్య) షేక్ మహమ్మద్ ముస్తాఫా మొదలగువారున్నారు. వీరేకాక ఇంకా చాలా మంది ముస్లిం కవులు, రచయితలు చందోబద్ధ సాంప్రదాయక వస్తు స్వీకరణతో రచనలు చేయడం వలన పూర్వ సాంప్రదాయంతో వారు ఎంతగా మమేకం చెందినారో స్పష్టమౌతున్నది.

20వ శతాబ్దపు ప్రథమభాగం నుంచి సంస్కృత భాషా రచనల ప్రాబల్యం తగ్గి తెలుగు సాంప్రదాయ రచనల ప్రభావం ప్రారంభమైంది. వాస్తవంగా నన్నయ్య కాలం నుంచే తెలుగు భాషాధిక్యత, ప్రభావాలు సమాజంలో విస్తృతంగా ఉన్నప్పటికీ సంఖ్యాబలంలో తెలుగు పద్యరచనలు తక్కువ కాక పోయినప్పటికీ 20వ శతాబ్దపు తొలి దశలో ఈ ధోరణి ఊపందుకుంది. తిరుపతి వేంకట కవులు, కొప్పరపు కవులు, వేంకట పార్వతీశ కవులు ఇంకా అనేక మంది కవులు "అవధాన సరస్వతి"ని నమ్ముకొని ఆంధ్రదేశం నలుమూలలా కవితాదిగ్విజయ యాత్రలు చేసి ఒక ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. తరువాత వచ్చిన భావకవులు కూడా తమ భావగీతాలతో ఊరు వాడా ఏకంచేశారు. ఈ ప్రభావం ముస్లిం సాంప్రదాయ కవులపైపడి, వారు కూడా సమాజంలో పద్య సంప్రదాయాన్నీ, తద్వారా బ్రాహ్మణీయ లేక వైదిక సంప్రదాయాన్ని సమర్థిస్తూ అనేక రచనలు చేశారు. అందువలన తరువాత అధ్యాయాలలో ముస్లిం రచయితలు చేసిన సంప్రదాయ సాహిత్యసేవను స్థూలంగా పరిశీలించడం జరుగుతుంది.

తెలుగు సాహిత్యంలో మెజారిటీ కవులు సాంప్రదాయ వాదం నుంచి బయటపడి, నూతన దృక్పథాన్ని ఏర్పరుచుకొని ఆధునిక యుగ స్ఫూర్తితో కవితలు, కథలు, గేయాలు, ఇతర ప్రక్రియల్లో రచనలు సాగించినట్లు ముస్లిం కవులు/ రచయితలు కూడా ఆధునిక సాహిత్య నిర్మాణం వైపుకి "బలమైన అడుగులు" వేశారనడం స్పష్టమౌతుంది.ఏ రచయిత కూడా తను జీవించి ఉన్న యుగస్ఫూర్తి నుంచి పూర్తిగా బయటపడలేడు. కవి / రచయిత తాను జీవించి ఉన్న కాలానికి వ్యతిరేకమైన లేక ఊహాజనితమైన అంశాలతో రచనలు చేయవచ్చును. కానీ తన కాలానికి ముడిపడిన స్వీయానుభవంతో రాసిన రచనలే ఎక్కువ వాస్తవికతను కలిగి ఉండి, జాతిజనులు పాడుకొనే గీతాలుగా పల్లవిస్తాయి. మిగతా రచనలు అంటే పూర్తిగా కాలాతీతమైన రచనలు శిల్పరీత్యా చదివింపచేసినప్పటికి వాటిల్లో వాస్తవికత లోపించి అవి తాత్కాలికమైనవి అవుతాయి. ఏ రచనలయితే సార్వకాలీనమైన మానవీయ విలువలైన, కరుణ, ప్రేమ, దయ, మానవత, జ్ఞానవిజ్ఞానాల వంటి మానవీయ విలువలకు సంబంధించి వుంటాయో ఆ రచనలు సార్వకాలీనాలు అవుతాయి.

ఏ రచన అయినా ఆర్ద్రత, ఆలోచనలు సమపాళ్లలో లేకపోతే అది రాణించదు. విప్లవ గేయాలైన శ్రీశ్రీరచనలలో ఎంతో ఆర్ద్రత , మానవీయత ప్రతి ఫలిస్తూవుంటుంది. అయితే ఆయన మార్క్సిజం వైపుకి ఆకర్షితుడైనా సాహిత్య దృక్పథం వీడకుండా రాజకీయ దృక్పథం

వైపుకి పయనించాడు. ముస్లిం కవులు/రచయితలు కూడా కొంతవరకు మత దృక్పథం నుంచి విడివడి ప్రజాస్వామ్య, లౌకిక దృక్కోణం వైపుకి పయనించి సామాజిక స్పృహతో రచనలు చేశారు. ముస్లిం రచయితల రాజకీయ దృక్కోణం ప్రత్యేకమైనది. ఈ పరిణామాన్ని పరిశీలించడం జరుగుతుంది.

ఆధునిక కవుల్లో స్మైల్, మెహజబీన్, షాజహానా, అఫ్సర్, స్కైబాబా, అబ్బాస్, ఎం.ఏ. అజీజ్ , అన్వర్, యం.డి.హెచ్. ఆలి, అల్‌ఫతా, అహ్మద్, ఇబ్రహీం, ఇషాక్ అహ్మద్, ఉస్మాన్‌ఖాన్, ఖాదర్ మొహియుద్దీన్, గఫార్, గౌస్‌మోహియుద్దీన్, జవేరియా, దిలావర్, దేవీప్రియ, యాకూబ్, రహమతుల్లా, షేక్ కరిముల్లా హనీఫ్ మొదలగు వారు, వచన కవితా ప్రక్రియను, ఆధునిక సాహిత్యాన్ని, ముఖ్యంగా తెలుగు కవిత్వాన్ని సుసంపన్నంచేసే రచనలు చేశారు. రచన అనేది సృజనకు సంబంధించినది. రచయిత చుట్టూవున్న వాతావరణాన్ని అతను ఏ అస్తిత్వానికి చెంది వుంటాడో, ఏ సామాజిక వర్గానికి చెంది వుంటాడో ఆ భావజాలాన్ని హృదయైక్యం, మజ్జాగతం చేసుకొని తన రచనలను సమాజం ముందుకు తీసుకొనివస్తాడు. అలా ముస్లిం రచయితలు కూడా తమ సంపద్వంతమైన రచనల్లో భారతీయ లేక తెలుగు సమాజము –సంస్కృతి ఎంతవరకు ప్రతిబింబించిందీ అనే అంశాన్ని కూడా ఇక్కడ చర్చించడం జరుగుతుంది.

అయితే ఆధునిక దృక్పథం కల్గిన ముస్లిం కవులు, రచయితలు ప్రధాన స్రవంతి అయిన సంస్కృతిలో భాగమైన రచనలు చేశారా? లేక ఒకవైపు మత సంస్కృతిని పోషిస్తూ ఇంకోవైపు, ఆధునిక భావజాలాన్ని ఇంకొకవైపు సమర్థించారా? సమాజ సమస్యల పట్ల ఏవిధంగా స్పందించారు? సమాజం మౌలిక సమస్యలను గుర్తించగలిగారా? కేవలం ముస్లిం సమాజం యొక్క సమస్యలను ప్రతిబింబింపజేయడానికే పరిమితమైనారా? అనే ప్రశ్నలకు సమాధానాలను, మరియు ముఖ్యంగా ముస్లిం రచయితల యొక్క తాత్త్విక దృక్పథం యొక్క సాంద్రత ఎటువంటిది? అది ఇస్లాం మహాసూత్రాలకుగాని పారశీక, ఉర్దూ సంస్కృతులకుగాని దగ్గరగావుందా? భాషాపరంగా ముస్లిం కవులు, రచయితలు హిందీ ఉర్దూ, పదాలను వాడటంలోని ఆంతర్యమేమిటి? అనే విషయం కూలంకషంగా విశ్లేషించబడుతుంది. ఇంకా ముస్లిం కవులు/ రచయితలు ప్రాంతీయ మాండలిక భాషను ఎంతమేరకు ఉపయోగించుకున్నారనే అంశం కూడా యీ అధ్యాయాలలో ప్రస్తావించబడుతుంది. ముస్లిం రచయితలు తమ తమ సిద్ధాంత గ్రంథాలలో చర్చించిన నూతన అంశాలు ఏమిటి ? నూతన సత్యాలు ఏమిటి ? అనే విషయాలను ఈ సిద్ధాంత వ్యాసంలో ముమ్ముందు వచ్చే అధ్యాయాలలో చర్చించబడతాయి.

ముస్లిం రచయితలు సృష్టించిన అనువాద సాహిత్యం గురించిన పరామర్శను, రాజకీయ ధోరణులు, సాహిత్య ఉద్యమాలలో ముస్లిం కవులు, రచయితలు వహించిన పాత్రను గురించి, ఇంకా ముఖ్యంగా ముస్లిం కవయిత్రుల స్వేచ్ఛావాద దృక్పథాన్ని, ముస్లిం రచయితలు జానపద వాఙ్మయానికి చేసిన సేవను కూడా సమీక్షించడం జరుగుతుంది.

ముస్లిం కవులు, రచయితలు 'దేశభక్తి' కి, జాతీయవాదానికి దూరంగా ఉంటారనే అపోహ వుంది. ఇంకా ముందుకు పోతే ముస్లింలను ప్రతినిత్యము అనుమానంగా చూడబడే ఒక విద్రోహిగా పరిగణించడం జరుగుతుంది. ప్రతి ముస్లీం అల్‌ఖైదా ఏజెంటుగానో, “ సిమి ” కార్యకర్తగానో, కాశ్మీరు ఉగ్రవాదానికి చేయూతనిచ్చే వ్యక్తిగానో భ్రమించే తత్త్వం హిందూ సమాజంలో పుష్కలంగా వుంది. ఇటువంటి (వ్యవస్థీకృత భావజాలం) ఎంత వరకు సమంజసమో, చర్చించబడుతుంది. ఈ మట్టిలో పుట్టి ఈ మట్టినే నమ్ముకొని, ఈ మట్టిలో జీవించి, మరణించే ఒక పేద ముస్లింని కూడా శంకించే దశకు ఈ సభ్య సమాజం చేరుకుందనే ఊహకూడా బాధాకరంగానే వుంటుంది. ఇటువంటి భావజాలానికి సంబంధించిన కవితాసృజన గావించిన రచయితల ఆందోళనను, వారు వ్యక్తం చేసిన ఆవేదన సందర్భాలను ఈ పరిశోధనలో పేర్కొనడం జరుగుతుంది. ఒక రచనలోని ఆలంకారికతను, సౌందర్యాన్ని, రసదృక్పథానికి మాత్రమే పరిమితం కాకుండా , ఆ రచన జీవన వాస్తవికతను (reality of living purpose) ఏవిధముగా ప్రతిబింబించినదీ, వ్యక్త పరచడం ఈ పరిశోధన యొక్క మౌలిక భావాలలో ఒకటి. ముస్లిం కవులలో, రచయితలలో పురోగమన వాదులను, ప్రగతిశీల వాదులను గుర్తించి వారి యొక్క కవిత్వంపై ఇతర సాహితీ రచనలపై సమగ్రమైన సమీక్ష చేయడం జరుగుతుంది.

ఏ రచయిత అయినా, కవియైనా తన వర్గ నేపథ్యాన్ని అభివ్యక్త పరచినంత పటిష్టంగా, ఇతర వర్గాల, ప్రజల స్థితిగతులను, సమస్యలను సరిగ్గా చిత్రీకరించలేరనే వాదన ఒకటి బలంగా ఉంది. అందువల్లనే స్త్రీవాదాన్ని ప్రధానంగా స్త్రీలు, దళితవాదాన్ని దళితులు, మైనారిటీ వాదాన్ని ముస్లింలు తమతమ రచనల్లో చక్కగా ప్రతిబింబింపచేశారనే అభిప్రాయం ప్రచలితం అయివుంది. ఇది పాక్షిక సత్యం. ప్రతి వాదానికి, అభిప్రాయానికి భిన్న పార్శ్వాలు ఉంటాయి. ఉన్నవ వారి 'మాలపల్లి' లాంటి రచనలుగూడా సాహిత్యంలో ధృవతారలై నిలిచి అగ్రవర్ణాలకు చెందిన కొంత మంది రచయితల మానవీయ దృక్పథం తేటతెల్లం చేశాయి.

ముస్లిం రచయితలు మైనారిటీ వర్గం యొక్క సమస్యలను కవిత్వీకరించి, కథీకరించి, అనువదించి, నాటకీకరించి, ఒక ఉద్యమం మాదిరిగా సమాజం ముందుకు వచ్చారనే విషయం స్పష్టమయ్యే విధంగా వారివారి రచనలనుంచి ఈ మైనారిటీ కవుల ఉద్యమం ఏవిధంగా సఫలీకృతమైనదీ వివరించడం జరుగుతుంది. ఒక ఉద్యమం రూపుదిద్దుకోవడం ఒక సామాజిక అవసరం. ఇటువంటి ఆవశ్యకత ఏర్పడటానికి మైనారిటీకవులను ప్రేరేపించిన సామాజిక అంశాలు, విధ్వంసాలు, ముఖ్యంగా బాబ్రీమసీదు కూల్చివేత, ఇంకా ఇతరేతర కారణాలను పరిశీలించడం ఈ అధ్యాయాలలో సందర్భోచితంగా జరుగుతుంది.

కవిత్వంలో గాని మరే ఇతర సాహిత్య ప్రక్రియలలో గాని ఒకేవ్యక్తి లేక రచయిత, ఉద్యమస్ఫూర్తి కలిగించడం అరుదు అని చెప్పలేముకాని గత శతాబ్ద సాహిత్య చరిత్రను పరిశీలిస్తే గురజాడ, కందుకూరి వీరేశలింగం పంతులు, చలం, శ్రీశ్రీ, జాషువా, విశ్వనాధ, త్రిపురనేని రామస్వామిచౌదరి, రాయ ప్రోలు, కృష్ణశాస్త్రి లాంటి మహామహులైన కవులు, రచయితలు, సామాజిక సమస్యలలోనైతేనేమి, వైయుక్తిక సమస్యలలోనైతేనేమి ఒక్కొక్కరు ఒక సాహిత్యోద్యమంగా ఉద్యమించినవారే! అందువలన వారి పేర్లు సాహితీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయి వున్నవి. ఒక వ్యక్తి ఉద్యమ కారుడిగా , ఒక ప్రచండ శక్తిగా పురోగమించడానికి , ఒక సముహం ఉద్యమ స్ఫూర్తితో ముందుకు, మున్ముందుకు దూసుకుపోవడానికి గల కారణాలను విశదీకరించవలసి యున్నది. ఉదాహరణకు గురజాడ, శ్రీశ్రీ , చలం , జాషువా, వీరేశలింగం, రాయప్రోలు, తమతమ దృక్పథాలు వేరు అయినప్పటికి ఒక వ్యక్తి గా ఉద్యమించారు. తరువాత వచ్చిన ఆధునిక కవులు గాని, దిగంబర, పైగంబర దళిత, మైనారిటీ కవులు గాని, మూకుమ్మడిగా ఒక ఉద్యమాన్ని నిర్మించగలిగారు. కాని ఒక వ్యక్తిగా మహోద్యమాన్ని నిర్మించలేకపోయారు. ఈ విధముగా జరగడానికి వ్యక్తిగత, మానసిక, సాంస్కృతిక " చైతన్య దీప్తి " బలీయమైన తుఫానులా, ఉప్పెనలా, ఎగిసి పడక పోవడమే ఒక కారణం అని గ్రహించవలసిన ఆవశ్యకత వుంది. అందుకే వారు సమూహాలుగా ఏర్పడి ఉద్యమ స్ఫూర్తిని కలిగించారనడం అవాస్తవం కాదు.

అయితే ప్రస్తుత పరిస్థితుల్లో రచయితలు / కవులు ఒక విషయాన్నిని ఎన్నుకొని ఒక విలక్షణమైన ఉద్యమాన్ని సామూహిక చైతన్యంతో సాగించడం కనిపిస్తుంది. ఉదాహరణకు భావకవుల ప్రణయగీతాలు, విరహవేదనల తర్వాత ఇలాంటి సామూహిక దృక్పథాన్ని సమాజంలో ప్రవేశ పెట్టిన వారు విరసం కవులు, దిగంబరకవులు, కవిసేన మేనిఫెస్టో కవులు, పైగంబర

కవులు, నిరసన కవులు, స్త్రీవాద, దళిత వాద కవులు, ప్రస్తుతం ముస్లిం కవులూ, రచయిత ఒక సమస్య యొక్క తీవ్రతను బట్టి, సమాజంలో దాని పరిష్కార ఆవశ్యకతను బట్టి ఉద్యమాలు ఏర్పడతాయి. ముస్లిం కవులు/రచయితలను కూడా బాబ్రీమసీదు కూల్చివేత, ముస్లింలపై ఇతరుల దాడులు అస్తిత్వ వేదనకు గురిచేశాయి. అందువలన సమాజ చైతన్య స్ఫూర్తిని కలిగిన ముస్లిం రచయితలకు తమ కలాలను హలాలుగా చేసి సాహిత్యక్షేత్రాన్ని దున్ని, సమ్యక్ ఆలోచనలనే బీజాలను చల్లి, రచనలనే ఫలాలను సాహితీజీవులకు, సమాజానికి అందించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

ఇటువంటి దృక్పథం, అంటే మూకుమ్మడిగా కవులు, రచయితలు సమాజం ముందుకు వచ్చి పెద్దగా నినదించకపోతే తమ మాటలను కవిత్వాన్ని, రచనలను సమాజం పట్టించుకోదేమోననే అనుమానం ఒకటి, అన్ని గళాలు, కలాలు కలిస్తేనే కానీ ప్రజల్లో ఒక ఉద్యమస్ఫూర్తి కలగదనే ఆర్తి ఒకటి యీవిధమైన ఉద్యమ కవిత్వానికి దారితీయిస్తున్నది. ఈ విషయం ఎంతవరకు హేతుబద్ధమో యీ గ్రంథంలోని ఒక అధ్యాయంలో చర్చించడం జరుగుతుంది. ఒక విషయాన్ని భిన్న పార్శ్వాల నుంచి చూడటం , తర్కించడం నిగ్గుతేల్చడం బహుసత్యతాతర్కం (Fuzy Logic) యొక్క దృక్పథం. ఇటువంటి పరిశీలన సత్యం యొక్క స్వరూపాన్ని నలుదిశలనుంచి అందిస్తుంది. ఈ దృక్పథం నుంచి ముస్లిం కవులు /రచయితల రచనలను పరిశీలించడం జరుగుతుంది.

ఒకవైపు ప్రగతిశీల దృక్పథం వైపుకి ముస్లిం కవులు / రచయితలు పురోగమిస్తున్నప్పటికీ ఇంకొకవైపు కొంతమంది ముస్లిం కవులు / రచయితలు మత సాంప్రదాయాలను, కాదనలేక, ఔననలేక ద్వంద్వ వైఖరులను తమ రచనల్లో రేఖామాత్రంగా అభివ్యక్త పరచిన సంఘటనలు కూడా చోటుచేసుకొని ఉన్నాయి. ఎవరి రచనలు, ఎంతవారి రచనలైనా పాలుపోసి కడిగినట్లు, నిర్దుష్టంగా వుండవు. ఎవరికైనా కళ నిర్దుష్టంగా ఉండాలనే ఆకాంక్ష, ఆతురత, ఉంటుందిగాని, అది సాహిత్యంలో ఎక్కువభాగం వీలుపడదు.రచనగాని, కళాకృతి గాని సమగ్రతకు దగ్గరగా వస్తుంది. ఒక పాశ్చాత్య విమర్శకుడు అన్నట్లు " రచించని కవిత, చిత్రింపబడని చిత్రం, వినిపించని రాగం" ఉత్తమోత్తమైనవట. ఇది కళా సృజనకు ఒక పరిణితి అనేది వుండదని, కళాకారుడు తన సృజనతో ఎన్నో అద్భుత కృతులు నిర్మించాలనే వాంఛతో చెప్పిన మాట అది. వాస్తవం ఏమిటంటే మన ఎదురుగానున్న దృశ్యం కన్న , మనకన్ను చూడని అతీతదర్శనం ఎంతో సుందరమైనది అనడం లాంటిది. ఇది రసాత్మక భావం .

లలిత కళల్లో ఒక్కటైన సాహిత్యం, ఈ తరంలో 'గురుకులవాసంలో' పుష్పించడంలేదు. కళనేర్చుకొనేటప్పుడు విద్య, ప్రయోగించేటప్పుడు 'కళ' అనే నిర్దుష్ట ప్రణాళికగా సమాజం ముందుకు రాలేదు. అందువలన శ్రీశ్రీ, తిలక్, లాంటి వారి ప్రామాణిక అధ్యయనం నేటితరం కవులకు లేక పోవడం వలన తమ కవితల్లో, రచనల్లో స్వల్పంగా నిర్దుష్టత లోపించడం జరుగుతుంది. ఇది మైనారిటీ కవులకే కాకుండా అన్ని వర్గాల కవులకూ వర్తిస్తుంది. ఈ విధమైన చిన్నచిన్న లోపాలు పరిగణించడానికి వీల్లేదుగాని, వస్తుశిల్పాల విషయంలో పరిణతి చెందిన దశ అనేది ఏవిధంగా ఉంటుందో, కవులు తమ రచనల్లో ఎలాంటి వస్తు శ్రద్ధను, శిల్ప నైపుణ్యాన్ని జోడించడం జరిగిందో విశ్లేషించడం జరిగినది.

ఇక పోతే ప్రస్తుత, వర్తమాన కవులు రాజకీయ నేపథ్యం కలిగివుండి, కేవలం నినాదప్రాయ కవిత్వం వ్రాసిన వారు కూడా ఉన్నారు. వస్తువును స్వీకరించడంలో ప్రత్యక్ష, పరోక్ష పద్ధతులు వుంటాయి. వస్తు స్వీకరణలో ప్రత్యక్ష పద్ధతి అంటే యథాతథంగా సమాజంలో తాను చూసిన దృశ్యాలు లేక సంఘటనల నుంచి 'ప్రేరణ' పొంది రచించడం, పరోక్ష పద్ధతి అంటే తాను విన్నవి, చదివినవి, టి.వి.లో చూచి ప్రేరణగా పొందినవి రచనగా మలచడం లాంటిది. మొదటి విధానంలో వస్తువు రచయితకు ఆత్మగతమైనట్లుగా, రెండవదానిలో వస్తువు రచయితకు ఆత్మగతం కాదు. ఏ దశలోనైనా వస్తువు యొక్క ఆభాసారూపమే రచయితలో ప్రతిబింబిస్తుంది. ఏదైనా కళలో ఆభాసారూపమే ప్రాధాన్యత వహిస్తుంది. గ్రీకుతాత్వికుడు ప్లేటో 'రిపబ్లిక్‌లో' కళను త్రిగుణ వ్యవహితం అని అన్నాడు.

ఇక్కడ ముస్లిం రచయితల రచనల్లోని వస్తుగత దృక్పథాన్ని (objectified vision) వ్యక్తిగత దృక్పథాన్ని (subjectfied Vision ) విశదీకరించడం జరిగింది. సహజంగా రచయితలో వస్తుగత దృక్పథం , వ్యక్తిగత భావజాలంతో సంలీనం చెంది వ్యక్తమౌతుంది.ఆ విధంగా అభివ్యక్తమైనప్పుడు రచన సజీవంగా వుంటుంది.

ఏదిఏమైనా, ముస్లిం రచయితలు / కవులు భారత దేశంలో గాని ఆంధ్రప్రదేశ్‌లోగాని రెండవ శ్రేణి పౌరులుగా అధిక శాతం మంది పరిగణించి, వారి దేశభక్తిని, జాతీయ తత్త్వాన్ని అనుమానించేదశకూ, దిశకూ పోవడం చూపి యీ సిద్ధాంతవ్యాసం అందుకు ఉన్న అహేతుక కారణాలను, విమర్శిస్తుంది. అందరి మాదిరిగా ఈ మట్టిలోపుట్టి, ఈ మట్టిలోనే గిట్టే ముస్లిం

జాతీయుడు అన్యుడుకాడని, సోదరుడనే విషయాన్ని, ముస్లిం కవుల, రచయితల రచనలోని అంశాలను పరామర్శించడం ద్వారా నిరూపిస్తుంది. ముస్లిం రచయితల ఆత్మ ఘోష కూడా అదే తాము పరాయి వాళ్లం కామని, యీ దేశపు మట్టి వాసనలో వాయుతరంగాల్లో, ఈ పునీత జలాల్లో యీ దేశ ఆకాశం క్రింద తమ ఆత్మలు వికసించాయని, ఈ దేశ సమగ్రతకు మేము ఎట్లా వ్యతిరేకులమవుతామని ప్రశ్నిస్తున్నారు. ఈ కోణాన్ని వారి సాహిత్యోదాహారణల ద్వారా వివరించడం జరుగుతుంది.

" ముస్లిం వాదం ముస్లిం సమాజం కోసం పనిచేస్తూనే –మొత్తం సామాజిక మార్పు కోసం పనిచేస్తుంది" (ఖాజా 2005, పుట, 45) అనే సత్యాన్ని విశదీకరించడానికి యీ పరిశోధన కొంత సమగ్రత వైపుకి పయనిస్తుంది. ముస్లిం కవులు / రచయితల రచనల్లోని సౌందర్య తత్త్వాన్ని, సామాజిక తత్త్వాన్ని యీ సిద్ధాంత వ్యాసం ప్రధానంగా చర్చిస్తుందికూడా ! కవిత్వంలో, మిగతా సాహిత్యరచనల్లో 'రసతత్త్వం' అనేది మృగ్యమైతే ఆరచన పేలవంగా ముగుస్తుంది. రచనల్లో సామాజిక దృక్పథము, రసతత్త్వము మేళవించినప్పుడే ఆ రచన సామాజికులకు చేరువ కాగలుగుతుంది. అంటే ఏ కవితలో గాని, రచనలో గాని, కళాత్మకత వలనే ఆ కృతికి సాహితీ గౌరవం కలుగుతుందనే అంశం విస్మరించరానిది. అందువలన ముస్లిం కవుల రచనల్లో ఏది రసజ్ఞుల రసనలపై నిలుస్తుంది? ఏ రచన సరియైన అభివ్యక్తి లేకుండా శుష్కమైవుంది అనే కోణం నుంచి కూడా పరిశీలించడం జరుగుతుంది. ఈ విధంగా ఉల్లేకించడం వలన యిది భావవాద సాహిత్య విమర్శకాదు– భావ, భౌతికవాదాల సమ్మేళనంతోనే యీ సాహిత్య ప్రక్రియలోని అన్ని అంశాలను పరామర్శించడం జరుగుతుంది.

మానవసమాజమంతా ఒక్కటేగనుక, ముస్లిం రచయితలు తమ సమస్యలకే కాకుండా, ఇతర వర్గాల ప్రజల మనోభావాలను, సమస్యలను ఏ విధంగా ప్రతిస్పందించారో అనే విషయాన్ని కూడా ఇక్కడా ప్రస్తావించడం జరుగుతుంది. స్త్రీ వాదం, దళితవాదం లాంటివి తమ తమ వాదాలకే పరిమితం కాకుండా, మిగతా సామాజిక సమస్యలను పట్టించుకొని విస్తృతమౌతున్నట్లే ఈ మైనారిటీ ముస్లిం వాద కవులు కూడా తమ పరిధి నుంచి బయటకు వచ్చి మిగతా సామాజిక సమస్యల పట్ల ప్రతిస్పందించిన తీరు కూడా గమనార్హం అవుతుంది. ఇంకా ముందుకు పోయి ముస్లిం రచయితలు మేము కూడా దళితులమేనని మాది కూడా దళిత కవిత్వమే ననడం ప్రస్తావించబడినది.

నాలుగైదు దశాబ్దాల క్రితం వున్న ముస్లిం కవులలో తిరుగుబాటు ధోరణులు అత్యల్పంగా కనిపిస్తే, యీరెండు దశాబ్దాల ముస్లిం రచయితల్లో తిరుగు బాటు ధోరణి, హేతువాద దృక్పథం, ప్రశ్నించే తత్త్వం తమ వర్గప్రజల పట్ల సానుభూతి, సంయమనంతో కూడిన రచనావిధానం లాంటి వాటి తీవ్రత పెరిగింది. ఇటువంటి అంశాలను గుర్తించి ఈ గ్రంథంలో ప్రస్తావించడం జరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లోని ముస్లిం కవులు / రచయితలు, సంస్కృతికి - సమాజానికి తమ రచనల ద్వారా ఏవిధమైన ఖ్యాతిని చేకూర్చారో ఏవిధమైన భావజాలంతో సమాజంలోని అహేతుకత్వాన్ని, పాక్షిక వైఖరులను నిరసించారో, ఈ పురిటి గడ్డలోని సంస్కృతిలో ఏ విధంగా మమేకం చెందారో , సమీక్షిస్తూ, ఒక సమగ్ర వివేచన చేయడానికి ప్రయత్నించడం జరిగింది.

ముస్లిం రచయితలు కొంత మంది తమ మత సంస్కృతి నుంచి లౌకికత్వం వైపుకి మానవతావాదం వైపుకి ఏవిధంగా పయనించారో స్పష్టీకరించడం జరిగింది. మతం నుంచి మానవతావాదం, మహామానవతావాదం వైపుకి, మానసవాదం, వైపుకి ప్రయాణించిన ముస్లిం రచయతలు, మిగతా వర్గాలలోని పరిణిత కవుల దిశలోనే పయనించారనే వాస్తవం తేటతెల్లం చేయబడింది.

ఏ రచనకైనా, సిద్ధాంతానికైనా, పరిశోధనకైనా బాహ్య అంతర్గత దృక్పథాలను వివరించడం అవసరంగనుక, మైనారిటీ కవుల్లో ఉన్న బాహ్యలక్షణాలేమిటి? అంతర్గత లక్షణాలేమిటి? వీటి మధ్య వైరుధ్యాలుగాని, వైవిధ్యాలుగాని ఉన్నాయా? అనే అంశాన్ని పరిశీలించడం జరిగింది.

ముస్లిం కవులు/ రచయితలు సమాజం పట్ల, సంస్కృతులు పట్ల తమ వంతు బాధ్యతను సామాజికంగా, కళాత్మకంగా, తాత్త్వికంగా, సమర్ధవంతంగా నిర్వహించారా?లేదా? అన్న విచికిత్సతో, కొత్త ప్రతి పాదనలతో ఈ సిద్ధాంత వ్యాసం ముగుస్తుంది.ఏది ఏమైనా ఈ ప్రతి పాదనలన్నింటిని ఒక పరిపూర్ణ దృక్పథంగా ( Holistic Perspective ) భావించడం లేదు. పరిపూర్ణ సిద్ధాంతం, సమగ్రసత్యం అనేవి ఆదర్శాలు మాత్రమే కవిలో, రచయితలో ఏ విధంగా parallox errors (కుడి, ఎడమ కంటి చూపుల్లో వుండే స్వల్పమైన దృష్టి దోషం) వుంటాయో, రచనలను సిద్ధాంతీకరించడంలో కూడా అవి మనుగడ చేస్తుంటాయి.

పైన పేర్కొనబడిన అంశాలన్నీ తరువాతి అధ్యాయాలలో ప్రస్తావించడం జరిగింది.

---

# II. ముస్లిం కవుల సంప్రదాయ సాహిత్యం - భిన్న ధోరణులు

“శ్వపచ బ్రాహ్మణ బేధముల్ సలిపిమనుజ
కోటియను మేటి సౌధంబు గూలకొట్టి
నిప్పుబెట్టరి, దానిచే నేటిదాక
మండుచున్నది గాని యే పండితుండు
నడుము కట్టి చిచ్చార్ప గడగలేదు”

- ఉమర్ అలీషా

తెలుగు సంప్రదాయ కవిత్వం తెలుగువారికి ఒక మధురస్మృతి, ఒక రసధ్వని, ఒక మంగళాశాసనము. ఆదికవి నన్నయ్య మహాభారతంలో

"సారమతిం కవీంద్రులు ప్రసన్న కథా కవితార్థయుక్తిలో
నారసి మేలునా యితరు లక్షర రమ్యత నాదరింప నా
నారుచిరార్ధ సూక్తి నిధి నన్నయ్య భట్టు తెనుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్"
(ఆదిపర్వం, ప్ర.అ,26వ పద్యం)

అంటూ తన మార్గాన్ని "నానా రుచిరార్ధ సూక్తినిధి" నని చెప్పుకోవడంలోనే నిక్షిప్త పరచాడు. నన్నయ్య తెలుగు సాహిత్యానికి యుగకర్త. తెలుగు సాహిత్య సృష్టికర్త. వాల్మీకి సంస్కృత లౌకిక సాహిత్యమునకు ఆదికవి అయితే తెలుగు సాహిత్యానికి నన్నయ్య ఆదికవి. నన్నయ్య నుంచి నాగభైరవ వరకు తెలుగు ప్రాచీన సాహిత్య హేల దిగ్విజయముగా నడిచినది. ఏ ప్రాంతానికి చెందిన కవి అయినా, ఏ మతానికి చెందిన కవి అయినా నన్నయ్యకు నమస్కారము పెట్టనిదే, నన్నయ్య భారత సంహితను అధ్యయనం చేయనిదే కవికాలేని పరిస్థితి– ఈ ఆధునిక యుగములో ముస్లిం కవులు కూడా నన్నయ్య నుంచి మొదలైన ఈ సంప్రదాయ సాహితీ స్రవంతిలో ఈదులాడినవారే ! ముస్లిం సాంప్రదాయ కవులలో సాహిత్య సుగంధము చిక్కగా పరిమళించడం వెనుక గల కారణం ఇదే.

సంస్కృత వాఙ్మయమును ఊతగా తీసుకొని తెలుగు సాహిత్యం పుట్టింది. అందువల్లనే "సకల భాషలకు జనని సంస్కృతంబు" అని "అమరము రానివారికి నేనమరను" అనే వాగ్దేవి ప్రతిన అనే ముస్లిం సంప్రదాయ కవులకు కూడా తెలుసు. అందువల్లనే ముస్లిం సంప్రదాయకవులు, చంధోవ్యాకరణ అలంకార శాస్త్రాదులలో నిష్ణాతులై పద్య కవిత్వానికి శ్రీకారము చుట్టినారు. మన సంప్రదాయంలో పద్య కవితలల్లాలంటే వివిధ శాస్త్రజ్ఞానము దండిగా వుండవలసిందే!

అట్లాగే వచ్చిన కవితల వలెనంటే సామాజిక దృక్పథము, హేతువాద దృష్టి మనో వైజ్ఞానిక శాస్త్ర పరిచయము వుండి తీరవలసిందే! అందుకే ఆదికవి వాల్మీకి సంప్రదాయ కవిత్వరీతిని ఈ విధంగా అక్షరీ కరించాడు.

"పాదబద్ధో క్ష రసమస్తన్త్రీ, లయ సమన్విత:
శోకార్తస్య ప్రవృత్తో మేశ్లోకోభవతు నానన్ధా"
(బాలకాండం, 2వసర్గ,18శ్లోకవ)

దీని భావము, పాదబద్ధము, అక్షరసమము, తంత్రీలయ సమన్వితము, శోకార్త ప్రవృత్తము శ్లోకమే అగును – మరొకటి కాదు అని

ఇక్కడ విశేషమేమిటంటే శబ్దానికి, నాదానికి సమప్రాధాన్యత నీయడం– ఇందువల్లనే పద్యములో ఆర్ద్రత, రాగచ్ఛాయ విశేషముగా ఉంటాయి. అందుకే యీనాటికి పద్యాన్ని ఆరాధించటం కనిపిస్తుంది. "చెల్లియొ చెల్లకో తమకు సేసిన యొగ్గులు" అనే పద్యము "జెండాపై కపిరాజు" – " మాయామేయజగంబె నిత్యమని సంభావించి" "ఇచ్చోటనేకదా లేత యిల్లాలి నల్లపూసలసౌరు" అనే పద్యాలు రాని ఆంధ్రుడు వుండడు. అందువల్లనే మన ముస్లిం సంప్రదాయకవులు కూడా విస్తృతంగా పద్యకావ్యాలను రచించారు. కానీ వాటిలో చాలా గ్రంధాలు దురదృష్టవశాత్తు యిప్పుడు అలభ్యాలు అయినవి.

నన్నయ్య గారి తరువాత తిక్కన యుగం ప్రారంభమైనది. తిక్కన మొదట నిర్వచనోత్తర రామాయణం రచించాడు. అయితే ఆయన అప్పటికి సంయమన పూర్వకమైన కవితాదృష్టిని అందుకోలేదు – అందుకే యీ విధంగా అన్నాడు.

" అమలోదాత్త మనీష నేనుభయ కావ్య ప్రౌఢి బాటించు శి
ల్పమునం బారగుడం గళావిదుడ నాపస్తంబ సూత్రుండనే గౌ
తమ గోత్రుండ మహేశ్వరాంఘ్రి కమల ధ్యానైక శీలుండ న
న్నమ కుం గొమ్మన మంత్రికిన్ సుతుండ దిక్కాంకుడ సన్మాన్యుండన్"
(తిక్కన, 1వ అధ్యాయం, 13వ పద్యం)

తిక్కన గారి అహం ప్రత్యయము యీ పద్యములో కనిపిస్తుంది. ఇదేదారిన ఉమర్ ఆలీషా కవికూడా తన ధీశక్తిని చెప్పుకొన్నాడు – ప్రతిభావంతులు ఏమిచేసిన, ఏది మాట్లాడినా

చెల్లుతుంది – అయినప్పటికీ కొంతమంది యీ ధోరణిని వ్యతిరేకించారు – అయితే తదుపరి తిక్కన సోమయాజి అయి, "నా నేర్చిన భంగి చెప్పి వరణీయుడ నయ్యెద భక్తకోటికిన్" అని విద్యావినయ సంపత్తిని ప్రదర్శించాడు అది వేరే విషయం అయితే తిక్కనగారి భారతములోని ఈ శైలిని ముస్లింకవుల తమ పద్య రచనల్లో కొంత అనుసృజన చేయడం జరిగింది. దాని వలన వారి కృతుల కొక సౌందర్యం వచ్చింది. ఉదాహరణకు తిక్కనగారి ఈ క్రింది పద్యం చూడండి.

దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవరిప్డు నిను దోర్లీలన్ బెసంగిట్టి గం
ధర్వుల్ మానము ప్రాణముం గొనుట తథ్యం బెమ్మయి గీచకా!

(విరాటపర్వము, ద్వి. 22వ ప)

పై పద్యానికి అను సృజనగా కవి బుడెన్ సాహెబ్ గారి పద్యము చూడండి.

"బైరాంశానున కిచ్చి పెండ్లి సలిపెం బ్రస్థాన మార్గాంత పూ
ర్వారోత్తంసము రమ్య సౌధలతికా ప్రత్యగ్ర శోభావళీ
స్ఫారంబైన జలంధరన్ పురమునన్ వారాంగనా నృత్యతూ
ర్యారావంబులు దంతివీటి భట విన్యాసంబు లేపారగన్

(బుడెన్ సాహెబ్ షేక్, 1969, పుట81)

బుడెన్ గారి పద్య నిర్మాణము తిక్కన గారిని పోలియుండటం వలన ముస్లిం కవుల శక్తియుక్తులు అవగతం అవుతున్నవి.

ఈ విధంగా పూర్వకవులైన శ్రీనాధుడు, పోతన, పెద్దన నంది తిమ్మన లాంటి ప్రాచీన కవుల ప్రౌఢ కవితా మహత్వాన్ని పుణికి పుచ్చుకొని ఆధునిక కవులు రాయప్రోలు, విశ్వనాథ, జాషువా, లాంటి కవులకు సమవుజ్జీగా రచనలు చేశారు. కవిత్వము వ్రాసిన వారు ముస్లిం సంప్రదాయ కవులు. అయితే ఆధునిక సంప్రదాయ కవులకు వచ్చిన పేరు ప్రఖ్యాతులు ముస్లిం కవులకు రాలేదు. మిగతా వర్గాలలోని కవుల రచనలు చర్చకు, విమర్శకు వచ్చినట్లు ముస్లిం సాంప్రదాయ కవుల రచనలు గుర్తింపబడలేదు. దీనికి గల కారణాలలో వీరి మతనేపథ్యం మొదటిది. సంఖ్యాపరంగా వీరి ప్రాతినిధ్యం తక్కువ కావడం రెండవది.

ఏమైనా ఈ రాష్ట్ర ముస్లింలు తెలుగు సంప్రదాయ కవులతో సరి సమానంగా తెలుగు, సంస్కృత భాషలనునేర్చుకొని, ఛందస్సు, వ్యాకరణం, అలంకారశాస్త్రాలలో ఎంతో ప్రావీణ్యం సంపాదించుకొని తమ కావ్యాలను , నాటకాలను సంప్రదాయబద్ధంగా ఒక శిల్ప సమూహ రచన మాదిరిగా తీర్చిదిద్దుకున్నారు. ముస్లిం కవులు తమ మాతృభాషను వదిలి తెలుగులో రచనలు సాగించడం చూస్తే వారు ఈ రాష్ట్ర మన భాషా సంస్కృతుల్లో ఏవిధంగా, ఎంత గాఢంగా మమేకమైంది విశదమౌతుంది. ఈ విధంగా ముస్లిం కవులు, సాహిత్యానికి ప్రధాన స్రవంతిగా నిలిచిన సాంప్రదాయ సాహిత్య సృజనకు పూనుకొని దానిని పరిపుష్టం చేశారు. సంప్రదాయ సాహిత్యంలో కావ్యాలను, ఖండకావ్యాలను దృశ్యకావ్యాలను, పౌరాణిక, చారిత్రిక, సాంఘిక కావ్యాలను, శతకాలను నిర్మించి తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని పొందారు. పరిణామ క్రమంలో తెలుగు సాహిత్యంలో గతశతాబ్దంలో ఎటువంటి సాహితీ ప్రక్రియలు చోటుచేసుకొని ఉన్నాయో వాటన్నిటిలోనూ ముస్లిం కవులు తమ ప్రతిభాపాటవాలను చాటారు. సహజంగా ముస్లిం కవులు / రచయితలు అనే సరికి వారు ఉర్దూలోనో, పారశీకంలోనో రచనలు చేసుంటారనో లేక వారు తెలుగు రాని ఉర్దూ పండితులనో ఒక భ్రమాత్మక అవగాహన తెలుగు పాఠకుల్లో , సాహితీ పరుల్లో కొంత గూడుకట్టుకొని వుంది. ఇది సరియైన ఆలోచన కాదు. ఈ విషయాన్ని వారి రచనలను ఉదహరించడం ద్వారా విపులంగా చర్చించబడుతుంది.

సంప్రదాయ కవిత్వాని వస్తురీత్యా పౌరాణిక, చారిత్రక, ఆధునిక కావ్యాలుగా విభజింపవచ్చును – ఇరవయ్యో శతాబ్దపు ప్రథమం వరకు ఈ ధోరణిలో పెనుమార్పులేమి జరగలేదు. రామాయణ, భారత భాగవతాలలో నుంచి వస్తుస్వీకరణ చేయడం గౌరవ ప్రదమైన విషయంగానూ, మీదు మిక్కిలి సంస్కృత కవులను ఆంధ్రీకరించడము అవసరమని అప్పటి సాహితీకారులు భావించారు. అయితే పాశ్చాత్య విద్యా ప్రభావం, స్వాతంత్ర్య రహిత సమాజంలో జీవించడం, స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకు అర్రులు చాచడం వంటివి దేశభక్తి, జాతీయత అనే భావజాలాన్ని అన్ని రంగాలలోను ప్రవేశ పెట్టాయి. అదే పంథాలో ఈ నూతన భావజాలం కవుల, కళాకారుల, మేధావుల, ఆలోచనల దిశను కూడా మార్చింది. ఈ సందర్భంలో కవులు ఒక ప్రక్క సంప్రదాయక ఇతి వృత్తాలతో రచనలు చేస్తూనే ఇంకొక ప్రక్క ఆధునిక భావజాలాన్ని, సామాజిక దృక్పథాన్ని అందుకోవాలని ప్రయత్నించారు. ఈ దృక్పథం ముస్లిం సాంప్రదాయ కవుల్లో కూడా వుంది. అందులో బ్రహ్మర్షి ఉమర్ అలీషా ప్రథములు.

## II.1 బ్రహర్షి ఉమర్ అలీషా

కీ.శే.డా॥ ఉమర్ అలీషా, ముస్లిం కవుల్లో ప్రముఖులు పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లాలో నివసించారు. భారతీయ సంప్రదాయాన్ని ముస్లిం సంప్రదాయాన్ని ఔపోసన పట్టిన మహా కవి. అయితే ఆయన రచనలన్నీ తెలుగు సాంప్రదాయక కవుల మార్గములోనే పయనించినవిగాని ప్రత్యేకించి ముస్లిం తత్త్వాన్ని ప్రతిపాదించే రచనలు చేయలేదు. ఒకటీ రెండు రచనలు మినహా! ఆయన రచనలను సాహిత్య, తాత్త్విక, అనువాద రచనలుగా త్రిధా విభజించవలసివుంది. ఇందులో సాహిత్య రచనలను చూసినట్లయితే ఆయన తన సాహితీ ప్రస్థానాన్ని మూడు అంశాల ప్రధానంగా సాగించినట్లుగా తెలుస్తుంది. అవి వరుసగా

1) <u>సంప్రదాయ ఇతి వృత్తాలు</u> :- సంప్రదాయ ఇతి వృత్తాల వలన సహజంగా సంప్రదాయ సాహితీ పరులకు అనుస్యూతంగా వచ్చే సంప్రదాయానికి తాను వ్యతిరేకిని కాకపోగా, దానికి అత్యంత అనుకూలుడనని, పరిరక్షకుడనని 1) అనసూయాదేవి 2) పద్మావతి 3) మహాభారత కౌరవరంగము 4) చంద్రగుప్త లాంటి రచనల ద్వారా నిరూపించారు.

2) <u>అధునిక ఇతి వృత్తాలు</u>:- బ్రహ్మర్షి ఉమర్ ఆలీషా తన ఖండ కావ్యాలు, ఉమర్ ఖయ్యామ్‌లాంటి అనువాద కావ్యం లాంటి రచనలు ద్వారా తాను ఆధునికుడనని, సామాజిక దృక్పథం వున్న రచయితనని నిరూపించు కొన్నారు.

3) <u>ఆధ్మాత్మిక ఇతి వృత్తాలు</u>:- ఈ విభాగంలోని రచనల్లో 1) సంప్రదాయ ఆధ్యాత్మికత 2) ముస్లిం మత దృక్పధము; సూఫీ వేదాంత దర్శనము – ఈ రెండు అంశాలలో తత్వసందేశం తత్వ ప్రబోధము లాంటివి రచించి బ్రాహ్మణ సంప్రదాయవాదులను ముస్లిం సంప్రదాయ వాదులను ఏకకాలంలో సమన్వయ పరచడానికి పూనుకొనినారు.

ఉమర్ అలీషా రచనలు ఆయన బహుముఖ ప్రజ్ఞను వెల్లడిస్తాయి.

## II.1.A ఉమర్ ఆలీషా గారి రచనలు

| | |
|---|---|
| 1) అనసూయాదేవి (నాటకం) | 2) శ్రీమహమ్మదు రసూలు వారి చరిత్ర |
| 2) ఉమర్ ఖయ్యాం | 13) మహాభారత కౌరవరంగము (నాటకం) |

| | |
|---|---|
| 3) కళ | 14) విషాద సౌందర్యం |
| 4) ఖండకావ్యములు | 15) విచిత్ర బిల్హణీయం |
| 5) చంద్రగుప్త | 16) స్వర్ణమాత (కందార్ధములు) |
| 6) తత్త్వసందేశం | 17) మణిమాల (నాటకం) |
| 7) దానవ వధ | 18) శాంత |
| 8) పద్మావతి | 19) బర్హిణీదేవి |
| 9) ప్రభాత కథావళి | 20) సాధనా పథము |
| 10) సూఫీ వేదాంత దర్శనం | 21) షా తత్త్వము |
| 11) ఖండ కావ్యములు | 22) తత్త్వ ప్రబోధము మొదలగునవి . |

ఉమర్ అలీషా కవి, పండితుడు, ఆధ్యాత్మిక చింతనాపరుడు, తాత్త్విక జీవి. ఆయన రచనలను, ప్రధానంగా పద్య రచనలను ముమ్ముందు పరిశీలించవలసివుంది. శ్రీ ఉమర్ అలీషా కవి 1908 సం॥ నుంచి 1934 సం॥ల మధ్య లఘు కావ్యములను రచించారు. అవన్నీ కలిపి "ఖండకావ్యములు" అనుపేరు ప్రచురించబడినవి. ఈ ఖండ కావ్యములు రచించే ప్రక్రియ ఆనాటి తెలుగు కవులలో బహుళ వ్యాప్తి పొంది వుంది. అందువల్లనే అలీషాగారు ఆ ప్రక్రియను కూడా చేపట్టి తమ ప్రజ్ఞా పాటవాలను నిరూపించారు.

ఈ ఖండ కావ్యములలో సామాజిక దృక్పథంతో రచించిన అనేక ఖండికలు గలవు. సంప్రదాయబద్ధమైన కావ్యాలు, నాటకాలు ఆయన రచించారు. ఉమర్ అలీషా భారతీయ తత్త్వచింతనలో ఎంత గాఢానుభవం కలిగిన వ్యక్తో ఆవిధంగానే ఆయనకు సూఫీ వేదాంతంలో కూడా అంతే గాఢానురక్తి కలిగిన వ్యక్తి.

## II.1.B ఖండ కావ్యములు

ఉమర్ అలీషా గారి ఆంధ్రభక్తి, తెలుగు భాషానురక్తి వెలకట్టలేనిది. ఏ ఇతర తెలుగు కవులకు తీసిపోనిది. విశ్వనాథ, జాషువాలకు ధీటుగా కీ.శే. ఉమర్ అలీషా గారి కావ్యములు నడిచినవి. ముస్లిం కవులకు లేక ముస్లింలకు రాష్ట్రాభిమానము, దేశాభిమానము సామాజిక చింతన ఉండదనే అపోహకు ఉమర్ అలీషా గారి కవితలు చెంపపెట్టుగా గోచరిస్తాయి.

ఉమర్ అలీషా గారి యీ క్రింది కవితలో శాత వాహన రాజుల, కీర్తి, పల్నాటి వీరుల శౌర్యదీప్తి. గజపతి రాజులు, పాక నాటి ప్రభువులు చాళుక్య ప్రభువుల కళాశక్తి, పౌరుష ప్రతాపాలను ఎంతో రమ్యంగా వర్ణించారు. ఇక్కడ సిరి, సరస్వతి కలసి నర్తించారని ఉమర్ అలీషా చెప్పడం చూస్తూంటే , జాతి మత భేదం లేకుండా అందరి కవుల హృదయాలు ఒకే విధంగా ప్రతిధ్వనించాయని స్పష్టంగా తెలుస్తుంది. మచ్చుకి ఆయన రాష్ట్రాభిమానానికి నిదర్శనమైన ఒక పద్యం చూడండి :

"శాతవాహన శకనాధ సార్వభౌము
లొలయు నాస్థాన సీమల నోలగముల
ప్రధిత పల్నాటివీర మార్తాండ కోటి
నిండు కొలువున గజరాజులుండు కోట
మేటి చాళుక్య గణ పాకనాటి ప్రభుల
యల నిజామాధినృపుల సౌధాల మ్రోల
మహిత మాణిక్య దీపముల్ మండుచోట
పరనృపాల కిరీటముల్ వంగుచోట
విమల సురభిళానిలములు వీచుచోట
సిరి సరస్వతి యొకచోట చెలగుచోట
గజ్జెలందెలు మ్రోయగా గనకవృష్టి
గురియు దివి జాంగనల మనో హరవిలాస
భాసమాన కణ సముల్లాస లీల
నవ్వు వెన్నెలలలమగ నాట్యమాడి
నట్టి శ్రీ రాజ్యలక్ష్మి" (ఉమర్ అలీషా, 1951, పుట 62)

ఈ విధంగా కవనధారతో ఆంధ్రరాజ్యలక్ష్మిని ప్రశంసించాడు శ్రీ ఉమర్ అలీషాగారు. ఈయన కవితతో శాతవాహన రాజులు, పల్నాటి వీరులు, చాళుక్యులు, పాకనాటి ప్రభువులు సజీవులైనారు. ఈ విధమైన ఆంధ్ర ప్రశస్తి చేసి రాయప్రోలు, విశ్వనాథ, జాషువాలతో సరితూగ గలిగాడు ఈ కవిచంద్రుడు.దేశమేగిన ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని అనే రాయప్రోలు గీతానికి సరితూగ గలిగిన పై తేటగీతి మాలిక ఎంతో భావస్ఫోరకంగా వికసిల్లుతుంది.

ప్రాచీన కవుల పట్ల ఉమర్ అలీషా కవిగారి భక్తి తత్పరత సరిసాటిలేనిది : ప్రాచీన కవులను ప్రస్తుతించడం, కుకవులను నిందించడం సాంప్రదాయ కవుల పద్ధతి. ఆ సంప్రదాయంలోనే ఉమర్ అలీషా పూర్వ కవుల అపూర్వ ప్రతిభా విశేషాలను హృదయ స్ఫూర్తితో " ముకుళిత హస్తాలతో " ప్రస్తుతించారు. ఇది కవిగారి కవితానురక్తి, పూర్వ కవులపై వున్న భక్తికి, సాహిత్య శక్తికి నిదర్శనంగా కనిపిస్తుంది. ఉదాహరణకు ఈ క్రింది పద్యం చూడండి.

" తెలుగు కత్తుల నెత్తురుల్ కడిగివేసి
ఘంటముల బోసి, భారతఘట్టములకు
వీరరుచి పెట్టి తలబ్రాలు వేయుచున్న
నన్న, తిక్కన్న ముకుళిత హస్తములను
పలుకు పలుకున టేకలు బలుకునట్టి
జిలుగు బెట్టిన పోతన్న తెలుగు వాణి
కంచుఢక్కను బ్రద్దలు గాగగొట్టి
వెలయు శ్రీనాథ కవిత్వధాటి" (ఉమర్ అలీషా, 1951, పుట 11)

కవి ఉమర్ అలీషా ముస్లిం అయినప్పటికీ తెలుగు సాంప్రదాయకవిగా తెలుగునేలపై నిలిచిపోయినాడు. త్రికరణ శుద్ధిగా తెలుగు సంస్కృతిలో మమేకమైన ఈ కవి. తన మతరీత్యా గాని, ముస్లిం సంస్కృతి రీత్యా గాని తాను ఆంధ్రుడను కానని ఊహించలేదు గనుక, ఉమర్ అలీషా కవితలో తెలుగు వారి సంస్కృతి పునర్జీవింపబడింది. ఉమర్ అలీషా సామాజిక చైతన్యము ఏవిధంగా పరుగులెత్తిందీ, వికసించిందీ ఆయన పద్యరచనలను పరిశీలిస్తే అవగతం కాగలదు.

ఒక గొప్ప సాంస్కృతిక నేపథ్యం కలిగిన కవి, కుల, మతాలు సరిహద్దులను దాటి, మానసిక సంకీర్ణతలను అధిగమించి ఉత్తమ కళాసృష్టి గావిస్తాడనడానికి ఉమర్ అలీషా గారి కవిత్వము చక్కని ఉదాహరణగా స్వీకరించవచ్చును.

"క్షామదేవత" అనే ఖండిక 1919లో రచింపబడినది. ఆనాటి సామాజిక పరిస్థితులకు ఈ కవితలోని పద్యాలు అద్దం పట్టాయి. ఉమ్మర్ అలీషా గారి ఈ రచన వలన ఆనాటి సామాన్యుడి పరిస్థితి ఏ విధముగా దయనీయంగా వుందో తేటతెల్లమౌతుంది. తెల్లవారి ప్రభుత్వములో

బ్రతుకులు తెల్లవారిపోయినవనే ధ్వనిని ఈ కవి వాస్తవికముగా దృశ్యీకరించాడు. ఈ క్షామదేవత ఉక్కుపిడికిలిలో దిక్కులేని ఆనాథల స్థితిని తెలిపే ఈ కవితాఖండికలో పద్యములు: ఒకటీ, రెండు :

"కూటికి మోమువాచి పసి కూనలలో యని యేడ్చునిండ్లు నా
నాటికి హెచ్చుచున్నవి; దినంబును యుగంబును బోలెదోచునే
చోటికి బోయినన్ కడుపుచుమ్మలు చుట్టుక పోవుచుండె నీ
కాటక మందు జెంద కడగండ్లిక దప్పవె క్షామదేవతా!"
అన్నమొ రామచంద్రయని యార్చుచు వీధుల వెంట నెందరో
ఖిన్నులు కంఠమెత్తి తమ ఖేదము పాడుచు మొత్తుకొంచు నే
మన్నను గాని యొక్క కడియన్నము బెట్టెడు రేడు లేడు సం
పన్నత గన్నదేశము శవంబవుతున్నది క్షామదేవతా!"

(ఉమర్ అలీషా, 1951, పుట 26)

ఈ విధంగా ఉమర్ అలీషా యుద్ధానంతర సమాజంలోని భీభత్సాన్ని చిత్రీకరించాడు. పసికూనలు కూటికి ముఖంవాచి వుండటం, కడుపు "చుమ్మలు చుట్టుకు పోవడం", అన్నమోరామచంద్రాయని అంగలార్చడం, చివరకు ఒక ముద్ద అన్నము కూడా దక్కక పోవడంతో ఒకప్పుడు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లిన దేశము "శవం"తో సమానమై పోయినదని కవి వాపోతున్నాడు. ఏమతంలో, ఏకులంలో ఉన్నా మనిషిని, మానవత, ఆర్ధ్రత, కరుణ, జాలి అనేవి కులమతాల కతీతంగా, ఉన్నతీకరిస్తాయని తన కవితలలో చాటాడు శ్రీ ఉమర్ అలీషా!

కవి 'క్రాంతిదర్శి' కవిర్మనీషి స్వయంభూ: పరిభూ: అనే ప్రాచీన వాక్య ధర్మాలు నిజం అనడానికి ఉమర్ అలీషా గారి 'నిమ్న జాత్యుద్ధరణము' అనే కవితను ఉదాహరణగా తీసుకొనవచ్చును. ఆ కవితలో ఆయన దళితజాతుల పట్ల ఉన్న ఆర్ధ్రత స్పష్టీకరించబడింది.

"దేశవాసుడు మీ యిష్ట దేవుగొలుచు
మీకు సోదర ప్రాయుండు మీ సఖుండు
మాలవాడని వర్జించి త్రోలదగునె
మైలవచ్చునె ముట్టిన?" (ఉమర్ అలీషా, 1951, పుట 21)

ఈ పద్యం కవి వ్యంగ్య వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది. మాలవాడు కూడా మీ దేశస్థుడే, పైగా మీరు కొలిచే దేవుళ్ళను కొలుస్తున్నాడు, మీకు సోదరతుల్యుడు అటువంటి సాటి మానవుడిని ముట్టుకుంటే మైల ఏర్పడుతుందా? అని అంటూ అంటరాని వానిగా తోసివేయబడిన మాల మాదిగలు, మిగతా అగ్రవర్ణాలు ఒకే దేశస్థులని ఇద్దరికీ ఇష్టదైవాలు ఒక్కరేనని, ఉమర్ ఆలీషా వ్యంగ్యంగా గుర్తు చేస్తూ యీ విధంగా అన్నారు.

"ధూళిధూసర కలితయై దోగునట్టి
గంధమహున కేమైనను గలదెమైల? (పైదే)

ఇది ఒక గొప్ప ఉదాత్తభావన దూళిధూసరాలతో కలిసి వ్యాపిస్తున్న వాయువు గంధాన్ని కూడా మోసుకొస్తుంది గదా! దానికి మైల అంటుట లేదు గదా, నీ వెందుకు మైల, ఆచారం సంప్రదాయం అంటూ దూరంగా తొలగి పోతున్నావు అని బ్రాహ్మణ సమాజం వైపుకి ఒక మౌలిక ప్రశ్నను సంధిస్తాడు. కులమతాలమధ్య ఉన్న అడ్డుగోడలనుంచి ఈ సమాజాన్ని కాంతి పథం వైపుకి నడిపించాలని ముస్లింకవులు తీవ్రయత్నం కవితాక్షరాల ద్వారా చేశారు. ఇందుకు పైన పేర్కొనబడిన రెండు కవితలే గీటురాళ్ళు. ఇంకా యీ కవి యీ విధంగా అన్నాడు.

"శ్వపచ బ్రాహ్మణ భేదముల్ సలిపిమనుజ
కోటియను మేటి సౌధంబు గూలకొట్టి
నిప్పుబెట్టరి, దానిచే నేటిదాక
మండుచున్నది గాని యే పండితుండు
నడుము కట్టి చిచ్చార్ప గడగలేదు" (ఉమర్ అలీషా, 1951, పుట 22)

ఇక్కడ ఒక విషయాన్ని ధ్వని ప్రాయంగా ఉమర్ అలీషా గారు చెప్పారు. మనుషులను విడగొట్టి, మానవ కోటి ఐక్యంగా ఐకమత్యంగా నిర్మించుకొన్న మానవతా సౌధాన్ని నిప్పుపెట్టి కూల్చి వేశారని, ఇంత వరకు ఏ కవి, పండితుడూ తన కవితా శక్తితో, మేధో శక్తితో దాన్ని రూపు మాపలేదని, ప్రధమంగా తాను మాత్రమే బ్రాహ్మణ, ముస్లిం సంప్రదాయాలను మేళవించి, సమన్వయించి కావ్యాలను రచించానని, ఈ రెండు సంస్కృతిల మధ్య వారిధిగా పనిచేశానని ఉమర్ అలీషా కవి సూచించాడు.

ఈ కులభేదాల చిచ్చు కవి కాలం 20వ శతాబ్దం మొదటి నుంచి 21వ శతాబ్ది మొదటి దశకంలో కూడా ఇంకా విజృంభిస్తూనే ఉంది. ఇటువంటి సమకాలీన సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా ముస్లిం కవులు తమ కవితాస్త్రాలను సంధించారు. ముస్లిం కవుల సామాజిక స్పృహకు ఇది ఒక చక్కని ఉదాహరణ. తెలుగు సాహిత్యం యొక్క ప్రధాన స్రవంతిలోనే మొదటి నుంచి ముస్లిం కవులు ప్రయాణిస్తున్నారనేదానికి ఉమర్ అలీషా కవితలను అనేకం ఉదహరించవచ్చును. ఇక్కడ విస్తరణ భీతి చేత కొన్ని మాత్రమే పరామర్శించబడినవి. మన స్వాతంత్ర్యోద్యమంలో అన్ని వర్గాలు వారు గాంధీజీ నాయకత్వంలో పనిచేశారు. ఆనాడు ఎక్కువ భాగం ముస్లింలు ప్రత్యేక దేశాన్ని కోరుకోలేదు. జిన్నాలాంటి వారి రాజకీయ ధోరణుల వలన పాకిస్తాన్ ప్రత్యేక దేశంగా అవతరించడానికి కారణమైనది. ఏది ఏమైన హిందూ – ముస్లింలలో భాషా పరమైన అనుబంధత చాలా దగ్గరగా వున్నది. ఈ విషయాన్ని డా॥అంబేద్కర్ స్పష్టంగా ఈ విధంగా అన్నారు. " హిందువులు – ముస్లింలు చాలా కాలముగా కలసి మెలసి జీవిస్తున్నారు..... హిందువులకు భిన్నముగా ముస్లింల మధ్య భాషాపరమైన సమైక్యత పూర్తిగా వుంది. పంజాబ్‌లో హిందువులు, ముస్లింలు పంజాబీ భాషానే మాట్లాడతారు. సింధ్‌లో ఇరువురు సింధీ భాషనే మాట్లాడతారు. బెంగాల్‌లో బెంగాలీ భాషనే ఉపయోగిస్తారు. గుజరాత్‌లో ఇరు మతాల వారు గుజరాతి భాషలోనే మాట్లాడుకుంటారు. మహరాష్ట్రలో మరాఠి భాషనే వాడతారు. ఈ విధంగా సాగిన సామరస్యానికి రాజకీయ నాయకులు , మత పెద్దలు గండి కొట్టారు." (అంబేద్కర్, 1994, పుట 17) మహామేధావి డా॥ అంబేద్కర్ హిందూ ముస్లింల సమస్యని ఒక ప్రత్యేక దృక్కోణంతో చూశారు. అది భాషా సంస్కృతిలో ఇరు మతాలవారు ఏ విధంగా, ఒక భాషలో ఇంకొక భాష మమేకం అయ్యేటట్లుగా, తమ మౌఖిక సంప్రదాయాన్ని మార్చుకొని ప్రవర్తిల్లనదీ వివరించారు – అసలు యీ మత విద్వేషాలకు, రాజకీయ నాయకులు, మతవాదులు కారణమనే మౌలిక సత్యాన్ని ఆ విష్కరించారు.

స్వాతంత్ర్యోద్యమంలో 'జలియన్‌వాలాబాగ్" సంఘటనను తీవ్రస్వరంతో ఉమర్ అలీషా నిరసించడం వలన ఆయన దేశభక్తి ప్రస్ఫుటమౌతుంది. ఆయనంటాడు.

> "జలియనుబాగులో జనుల జంపినరక్తము వర్షపాతముం
> బలెప్రవహించె; మొండెముల బ్రాణములుండిన వారియార్తి సం

కలిత రవంబు గర్జనము క్రైవడి మ్రైసె దిగంత భూములన్
ప్రళయము వచ్చెనో యనుచు పౌరులు బారిరి ప్రాణభీతులై”
(ఉమర్ అలీషా, 1951, పుట 35)

తెల్లదొరలు సాగించిన దురాగతాలకు అంతులేదు. అమాయక ప్రాణాలు ఎన్నో గాలిలో కలిసిపోయాయి. తూటాలకు ఎదురొడ్డిన దేశభక్తులు వీరస్వర్గాన్ని అలంకరించారు- అక్కడ (జలియన్‌వాలాబాగ్‌లో) జనుల రక్తము వర్షపాతంగా ప్రవహించిందని గాయపడిన వారి ఆర్తి, ఆవేదన పిడుగు పడినట్లుగా అన్ని దిశలకూ వ్యాపించిదని కవిత్వీకరించడంలో కవి ఆవేదన స్పష్టంగా అద్దంలో కనిపించినట్లుగా కన్పిస్తుంది. ఇటువంటి హృదయ స్పందన వున్న  కవి ఏ మతం వాడయితేనేం? భారతీయుడే!

ఈ విధంగా దేశాభిమానం కలిగిన ముస్లిం కవులనేక మంది ఉన్నారు. కొన్ని సంస్థల ప్రభావం వలన ఎక్కువమంది ముస్లింల దేశభక్తిని శంకించనవసరంలేదు. దేశంపై భక్తి విశ్వాసాలు లేనివారు అన్ని మతాల్లోనూ అల్పంగానో అనల్పంగానో ఉంటూనే ఉంటారు. దానికి మతం కొలబద్దకాదు. ఇదే విషయాన్ని ఉమర్ అలీషాగారు “ఐకమత్యము” అనే ఖండికలో ఈ విధంగా అన్నారు.

“ఆర్యరక్తంబు వీరి దేహములయందు
స్వచ్ఛమై నేటిదాక యేపారుచుండె
మతము వేరైన జాతి సమ్మతముగాదె
భ్రాతృ వరులార సుగుణ సంపన్నులార” (ఉమర్ అలీషా, 1951, పుట 32)

మతము ఏదైతేనేం, భారతజాతి ఒకటే అని అంగీకరించరా? అనే మౌలికమైన ప్రశ్నను సంధించాడుకవి. ఈ ప్రశ్నద్వారా భారత జాతి లోని విభిన్న మతాల వారిది, విభిన్న జాతుల వారిది ఒకటే ఆర్య రక్తమని కనుక వీరందరూ సోదర బాంధవ్యము కలిగి వున్నారని కవిసూత్రీకరించి, భిన్నజాతుల మధ్య ఒక అంతస్సూత్రాన్ని ఏర్పరచాడు. ఇందువలన ఒక ముస్లిం కవి యొక్క ఉదాత్తవైఖరి వ్యక్తమౌతుంది. ఏ అరమరికలు లేకుండా “భాతృవరులారా! అని అంటూ మీలో సుగుణ సంపత్తి కూడా వుంది కాబట్టి మాలోని మంచితనాన్ని గుర్తించండని సూచిస్తున్నాడు.

పద్యకవులపై యీనాటికీ ఆధునికులు ఒక ముద్రవేస్తున్నారు – అది సరికాదు, సంప్రదాయ కవులు అనగానే వారు సమాజాన్ని విడిచి "వ్యక్తివాదంతో"– ఏవో పనికిరాని ఆదర్శలతో జీవిస్తారనే ఒక భ్రమను కలిగించడానికి ముఖ్యంగా మార్క్సిస్టు కవులు, విమర్శకులు ప్రయత్నించారు – ఇది సంప్రదాయ సాహితి పై బురద చల్లడమే! వారికి కూడా వాస్తవిక దృక్కోణం వుంది, వుంటుంది కూడా! సంప్రదాయ కవిత్వం ఔపోశన పట్టక పోతే శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీ గా ఉద్భవించేవాడు కాదు. బాలగంగాధర్ తిలక్, ఆరుద్ర, గుంటూరు శేషేంద్రశర్మ లాంటి ప్రసిద్ధ కవులందరూ సంప్రదాయ కవిత్వాన్ని భక్తి శ్రద్ధలతో అధ్యయనం చేసినవారే. ఈ నేపథ్యమే వారిని గొప్ప కవులుగా తీర్చిదిద్దింది.

ఆనాటి పద్యకవులు సంప్రదాయక అనుసరణతో పాటు వాస్తవిక దృక్పథాన్ని కూడా కలిగి ఉన్నారనడానికి ఈ "పల్లెటూరికాపు" గేయ కవితలోని కొన్ని చరణాలే ఉదాహరణలు

"చేలంట తిరిగేటి
ఆలంట మసిలేటి
పాలికాపుల్లోను
కాలాన్ని మార్చేటి
కాలుచూశారా?
మాకోలు గన్నారా? (ఉమర్ అలీషా, 1951, పుట 51-52)

ఉమర్ అలీషా కవి తనను గురించి చెప్పుకొన్న యీ పద్యం అత్యుక్తి కాదు.

"వ్యసనములున్ విమర్శనలు భావకవిత్వ రసైక చారు వి
న్యాసములున్ మతాంతర మహాపరివర్తన తత్త్వ రూపకో
పాసనముల్ పురాణములు వ్రాసితి భారత భూమి నేనుప
న్యాసము లిచ్చుచున్ దిరిగినాడను "ఉమ్రలిషా" కవీంద్రుడన్"

(ఉమర్ అలీషా, 1955, పుట iii)

పై పద్యము వలన ఉమర్ అలీషా ప్రతిభా పాటవాలు అసామాన్యమైనవని గ్రహించ వచ్చును. ఈ విధంగా సాగిన ఉమర్ అలీషా కవిలో ఆమోదయోగ్యము కాని ఒకటీ రెండు విషయాలు ఉండటము ఆశ్చర్యమేమీకాదు. వారి ఖండికల్లో "పేదరికములోని రహస్యము"

"స్త్రీ స్వాతంత్ర్యము" అనే వాటిల్లో "పేదరికము" దైవదత్తమని, స్త్రీకి స్వాతంత్రమిచ్చినట్లయితే సమాజములో నైతికత పోతుందని చెప్పడము, ఆనాటి కర్మసిద్ధాంత లక్షణాలని చెప్పకతప్పదు. ఏది ఏమైనా ఉమర్ అలీషా మహాకవియే! ఆయన మాటల్లోనే

"ఆ మొహియుద్దీన్ బాద్షా
నామ మహాయోగి కగ్రనందనుడనా
నా మహితాగమహితవి
ద్యామతి " ఉమ్రాలిషామహాకవినేనున్"

(ఉమర్ అలీషా, 1955, పుట ii)

అని అంటూ తర్వాత పద్యములో పది కావ్యములను, పదినాటకాలను, పది నవలలను, పారసీ కావ్యానువాదాలను చేశానని అవధాన ప్రక్రియలందు ఉద్ధండునని చెప్పుకోవడం వెనుక వున్నది కవి ఆత్మవిశ్వాసమే గాని అహంభావం కాదు – కవి నిజంగా అంత సమర్థుడే!

సంప్రదాయకవి అయినప్పటికీ , సామాజిక చింతన కలిగి రచనలు సాగించిన కవి ఉమ్రాలిషా మిగతా రచనలనూ కొంత పరామర్శించవలసిన ఆవశ్యకతవుంది. ఆయన బహుముఖీన పాండిత్యాన్ని కొంత పరిచయం చేయడం అవసరం. సాహిత్యంలోని దాదాపు అన్ని మిగతా ప్రక్రియల్లో రచనలు సాగించిన ఉమర్ అలీషా గారి సామాజిక చింతనా దృక్పథాన్ని, తాత్త్విక భావధారను స్థూలంగా పరిశీలించడం జరుగుతుంది.

ఉమర్ అలీషా కృతుల్లో పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలు ఉన్నవి. సాహిత్యాంత హి నాటకమ్' (లక్ష్మీకాంతం పింగళి, 1991, పుట – 89) అనే అలంకారిక శాసనమువలన అనేకమంది కవులు నాటకరచనలు చేశారు. తెలుగు సాహిత్యంలో, ముస్లిం కవుల్లో మొట్టమొదటిగా నాటకాలు రచించిన కవి ఉమర్ అలీషాగారు.తిరుపతి వేంకట కవులకు ఇంచుమించుగా సమకాలీనుడైన ఉమర్ అలీషా వారి పద్ధతిలో నాటక రచన చేయడం గమనార్హం. కవితా చైతన్య రథంలో ఊరేగుతూ ఆంధ్రదేశాన్ని ఒక ఊపు ఊపిన వారు తిరుపతి వెంకటకవులు. వారి అవధానాలు, నాటకాలు సర్వజన రంజకంగా వుండేవి. అదే మార్గంలో పద్య, గద్యాత్మక నాటాకాలను అనేక మంది కవులు రచించినప్పటికీ "పాండవోద్యోగ విజయాలు", బలిజేపల్లి లక్ష్మీకాంత కవి సత్యహరిశ్చంద్ర అంతటి ప్రసిద్ధి. మిగతా రచనలకు కలుగలేదు. అయితే

మిగతావారి నాటకాలు సాహితీపరంగా సాహితీపరులు అధ్యయనం చేయడానికి పనికి వచ్చినవి. పండిత పామరులను రంజింపచేసేదే ఉత్తమ కళ – ఈ ప్రక్రియతో తిరుపతి వేంకటకవులు సామర్ధ్యాన్ని మిగతా వారందుకో లేక పోయారు.

## II.1.C అనసూయా దేవి

అనసూయ ఇతివృత్తాన్ని ఎన్నుకోవడంతో ఉమర్ అలీషా గారి దృక్పథం అవగతం అవుతుంది. భారతీయ మహిళా ధర్మానికి ఆయన ఎంత విలువ ఇచ్చినది తెలిసి పోతుంది. అప్పటికే రవీంద్రుడు, శరత్‌చంద్రుడు భారతీయ మహిళ ఔన్నత్యాన్ని చాటుతూ బెంగాలిలో అనేక నవలలు రచించారు. బెంగాలీ సాహిత్యం గురించి వినడం ద్వారా చదవడం ద్వారా ఆంధ్రదేశంలో రచయితలు స్ఫూర్తి చెందినారు – తరువాత బెంగాలీ రచనలు తెలుగు రచనలు అనేవిధంగా అనువాదం గావించబడినవిషయము అందరికీ తెలిసిందే ! ఉమర్ అలీషా గారు తీసుకొన్న ఇతివృత్తం స్థూలంగా డా. షేక్ మస్తాన్ గారి సిద్ధాంత గ్రంథం నుండి

"శంతనుడి ద్వారా కలిగిన ఏడుగురు కుమారులను గంగకర్పిస్తుంది గంగాదేవి. గంగపాలు చేసిన పాతకానికి పాపదేవత గంగను యమ  యాతనలు పెట్టి వేధిస్తుంది. ఆ బాధల కోర్వలేక గంగ, బ్రహ్మ, విష్ణు మహేశ్వరులను శరణువేడి విఫలమౌతుంది. తుదకు అనసూయాదేవిని ఆశ్రయించి పాపదేవత బాధలనుండి విముక్తి పొందుతుంది. సర్వశక్తి మంతులైన జగజ్జనులు సైతం సాధించలేని కార్యాన్ని అనసూయ తన పాతివ్రత్యమహిమతో నెరవేరుస్తుంది" (షేక్ మస్తాన్,1981, పుట – 87)

అనసూయా దేవి త్రిమూర్తుల పరీక్షలో నెగ్గడము, నర్మదభర్త ప్రాణాలను కాపాడటము మొదలగు అంశాలను కవి తన నాటకంలో చక్కగా వ్యక్తీకరించారు. నారదుడు త్రిమూర్తుల పత్నులతో అనసూయాదేవి పాతివ్రత్యాన్ని గురించి చెప్పిన మాటలు ఈ విధంగా ఉన్నవి.

> "నిగురు గల నిప్పుపై నీగలెగురగలవె
> భాను బింబమ్ముపై చెదపట్టగలదె
> అట్టులాసాధ్వి యనసూయ నంట నెవరి
> తరము మృత్పాత్ర మేరువు దాకినట్లు" (ఉమర్ అలీషా, 1951, పుట–68)

ఉమర్ అలీషా గారి ఈ అనసూయదేవియే తరువాత కరుణశ్రీ “అనసూయ“ గురించి మహత్తరమైన ఖండికను వ్రాయడానికి ‘ప్రేరణ‘ గా నిలిచివుంటుందని భావించడంలో అనౌచిత్యము కన్పించడంలేదు.

ఈ నాటకంలో ఉమర్ అలీషా కవి గారి అలంకారిక వైచిత్రి స్పష్టమౌతుంది. డా॥ షేక్ మస్తాను గారు ఈ నాటకాన్ని గురించి “నాటకంలో చక్కని జాతీయాలను, సామెతలను వాడి నాటకానికి ఒక వినూత్నత్వాన్ని కలిగించారు” అని అన్నారు (షేక్ మస్తాన్, 1981, పుట-90) కవిత్వరచన అంటే యధాతథంగా చిత్రీకరించడం కాదు. ఒక చిత్రకారుడు వర్ణమిశ్రమంతో చిత్ర శిల్పాన్ని సాధించినట్లే, సాహిత్యంలో సజీవమై, నిరంతరం జనం నోట ప్రస్తావించబడే జాతీయాలు, సామెతలు, కవిత్వరచనలో చోటు చేసుకొంటే ఆ కవితలో కవి “ప్రాణస్పందన“ కనిపిస్తుందనడం సహజోక్తి మాత్రమే!

## II.1.D మహాభారత కౌరవ రంగము

ఉమర్ అలీషాగారు 1916 సం॥ ప్రాంతంలో వ్రాసిన నాటకం ఇది. మాహాభారతంలోని ఉద్యోగ, భీష్మపర్వాల నుంచి కథను స్వీకరించడం జరిగింది.

మహాకవి జాషువా గారికి “కర్ణుని” పాత్ర అంటే ఎంత ఇష్టమో శ్రీ ఉమర్ అలీషా గారికి కూడా కర్ణుడు అంతే ఇష్టం. మహా భారతంలో విధివంచితుడైన కర్ణుని గురించి ఎవరికైనా సానుభూతి ఉండటంలో ఆశ్చర్యంలేదు. ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో విశిష్టమైన వ్యక్తిత్వం గలిగిన ‘కర్ణుని’ గురించి శ్రద్ధ తీసుకొన్నవారిలో ఉమర్ ఆలీషా ప్రథములు అనవచ్చును. మహాకవి జాషువా గాని, ఉమర్ అలీషా కవి గాని, “ కర్ణుని ” పూర్తిగా అభిమానించడానికి గల ప్రధాన కారణం, మహాభారతంలోని “కర్ణుడు” ఆధునిక మహాభారతంలో “ కర్ణులం ” మేము అనే ధ్వని ఆయా ఖండికలను చదివిన వారికి స్ఫురించకపోదు. సమాజం విసరిపారేయబడిన దళితులకు ‘కర్ణుడు‘ ఒక ప్రతీక! మహాకవి జాషువా కూడా

“ముసలివాడైన బ్రహ్మకు పుట్టినట్టి
కొమరులు నలుగురనుచు విన్నాము గాని
పసరము కన్న హీనుడభాగ్యుడైన
ఐదవ కులస్థుడెవ రమ్మా సవిత్రి! (జాషువా, పుట-25)

అని ప్రశ్నించాడు – ఆ అయిదవ కులస్థుడు అంటరాని 'కర్ణులే' పరస్త్రీల యందు కర్ణుని మాతృదృష్టి ఈ పద్యములో విశిష్టముగా వర్ణించబడింది.

"కుంతికి బుట్టినన్ మఱి శకుంతకు బుట్టిన బుట్టనిమ్ము నే
యింతికొ మానవుండు జనియించుట తథ్యము నాకు దానికై
వంత యొకింతలేదు బలవంతముగా నిది తల్లియంచు నీ
వింతగ చెప్పనేల పెఱయింతులు తల్లులు గారెమాధవా"

(ఉమర్ అలీషా, 1936, పుట-77)

ఈ పద్యంలోని కర్ణుని వ్యక్తిత్వం 'నభూతో నభవిష్యతి ' అన్న చందంగా ఉమర్ అలీషా గారు వర్ణించారు. ఈ పద్యంలో కర్ణుడు లోకోత్తర మానవుడిగా కనిపిస్తాడు. ఒకరు కుంతికి జన్మించవచ్చు, శకుంతలకు జన్మించవచ్చు, మనిషి అన్నవాడు ఏదో ఒకఇంతికి జన్మించకుండా వుండడు – కృష్ణా నీవు బలవంతముగా యీ స్త్రీని తల్లియని చెప్పడం వింతగావుంది. పరాయి స్త్రీలు తల్లులు గాక ఏమవుతారు? అని కర్ణుడు ప్రశ్నించడం ఎంతో కరుణ రస ప్లావితంగా వుండి, పాఠకుడిని కదిలిస్తుంది. ఇందులో కర్ణుడు ఒక విశ్వనరుడిగా గోచరిస్తాడు. కుంతి కోరిన కోర్కెల గురించి కర్ణుడు వ్యంగ్యంగా, తల్లి మీద గౌరవం పోకుండా చెప్పిన ఈ మాటల్లో కర్ణుని ధీరోదాత్తత, బాధ ప్రతిబింబిస్తుంది. చూడండి.

"సూర్యునంతటివాని సూనుడం చెరిగియు
        కృపమాని గంగ కర్పించినావు;
చిరకాలమై పాసి చిత్తంబులో రోసి
        మరణించెనని కర్ణు మరచినావు
సూతుని సుతుడనై సూతకన్యను గూడి
        కాపురంబును సేయగాంచినావు
పాండు నిల్లాలివై పడసిన పుత్రుల
        గెలిపింపనన్నొంప దలచినావు
నిజముగా నన్ను తొమ్మిది నెలలు మోసి
కాంచియుండిన నాస్థితి గాంచి నీదు
కడుపుచుమ్మలు చుట్టక పడకయున్నె
తల్లి గొంతెమ్మకోర్కెలు జెల్లునమ్మ" (ఉమర్ అలీషా, 1936, పుట-77)

కర్ణుడు తన తల్లి అయిన కుంతీదేవికి సంధించిన ప్రశ్నలుగా కాకుండా అస్త్రాలుగా గోచరిస్తాయి. కవిప్రతిభకు గీటురాళ్లు ఈ ప్రశ్నలు. ఈ విధంగా ఉమ్రాలీషా కవి ' మహాభారత కౌరవ రంగం ' లో కర్ణుని పాత్రను, విశిష్టంగా, సృజించి, సమాజంలోని మైనారిటీలు, దళితులు, కర్ణుడు మాదిరిగా విధివంచితులు అని ధృవీకరించారు.

ఈ నాటకంలోని ప్రత్యేకమైన అంశం ఏమిటంటే కవి కౌరవుల పక్షం వహించి పాండవులు చేసిన తప్పులను పట్టి చూపడమే ! యుద్ధ తంత్రంలో ఇరుపక్షాలు అన్యాయానికి పాల్పడటం అక్కడక్కడా మహాభారతంలో కనిపిస్తూనే వుంటుంది. అయితే కౌరవులు అధర్మవర్తనులైనట్లే పాండవులు కూడా అధర్మవర్తనులనే విషయం విస్మరించరానిదని ఉమర్ అలీషా అనే కవి మన స్మృతికి తీసుకురావడంలో గొప్ప సఫలతను సాధించాడు. ధర్మము పాండవుల పక్షాన, అధర్మము కౌరవుల పక్షాన మధ్యలో సరళగీత గీచినట్లుగా లేవు – రెండు పక్షాలలోనూ ధర్మాధర్మాలున్నవి అని చెప్పడమనే కవిలక్ష్యం సమంజసంగా వుంది.

## II.1.E ఉమర్ ఖయ్యామ్

పారశీక కవి " ఉమర్ ఖయ్యామ్" రచనలను అనేక మంది ప్రసిద్ధకవులు ఆంధ్రీకరించారు. ఈ తెనుగు సేతలో దువ్వూరి రామిరెడ్డి, కరుణశ్రీ, దేవులపల్లి, రాయప్రోలు, బూర్గుల రామకృష్ణారావు ఆదిభట్ల నారాయణదాసు, చిలుకూరు నారాయణరావు, చలం, శివశంకర శాస్త్రి, స్ఫూర్తి శ్రీ, లత లాంటి వారు చేసిన అనువాదాలకు ధీటుగా ఉమర్ అలీషా అనువాదం నిలబడటం, వారి ప్రతిభాపాటవాలకు నిదర్శనం. ఉమర్ అలీషా గారి అనువాద పఠిమకు ఉదాహరణలు చూడండి.

> "ఎక్కడ నుండి వచ్చితిమొ యెక్కడి కేగుట కౌనొ యెవ్వరీ
> నిక్క మెరింగి చెప్పుటకు నేర్చిన వారలు గారు ధాత్రియం
> దక్కట దీనికిన్ మొదలు నంతము నిట్టిదటంచు తోచ దీ
> ఫక్కిని జీవయాత్రకయి వచ్చుచు పోవుచు నుంటి మెంతయున్"

(ఉమర్ అలీషా (అను) 1965, పుట 10)

ఉమర్ ఖయ్యాము తత్త్వము 'తినుట, త్రాగుట, సుఖించుట అనే అపప్రథ ఉన్నది. అయితే ఉమర్ ఖయ్యాము సత్యాన్వేషణ 'అతీతాన్ని' సందర్శించటమే! జీవనయానములోని ఒడిదుడుకులను, ప్రణయతత్త్వాన్ని ఉన్నతీకరించడమే ! ఇందుకు ఉదాహరణ చూడండి

"ఎవ్వరివల్ల గాదల యతీంద్రయమున్ దెరదాటిపోవ నిం
దెవ్వరు నీరహస్య మిదమిత్థమటంచును జెప్పలేరు మున్
దివ్య సుధాంతరంగ నిజ మృద్గృహ గమ్యతలంబు; కాని యీ
నెవ్వగ పెద్ద గాథవలె నివ్వెఱ గొల్పును జెప్పవచ్చినన్" (పైదే, పుట18)

కరుణ శ్రీ, స్ఫూర్తిశ్రీ లాంటివారు, ఒక సారి మూలం నుంచి అనువాదంగావించబడిన ఆంగ్ల గ్రంథం నుంచి అనువాదం చేయడం జరిగితే ఉమర్ అలీషా కవి నేరుగా పారశీకం నుంచి అనువదించడం వలన అలీషా అనువాదం అత్యంత మూల విధేయంగా వుండి ఉమర్ ఖయాం భావజాలంతో మనకొక దగ్గరితనం వస్తుంది. మచ్చుకి ఒక ఉదాహరణ.

లబ్‌బర్ లబె కూ జబర్దమ్ అజ్గాయతె ఆజ్
తాజా తలబమ్ వాస్తమె ఉమ్రెదరాజ్
బామన్ బజ బానె హాల్ మీ గుఫ్త్ ఈఁరాజ్
ఉమ్రేచతొ బూదఅయ్ దమే బామన్‌సాజ్

దీనికి ఉమర్ ఆలీషా గారి అనువాదం చూడండి.

ఆస జషకఁబు బెదవులనంటి యాయు
వెంతో యభివృద్ధి సేయగానెంచ, నదియు
నిట్టులనె; నేను నీవలెనెపుడొ నరుడ
నన్ను సేవింపుమింకఁ గొన్నాళ్ళు నీవు (గోపాలకృష్ణారావు. కె, 1968, పుట122)

ఉమర్ ఖయ్యాము సూఫీ తత్వము యిందులో ప్రతిబింబిస్తుంది. ఉమర్ అలీషా మూల విధేయంగా రచన సాగించినట్లు తోస్తుంది. ఈ ఉమర్ అలీషా అనువాద కావ్యం ఉమర్ ఖయ్యాము దువ్వూరి రామిరెడ్డి గారి "పానశాల" కావ్యానికి సమవుజ్జీగా వుండి రసజ్ఞులను ఆశ్చర్యపరుస్తుంది. రసతన్మయతను కలిగిస్తుంది కూడా !

## II.1.F బ్రహ్మ విద్యావిలాసము

ఉమర్ అలీషా కవి భారతీయ తత్త్వాన్ని జీర్ణించుకొనిన మనిషి. ముఖ్యంగా అద్వైత వాది. వారి పూర్వీకులు "శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం"ను స్థాపించి తమవంశమువారిని పీఠాధిపతులుగ నియమించుచున్నారు. ఉమర్ అలీషా కవి షష్టమ పీఠాధిపతి. International Academy of America వారు 1936 సం॥ D.Litt ఇచ్చి వీరిని గౌరవించడం వలన వీరి విద్వత్ తేజం ఎంత ప్రకాశమానమైనదీ స్పష్టమౌతుంది.

ఉమర్ ఆలీషా కేవలం కవి, నాటక కర్త, అనువాదకుడు, నవలా రచయిత కాకుండా సాంప్రదాయక ఆధ్యాత్మిక విద్యను అనుభవ పూర్వకంగా గ్రహించి, అధ్యయనంచేసి "బ్రహ్మవిద్యా విలాసం" అను శతకాన్ని తన గురువు పేర రచించారు. అందులోని పద్యం ఒకటి చూడండి.

"నిశ్చలంబయి ఒక్కటై నిత్యసత్య
నిష్కళానంద నిష్క్రియ నిర్గుణంబు
యైన బ్రహ్మంబహంబని యలరుమున్ను
కలుషగత వేషభూషయా ఖైలనీష" (ఉమర్ అలీషా, 1951, పుట 8)

'బ్రహ్మ'ను నిర్గుణ బ్రహ్మగా, సగుణ బ్రహ్మగా విభజించుట మన ఆధ్యాత్మిక సాంప్రదాయంలో వుంది. 'సగుణతత్త్వము'' మధ్యమాధికారులకు ''నిర్గుణ తత్త్వాన్ని '' ఉత్తమాధికారులకు నియమించడం జరిగింది. పైన ఉమర్ అలీషా గారు వ్రాసిన పద్యంలో ఒక చమత్కృతి వుంది. అది అద్వైత వాదానికి మూల సూత్రమైన " అహం బ్రహ్మోస్మి" అనేదాన్ని తేట తెనుగులో ఈ పద్యంలో నిక్షిప్త పరిచారు, " బ్రహ్మంబహంబని " అనే పదవిన్యాసంలో !

బ్రహ్మర్షి ఉమర్ అలీషా గారు బ్రహ్మతత్త్వాన్ని బాగా అవగతం చేసుకొని సాంప్రదాయక ఆధ్యాత్మిక వాదులతో సమంగా ఉన్నారనేది స్పష్టం. అందుకు " బ్రహ్మవిద్యా విలాసం " పీఠికలో వారు ఉదాహరించిన ఈ తత్త్వసూత్రాలే నిదర్శనం.

1) సదేవ సోమ్యేదమగ్ర అసీత్. ఏకమే వాద్వితీయం
2) ఇదాత్మన మిదం సర్వం సత్సత్యంప ఆత్మా
3) మాయాంతుం ప్రకృతిం విద్యాన్మాయి నంతు మహేశ్వరం

4) అస్యావయవ భూతైస్తు వాస్తం సర్వం మిదం జగత్

5) మాయా చతమోరూప! తదేతజ్జడం మహాత్మకం అనంతం

(ఉమర్ అలీషా, 1951, పీఠిక)

ఈ విధంగా అనేక తత్త్వ సూత్రాలు ఉమర్ అలీషా బ్రహ్మవిద్యా పారంగతుడని తెలియపరుస్తాయి. బౌద్ధుల "శూన్యవాదం" అద్వైతుల "నిర్గుణ తత్త్వం" ఒక్కటిగానే గోచరిస్తవి అని ఇక్కడ సూచించడము భారతీయ తత్త్వచింతన లో ప్రధానమైన (బ్రాహ్మణ) అద్వైతవాదం, బౌద్ధుల శూన్యవాదం ఒకే నాణేనికి బొమ్మ బొరుసులాంటివని తెలియపరచడం కోసమే ! అందువల్లనే శంకరాచార్యులు " ప్రచ్ఛన్న బౌద్ధుడవడమూ " – ఆచార్య నాగార్జునుడు ప్రచ్ఛన్న హిందూవవడం తటస్థించినవి.

శ్రీ ఉమర్ అలీషా సగుణ నిర్గుణ బ్రహ్మతత్త్వాన్ని, మాయా తత్త్వాన్ని, పంచ భూతాత్మక తత్త్వాన్ని, మహాజ్ఞాన, ధ్యాన తత్త్వాలను సూక్ష్మస్థూల పంచీకరణాన్ని తన 16వ యేటనే తెలుసుకొని తమ గురువుగారి పేర శతకము రచించడము ఆశ్చర్యం కలిగిస్తుంది. దాదాపు 50 కావ్యాలను, గ్రంథాలను శ్రీ ఉమర్ ఆలీషా రచించినట్లు తెలుస్తుంది. ఇందువలన ముస్లిం కవి , పండితుడు అయిన ఉమర్ ఆలీషా కొంత మంది అగ్రవర్ణాల సొత్తుగా పరిగణించే ఆధ్యాత్మిక జ్ఞానములో ఏ ఇతర బ్రాహ్మణ బ్రాహ్మణేతర కవి పండితులకన్నా తక్కువవాడు కాదని ఆయన పూర్తిగా భారతీయ ధర్మాన్ని అనుష్టించారని తెలుస్తుంది. భారతీయధర్మం అనేది, సంస్కృతి అనేది ఒక ప్రత్యేకమైన వైదిక, బ్రాహ్మణ భావజాలాలకు మాత్రమే పరిమితి చేసిన కాలం అది. అందువలనే ఏ సంప్రదాయ కవి అయినా తన మార్గాన్ని ఒక సంకీర్ణ భావజాలానికే పరిమితం చేసుకొని ఎక్కువ భాగం వైదిక, బ్రాహ్మణ భావజాలాల పరివ్యాప్తికి కృషి చేయడం జరిగింది. అదే బాటలో ఉమ్రాలిషా కవి ప్రయాణం చేసినా ఆయనలో మానవత, సామాజిక దృక్పథం, హేతువాద ధోరణి సమ్మిశ్రితం అయివున్నవి. అందువలన చాంధసవాద లక్షణం ఆయన రచనలకు లేదు. ఉమర్ అలీషా, శ్రీనాథ కవి చెప్పిన చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాడు రచియించితి మరుత్తరాట్చరిత్ర! అనే చాటు పద్యంలోని భావసరళిని పుచ్చుకొని ఈ క్రింద నుదహరించిన పద్యం చెప్పాడు చూడండి.

"రచియించినాడ విభ్రజిత దివ్యప్ర
బంధముల్ పది కావ్యబంధములుగా
వ్రాసి నాడను కల్పనాసక్తిమతి పది
నాటకంబులను కర్నాట ఫక్కి
కూర్చినాడను కళాకోవిదుల్ కొనియాడ
నవలలు పది నవలల నగ
తెనిగించినాడ నుద్దీపితాఖండ పా
రసి కావ్యములు పది రసికులలర
రసము పెంపార నవధాన క్రమము అయిదు
ఆశువుల యందు పాటల యందు కలిత
చెప్పినాడ నుపన్యాస సీమ లెక్కి
యవని 'ఉమ్రాలిషా కవి' యనగ నేను (ఉమర్ అలీషా, 1955, పుట, ii)

కవి యొక్క గొప్ప ఆత్మ విశ్వాసము ఈ పద్యములో కనిపిస్తుంది. ఏ ప్రాచీన కవికి గాని ఆధునిక (సంప్రదాయ) కవికి గాని తక్కువగారు మహాకవి ఉమర్ అలీషా.

## II.2. షేక్ ఖాసిం

ఈ రచయిత 'సాధులోకపాల సత్యశీల' అనే మకుటంతో సాధుశీల శతకాన్ని రచించారు ఇందులో 101 పద్యములున్నవి. ఈ కవి మతదృక్పథం కలిగిన వ్యక్తి. అందువలన ఈ శతకం తొలి పద్యము ఈ విధంగా వుంది.

"శ్రీ విభున్మివురవి చిద్రూపుడల్లాను
సంస్కృతాంధ్రకవుల, సత్యశీలు
గాంధి దలచి మలతు కవితలు శతకంబు
సాధులోక పాల సత్యశీల" (షేక్ ఖాసిం, 19 , పుట,12)

"మతము హితముకొరకె మత్సర మేలయ్యా!" అని షేక్ ఖాసిం గారనడం వలన మతాన్ని పూర్తిగా విశ్వసించినట్లు తెలుస్తుంది. "దేవుడొక్కడేను తెలియదు రూపంబు" అనడం వలన

కవికి ఏకేశ్వరోపాసన పట్ల నమ్మకము ఉందని తెలుస్తుంది. షేక్ ఖాసింగారి మతదృక్పథాన్ని, కొంచెం ప్రక్కకు పెట్టి చూస్తే ఇది మంచి నీతి శతకంగా కనిపిస్తుంది. ఈ శతకంలో ఒకటీ, రెండు పద్యాలు:

"బాల్య చాపల్యమున బడియుండి కొన్నాళ్లు
యౌవనమున చాపమావహింప
ముసలి తనము నందు మొరపెట్టిఫలమేమి?
సాధు లోకపాల సత్యశీల!
కులము మతము గాదు గుణము ప్రధానంబు,
దైవచింత లేమి తపముగాదు
బాలయోగి కులము పంచమ కులమయా
సాధులోక పాల సత్యశీల! (పైదే పుట-21)

ఈ విధంగా సాదాసీదాగా, సాగే రచన అయినప్పటికీ నీతి ప్రబోధము చేయడం వలన శతకం వన్నె కెక్కినది. ఈ కవి యొక్క పద్య గమనం, భావ నిర్దుష్టతల విషయంలో వేమన కవిని గుర్తుకు తెస్తాయనడములో అతిశయోక్తి లేదు.

ఒక కవి యొక్క రచనలను పరిశీలించేటప్పుడు, అతని రచనలను రెండు విధాలుగా దర్శించ వలసిన ఆవశ్యకతవుంది. కవి యొక్క రసదృష్టి వలన ఆ కవితగాని పద్యంగాని ఆనందింపజేస్తుంది. అందులో సందేహం లేదు. అతని యొక్క సామాజిక యధార్ధత తిరోగమిస్తుందా? లేక పురోగమిస్తుందా? అనే విచికిత్స ప్రధానమైనది. ఎంత గొప్ప రచన అయినా, ప్రగతిశీల దృక్పధం లేక పోతే అది ఒక పిండి బొమ్మ గానే గోచరిస్తుంది. షేక్‌ఖాసిం గారు వెనుకబాటు తనాన్ని చూపే "మతభావాలు" కొన్ని కలిగి వున్నప్పటికీ ఆయన జీవితాన్ని, సమాజాన్ని దర్శించిన తీరులో ఒక పరిణితి కనిపిస్తుంది. అదే ఆయన రచనల్లోని సద్లక్షణం. షేక్ ఖాసిం కవి సీతారామ కళ్యాణం (బుర్రకథ), సమస్యాపూరణ పద్యసంపుటి - 'మహ్మదు ప్రవక్త జీవితచరిత్ర (పద్యకావ్యం) లాంటివి రాయడం వలన ఇతను హిందు-ముస్లిం మత సంస్కృతులను సమానంగా గౌరవించినాడని తెలుస్తుంది.

## II.3. షేక్ బుడన్ సాహెబ్

అక్బరు చరిత్రను "జలాల్‌నామా" పేరున షేక్‌బుడన్ సాహెబ్‌గారు అయిదాశ్వాసాల ప్రబంధంగా రచించారు. ఈ కవిని గురించి దివాకర్ల వేంకటావధాని, దేవులపల్లి రామానుజరావు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, జనమంచి వేంకట సుబ్రహ్మణ్యశర్మ లాంటి ఉద్ధండులు ప్రశంసించడం వలన కవిగారి కవితా శక్తి అనల్పమైనదని తెలియుచున్నది. షేక్ బుడన్ సాహెబ్ గొప్పపండితుడు అనువాదకళ కూడా తెలిసిన కవి.

షేక్ బుడన్ సాహెబ్ జలాల్ నామాతోపాటు 'కుతుబ్ నామా' కూడా రచించారు. ఈ కవి గురించి జనమంచి వేంకట సుబ్రహ్మణ్య శర్మ గారు ప్రాచీన మర్యాదలను పాటించి కావ్యశైలిలో గ్రంథము పాఠకులకు తదేకాగ్రత కలుగునట్లు కథ నడిపించినాడు. ఈ కవి అని ఇంకా మహమ్మదీయుడయ్యి గీర్వాణివాణిలో నుండు నసాధారణములైన పదములను సైతము రసవంతంగా పొందు పరచి చక్కని శైలిలో పండిత పామర రసవేద్యముగా కావ్యము రచించాడని అన్నారు. ఏ కావ్య రచన అయినా పండితులకు, పామరులకు ఆమోదయోగ్యమైతేనే అది ఉత్తమ రచన అని జనమంచి వారి అభిప్రాయమూ, రసజ్ఞజన అభిప్రాయము కూడా ! దివాకర్లవారు ఈ విధంగా కావ్యం యొక్క ప్రశస్తిని ప్రశంసించారు "తమ ఖతుబ్ నామా" వలెనే యీ కావ్యమును రసభావబంధురమై లలితపద భూయిష్టమై, హృద్య వర్ణనోపేతమై యెంతో యింపు నింపినది అని కూడా అన్నారు. జలాల్‌నామాకు, తత్కావ్యకర్త బుడెన్ సాహెబ్ గారిని, ప్రసిద్ధపండితుడు కప్పగంతుల లక్ష్మణశాస్త్రి యీ విధంగా ప్రశంసించాడు.

"కవితారీతులు గాంచిమెచ్చితి భవత్కావ్యంబు విద్వజ్జన
స్తవనీయంబు జలాలు నామ యిదినీ జ్ఞాన ప్రసూనంపు బ్రా
భవ సౌలభ్యము నెల్లదిక్కులకు విద్వచ్ఛిత్త పేయంబుగా
వివరించున్ సుకవీ 'బుడెన్' బుధవరా! వేనోళ్లప్రశంసించెదన్"

(లక్ష్మణశాస్త్రి క.గం,1969, పీఠిక)

ఈ విధంగా ప్రముఖ కవి పండితుల ప్రశంసలను అందుకొన్న "జలాల్ నామా" కావ్యం యొక్క విశిష్టతను కొంత పేర్కొనవలసిన ఆవశ్యకత వుంది.

జలాల్ నామా ప్రౌఢ కావ్యం. ఇందలి వర్ణనలు, అలంకారాలు, శైలీవిన్యాసం, ధారా శుద్ధి, వస్తు నిర్వహణలో బుడన్ సాహెబ్ గారు తన సమకాలీన కవులకు ఏమాత్రం తీసిపోరు. బాలుడైన అక్బరును ఈ విధంగా వర్ణించారు.

"ఓ చెలియ! యీ శుభాకృతి
నేచరితల వింటి! మిట్టులెసగెడి శిశువున్
భూచక్రమందు గంటిమె?
మాచక్షుల కెంత ప్రీతి మఱిమఱిగలిగెన్"

అని అంటూ

కుసుమ బాణుడొండె కుముద బాంధవుడొండె
శిబికి బుట్టిన చతురు డొండె
యక్ష సూతి యొండె యాదృచ్ఛికా గత
బాలకృష్ణుడొండె పరుడె వీడు" (షేక్ బుడెన్ సాహెబ్, 1961, పు-31)

అని అక్బరు అందచందాలను వర్ణించిన కవి, అక్బర్‌ను బాలకృష్ణునితో పోల్చడము హిందూ, ముస్లిం సంస్కృతుల సమ్మేళనాన్ని దాని అవసరాన్ని సమయోచితముగా చెప్పినట్లయింది. అక్బర్‌ను బాలకృష్ణునితో పోల్చడం ఒక సాహసకార్యంగా మనం భావించవచ్చును. అసలిటువంటి వర్ణనలు ముస్లిం మత పెద్దలకు నచ్చవు. అసలు ముస్లింలు తెలుగు కవిత్వం వ్రాయడం, అందులో హిందు, సంస్కృతికి చెందిన భావజాలంతో నింపడం, కవుల సజాతీయుల్లో పూర్తిగా నచ్చని విషయం. ఇటువంటి సందర్భాలలో ఒక ముస్లిం కవి, కృష్ణతత్వంతో మమేకం గావడం, కవి యొక్క విశాల దృక్పధాన్ని తెలుపుతుంది. సాంప్రదాయ కవిని, అదే దృక్పధం నుంచి చూడవలసిన ఆవశ్యకత వుంది.

అక్బర్ పరాక్రమాన్ని వీరరసము ఉట్టిపడేటట్లు ఈ విధంగా వర్ణించినాడు.

కుదర గాత్రుండైన గోలియత్తునుచెండు
బాలుడు దావీదు లీలమెఱసి;
ధేనుకాసురు బట్టి తిగిచి తాళీవన
శ్రేణి గూల్చిన కృష్ణుచెల్వమెనసి

అమృతపహరణార్థ మమరాధిపతిదాకు
వైనతేయుని సత్త్వపటిమ బెరసి
పాదత్రయంబున బలి నిర్జితుని జేయు
వామనుండగు విష్ణుబలము బడసి”
(షేక్ బుడెన్ సాహెబ్, 1969, పు-50)

ఈవిధంగా క్రైస్తవ, హిందూ మత ప్రతీకలను వాడి అక్బర్ పరమతసహనాన్ని, సూచించాడు. కవి బుడన్ సాహెబ్ గారు అక్బర్ గుణగణములను వర్ణించడం వలన భారతదేశాన్ని పరిపాలించవలసిన వ్యక్తి యొక్క మహనీయ వ్యక్తిత్వాన్ని స్పష్టపరచి, అసలు పరిపాలకుడు ఏల క్షణాలు కలిగియుండాలి? అనే విషయాన్ని స్పష్టపరచడం జరిగింది.

చరిత్ర విషయాలు పొల్లుబోకుండా అక్బరు జలాల్ నామా గ్రంథాన్ని బుడెన్ సాహెబ్ గారు రచించారు. కవులు సామాన్యంగా స్వతంత్రులు గనుక, ఒక చారిత్రిక కావ్యాన్ని వ్రాసేటప్పుడు “చారిత్రిక యథార్థతను వెనుకకు నెట్టివేసే ప్రయత్నం కొంత మంది కవుల విషయంలో జరిగింది. అయితే షేక్ బుడెన్ సాహెబ్ గారు, మొగలుల విషయంలో చారిత్రిక అంశాలను సైతం క్రమబద్ధంగా పొందుపరచి కవితాశక్తికి, వాస్తవికతను జోడించారు. 1516 సం॥ జరిగిన పానిపట్ యుద్ధాన్ని వీరరస ప్రధానంగా కవి అక్షరీకరించాడు. అక్బరు శాంతి సందేశాన్ని యీ విధంగా తెలియపరిచాడు కవి.

“ఆత్మ వత్సర్వ భూతాని” యనెడి పలుకు
పరమధర్మము నాజన్మ వసుధయందు
కఱకు కత్తుల భూమిని వఱలినట్టి
కలదు నెమ్మది నీమాట నిలువదేమొ!
పావనంబగునట్టి యీ భరతభూమి
సంకుచిత దృష్టి మంతుల జగతికాదు
క్రౌర్య దౌర్జన్యముల నరికట్టు కున్న
శోభనంబులు మన కిట శూన్యమగును (పైదే, పుట 60)

పై పద్యములోని " ఆత్మవత్సర్వ భూతాని " అనే వేదాంత వాక్యము అతి ప్రసిద్ధమైనది. ఉపనిషత్తుల సారాన్ని ఒక్క వాక్యములో ప్రాచీన ఋషులు చెప్పారనిపిస్తుంది. పిపీలీకం నుంచి, విశ్వమంతా వ్యాపించి వున్న అన్ని జీవులలోనూ " ఆత్మ ఒక్కటే " అని బోధించడము ఒక్క వైదిక ధర్మానికే చెల్లింది. ఈ వాక్యాభావాన్ని " బుడన్ సాహెబ్ " గారు చెప్పడంలో వారి తత్వ దర్శనం అవగతం ఔతుంది. ఆత్మవత్సర్వభూతాని అనే వేదాంత వాక్యము శాంత్యహింసలకు మౌలిక భావన. ఇటువంటి ఉన్నత శ్రేణి ఆలోచనధారను బుడెన్ సాహెబ్ కవి కలిగియుండటం వలన ఆయన గొప్ప సంస్కృతీ పరుడిగా మనకు గోచరిస్తాడు.

మతాల మధ్య, జాతుల మధ్య సంకుచిత దృష్టి భారతభూమికి పనికిరాదని విశాల దృక్పథం కలిగిన లౌకిక రాజ్యాన్ని అక్బరు ఆనాడే వూహించడము కవి ప్రత్యక్షంగా, ఆర్షధర్మానికి ఒక మంచి నిర్వచనము ఇచ్చినట్లుగా గోచరిస్తుంది. ఇది ప్రౌఢకావ్యం, అక్బరు ఆదర్శమూర్తిమత్వానికి అద్దం పట్టినకావ్యం.

షేక్ బుడెన్ సాహెబ్ గారు తన సాంప్రదాయ కవితా పటిమతో ప్రామాణికమైన జలాల్ నామా, అక్బరునామా గ్రంథాలను రచించి ముస్లిం చక్రవర్తులు, రాజులు భారతదేశాన్ని పరిపాలించిన వైనాన్ని, చేసిన సేవలను చరిత్ర కనుగుణంగా తెలియచెప్పడం వలన ముస్లిం చక్రవర్తులలో ఎక్కువ భాగం భారతీయ సంస్కృతిలో మమేకం అయినారనే విషయం పఠితకు సులభ గ్రాహ్యంకాగలదు.

## II.4. షేక్ దరియ హుస్సేన్ మరియు ఇతర కవులు

"పురుషోత్తముడు" కావ్య రచనవలన తన 'దేశభక్తికి' ఒక రూపాన్నిచ్చినట్లయింది. ముస్లిం కవులు, ప్రజలు భారతదేశాన్ని ఇతర దేశంగా భావించడం లేదనే సందేశాన్ని పరోక్షంగా అందించారు. ఈ చారిత్రక నాటకంలో కవి పాత్రలతో మమేకమై తన దేశాభిమానాన్ని ప్రత్యక్షరంలో గోచరింపచేశాడు, షేక్ దావూదు కవి రచించిన చారిత్రక పద్యకావ్యం "దాసీపన్న కూడా వీరరస ప్రధానంగా, కరుణా శాంతిరసాలు గౌణంగా ఉండి అప్పటి క్షత్రియ రాజుల శౌర్య పరాక్రమాలకు అద్దం పట్టింది.

'దాసీపన్నా' కావ్యంలో ఆమె వ్యకిత్వం భారత స్త్రీయొక్క త్యాగనిరతిని చాటుతుంది. ఉదయసింహుడి కోసం తన కుమారుడిని బలిపట్టే సంఘటన కవి అక్షర బద్ధంచేసి ఆనాటి త్యాగమయ జీవితాలను మన కనుల ముందుంచాడు. ఇది ఎంతో ఆర్ద్రత కలింగించే సన్నివేశము ఈ కావ్యం గురించి కావ్య విమర్శకులు డా॥ షేక్ మస్తాన్ గారీవిధంగా అన్నారు. "రచయిత ఇస్లాం మతస్థుడైనప్పటికీ భారతీయ సంప్రదాయాలను ఆకళింపు చేసుకొని హిందూ – ఇస్లాం సంస్కృతుల సమైక్య సమ్మేళనం పొందిన సౌజన్యమూర్తిగా సాక్షాత్కరిస్తారు". (షేక్ మస్తాన్, 1981, పుట–12) ఇది నూరు శాతము నిజమే. భారతదేశంలోని భిన్న సంస్కృతులు ఒకే కొమ్మకు పూచిన పూలు. వాటి సువాసనలూ ఒక్కటే !

ఇంకా ముస్లిం కవులు అదీ ఇదీ అనిలేకుండా అనేక సాహితీ విభాగాల్లో తమ ప్రతిభా పాటవాలను చూపారు. 1. బాల సాహిత్యంలో నాటకాలు రచించిన వారిలో మహమ్మద్ ఖాసిం ఖాన్ గారు ప్రసిద్ధులని డా॥ షేక్ షమీఉల్లా పరిశోధనల వలన తెలుస్తుంది. శ్రీ ఖాసింఖాన్ అల్బర్ట్ ఐన్‌స్టీన్, స్కట్ నాయకుడు లెవ్‌సిడ్టన్స్ జీవిత చరిత్రను తెలుగులోకి అనువదించినారు. ఇందువలన షేక్ ఖాసిం ఖాన్ కవి గారు వైజ్ఞానిక దృక్పథం కలిగిన వ్యక్తిగా, జాతీయభావం కలిగిన వ్యక్తిగా, ఆధునిక దృక్పథం కలిగిన వ్యక్తిగా గోచరిస్తున్నారు.

మహాకవి ఉమర్ ఆలీషాతో పాటు షేక్ దరియా హుస్సేన్, మహమ్మద్ ఖాసింఖాన్, ఖాసింఖాన్, మహమ్మద్ గపూర్ ఖాన్, నఫీజుద్దీన్, లాంటి వారు ప్రసిద్ధి కెక్కారు. ప్రముఖ సాహితీ కారుడు డా॥షేక్ షమీఉల్లా అన్న వాక్యాలు ఇక్కడ గమనార్హం. ఆయనంటారు " ముస్లిం రచయితల హైందవ పురాణగాధలతో పాటు ముస్లిం మత గాధలను, ముస్లింవీరుల జీవిత విశేషాలను హరికథలుగా తీర్చిదిద్దారు. షేక్ నబీ సాహెబ్ అంబరీషోపాఖ్యానము, ధ్రువో పాఖ్యానము, చంద్రహాసచరిత్రము, ఖాదర్ సాహెబ్ మహమ్మద్ విలాసము షేక్ బడే సాహెబ్ మహమ్మద్ జీవిత చరిత్ర, కర్బలా వీరగాధ, మహమ్మద్ గులామ్ గురుశిష్యసంవా దము, మస్తాన్ సాహెబ్ కుచేలో పాఖ్యానము, తిరుపతి వేంకటేశ్వర మహత్యము, పురందరదాసుక థ, బ్రహ్మంగారి చరిత్ర, భారతము, రామాయణము, శివలీల , సీతాకల్యాణము, సూరదాసు మొదలైన హరికథలను విరచించి హరికథా వాఙ్మ యాభివృద్ధికి కృషి చేశారు. హరికథారచనలోను, ప్రవచనం లోను ముస్లిం కళా కారులు సైతం సాంప్రదాయక రీతిని అవలంభించినట్లు స్పష్టమౌతుంది". (షమీఉల్లా, 2005, పుట, 54–55)

ప్రముఖ సాహితీకారుడు డా॥షేక్ షమీఉల్లా గారి పై విశ్లేషణ వలన కొన్ని వాస్తవాలు బహిర్గతం ఔతున్నవి.

1. 20వ శతాబ్దం ప్రథమార్ధంలో వున్న సాహిత్యం సాంప్రదాయాలను ముస్లిం కవులు మనసా, వాచా, కర్మణా అనుసరించి తమ సాహిత్య జీవితాన్ని కొనసాగించారు.

2. పైన పేర్కొనబడిన కవులు హిందూ, ముస్లిం మతాలకు సంబంధించిన ఇతివృత్తాలను స్వీకరించి, తాము హిందూత్వాన్ని, ముస్లిం మతాన్ని సమానంగా సమదృష్టితో గౌరవించామనే సంకేతాన్ని వారు సమాజానికి ఇవ్వటంలో సఫలీకృతులైనారు.

ఈ దృక్కోణం నుంచి చూస్తే వైదిక సాంప్రదాయం నుంచి వచ్చిన కవులు, ముస్లిం మత దృక్పథం కలిగిన ఇతి వృత్తాలను స్వీకరించి, సాహితీకరణ చేసినవారు ఇంచుమించు లేరనే చెప్పవచ్చును. ఏతా వాతా తేలిందేమిటంటే సాహితీపరంగా, ఆనాటి ముస్లిం సమాజంలో హిందూ వ్యతిరేక భావన లేదని బ్రాహ్మణ కవుల, మార్గంలోనే ముస్లిం కవులే బ్రాహ్మణ లేక వేద సంస్కృతికి చెందిన సంస్కృతిని, కళారీతులను సృజించడం ద్వారా తమ విశాల దృక్పథాన్ని విశద పరచారని స్పష్టమౌతుంది. హిందూ మతం నుంచి వచ్చిన కవులు వైదిక, బ్రాహ్మణ వాదాలను పున: ప్రతిష్టించాలని ప్రయత్నించారు. అయితే ఇస్లాం సంప్రదాయాన్నుంచి వచ్చిన ముస్లిం కవులు, తమ తమ ప్రభావాన్ని అంతగా తమ సాహిత్యంలో చొప్పించ కుండా భారతీయ సంప్రదాయంలో, భారతీయ ఆత్మలో, సంస్కృతిలో మమేకం అయి అనేక రచనలు చేసారు. తెలుగు సమాజంలో, భారతీయ సంస్కృతి వ్యాప్తికి ఇట్లా కృషి చేయడంలో ముస్లిం సంప్రదాయ కవుల విశాల దృక్పథం స్పష్టమౌతుంది. ఇదే ఇక్కడ గమనించ వలసిన అతి ప్రధానాంశం.

ముస్లిం కవులు పౌరాణిక, చారిత్రక, సాంఘిక, పారమార్థిక కావ్యాలను రచించారు. ఖండ కావ్యాలను అనేకం సృజించారు. జీవిత చరిత్రలు, భక్తి శతకాలు, నీతీ శతకాలు, ప్రభోదాత్మక శతకాలు అనేకం రచించారు.

ముస్లిం సంప్రదాయకవుల్లో భిన్నథోరణులు, భావరీత్యా, వస్తు రీత్యా, శిల్పరీత్యా వున్నప్పటికీ వారందరు కూడా, హిందూ – ముస్లిం సంస్కృతులు వేర్వేరు అని భావించకుండా, తమ ప్రతిభా పాటవాలతో పద్య, గద్య సాహితాన్ని సృజించి, తెలుగు సాహిత్యాన్ని

సుసంపన్నంచేశారనడంలో ఎవ్వరూ ఏవిధంగా సందేహాలు ఉంచనక్కరలేదు. విస్మృత ముస్లిం కవులు తెలుగు సాహిత్యానికి చేసిన సేవ వారి గ్రంథాలను పునర్ముద్రించడం ద్వారా, పాఠ్య గ్రంథాలలో వారి రచనలను చేర్చడం ద్వారా వారిని వారి విశాల దృక్పథాన్ని పరమత సహనాన్ని నేటి తరానికి భావి తరాలకు అందించి ముస్లిముల పట్ల మిగతా వర్గాల, వర్ణాల వారికి గల తప్పుడు అభిప్రాయాలను మార్చవచ్చు ఇదే మనం వారికందించే గౌరవం, గుర్తింపు.

# III. ముస్లిం రచయితల కథా సాహిత్యం సామాజిక దృక్పథం

"స్వార్థ చాదస్తాల బందీరాక్షసులు
రామ్ రహీమ్ భక్తుల్లా జాతి రక్షకుల్లా
కురుక్షేత్రాన్ని సృష్టించనీ
కుత్తుకలు తెగ్గోసుకుని చచ్చినోళ్లుచచ్చాక
మిగిలి నోళ్ల సంగతి మనం చూద్దాం"

- రహమతుల్లా

"కథ్యతే ఇతి కథా " అని అలంకారికుల మాట. ఏదైతే చెప్పబడుతుందో అది కథ అని ఈ వాక్య సారాంశం. ఈ కథలు అనువంశికంగా వచ్చేవి, కల్పించబడేవి, జరిగిన సంఘటనలకు, ఆకర్షణీయతను జోడించి కథలుగా మార్చి ఒకరికొకరు చెప్పుకొనేవి ఉనికిని కలిగి ఉన్నాయి. ప్రాక్ శిలాయుగానికి చెందిన ఆటవిక మానవుడు తను వేటాడే జంతువులను గుహల్లో రేఖా చిత్రాలుగా బాణపు ములుకు లాంటి, ఉలిలాంటి వస్తువులతో గీసేవాడు. తాను వేటాడే జంతువును గీస్తే లేక చెక్కితే, ఆ జంతువు లభ్యమౌతుందని ఒక నమ్మిక. అదే గుహ చిత్రకళ. ఆ విధంగానే ప్రకృతికి భయపడుతూ, ప్రకృతి రహస్యాలు తెలియక వాటిని ఊహించుకుంటూ "కథలు" చెప్పుకోవడం వేద కాలానికి పూర్వం ఉండేదనే విశ్వాసం హేతుబద్ధతకు వ్యతిరేకం కాదు. ఈ ఛాయలు ఋగ్వేదంలో ఉన్నాయి. భాష పుట్టకముందు, సంజ్ఞలతో, సైగలతో, హావభావాలతో మొదలైన కథా ప్రక్రియ భాష పుట్టిన తరువాత ఉజ్జ్వల స్థితిలో వుంది. పూర్వం "కథలు" చెప్పే వ్యక్తులను మేధావులుగా పరిగణించారు.

చిత్రకళ ఎంత ప్రాచీనమైనదో కథ అంత ప్రాచీనమైనది. కవిత్వం ఒక స్థాయి గల్గిన వారికి అర్థం అయ్యే ప్రక్రియ, కథ అందరికీ అందుబాటులో వుండే సర్వజనా మోద ప్రక్రియ 'బ్రహ్మసూత్రాలు' అందరికీ తెలిసిన జ్ఞాన సూత్రాల సమాహారం ఇందులో పారి ప్లవాధికరణం' అని ఒకటుంది. 'పారిప్లవం' అనే దానికి అర్థం అశ్వమేధయాగం చేసేటప్పుడు "అద్వర్వుడు" వేదాల్లో ఉన్న కథలను రాజుకు, రాజకుటుంబీకులకు చెప్పేవారు, వాటిని 'పారిప్లవాలు' అనే వారు. "సర్వాభ్యానాని పారిప్లవే' అనే వివరణను బట్టి అక్కడ అన్ని కథలూ చెప్పబడేవి అని తెలుస్తుంది.

పూర్వం కథా సాహిత్యం కూడా పద్య రూపంలోనే వుండేది. మన ప్రాచీనకావ్యాలలో కొన్ని లోకజ్ఞతతో కూడి వుండి ఆనాటి సామాజిక పరిస్థితులను వెల్లడించేవి. విక్రమార్క చరిత్రము, భోజరాజీయము, దశకుమారచరిత్రము, హంసవింశతి, శుకసప్తతి, బిల్హణీయము, ఇంకా అనేక కావ్యాలు తెలుగు సాహిత్యములో కథాప్రియులను అలరించినవి. అదే కోవల్తో ఆధునిక యుగంలో కథకులు తమ ప్రతిభ విశేషాలతో పాఠకులను కవిత్వం నుంచి కథల వైపుకి మరలించారు. శ్రీపాద, చలం, గోపీచంద్, బుచ్చిబాబు, రావిశాస్త్రి, బీనాదేవి, లత, కుటుంబరావు, కొమ్మూరి వేణుగోపాల్, బలివాడ కాంతారావు, ఓల్గా, పురాణం, పాపినేని లాంటి ప్రసిద్ధులు కథా ప్రపంచాన్ని సుసంపన్నం చేశారు.

తెలుగు సాహిత్యంలో వేలసంఖ్యలో కథలు వెలువడ్డాయి. కథ లేక పోతే తెలుగు సాహిత్యం లేదనే దశకు వచ్చింది. కథ శక్తి వంతమైన మాధ్యమంగా రచయితలు గుర్తించారు. ఈ దశలో ముస్లిం రచయితలు కథా మాద్యమాన్ని ఎన్నుకొని మైనారిటీ వర్గాల సమస్యలను కథా కథన శిల్పంతో మేళవించి పాఠకులను ఆలోచింపచేశారు.

ముస్లిం రచయితలు సాంప్రదాయ, కవిత్వంలోనూ, ఆధ్యాత్మిక సాహిత్య సృష్టిలోనూ పరిణితిని సాధించినట్లే కథాసాహిత్యంలోనూ తమదైన బలమైన ముద్రవేసి, తమ ఉనికిని ఆంధ్రరాష్ట్రం అంతా విస్తరింపచేశారు. అందువలన కథాజగత్తు విస్తృతమైంది. తెలుగు సాహిత్యంలో లబ్ద ప్రతిష్టులైన గోపీచంద్, కొ.కు. చలం, లాంటి అగ్రశ్రేణి రచయితల సరసన కూర్చుండబెట్ట తగిన కథరచయితలు ముస్లిం కమ్యూనిటీ నుంచి తయారైనారు. కథా సాహిత్యంలో ఇంతమంచి స్థానాన్ని ముస్లిం రచయితలు పొందడానికి ప్రధాన కారణము వారిలో రేగిన సంఘర్షణల ఫలితమని చెప్పవచ్చును. బాబ్రీ మసీదు కూల్చివేత, భారత దేశంలో జరిగే ఉగ్రవాదుల దాడులకు ముస్లిం మతస్థులు, రచయితలు, మేధావులును జవాబుదారీ తనం వైపుకి నెట్టి వేయడం వలన, "ఎవరో చేసిన దానికి ఇంకెవరినో బాధ్యులను" చేయడం సహించలేక ముస్లిం కథారచయితలు, తమ జీవితాలను , కథలుగా కన్నీటి గాధలుగా మలచారు.

అటువంటి రచయితల్లో రహమతుల్లా ప్రసిద్దుడు ఆయన 'బా' కథలు, పలువురి ప్రసిద్ధ రచయితల ప్రశంసలు పొందినవి.

## III.1. రహమతుల్లా 'బా'

ప్రఖ్యాతకవి పద్మభూషణ్ కాళోజి 'బా' కథలను గురించి యీ విధంగా అన్నారు "నన్ను నాలాంటి వాళ్లను నీ కథలు ఏడిపిస్తాయి. జీవితంలోని ఆ ఆర్తిని వదలకు. అక్షర కళాత్మకత ముసుగులో అబద్ధాన్ని నిజంలా రాసేందుకు ప్రయత్నించకు" – (కాళోజి, 2004, చివరి అట్ట) ఈ విధమైన నిజాయతీతో కూడిన, పాక్షిక వైఖరిలేని ప్రశంస సర్వదా ఆమోదయోగ్యమైనది. రచయిత మూర్తి మత్వాన్ని పాఠకుడికి విశదపరచింది. ఇక్కడ పద్మభూషణ్ కాళోజి గారి మాటల్లోని వాస్తవాన్ని గ్రహించిన రహమతుల్లా తన సాహిత్య జీవితాన్ని నిజాయితీతో కూడిన పంథాగా నిర్ధేశించుకొన్నారు.

కథ జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. సమాజాన్ని ప్రతిఫలిస్తుంది. అందువలన మిగతా సాహిత్య ప్రక్రియలన్నింటికన్నా కథే సామాజిక చిత్రణకు ఎక్కువ అనుకూలంగా ఉంటుందనే విషయం విస్మరించరానిది. కథ పూర్తిగా జీవితాన్ని ప్రతిబింబింపకపోయినా ఒక సంఘటన ద్వారా అయినా జీవన వాస్తవికతను ప్రతిబింబించచేయడానికి ప్రయత్నిస్తుంది. ప్రసిద్ధ రచయిత 'స్మైల్' కూడా రహమతుల్లా గురించి ఒక మంచి విశ్లేషణ చేసారు. "ఏతావాతా రహమతుల్లాని చదివితే స్పష్టమయ్యేదేమిటంటే – రచయితకూడా ఒక సోషల్‌యాక్టివిస్ట్ అని! గొప్ప గుండె తడితో రాసిన కథలివి. ముస్లింలంతా చదవాలి. ముస్లింలు ఎలావున్నారో ఎలా ఆలోచిస్తున్నారో తెలుస్తుంది. ఆంధ్రదేశంలో ఒక వెనుకబడిన ప్రాంతంలో ముస్లింలు ఎంత దయనీయమైన జీవితం గడుపుతున్నారో "బా" కథలు చదివితే అవగతం ఔతుంది. తెలుగుదనం ఆ కథల్లో స్పష్టంగా గోచరిస్తుంది." (స్మైల్, 2004, పుట 92).

భారతీయ ముస్లింలు కాని, ఆంధ్రా ముస్లింలు కాని తమ సమస్యలను ఏవిధంగా అవగతం చేసుకుంటున్నారు – అఖండ భారతజాతిలో తమరిని ఒకరిగా భావిస్తున్నారా? లేక వేరే ప్రత్యేకమైన జాతిగా భావిస్తున్నారా? ఈ సమాజంలో వారి జీవన విధానం ఏ విధంగా వుంది. ఈ సమాజంలో తగిన గౌరవ ప్రతిపత్తి ముస్లింలకున్నదా? తమ కోసం వ్రాయబడిన సాహిత్యాన్ని ముస్లింలు సరిగా చదివి చైతన్యం పొందుతున్నారా? లాంటి అనేక ప్రశ్నలకు ఈ అధ్యాయంలో జవాబులు వెతికే ప్రయత్నం జరిగింది. ఆ ప్రయత్నానికి ఈ 'బా' కథలు ఎంతో సహకరించాయి.

'స్వామి' అనే తాత్త్విక రచయిత రహమతుల్లా కథలను గురించి ఒక ప్రామాణికమైన అభిప్రాయాన్ని ఈ విధంగా వెలువరించారు. "ముస్లిం మనుషుల సమాజాన్ని, సంస్కృతినీ, సమస్యల్నీ భయాన్నీ, అభద్రతనీ వ్యక్తీకరించడం ద్వారా ఆ మతస్థుల సమూహానికి ఒక వ్యక్తిత్వ రూపకల్పన చేయడంలో రహమతుల్లా కథలు గొప్ప విజయం సాధించాయి". (స్వామి, 2004, పుట, 95). ఈ విశ్లేషణ అక్షరాల సత్యం.

ముస్లిం మతస్థులు మన సమాజంలో అభద్రతాభావాన్ని కలిగియున్నారని, ఆ అభద్రతాభావమే వారిలో ఐకమత్యాన్ని కొంత కలిగి వుండటానికి, ఏదైనా సమస్యవచ్చినప్పుడు మూకుమ్మడిగా కలిసి పనిచేయడానికి, హిందూత్వ సవాలును ఎదుర్కోవడానికి కావలసిన ధైర్యాన్ని కలిగిస్తుందని అర్థం చేసుకోవచ్చును.ఏ మతవాదులైన రెచ్చగొట్టపడితే వారి అనార్కిజానికి హద్దుండదనే విషయం అందరికీ తెలిసిందే ! ముస్లిం సమాజం యొక్క వాస్తవ స్వరూపం సంస్కృతిని ప్రతిబంబించే ఈ కథలను పరిశీలించడం ద్వారా వారి సామాజిక చైతన్యాన్ని పగిలే గుండెల ఆర్తిని పరిచయం చేసుకోవచ్చు.

## III.1.A. బా సంపుటిలోని కథలు

1) నర్గీస్
2) బోర్డర్స్
3) అఫ్జల్ బిచారా
4) పీపల్ మే నీమ్ కాపేడ్
5) అమ్మీజాన్
6) ప్యార్ మీర్జా మహేశ్వరీకా
7) బందీ పింజరేకే బినా
8) కిరాయ్ మకాన్
9) ఫుట్‌పాత్
10) బా

## III.1.B. నర్గీస్

ఈ కథ ప్రారంభం ఈ విధంగా ఉంది. “అల్లాహో అక్బర్ అల్లాహో అక్బర్ లా ఇలాహ”( రహమతుల్లా, 2004, పుట, 9) అంటూ ‘అజా’ తో ప్రారంభమైంది. ఈ విధమైన సాంప్రదాయక ప్రార్థనతో ఒక ముస్లిం రచయిత రచన ప్రారంభించడం వలన, ఏదైనా ‘సంకేతాన్ని’ అంటే తాను ‘మత విశ్వాసాలను’ కలిగిన వాడననే ఉద్ధేశ్యాన్ని బైట పెడుతున్నాడా? లేక ‘మతం’ చాటునుంచి తన సృజనా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాడా? అనే అంశాలను పరిశీలించ వలసి వుంది.

‘నమాజ్’కు రండని పిలిచే సంఘటనను ఈ విధంగా వర్ణించాడు రచయిత “మధురమైన ఆ రాగాలాపన, అందులోని శ్రవణానందమైన లయ మనస్సుకు హాయిని తాదాత్మ్యతను కలిగిస్తుంది” (పైదే, పుట, 9) అని అనడంలో రచయిత దృక్పథం అవగతం ఔతుంది.

‘మతాన్ని’ అభ్యుదయవాదులు వ్యతిరేకించినట్లు తాను వ్యతిరేకించడం లేదనేవిషయాన్ని స్పష్టపరుస్తున్నాడా? అయితే ఈ భావన తాత్కాలికమే! ఒక పాత్ర యొక్క మనో ప్రవృత్తిలో కలిగే మార్పులకు అనుగుణంగా ఈ మతపరమైన ఎత్తుగడను రచయిత ఎన్నుకున్నాడు.

“మహమ్మదీయ మత ఛాందస కుటుంబంలో పదిమంది సంతానంలో ‘నర్గీస్’ ఒకతె” ముస్లింల్లో సహజంగా ఇదివరకు కాలంలో వుండే బహు సంతాన ప్రీతిని దేవుడు యిచ్చే సంపద బిడ్డలనే నమ్మకాన్ని పైవాక్యంలో సూచించారు. బహుసంతాన ప్రీతి అనేది మూడు, నాలుగు దశాబ్దాల క్రితం సమాజంలోని అన్ని మత వర్గాల వారిలో వుండేది. కాలక్రమేణా, మారిన పరిస్థితుల దృష్ట్యా చిన్న కుటుంబాలే మేలనే ఒక నిశ్చయానికి వచ్చిన చాలామంది మత వాదులు ఇద్దరి బిడ్డలకే పరిమితం ఔతున్నారు. పట్టణ ప్రాంతంలోని కుటుంబాలు ఒక బిడ్డతోనే సరిపుచ్చుకుంటున్నారు. అయితే నర్గీస్ పుట్టిన సందర్భములో “ బహుసంతానమే” కుటుంబాల లక్ష్యంగా వుండేది. దీనికి ఇంకో పార్శ్యం కూడా వుంది. స్త్రీని ఎక్కువ సంతానానికి ప్రోత్సహించే పురుషులలో, మత వాదులలో, ఒక వ్యక్తిగత లేక పురుషగత స్వార్ధం కూడా దాగి వుంది. ఎంత మంది ఎక్కువ పిల్లలను కంటే స్త్రీ అంత ఎక్కువగా కుటుంబంలో బందీ లేక బానిస ఔతుందనే దృక్పథంలో పురుషులు/మతవాదులు స్త్రీని ఎక్కువ మంది పిల్లలను కనమని ప్రోత్సహించడం జరుగుతుంది. “ పిల్లల క్షేమం దృష్ట్యా స్త్రీ బానిసగాపడి వుంటుందనేది ” ఒక పురుషాహంకార దృక్కోణం – ఆ విధంగానే నర్గీస్ తండ్రి ప్రవర్తించాడు.

నర్గీస్ పాత్రను ప్రారంభిస్తూ "తండ్రి భర్తల మరణాలకంటే పెళ్లిళ్లకు ఎదుగుతున్న బిడ్డల బాధ్యత కంటే నాల్గుపదుల జీవితపు ఆత్మలు దిద్దవలసి రావటం విషాదం". (పుట 10) ఒక దిగువ మధ్య తరగతి ముస్లిం స్త్రీ పై తండ్రి పెత్తనం, భర్త విడిచిపోయిన స్త్రీ యొక్క స్థితిని కథాంతరీకరణ చేయడం ద్వారా రచయిత ముస్లిం స్త్రీల దయనీయతను అంటే ఒక ముస్లిం నిమ్న ఆర్థిక వర్గం వారి పరిస్థితిని అక్షరీకరించారు, దృశ్యీకరించారు నర్గీస్ జీవితం నాలుగు పదులకు పూర్వం ఏ విధంగా ఉందో ఈ మాటలు స్పష్టీకరిస్తాయి.

"సంస్కృతి, మతం,ఆర్థికం, తండ్రి, భర్త అన్నీ కలిసి తనను ఇంత కాలం చీకట్లో బంధించి ఉంచాయి. ఆ గాఢాంధకారమే జీవితం అనే భావనలతో తను ఉండిపోయింది." (పుట,11) ముస్లింలలో పురుషాధిక్యత ఏ స్థాయిలో ఉన్నదో పై వాక్యాల్లో అవగతం అవుతుంది. 'నఖాబ్' ముఖాన్ని చీకటిచేస్తే, ముస్లిం సంస్కృతి స్త్రీ జీవితాన్ని పూర్తిగా అంధకారంలోకి నెట్టి వేసిందని తెలుస్తుంది. ఒక ముస్లిం సంస్కృతియే కాకుండా మిగతా మతాలలో/కులాలలో పురుషాధిక్యతా భావం హద్దులు మీరి, అసలు భారతీయ మహిళను ఒక అంధ కూపంలోకి నెట్టి వేసిందనే వాస్తవాన్ని విస్మరించకూడదు. అసలు యీ వివాహ వ్యవస్థలో, యీ వ్యవస్థలో స్త్రీ పై జరుగుతున్న దౌర్జన్యానికి అంతులేదు. ప్రతిరోజు పత్రికల్లో టి.వి.ల్లో, యీ దృశ్యాలు, భయంకరంగా దర్శనమిస్తున్నాయి. ఇటువంటి తరుణంలో రహమతుల్లా ' కథలు కొన్ని స్త్రీ వాదులు వ్రాసిన కథలంత గాఢంగావుండి సమాజాన్ని ప్రభావితం చేస్తాయనడంలో సందేహం లేదు. అయితే ఒక నిరాశావాదంలో, బాధ్యతల మధ్య బందీగా ఒక ముస్లిం స్త్రీ జీవించడం, పఠితులకు ఆర్ద్రతను కలిగిస్తుంది, ఆలోచింపచేస్తుంది. ఈ క్రమంలో పాఠకుడ్ని ఆలోచింపజేసే రచనే ఉత్తమరచన అని వేరుగా చెప్పనవసరం లేదు.

ముస్లిం బాలికకు పెండ్లి అయి భర్తకు అప్పగించే సంఘటన ఈ విధంగా, సహజంగా, అభివ్యక్త పరచాడు రచయిత."దేఖోబేటా! బిడ్డను సైతాను ప్రపంచానికి దూరంగా పెంచాను. అరబ్బీ చదివించాను. ఖురాను మూడుసార్లు పూర్తిచేసింది. దీన్‌కు సంబంధించిన ఫాతెహా ఇవ్వడం లాంటి పనులన్నీ నేర్చుకొంది. ఎంతో నాజుకు వస్తువుని కాపాడినట్లు ఎవరికళ్లు అమ్మాయి మీద పడకుండా ఎంతో కట్టుదిట్టంగా కాపాడుకొచ్చాను. నాధర్మం ప్రకారం నీ హవాలా చేస్తున్నాను." (పుట,15) ఈ మాటల వలన మత గ్రంథంలో చెప్పిన విధంగా తన కుమార్తెను తీర్చిదిద్దానని తల్లి సూచిస్తూ ఇంక నీ యిష్టం – నీ భార్య, నాకేం సంబంధం లేదనే

ధ్వని పూర్వక వాక్యాలను ఇక్కడ వెలువరించింది. "తౌరాదు" (ధర్మశాస్త్రము) ప్రకారం స్త్రీ నడుచుకోవాలి. స్త్రీకి విధించిన "మౌజింజాలు" (అమానుషాలు) కు అంతువుండదు. ఎవరికీ ధర్మ శాస్త్రాన్ని ఎదిరించే ధైర్యం వుండదు. మత శాసనం అంత కఠినమైనది. పవిత్రఖురానులో యీ విధంగా వుంది. " your women are a tilth for you ( to cultivate) so go your tilth as you will ". (అబ్దుల్ అలా మౌదూది మౌలానా సయ్యద్, సూరా 2, 1996, పుట, 223).

ఇటువంటి ధర్మశాస్త్ర భావానికి దగ్గరగా తల్లి తన కూతురిని అప్పగించడం ఇక్కడ కనిపిస్తుంది. ముస్లిం స్త్రీ ఒక వస్తువుగా మార్పిడి చేయడం ఇక్కడ కన్పిస్తుంది. ముస్లిం స్త్రీ, ఏమిటి? అసలు స్త్రీనే వస్తువుగా చూచేదృక్పథం మిగతా హిందూ, క్రైస్తవ సమాజాల్లో లేకపోలేదు. అయితే ముస్లిం సమాజంలో కొంత ఎక్కువగా ఇటువంటి భావసరళి అభివ్యక్త మౌతుంది.

## III.1.C. బోర్డర్స్

దేశ సరిహద్దుల్లో జరిగే హింసాత్మక సంఘటనలకు ఏవిధమైన ప్రతి స్పందన ఉంటుందో, తెలియచెప్పే కథ కాదిది. గుజరాత్ సంఘటనలకు ఏ విధమైన మనోవైకల్యం (Mental disorder) ముస్లిం వ్యక్తులలో, సమాజంలో ఏర్పడిందీ తెలియజెప్పే కథ. ఈ కథను ఒక వ్యక్తికి పరిమితం చేసినప్పటికీ సామూహిక చైతన్యంలో కూడా ఈ లక్షణాలు ప్రస్ఫుటం ఔతాయి అనే సత్యాన్ని అంగీకరించక తప్పదు.

మతోన్మాదం వలన హింస, ఉగ్రవాదం, దేశాన్ని, అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ మతోన్మాదానికి మౌలికమైన కారణాలు ఏమిటి ? వాటిని ఏవిధంగా నిరోధించాలి? అనే అంశాలు ముస్లిం, హిందూ, క్రైస్తవ సమాజాలలో జరుగవలసిన మీమాంస! అయితే ఇటువంటి చర్చ మతవాదుల్లో జరుగుతున్న దాఖలాలు లేవు.

ఈ కథలో యూసుఫ్ పాత్ర యొక్క నిర్జీవతకు కారణాలు గుజరాత్‌లో జరిగిన మారణ హోమం, ఈ యూసఫ్ అనే "బతికున్న శవం"ని ఈ విధంగా వర్ణించాడు రచయిత, హృదయాన్ని కదిలించే విధంగా వుండి ఒక సజీవ పాత్ర మనముందు కదలినట్లు వుంటుంది. మనోమందిరంలో ముద్రితమై పోతుంది.

"మూడు నెలల్నించి మనిషి మనిషిలా లేడు
ఉదయం ఆదుర్దాగా పేపరు చదువుతాడు
టీవీలో భయంభయంగా వార్తలు వింటాడు
మిగిలిన సమయమంతా మంచం మీద పడుంటాడు
ఇంట్లో కార్యక్రమం అది
ఆఫీసులో ఎలా ఉంటున్నాడో తెలియదు" (పుట,17)

ఇటువంటి స్థితిలో ఉన్న 'యూసఫ్' తన భార్య యొక్క అందచందాలను, ఆలోచనలను, మధురానుభూతులను పక్కకు నెట్టివేశాడు. ఆనందమయమైన జీవితం నుంచి దూరమైనాడు. ఏ వ్యక్తి అయినా అతని జీవితాన్ని పూర్తిగా కప్పివేసే టెన్షన్ కి లోనయితే బాహ్య ప్రపంచంతో సంబంధం తెగిపోతుంది. మనస్సే అన్నిటికీ కారణం అందుకే ఉపనిషత్ కూడా "మనయేవమనుష్యాణం కారణం బంధమోకాయ" అనిఅంది. ఆధునిక మనోవిజ్ఞానశాస్త్రం కూడా, మనస్సు యొక్క స్థితిగతులను అనేక విధాలుగా సూత్రీకరించింది. మనో విజ్ఞాన శాస్త్రవేత్తలైన ప్రాయిడ్ , ఎడ్లర్, యూంగ్, ఎరిక్ ఫ్రామ్ లాంటి వారు మనస్సు యొక్క తీరుతెన్నులను చక్కగా విశ్లేషించారు. బుచ్చిబాబు "చివరకు మిగిలేది" గోపిచంద్ "అసమర్ధుని జీవయాత్ర " ఇంకా కొన్ని నవలలు, కథలు మాదిరిగానే ఈ కథకూడా మనోవైజ్ఞానిక రచనే!

డైరీ రూపంలో కొంత కథ చెప్పడంలోనే ప్రధాన పాత్ర యొక్క మానసికస్థితి సులభంగా అవగతం ఔతుంది. యూసుఫ్ డైరీని రజియాబేగం చదువుతుంది. అప్పుడుగాని అతని మానసిక పరిస్థితి అవగతం కాదామెకు. భర్త యొక్క వ్యక్తిగత డైరీ భార్య అయినా చదవకూడదు. అయితే భర్త యొక్క మానసిక పరిస్థితి, చేష్టలు అంతుబట్టని విధంగా తయారయినప్పుడు రజియా తన భర్త "యూసఫ్" డైరీ చదివి, అతని సమస్యను అర్థం చేసుకొంటుంది. అతని డైరీలో ఒక పేజీ చూడండి.

27-2-2002 : సబర్మతి రైలు బోగీ ధగ్ధం. యాభై మంది మంటల్లో మాడి దుర్మరణం, అమానుషం, హేయం, భయంకరం అనిఅంటూ "నాలోని అభద్రతకు డిశంబరు ఆరు కారణమా? కాదు పులుల్లా ఎదిగిన మతోన్మాదులు. జింకల్లాంటి సెక్యులర్ శక్తులు. మేకల్లాంటి ముసల్మానులు, సామాన్యజనులు ". (పుట, 18-19) రచయిత చేసిన పోలిక ఎంతో సమంజసంగా వుంది.

మతోన్మాదులను పులులతో పోల్చడము, లౌకిక ప్రజాస్వామ్య శక్తులను జింకలతో పోల్చడమూ, ముస్లిం మతస్థులను మేకలతో పోల్చడంతో మన భారత రాజకీయ వ్యవస్థ, సమాజమూ ఎటువంటి దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటుందీ అవగతమౌతుంది. బొంబాయిలో, ఆంధ్రప్రదేశ్‌లో, బెంగుళూరులో జరిగిన ఉగ్రవాద దాడులు, మానవత్వానికే, మానవ సమాజానికే సిగ్గుచేటయిన విషయాలు.

ఈ వాక్యాలు చాలు, భారతదేశంలో ఉగ్రవాదం ఏవిధంగా పనిచేస్తుందో దాన్ని ఎందుకు ప్రతిఘటించలేక పోతున్నారో అవగతం కావటానికి అహ్మదాబాద్‌లో హృదయవిదారకంగా విన్పించే మాటలు, రచయిత ఈ విధంగా చెప్పారు.

> "కొడకా! ఆగీత దాటకు
> బేటా! ఓ లిఖ్ఖార్ పార్ హోకెనై జానా"

"బచావ్, మారో.. మేరీమా.. మేరీబేటా... ఖురాన్‌ఆగ్" "కోపంగా అరుస్తున్నప్పుడు కాళ్లు చేతులు బేడీలను తెంపుకునేంత ఊపు. భయంగా బాధగా కేకలేస్తున్నప్పుడు చిన్న పిల్లాడి కన్నా అధ్వాన్నంగా ఏడుపు". (పుట, 23)

చివరకు, ఈ దుస్సంఘటనలన్నీ చూసిన యూసఫ్‌కు మతి చలిస్తుంది. ఇలా ఈ మైనారిటీ వర్గాలు అభద్రతా భావానికి, శారీరక మనో వైక్లబ్యాలకు గురి కావలసిందేనా? అనే ఒక ఆక్రోశంతో కథ ముగుస్తుంది.

భారతీయ సమాజంలో మైనారిటీలు కొన్ని సన్నివేశాలలో ఎటువంటి ఆర్తికి గురవుతున్నారో రహమతుల్లా చక్కగా శిల్పీకరించారు. ఈ దేశంలో పుట్టి, ఈ మట్టిలో జీవించే వ్యక్తి ఒక 'ముసాఫిర్' మాదిరిగా జీవించడం బాధాకరమైన విషయమే! కోట్ల " ముసాఫర్ " లమనోవ్యధ తీరేదెప్పుడో ? ప్రజాస్వామ్య వ్యవస్థలో, జాతి వలన కుల వివక్షత పాటించే రాజకీయ వర్గాలలో మార్పురావాలంటే మౌలికంగా వ్యక్తిలోనే మార్పురావలిసి వుంది. వ్యక్తి మార్పే సమాజం యొక్క మార్పు. అసలు వ్యక్తి మారాలంటే ఒక బలమైన తాత్విక సిద్ధాంతం సమాజంలో ప్రచలితం కావలసివుంది.

## III.1.D. అఫ్జల్ బిచారా

పేద ఉద్యోగి అఫ్జల్, ఒక వైపు మతాచారాల వత్తిడి, ఇంకొకవైపు ఆర్థిక బాధల వత్తిడి, ఇంట్లో సమస్యల తీవ్రత, తన ఉద్యోగ సమాజంలో అణిగిమణిగి ఉండటం వలన, లేమివలన అల్పత్వానికి గురి అవుతున్న సంఘటనలు, ఒక పేద ముస్లిం ఉద్యోగి ఏవిధంగా సమాజ పీడనకు గురి అయి వ్యధచెందిందీ , పేదరికం ఏ విధంగా మనిషిని నిర్జీవపరుస్తుందో ఈ కథ తెలియపరుస్తుంది. పేదరికం ఏ వర్గాన్నో, ఏ మతస్థులనో పీడించే సమస్య కాకపోయినప్పటికీ, ఎక్కువ శాతం " పేదరికం" దళితులను, మైనారిటీ వర్గాలను పీడిస్తుంది. ప్రముఖ ఆర్థిక వేత్త, ఆచార్య సూర్యదేవర మహేంద్ర దేవ్ వివరించిన గణాంకాలను బట్టి ఎస్.సి./ ఎస్.టి.ల తర్వాత ముస్లింలు ఎక్కువగా పేదరికంలో మగ్గుతున్నారని తెలుస్తుంది.

**మత , సామాజిక తరగతుల వారీగా ఆం.ప్ర.లో పేదరికం - 2004 -05**

| | మొత్తం | హిందూవులు | | | సాధారణ | ముస్లింలు | ఇతరులు |
|---|---|---|---|---|---|---|---|
| | | మొత్తం | ఎస్.సి.లు /ఎస్.టి.లు | ఓ.బి.సి. లు | | | |
| గ్రామీణ | 8 | 8 | 16 | 6 | 2 | 7 | 4 |
| పట్టణ | 26 | 25 | 41 | 27 | 11 | 35 | 16 |

(మహేంద్రదేవ్, 2008, పుట 23)

విద్యను అభ్యసించే వీలు ముస్లింలలోని పేదవర్గాలకు ప్రభుత్వం సరిగ్గా కల్పించక పోవడమూ వారి చుట్టూరా ఉన్న దారిద్ర్యం చదువు వైపుకి కాకుండా ఏదో పని చేసి "పిడికెడు అన్నం" సంపాదించాలనే ధోరణి వైపు వారిని తీసుకెళ్ళడం వలన వారిలో విద్యాసక్తి సన్నగిల్లి పోయింది. ముస్లింల విద్య గురించి ఖాజా యీ విధంగా అంటాడు.

"ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింల సాధారణ విద్యాస్థాయిని చూస్తే 1 నుంచి 5వ తరగతి మధ్య ముస్లిం విద్యార్థులు 9.45% వుండగా 6,7 తరగతుల్లో ఇది 8.12% తగ్గిపోతుంది. 6,9 తరగతుల్లో కేవలం 7.2% కాగా 10వ తరగతి వచ్చే సరికి 6.93% మంది విద్యార్థులు

మాత్రమే చదువుతున్నారు. ..... ఇంటర్మీడియట్‌లో కేవలం 6.6% మాత్రమే వుండగా డిగ్రీ స్థాయిలో ఇది 6.17% గా వుంది. ఇక ఉన్నత చదువు అభ్యసించే ముస్లింల సంఖ్య మరింత తక్కువగా వుంది. ఇంజనీరింగ్‌లో 1.39% నుంచి 3.92% మెడికల్‌లో 3.72%, బి.యిడి 2.51% మాత్రమే చదువుకొన్నారు. (ఖాజా, 2005, పుట,14)

అందువల్లనే మైనారిటీ వర్గాలు, ముఖ్యంగా ముస్లింలు అటెండరు, వాచ్‌మెన్, డ్రైవరు ఉద్యోగాలను దాటి వెళ్లరు. 'అఫ్జల్ బిబారా' కథలోని అఫ్జల్ కూడా అటెండరే! ఇది వాస్తవ పరిస్థితి – ఇటువంటి పేదరికం నిర్మూలనం చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలదే ! అయితే కథకుడు తన కళాత్మకత తో యీ భయంకరమైన పేదరికాన్ని అక్షరాలలో బంధించి సమాజం ముందుంచుతాడు .... అదే రహమతుల్లా చేసిన పని.

అఫ్జల్ బిచారాకు ముగ్గురు ఆడపిల్లలు, భార్య, ఉన్నారు. ఇంట్లో టాయ్‌లెట్ సౌకర్యం లేదు. అఫ్జల్‌తో లంబాడీ స్త్రీ అన్న మాటల్తో అతని దీనపరిస్థితి అవగతం ఔతుంది." సలాం సాయిబన్న నువ్వు సుత అటేవెళ్లస్తన్నవ ? మీ యాడోళ్లు సుతగిప్పుడే చెంబట్టుకొని గాసర్కార్ తుమ్మల్లదూరింద్రు" – (పుట, 24) ఈ మాటలు అఫ్జల్‌కు ముండ్లు మాదిరిగా గుచ్చుకుంటాయి. లంబాడీ స్త్రీ మాటల్లోని వ్యంగ్యం అతనిని బాధిస్తుంది. కొన్ని సౌకర్యాలైనా అయినా ఉన్న ఇల్లు అద్దెకు తీసుకోవడానికి అతని ఆదాయం చాలదు., అఫ్జల్ లాంటి వాళ్లు ఏవిధంగా ఆలోచిస్తారో, ప్రవర్తిస్తారో ఈ క్రింది వాక్యాలలో స్పష్టమౌతుంది. సగటు ముస్లిం ఆలోచనాధోరణి ఏవిధంగా ఉంటుందో రచయిత యీ వాక్యాల్లో సరళంగా విశ్లేషిస్తారు.

"స్త్రీలు బయట కనిపించడం అఫ్జల్‌కు ఇష్టం వుండదు. అందుకే బయటి పనులన్నీ తనే చూసుకుంటాడు. బజారునల్ల నుంచి నీళ్లు మోయటం, ఇంటికి సరుకులు తీసుకురావడం, ఇంటి ముంగిట కసువు ఊకటంలాంటి పనులు అతనే చేసుకుంటాడు. ఆఫీసు పనితో ఎంతలిసిపోయినా ఆడోళ్ళను మాత్రం ఇంటి గడపదాటనీడు. అయినా అప్పుడప్పుడు కొన్ని మాటలు వినక తప్పటం లేదు." (పుట,26)

ఈ మాటలు ఏమిటి? అనే ప్రశ్న ఉదయించక తప్పదు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వ్యక్తిని, స్వాభిమానంతో ఎవ్వరికీ తలవంచకుండా తన బాధను, కన్నీళ్లను తనలోనే నింపుకొని, సాధారణంగా, సౌమ్యంగా పేదరికానికి తలవంచుకొనే వ్యక్తిని సైతం యీ సమాజం ఈటెల్లాంటి

మాటలతో తూట్లు పొడవకుండా వదలదు – అఫ్జల్ విషయంలో కూడా సమాజం ఏ మాత్రం సానుభూతి చూపకుండా కఠినంగా వ్యవహరించడం తలచుకొంటే మానవ సంబంధాలు ఏదిశకు పయనిస్తున్నాయో అవగతం ఔతుంది.

ముస్లిం సమాజంలో బయటకు రాక స్వేచ్ఛలేక ముస్లిం స్త్రీ ఏవిధంగా వత్తిడికి గురిఔతుందో, ఆవిధంగా మతహద్దులను, దాటలేక పురుషుడు ఏవిధంగా నలిగిపోతున్నాడో యీ కథలో రహమతుల్లా చక్కగా, ఆర్ద్రంగా దృశ్యీకరించాడు.

తనతోటి ఉద్యోగ సమాజంలో కూడా అఫ్జల్ ఎంతో వివక్షతకు గురౌతాడు, రచయిత ఆఫీసుపాత్ర ద్వారా పలికించిన మాటలు చూడండి. “అబ్బే నువ్వు దండగ సన్యాసివి. తురకోడిగా పుట్టాల్సినోడివికాదు. ఎప్పుడూ మా ప్రసాదాలు పంచడం మా శుభకార్యాలకు రావటమే కాని నువ్వుగా ఎప్పుడన్నా ఏదన్నా చేసావా ? సాయిబుల పలావు తింటే ఆదిరిద్దంటారు. నువ్వు కనీసం దర్గా మిఠాయన్నా, ఇంతవరకు పెట్టక పోతివి... ఛఛ...... నువ్వుత్త వేస్టుగాడివోయ్” (‘బా’ 27) ఇటువంటి వ్యంగ్య బాణాలు వదిలేవారు ఉద్యోగ వర్గాలలో ఎక్కువ మంది ఉంటారు. అవతలి వ్యక్తి ఆర్థిక పరిస్థితి, ఏమిటో తెలియకుండా ఇటువంటి మాటలను ఈటెలుగా చేసి పొడుస్తుంటారు.

ఇంకొకవైపు భార్య వ్యంగ్య భాషణలు చురకత్తిలా అతని గుండెల్లో దిగటమే తరువాయి కార్యక్రమం అన్నట్లు ఉంటాయి. “నవాబుగారికి హూక్కాతాగే సమయమైనట్లుంది. బయటకు వేంచేసి నట్లున్నారు. వచ్చేటప్పుడు పాలప్యాకెట్ ఒకటి తీసుకురండి. ఈ రోజెందుకో తలనొప్పిగా ఉంది. చాయ్‌తాగాలనిపిస్తుంది”. (పుట, 26) అని అంటుంది. ఆమె మాటలకు అతని బీడీకైపు దిగిపోతుంది. ‘నవాబుగారు’ అని సంబోధించడంలోనే గొప్ప వ్యంగ్య విమర్శ దాగివుంది. – ‘పాలప్యాకెట్’. తప్పక తీసుకురండి అనిచెప్పడంలో “టీకూడా సమయానికి తాగడానికి ఠికాణాలేని పరిస్థితిలో ఉన్న తన దైన్యానికి దరిద్రానికి కారణం నీవేనంటూ భర్తవైపు వేలెత్తి చూపుతుంది.

పురుషుడికి , మరీ ముఖ్యంగా పేదరికంలో మగ్గుతున్న వ్యక్తికి, సమాజం వైపునుంచి ఎదురయ్యేవత్తిళ్ల కన్నా ఇంట్లో భార్య పిల్లలు వ్యక్తం చేసే అసహనమే, అసంతృప్తే ఎక్కువ వత్తిడికి గురిచేస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో గూడా అఫ్జల్ ఎంతో ఓర్పుతో, సహనంతో “అల్లా” పై భారం వేసి జీవనరథాన్ని నెట్టుకుంటూ వస్తాడు.

ఇటువంటి వ్యక్తి మతాచారాలలో శాంతి పొందాలనుకొంటాడు అదీ తాత్కాలికమే. ఈ కథను ముగిస్తూ రచయిత రహమతుల్లా 'యూసఫ్' పాత్ర ద్వారా చక్కటి ముగింపును, సందేశాన్ని ఇస్తాడీవిధంగా: "ఈ దర్గాలు, ఈ కందూర్‌లు, ఈ నమాజ్‌లు క్షణిక ఉపశమనాలు మాత్రమే. సుఖ దుఃఖాలకు ఉద్వేగాలకు అన్నిటికీ మూలం జీవితం. దాన్ని ఎద్దు మాదిరిగా భరించక తప్పదు. లేదా శత్రువుని పసికట్టి పులి మాదిరి పంజానన్నా విసరాలి". (పుట,32)

ఈ కథలో సూచ్యమైనది, అంతస్సూత్రమైన సత్యం ఒకటి దాగుంది. జీవిత గమనం వేరు. మత పంథావేరు. ఈ రెండింటినీ ముడిపెట్టో, ఈ రెంటినీ సమన్వయించో జీవితాన్ని సుఖదుఃఖాలకు అతీతంగా ఎవ్వరూ నడపలేరు. జీవితంలో సంభవించే సమస్యలకు, వ్యథలకు, కష్టాలకునష్టాలకు ఇంకా ఎన్నో ఒడిదుడుకులకు మతం, మతాచారాలు భాష్యం చెప్పగలుగుతాయా? లేదు. అందువలన చేయవలసిందేమిటి? జీవన తాత్త్వికతకు జీవన వాస్తవికతకు సంబందించిన జీవనకళను నేర్చుకొని, ఆచరించి మతదృక్పథం కన్నా భిన్నమైన ఒక జీవన తత్త్వాన్ని అలవర్చుకోవాలని రచయిత సూచించడం ద్వారా ఈ కథ ఒక ఉన్నత స్థాయిలో నిలచింది.

రహమతుల్లా చూసిన మార్గం జీవితానికి దగ్గరగా వుంది. మతానికి దూరంగా వుంది. అందువల్లనే సమాజ వాస్తవికత ఈ కథలో చక్కగా , సమగ్రంగా వ్యక్తమైంది.

## III.1.E. పీపల్ మే నీమ్‌కాపేడ్

ఇది కథకాదు. కవితలా సాగింది. రావిచెట్టులో వేపచెట్టులా కలిసి పోవాలని దీని తాత్పర్యం. చిన్న పుట్నించి సరదాగా, సామరస్యంగా జీవించిన బాలబాలికల్లో రెండు సంస్కృతులు ఎలాకలిసి పోయాయో,, ఏవిధంగా మతచాంధసత్వం వలన రెండువర్గాలు కొట్టుకు చస్తున్నాయో, చివరకు మిగిలిన వాళ్ల కర్తవ్యం ఏమిటో యీ దీర్ఘ కవితలో రహమతుల్లా స్పష్టీకరించారు. సమాజంలో నాలుగైదు దశాబ్దాల క్రింద కుల, మత బేధాలు వున్నప్పటికీ, మనిషిని మనిషిని కలపడానికి ఒకమానవతా దృక్పథం వుండేది. అయితే అది క్రమక్రమేణా మారి పోవడానికి కారణం సమాజంలో వచ్చిన ఆర్థిక, రాజకీయ శక్తుల స్వార్ధదృష్టి మాత్రమే, అందువలన సమాజంలోని భిన్న మతాల/కులాల మధ్య సామరస్యం అనేది "కరి మింగిన వెలగ పండు" అయింది. కవిత ఎత్తుకోవడం యీ విధంగా ఉంది.

"నా బాల్యమంతా
రాములోరి గుడి ఆవరణలోనే
చెన్నకేశవుడిలోగిలే కదూ" (పుట, 33)

అని అనడం, మూడు, నాలుగు దశాబ్దాల క్రితం మతం యొక్క ప్రభావం సమాజంలోని భిన్న మతాల మధ్య సామాన్యంగానే వుంది తప్ప అమానవీయ స్థితిలో లేదని తేలుతుంది. భిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ మత జాఢ్యం అంటుకోకుండా, భిన్నమతాల వారు అన్న, అక్క, వదిన, మామ లాంటి వరుసలు కలుపుకొని జీవించేవారు. ఇటువంటి స్థితిలో బాల్యంలోకి పయనించి రచయిత ఈ కథను చిత్రీకరించాడు, మనోజ్ఞంగా! బాల్యంలోని మధురానుభూతులు, శివాలయంలో, కోనేరులో బ్రాహ్మణ, కోమటి స్నేహితులతో గడచిపోవడం వర్ణితమైంది. ఈ ముస్లిం బాలిక అమ్మ తరచుగా యీ విధంగా అనేది.

"బఖాలా పొట్టే బొమ్మన్ పొట్టే హైతోబస్
యే మాతిమిలే కో ఖానాబీ నక్కో" (పుట,33)

ఈ మాటలుచాలు; మత స్పర్శలేని స్నేహాన్ని సమాజం ఏవిధంగా పంచుకున్నదో అవగతం చేసుకోవడానికి; ఈ వాక్యాలు ఎంత ఆర్ద్రంగా, వాస్తవికంగా ఉన్నాయో:

"ఏ రంజాన్‌కో బక్రీద్‌కో
పండగ నమాజ్ చదివేందుకు
చంకలో చాపెట్టుకొని ఈద్గాకెళ్తే
నా హిందూ దోస్తులు ఖబరస్తాన్ చెట్లెక్కి
కోతుల్లా నన్నెక్కిరించేటోళ్లు జల్దీరమ్మనేవాళ్లు" (పుట, 34)

హిందూ బాలికలు, ముస్లిం బాలికను ఆడుకోడానికి పిలిచేదృశ్యమిది. ఈ దృశ్యంలో ఒక స్నేహ భావన, మధురంగా ఒక రాగంలా వినిపిస్తుంది. శ్రవ్యాతిశ్రవ్యంగా! మతాలు/కులాలు స్నేహాన్ని కలుషితం చేయలేవనే రచయిత దృక్పథం హర్షణీయం.

"ఖురాన్ హదీసుల్లో ఏముందో తెల్వదుగాని
రామాయణ భారతాలన్నీ ఎంతబాగా తెలుసో

ఒకటా రెండా ఎన్నెన్ని హరికథలు
ఎన్నెన్ని బుర్రకథలు ఎన్నెన్ని రాత్రులు
ఆ కృష్ణ మందిరాల్లో గెంతుకుంటూ తూగుకుంటూ
భజన్ల చేసుకుంటూవినింది
లభ్యమై చదివిన సాహిత్యమంతా పురాణేతిహాసాలే
వాచకాల్లో చెప్పిందీ అదే
ఎక్కడి కెళ్లినా విన్పించేవి స్తోత్రాలూపద్యాలే" (పుట, 34-35)

ఈ విధంగా ముస్లిం యువతి, తెలుగు సంస్కృతీ సాంప్రదాయాల్లో మమేకం కావడం చూస్తుంటే ఈ రెండు సంస్కృతుల సమ్మేళనం "పీపల్ మే నీమ్ కాపేడ్" అనిపిస్తుంది. అయితే, ఈ సంస్కృతీ సమ్మేళన ప్రక్రియ ఎక్కడ విచ్ఛిన్నమైనదో కూడా రచయిత సమర్థవంతంగా వర్ణించి, తుది మాటల్లో దీనికి ఏ విధంగా మసలుకోవాలో సూచించడంలో ఈ కథా కవిత ముగుస్తుంది. రహమతుల్లా అంటారు.

"మసీదు గుమ్మటాన్ని చదునుచేసి
సాయిబుల రక్తాన్ని పారించాక
బాంబుల్తో బిల్డింగుల్ని కూల్చాక
దేశం మొత్తానికి విద్యుద్ఘాతం తాకిందా
మూడు రంగుల జెండా దిగి అపాయం బొక్కల
జెండా లేచిందా?
అభద్రతాభయం అస్తిత్వం ప్రశ్నయిందా
ఏమైందో తెల్వదుగాని మనుషుల్లో
తేడాలొచ్చిందనిపించి
అపనమ్మకం కలకలం ఆవరించగా
నా తల్లి ఒడిలో నక్కి దాక్కున్న
మజీద్ మందిరొంకో యాభవనోంకో
తోడ నామరదానా నహీకహలతా, షైతానీహో

నఫ్రత్ కో మిటానా, మోహబ్బత్ కోపైలానా ఇన్‌సాదియత్
డరనే వాలోంకో కోయిభీ డరాసకతే
హిమ్మత్ హోర్‌నామత్, జిందగీ జంగ్ ఛోడనామత్
'మా' మాటలు గీతాఖురాన్‌లా అనిపించి
తలెత్తి నిబ్బరంగా ఆలోచించాక
స్వార్ధ చాదస్తాల బందీరాక్షసులు
రామ్ రహీమ్ భక్తుల్లా జాతి రక్షకుల్లా
కురుక్షేత్రాన్ని సృష్టించనీ
కుత్తుకలు తెగ్గోసుకుని చచ్చినోళ్లుచచ్చాక
మిగిలి నోళ్ల సంగతి మనం చూద్దాం" (పుట, 37-38)

సామాన్యుడికి మత ఘర్షణలు పట్టవు. అతను తన జీవిక కోసం, నిత్యం పోరాటంలో వుంటాడు. తనకు, తన కుటుంబానికి ఏమి కావాలో? ఎలాదాన్ని సాధించాలి? అనే నిత్యసమస్య వేధిస్తూవుంటుంది. ఇటువంటి పరిస్థితులలో ఉన్న వ్యక్తిని మత భేషజాలలోకి తీసుకురావడం, అతనికి మేలు చేయడం కాదు. అతనికి కీడు చేయడమే! ఇటువంటి పరిస్థితులను అరికట్టడానికి ఉత్తమసాహిత్యం కృషి చేస్తుంది.

ఇక్కడ ఉత్తమ సాహిత్యమంటే ఒక నిర్వచనం చెప్పుకోవలసిన అవసరం వుంది. ఏ రచన మానవత్వాన్ని ప్రబోధిస్తుందో, ఏ రచన జీవన మూలాలను స్పృశిస్తుందో, ఏ రచన మనిషికి మనిషికి అడ్డుగోడ కట్టదో, ఏ రచన మానవాళి హృదయాలను పరిమళింపచేస్తుందో అదే ఉత్తమ రచన. ఇటువంటి లక్షణాలు రహమతుల్లా కథల్లో కన్పిస్తాయి – కాంతి రేఖలుగా, శాంతిగీతికలుగా !

మనిషికి ధైర్యాన్నీ, నూరిపోసే ఇలాంటి గీతాలు అనేకం తెలుగు సాహిత్యంలో ముస్లిం రచయితలు రచించారు. ఉగ్రవాదంతోనో, మతవాదంతోనో చనిపోయే వాళ్లని చావనీ, మిగిలిన వాళ్లే ప్రపంచానికి కావలసిన వాళ్లు, అవసరం అయినవాళ్లు, సమాజపురోగతిని కాంక్షించేవాళ్లు అనే శుభసందేశంతో కవిత ముగుస్తుంది. ఈ కవితలో రచయిత కథనం కొంచెం కటువుగా ఉన్నప్పటికీ అందులో వాస్తవం వుంది.

# III.1.F. అమ్మీజాన్

ఈ కథ గురించి విశ్లేషించేముందు కథలను గురించి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారన్న వాక్యాలను ఇక్కడ ఉటంకించడం సమంజసంగా ఉంటుంది. ఎందువలెనంటే "అమ్మీజాన్" కథ అంత విలువైనది. శ్రీపాద వారంటారు. "కథలంటే పైపైన ఉన్నాయనుకుంటున్నావేమో – అవి కల్పించడానికి ఎంతో ప్రతిభకావాలి. వాటి విలువ తెలుసుకోవడానికెంతో పరిజ్ఞానం కావాలి. అవి బోధపరచుకోడానికెంతో బుద్ధి సూక్ష్మత కావాలి. కథలు కళ్లకి వెలుగునిస్తాయి. బుద్ధికి పదును పెడతాయి. మనసుకు ఉల్లాసం ఇస్తాయి. కథలు చదవడం, వినడంఎప్పుడూ దండుగనుకోకేం" అని (సుబ్రహ్మణ్య శాస్త్రి శ్రీపాద, 1972, పుట, 92)

Modern short story అనే రచనలో H.E. బేట్స్ కథారచన అనేది అగ్గిపుల్లలతో మేడకట్టడం లాంటిదని అంటాడు. ఒక దశ వచ్చేసరికి ఒకపుల్ల ఎక్కువయినా మొత్తం కూలిపోతుంది. ఇంతశ్రద్ధగా 'బేలన్స్' గమనించాల్సిన ఆవశ్యకత ఒక కథా రచనలో తప్పించి మరెక్కడా కనపడదు. అందుచేతనే సృజనాత్మక వచన సాహిత్య ప్రక్రియలన్నింటిలోకి కథారచన క్లిష్టమయినదని ఆయన అభిప్రాయం. ఈ విశ్లేషణ అంతా మంచి కథ గురించి, అటువంటి మంచికథే "అమ్మీజాన్".

ఈ వర్ణన చూస్తే వస్తువుకి తగిన పోలికను చెప్పినట్టనిపిస్తుంది. పేద ముస్లిం స్త్రీని "చర్మాన్ని చీల్చుకొని బొక్కలు బయటపడనున్నట్లు సాయిబులపీరు మాదిరుందామె" (పుట,39) అని అన్నాడు రచయిత. ఈ విధంగానే ఇంకా ఆమె దయనీయ పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో యీ వాక్యాల్లో స్పష్టమౌతుంది. మాతృత్వం యొక్క మహనీయత యీ మాటల్లో గడ్డకట్టివుంది. "చేతుల్లోని తన బిడ్డడ్ని ఎండిన తన గుండెలకు అదుముకుంటా నా ముందు చేయి చాపింది. ఆ పిలగాడి కాళ్లు చేతులు సన్నగా పెన్సిళ్లు మాదిరున్నాయి. చింపిరి జుట్టుతో, చినిగిన బట్టల్తో ఇద్దరాడ పిల్లలు కూడ ఆ పిచ్చి మాతల్లి కాళ్లు చుట్టుకొని ఉన్నారు." అని అంటూ రచయిత "తల్లితల్లే, పిచ్చిదైనా, ఎడ్డిదైనా, పేగు బంధాన్ని తెంచుకోదు. ఇంకా విచ్ఛిన్నం కాకుండా పవిత్రంగా మిగిలున్న మానవీయ సంబంధం అదొక్కటేగద" (పుట, 39) అని అనుకుంటాడు.

రచయిత ముస్లిం అయినా, హిందూ క్రైస్తవ ఇంకా ఏ మతస్థుడైన మానవ జీవితం గురించి విశ్లేషించేటప్పుడు విశ్వనరుడు కాకతప్పదు. విభిన్న మతాలు, మతాచారాలు, సిద్ధాంతాలు

అనేకం వేరయినప్పటికీ వాటి మధ్య వైరుధ్యాలు వున్నప్పటికీ విభిన్న సమాజంలోని మనిషి అతని జీవితం ఒక్కటిగానే భాసిస్తుంది. అందువలన మానవజీవితానికా ప్రాముఖ్యం ఇచ్చే రచయితలు సార్వజనీన రచయితలుగా మిగిలిపోతారు. ఇక్కడ తల్లీ పిల్లల అనుబంధాన్ని ప్రారంభిస్తూ కథను చెప్పడంతో, ఈ కథలో తల్లీపిల్లల మమతానుబంధం గురించి చెప్పడం ప్రధానమనే అంశం సూచ్యమాన మైనది.

పెళ్లిళ్లు, కుటుంబాలు మనుషుల్ని ఎంత సంకుచితంగా చేస్తాయో ఈ కథ చక్కని ఉదాహరణ. సామాజిక పరిస్థితులు మనుషుల్ని ఏ విధంగా శాసిస్తాయో, స్వార్థం తనుయెక్కిన సోపానాలను ఏవిధంగా మరిపింపచేస్తుందో ఈ కథలో సూచితమైనవి. అయితే మతాంతర వివాహాల వలన కుటుంబాల మధ్య కలవలేని దూరం పెరిగి పోవడం కూడా యీ కథలో ప్రస్ఫుటం చేయబడింది. ఇది కొంత తిరోగమనన్ని సూచిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు ఆ విధంగానే ఉన్నాయి.

మనిషికి మనిషికి మధ్య దూరం ఎందుకు పెరుగుతుంది? మనుషులు ఎందుకింత క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. ఒకే జాతి జంతువుల మధ్య హింసా ప్రవృత్తి లేనప్పుడు, ఒకే జాతి అయిన మానవ జాతి ఎందుకు యీ హింసాజ్వాలల్లో చిక్కుకొని మాడిమసి అయిపోతుంది? అనే అంశాలను తీవ్రంగా పరిశీలించివలసివుంది. అసలు మనిషి సహజాతంలో హింస అనేది ఉనికి కలిగి వుందా? అనే అనుమానం కలుగుతుంది. ఈ కథను ఒక మానవీయ కోణం నుంచి, మానవతా స్పర్శనుంచి పరిశీలించవలసిన ఆవశ్యకతవుంది.

స్థూలంగా కథయిది. ఫాతిమాబీ విధివంచితురాలు కాదు. భర్త వంచనకు గురి అయింది. భర్త వేరే స్త్రీతో సంబంధం పెట్టుకొని భార్యను, కుటుంబాన్ని నిర్లక్ష్యపరుస్తాడు. పైగా తాగుబోతు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక రుగ్మతలలో యీ మద్యపానం ఒకటి. సమాజం దీన్ని ఒక వ్యసనంగా పరిగణించడం లేదు. ప్రభుత్వాలు ఈ మద్యం కాంట్రాక్టులు అమ్మకాలతో వచ్చే ఆదాయంతో బతికి బట్టకడుతున్నాయి. మారిన సంస్కృతి దృష్ట్యా అనేక పేద కుటుంబాలు యీ మద్యం మహమ్మారికి బలిఔతున్నవి. అటువంటి కుటుంబాలలో ఫాతిమా కుటుంబం ఒకటి. ఇటువంటి పరిస్థితుల్లో లేమితో బాధపడుతున్న కుటుంబాన్ని వదిలి భర్త మరణిస్తాడు. ఆమె తన బాధ్యత నుంచి పారిపోకుండా ఉన్నది అమ్మి పెద్దమ్మాయి పెండ్లి, అప్పులుచేసి

చిన్నమ్మాయి పెండ్లి చేస్తుంది. అండగా నిలుస్తాడనుకొన్న కన్న కొడుకు బ్రాహ్మణ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకొని కుటుంబానికి దూరం ఔతాడు. అటువంటి కుమారుడిని కన్నపేగుని తెంచుకోలేక చూడటానికి తల్లి బయలుదేరి వెళుతుంది (అల్లుడితో కూతుళ్లతో) కొడుకు ఇంటికి అల్లుడిని పంపిస్తే, పూర్తిగా హిందూగా మసలుతున్న కొడుకు, కోడలు వీళ్లని తమయింటిలోకి రానివ్వకుండా, తమ ప్రేమని చంపుకోకుండా కంటితుడుపు చర్యగా బట్టలు వగైరాయిచ్చి, దూరం నుంచి తల్లిని, అక్కచెల్లెండ్రను చూస్తూ నిలిచి పోయిన కుమారుడిని వేదనతో తల్లి గమనిస్తూ ఉండటంతో కథ ముగుస్తుంది.

సామాజిక సంబంధాలలో యీ మార్పుఎందుకు వస్తుంది. దాదాపు 25 సంత్సరాలు తల్లి కొడుకుని కడుపులో పెట్టుకొని పెంచుకొని, వృద్ధాప్యంలో తోడుంటాడని, తన బాధ్యతలను కొంత పంచుకుంటాడని ఆశించిన తల్లికి ఎదురైన సంఘటన, చివరకు దగ్గరగానయినా కన్నకొడుకుని అతని  పిల్లలను చూసే స్థితి లేక దూరం నుంచి చూసి గుడ్ల నీరు గుడ్లలో కుక్కుకొని వెనుతిరుగుతుంది. దీనిని  బట్టి మనుష్యులు దూరం కావడానికి దగ్గర కావడానికి వారివారి అవసరాలే ప్రాముఖ్యతనిస్తాయని, వ్యక్తి (తల్లి కాదు) తన స్వార్ధం, తన సౌఖ్యం లాంటి వాటి మధ్య తిరుగుతూ మానవ సంబంధాలను , ముఖ్యంగా తల్లి ప్రేమ నుంచి కూడా దూరం కావడానికి వెనుకాడడంలేదని ఈ కథ స్పష్టాతిస్పష్టంగా విశదీకరిస్తుంది.

తల్లీ, కొడుకుల పేగు బంధంకన్నా, మతమూ, సామాజిక పరిస్థితులే మనుషులను శాసిస్తాయని రచయిత యీ కథలో సూత్రీకరించడం సహజంగా ఉంది. సమాజం గీసే లక్ష్మణరేఖను దాటడానికి ఒక మధ్యతరగతి కుటుంబీకానికి సాధ్యంకాదని ఈ కథ రుజువు పరుస్తుంది. వ్యక్తి తన యొక్క స్వార్ధ అవసరాలను మాత్రమే విలువనిచ్చి కుటుంబం పట్ల ముఖ్యంగా కన్నవారి పట్ల సైతం బాధ్యతలను నిర్వర్తించడానికి సిద్ధంగా లేకుండా మానవ సంబంధాలను త్రోసిపుచ్చే సంస్కృతి ప్రస్తుత సమాజంలో ప్రచలితమై వున్నదని యీ కథ ద్వారా  సూచితమైంది.

## III.1.G. ప్యార్ మీర్జా మహేశ్వరికా

ఇది మత విలువలకు, హృదయంలో ప్రకంపనలు కల్గించే ప్రేమకు మధ్య జరిగే ఘర్షణను చిత్రీకరించిన కథ. చివరకు హృదయానుభూతులకు, సంస్పందనలకు విజయం సిద్ధిస్తుంది.

మతం మనిషిని బంధీకృతుడ్ని చేయలేదని రచయిత సున్నితంగా కథలోచెప్పారు. మనిషికి, అతని హృదయానికి దగ్గరగా ఉండే నిత్య జీవితములో అతను అనుభవించే విషయాలు మాత్రమే ప్రధానం అవి మనిషి యొక్క అంతశ్చేతననూ తాకుతాయి. ఎంతగా మనిషి మతంలోకి మమేకం కావాలనుకున్న అతని జీవనవాస్తవికత దాన్ని వ్యతిరేకిస్తుంది. అయితే సమాజం ఇచ్చే "మిధ్యాగౌరవాలకు" లొంగిపోయి మతాన్ని అనుసరిస్తున్నాడు మనిషి ఏ మత దృక్పధం కలిగి ఉన్న వారికి ఆయా మత కూటములతో గౌరవం లభిస్తుంది. ఈ మిధ్యాగౌరవానికి లొంగిపోయి ఎక్కువ శాతం సామాజికులు మత శాఖలను పట్టుకొని కోతి కొమ్మచ్చులాడుతూ వుంటారు. అయితే యీ కథలోని నాయకుని సంగతీ వేరే విధంగా కొంత హేతుబద్దంగా వుంది.

ఇర్ఫాన్ మీర్జా, నమాజు చెయ్యడు, మసీదుకు వెళ్లడు. అతని ఇల్లుమాత్రం మసీదుకు దగ్గరగా వుండటం వలన, అతని దగ్గరకు మతగురువులు "బందోబస్తు"గా వచ్చి మసీదుకు రమ్మని బలవంతం చేసేవాళ్లు. అయితే అతను మాత్రం మసీదుకు వెళ్లేవాడుకాదు.

ఏ మతానికి సంబంధించిన గురువులైనా ప్రతి వ్యక్తినీ తమతమ మతభావాలతో ప్రభావితం చేసి, మతం అనే వుచ్చులోకి ముగ్గులోకి దింపాలని ప్రయత్నించడం సమాజంలో విభిన్న మతాలతో జరిగే ఒక నిరంతర ప్రక్రియ. సమాజ సంస్కృతిని నాశనం చేసే యీలాంటి చర్యలు అన్ని మతాలలో ఎక్కువైపోయినవి.

ఈ కథలో మతగురువులు మసీదుకు రమ్మని రోజూ పిలిచేవారు. అయినా అతను చలించే వాడుకాదు. అయితే ఇస్మాయిల్ మౌలా అనే మత గురువు మాటలు అతన్ని ఆకర్షిస్తాయి. ఆ మాటల్లో రచయిత ఇస్లాం మతభావాలను ప్రతిబింబింపచేసాడు. ఇర్ఫాన్ మిర్జాను మసీదు వైపుకి తీసుకువెళ్లిన మాటలివి "నా పేరు ఇస్మాయిల్ మౌలా. నేను బొంబాయి నుంచి వచ్చిన జమాత్‌కు అమీర్‌ను. మీరు మస్జీదుకు రారని మీమస్జిదులో చెప్పారు. అందుకే మీకు మస్జీదుకు రమ్మని దావత్ ఇవ్వడానికి నేనే ప్రత్యేకంగా వచ్చాను. మీ ఇరవైనాలుగు గంటల్లో ఒక్కగంట ఆ ఖుదా కొరకు వెచ్చించండి. రోజులో ఐదు నమాజులు, ఇరవై రకాతులు, ఫజర్, జోహర్, అసర్, మగరిబ్, ఇషా, పొద్దుముందు, నడినెత్తిపొద్దు పొద్దుగుంకాక, పొద్దుపోయాక, రాత్రి. దినం మొత్తంలో ఏ నిమిషంలో కూడా ఒత్తిడి సైతాను మీదరిచేరని ఏర్పాటు. మీమనస్సుకు భావాతీతమైన సంతృప్తి. శరీరానికి సంపూర్ణమైన ఆరోగ్యం. కామం, క్రోధం, విరహం, భయం

లాంటి ఎన్నో మానసిక సమస్యలకు నమాజ్ మహద్భుతమైన లేపనం. ఇంక ఇటువంటి ఎన్నో విషయాలను మాట్లాడుకోవడానికి మీ షహర్‌కు వచ్చాం. మగరిబ్‌కు మస్జిదుకు వస్తే మాకెంతో సంతోషం" (పుట, 50)

ఈ సంభాషణా పూర్వక సందేశంలో మతం యొక్క అంతః సారాన్ని పిండి చెప్పినట్లయింది. నిజమే ననిపిస్తుందికూడా! అయితే మత సంస్కృతి అనేది ఒక చట్టం లాంటిది గనుక అందులో మనిషికి, మానవత్వానికి అనుభూతికి ఆలోచనకు 'స్వేచ్ఛ' అనేది వుండదు. అందువలన మానవ జీవనానికి కావలసిన తాత్విక నేపథ్యం మతంలో లభించదు. ఈ కథలో ఆ విషయం స్పష్టమైంది.

మతపెద్ద "అస్సలమాలేకుం మీర్జాసాబ్" అంటూ ఆత్మీయంగా కౌగిలించుకోవడం వలన ఓదార్పు కలగడం, "నీ ఆలోచనా విధానం ఇస్లాం ప్రకారం మార్చుకోమని " చెప్పడం, ఖుదాకు భయపడు. అంతే వాటంతట అవే సవ్యంగా జరిగిపోతాయి అని నొక్కి చెప్పడమూ, అర్ధరాత్రి తరువాత తెల్లవారకముందే రెండు రకాతుల తహజాద్ నమాజ్ చదివి ఏమి దువాచేస్తే అది నెరవేరుతుంది." అని చెప్పడంలో మీర్జాకు భక్తి ప్రపత్తుల మీద కొంత నమ్మకం కుదిరింది. మనిషి బలహీనతల్లో ప్రదానమైనది అతని కోరికలు మాత్రమే! ఈ కోరికలకు అంతం అనేది వుండదు - ఈ కోరికలను ఆసరాగా తీసుకొని మత గురువులు సామాన్యులను తమకు అనుగుణంగా అనుయాయులుగా మార్చుకొంటారు. ఇక్కడ కూడా ఇదే జరిగింది.

సహజంగా ఏమతంలో వున్న భక్తితత్వమైనా సమాజానికి కొంత మేలు చేస్తుందనడంలో సందేహంలేదు. అయితే, అనేక మానసిక శారీరక రుగ్మతలు కలిగిన వారు పూజ చేసినా, ప్రార్థన చేసినా, నమాజు చేసిన వారికి తాత్కాలిక చిత్తశాంతి దొరుకుతుంది. అయితే సమస్య యొక్క మూలంలోకి మతంగాని, మతం ద్వారా వచ్చే భక్తి తత్వంగాని వెళ్ళి వాళ్ల సమస్యను పరిష్కారం చెయ్యదు. సమాజం మతం నుంచి తత్వచింతన వైపుకి పయనించవలసిన ఆవశ్యకత వుంది. అందువల్లనే ఉపనిషత్ కారుడుకూడా "ఉత్తమా తత్వచింతైవ ॥ మధ్యమం శాస్త్రచింతనం॥ అధమామంత్రచింతాచ ॥ తీర్థభ్రాంత్యధ మాధమమ్ ॥" (తత్వచింతన ఉత్తమం - శాస్త్రచింతన మధ్యమం, మంత్రాలు చదివే అలోచన అధమం తీర్థాలకు వెళ్లడం అధమాధమం అని భావం) (వీరభద్ర కవి ఇరగం (వ్యా), 1992, పుట-2) అని అంటాడు.

కొంత నాస్తికత్వంలో వున్న యీ కథలోని ఇర్ఫాన్ మీర్జా. అల్లా ఉంటే నాకేమిటి ? లేకుంటే నాకేమిటి? అని అనుకొనేవాడిలో కొంత మార్పువచ్చింది. ఒక ప్రక్క 'దువా' చేస్తున్నా, అతని హృదయం ప్రకృతి సౌందర్యం వైపు, స్త్రీ ప్రేమవైపు మొగ్గు చూపింది. తను ప్రేమించిన, తనను ప్రేమించిన, మహేశ్వరి వైపుకే మొగ్గిన హృదయంలో తాత్కాలికంగా ఏర్పడిన మతావేశం, మతాచారాలు గాలికి కొట్టుకుని పోయాయి. మనిషి హృదయం దేనికి దగ్గరగా ఉంటుంది? సహజ విషయాలకా ? అసహజవిషయాలకా? అసహజమైన మత ప్రవృత్తి తొలగిపోయి "ప్రేమ ఒక అగ్ని; అది దహిస్తూ మనిషిని ఉన్నతుణ్ణి చేస్తుంది' అన్న రచయిత దృక్పథం వైపుకి సహజ, సరళ, స్వచ్ఛ దృక్పథంవైపుకి నడిచిపోతుంది. ఇర్ఫాన్ మీర్జా పాత్ర ! ఇదే వాస్తవం కూడా!

మనిషిని రెండు విషయాలు బాగా సంచలింపచేస్తాయి. ఒకటి యవ్వనములో కలిగే ప్రేమ, రెండవది వృద్ధాప్యములో వచ్చే మరణభయము లేక మృత్యువు గురించి ఆలోచన. ఈ రెండు విషయాలు ఎవ్వరినైనా కదిలిస్తాయి, కరిగిస్తాయి. అందువల్లనే మనిషి యొక్క బాహ్యచేతనలోనే తన ప్రభావాన్ని చూపే "మత ప్రభావం" నుంచి అంతశ్చేతనలో బలంగా గడ్డకట్టుకుపోయిన "ప్రేమభావన" వైపుకి కథలోని "ఇర్ఫాన్ మీర్జా" పయనించడంతో ముగించడం వలన "భావోద్వేగాలలో" ఏది ప్రధానమైన అంశమో రచయిత చెప్పక చెప్పినట్లయింది. మతం మాస్ హిస్టీరియా అయితే ప్రేమ పూర్వక హృదయ స్పందన సామూహిక తత్వం నుంచి వ్యక్తిని విడదీసి ఉన్న తీకరిస్తుంది. జడ స్వభావం కలిగిన మత విలువలకన్నా, మనిషి హృదయంగమైన విలువలు ప్రధానమైనవని ఈ కథలో రచయిత సుందరంగా అభివ్యక్త పరచాడు. అదే వాస్తవం కూడా!

## III.1.H. బందీపింజరేకేబినా

ముస్లిం స్త్రీ జీవితం 'సుహాగ్‌రాత్' నుంచి మొదలయిన యాంత్రికతను, పురుషదౌష్ట్యాన్ని, స్వేచ్ఛలేని జీవితాన్ని, కుటుంబంలో బందీ అయినవైనాన్ని, వాస్తవికత ఉట్టిపడేలా రచించాడీ కథను రహమతుల్లా.

పర్వీన్ దుల్హన్ అనేకమైన మధురానుభూతులతో, ఆశలతో ఒక స్వర్గాన్ని ఊహించుకొని, అత్తవారింటిలో అడుగు పెట్టి తీవ్ర నిరాశకు, నిర్లక్ష్యానికి, గురి అవుతుంది. ఒక స్త్రీ తన బాల్యములో వైవాహిక జీవితం గురించి అనేక కలలుకంటుంది. తనను ప్రేమగా చూసే భర్త,

తనను అభిమానించే అత్త, మామలు , ఆడబిడ్డలతో ఒక ఆదర్శవంతమైన అత్తవారింటిని ఊహించుకుంటుంది. చిన్నప్పుడు తండ్రి ఒడిలో పెరిగి, అన్నదమ్ముల ఆప్యాయతకు పొంగిపోయి మల్లెమొగ్గలా, గులాబి పువ్వులా పెరిగిన బాలిక మధురూహలన్నీ అత్తింటిలోకి అడుగుపెట్టగానే దూదిపింజల్లా ఎగిరిపోతాయి. వెంటనే జరిగే సైనిక చర్య మాదిరిగా, ఈ కథలో భర్త, అత్త ప్రవర్తించిన తీరు కూడా శోచనీయం.

'సుహాగ్‌రాత్' భర్త నిద్రపోతుంటే కొత్త కోడలికి అర్ధరాత్రి వచ్చిన అత్తగారి ఉపదేశం ఈ విధంగా వుంది. "నేనే రెండు నిద్రమాత్రలిచ్చాను; పెళ్లిపనుల్తో అబ్బాయి అలిసి పోయాడు. హాయిగా పడుకోని. ఈ చాప మంచం పక్కన వేసుకొని నువ్వూపడుకో! తెల్లారేలోపల అబ్బాయి లేస్తే ఎక్కువ కష్టపెట్టకు. సమజయిందా!" (పుట 59) ఈ ఉపదేశంలోని అంతరార్థం అత్తలోని నీచత్వం, స్వార్థం గ్రహించి నివ్వెర పోతుంది. ఈ విధంగా మొదలయిన ఆమె జిందగీలో బంధనాలు వయస్సు పెరిగే కొద్దీ విస్తృతమౌతాయి. మొదటి రాత్రి ఆమె యిష్టంతో ప్రమేయం లేకుండా, నిద్రావస్థలో ఉన్న ఆమెను ఆక్రమించి నిష్క్రమిస్తాడు. ముగ్గురి పిల్లల తల్లి అయింది. గానుగెద్దు జీవితం. రచయిత రహమతుల్లా ఆమె గురించి ఒక దీర్ఘకవిత యీ కథలో పొందుపరిచాడు. రహమతుల్లా కథలో ఒక కవిత కూర్చడంలోని అంతరార్థం ఒకటుంది. ఒక కళాకృతిని రచించేటప్పుడు భావోద్వేగం సృజనాత్మకతలో ఎక్కువగా చొరబడినప్పుడు, తాను తీసుకున్న వస్తువు లేక పాత్రపట్ల మమకారం ఎక్కువైనప్పుడు ఇటువంటి " లీనావిలీనావస్థ ఏర్పడుతుంది. అటువంటి స్థితిలో యీ కథలో కవిత చోటుచేసుకుంది. అందువలన యీ కవిత ఒక రస సరితలా ప్రవహిస్తుంది చూడండి.

"ఉదయాన్నీ, రాత్రినీ ఇంటి చాకిరి తినేస్తుంది
పగలంతా కంప్యూటర్లు, ఫైళ్లు, అధికారులూ...
నిలకడా నిశ్చింత లేని తన్నులు తినేబంతి పర్వీన్...
పైకంతా సుఖంగానే, స్వేచ్ఛగానే
లోనంతా చెదపురుగులాంటి ఒత్తిడి రాక్షసి....
బియ్యం బస్తా పైనబడి దొర్లినట్లు
నిత్యం రసహీనపు యాంత్రికతా, అత్యాచారం

కండ్లు తెరిస్తే ఎల్లికలా గురకల్తో షౌహర్
చలనం లేని ఎద్దు పక్కలో పడుకున్నభావన
నరాల సలుపును దేహబాధల్లోకి ఒక్కటిచేసి
ఏడ్వటానికి సమయం శక్తి నిద్రలోకి
హందేరేసే ఉట్కే
ఫిర్ మరతే హుయే జీన్‌కేలియే” (పుట, 61)

ఆమె తన్నులు తినడం బియ్యం బస్తా పైన బడినట్లుండటం, చలనం లేని ఎద్దు ప్రక్కలో వున్నట్లు వుండటం లాంటి సహజ వర్ణనలతో ఒక నిర్భాగ్యురాలి జీవితాన్ని వర్ణించాడు రచయిత. ఇదీ పర్వీన్ జీవితం – జీవితమంతా భయంకరమైన వత్తిడి. మధుర ప్రేమ స్పర్శ గాని, స్నేహవాత్సల్యాలు కనిపించని జీవితం ఇది ఒక బ్రతుకేనా? అనిపిస్తుంది. తప్పదు మరి.

జీవితంలో “జీవనం” అనే ప్రక్రియ వున్నంతవరకు, తన చుట్టు వున్న వారి దౌర్జన్యాన్ని మానసిక, శారీరకహింసను భరిస్తూ జీవించడం ఒక సాహస కార్యం – జీవితాన్ని ఎప్పుడైన బలవంతంగా ముగిద్దామా అనే ఆలోచన వస్తే, అప్పటికే , పిల్లల రూపంలో ఏర్పడిన బంధనాలు, సంకెళ్ళు ఛేదించే స్థితిలో ‘తల్లి’ అయిన స్త్రీ ఉండదు. ఈ కథలోని ‘పర్వీన్’ పరిస్థితి కూడా ఇదే! అందుకే రచయిత “మరణించడం కోసం జీవిస్తుంది” అనే వాక్యంతో ముగిస్తాడు కథను. వేల, లక్షల మంది స్త్రీల మనోవేదననూ పాఠకుల దృష్టికి తీసుకొని వచ్చి ముఖ్యంగా పురుషుల దృష్టి మారడానికి కొంత దోహదకారిగా పనిచేస్తుంది. స్త్రీ, పురుష సంబంధాలు ఎంత అమానవీయ స్థితిలో వున్నాయో, కుటుంబ సంస్కృతిలోని డొల్లతనం ఎంతో యీ కథ వ్యక్తీకరిస్తుంది.

అసలు కుటుంబంలో జరిగే సన్నివేశాలకు, సమాజంలో జరిగే దౌష్ట్యాలకు, మత యుద్ధాలకు, ఉగ్రవాద, తీవ్రవాదాలు కలిగించే నష్టాలను గురించి సామాజికుడు ఎందుకు తీవ్రంగా ఆలోచించలేక పోతున్నాడు? అనే ప్రశ్న ప్రధానమైంది – ఏ సమస్య అయినా నా వరకు రాలేదు కదా ! అనే ధైర్యం , నిర్లిప్తత అనేవి ప్రధానాంశాలు. అయితే తన దగ్గరకు, తన యింటిలో లేక తాను స్త్రీని చూసే దృక్పథం ఏ విధంగా వుంది? అనే ప్రశ్న వేసుకోడు భర్త స్థానంలో వున్న పురుషుడు – ఒక వేళ స్త్రీని అణిచివేసే కార్యక్రమాన్ని తాను చేస్తున్నానని తెలిపినా తన యొక్క స్టాండ్ ఖచ్చితంగా వుందని ఒక పనికిరాని, హేతుబద్ధంగాని తర్కం

ద్వారా, తన యొక్క నైజాన్ని, ప్రవర్తనను సమర్థించుకుంటాడు ఇటువంటి భావజాలాన్ని కథలో క్లుప్తీకరించడం ద్వారా రచయిత అసలు ముస్లిం సమాజంలో ఎక్కువ భాగం వుండే పురుషాంకారాన్ని వెల్లడించినట్లయింది.

అందువల్లనే పర్వీన్ జీవితం చిధ్రమైంది. మానవ జీవితంలో ఉన్నతమైన విలువలు అవాసంగా వుండాలంటే మహామానవుడైన తాత్వికుడు సమాజాన్ని నడిపించ వలసిన అవశ్యకత కనిపిస్తుంది.

## III.1.I. కిరాయ్‌మకాన్

"బ్లాక్ డే" సందర్భముగా ఉద్యోగంలో చేరడానికి ఒంగోలు నుంచి నల్లగొండ వచ్చిన అబ్దుల్లా, ముస్లిం అని ఆ రోజు రాత్రి లాకప్పులో పెడతారు పోలీసులు. ఘర్షణ వాతావరణం, కర్ఫ్యూ , కాషాయి రంగు కనిపిస్తే భయం, ఇల్లు అద్దెకు దొరకదు. ఉద్యోగానికి రాజీనామా యిచ్చి వెళ్లి పోవాలని ప్రయత్నిస్తాడు. ఎటువైపు వెళ్ళినా "తురకోడు" అని అవమానాలు.

వెళ్లిపోదామని ప్రయత్నిస్తున్న తరుణంలో వాళ్లయూనియన్ నాయకుడు చెప్పిన మాటల్తో లోక జ్ఞానం కలుగుతుంది. అతను అబ్దుల్లాకి యీ విధంగా చెప్పడంతో కథముగుస్తుంది. "చూడు అబ్దుల్లా ఇద్దరు బలవంతులు కొట్టుకోరు. హింసించుకోరు. వారిలో ఒకవేళ కసి, పగ ఉన్నా తమలోనే అదిమి పెట్టుకుని గౌరవంగా మసలుతుంటారు. ఎందుకో తెలుసా? వాళ్లు పోట్లాడుకుంటే ఇద్దరూ నష్టపోతారు. ఎవరికీ గెలుపు తమ దేనన్న ధీమావుండదు. అందుకే వాళ్లు బలహీనులను టార్గెట్‌గా పెట్టుకుంటారు. ఆ బలహీనులు పేదముస్లిమ్‌లు కావచ్చు, దళితులు కావచ్చు. శ్రామికులు కావచ్చు. ఎవరైనా వాళ్లకు అనవసరం, కాకుంటే పేదవాళ్లు, బలహీనులు అంతా అట్టడుగు కులాల వాళ్లే. కనుక నష్టపోయే మనం ఎలా బలం పుంజుకోవాలో ఆలోచించాలి కానీ ఇలా పారిపోతే ఎలా...." అని అంటాడు.

జీవితం నుంచి, సమాజం నుంచి దూరంగా పారిపోయే , పలాయనవాదం సరికాదని, పేద, బలహీన వర్గాలు పీడింపబడటం వలన వాళ్లంతా సంఘటితం కావాలని సందేశం. ఒక సామాన్యుడు కిరాయికి ఇల్లు అద్దెకు తీసుకోవడానికి ఎన్ని పాట్లుపడాలో ఎంత వివక్షతకు గురికావలసి వుంటుందో యీకథలో వ్యక్తమౌతుంది. నేడు పట్టణాలలో కొన్ని ప్రాంతాల్లో

అద్దెయిండ్లు "ఒక ఉన్నత వర్గానికి మాత్రమే" అని బోర్డులు బైట పెట్టడం కనిపిస్తుంది. అద్దె యింటి ద్వారా సమాజం యొక్క దుస్థితిని రచయిత చక్కగా వ్యక్తీకరించాడు.

## III.1.J. పుట్‌పాత్

పుట్‌పాత్ బ్రతుకుల మీద ఒక స్కెచ్‌లాంటి కథ ఇది. నిజ జీవిత దృశ్యాలను ఆవిష్కరించిన కథ. రచయిత అనుభవాలతో పఠిత సహానుభూతి చెందుతాడు.

## III.1.K. "బా"

"బా" – ఈ కథా సంపుటిలో "బా" కథ చివరిది. "బా" మరణంతో మొదలవుతుంది కథ "బా" పేరు షేక్ అబ్దుల్ గఫూర్ – ఎద్దు బండి తోల్తాడు. ఎద్దుబండి తోలే "బా" జీవితాన్ని, అతను చనిపోయిన తరువాత కొడుకు జ్ఞాపకాల్లో మెదిలిన విధానాన్ని రచయిత అత్యంత వాస్తవంగా హృదయ విదారకంగా కళ్లకు బొమ్మకట్టించాడు.

మనుషుల్ని ఎక్కించుకొని కొంతకాలం, శవాల బాడుగులు, సరుకులు వేసుకొని ఎద్దుల బండిని నడిపి కుటుంబాన్ని గట్టెక్కించడం సహజంగా "బా" కథలో కనిపిస్తుంది. ఈ క్రింది సంభాషణలో "బా" వ్యక్తిత్వం కనిపిస్తుంది.

"సాయి బా" ఇంత కష్టంతో సంపాదించిన డబ్బుల్తో ఎద్దుకు చక్కెర కేళీలు, అరటి పండ్లు తినిపించేవాడ్ని నిన్నేచూశాను. నువ్వో పిచ్చిమాలోకం లాగున్నావే, అన్నాడు కొట్టోడు డబ్బులు తీసుకుంటూ.

" బండిలాగి బాడుగ సంపాయించి మాకు ఇంత కూడు బెట్టే మూగజీవియిది. దాన్ని సరిగ్గా చూస్కోకుంటే దాని పేడతిన్నట్టే "

ఆయన జీవిత కాలంలో ఎప్పుడూ కూడా డబ్బులు ఆయన దగ్గర ఉంచుకోలేదు. ఎద్దుబండి లాగుద్ది. మామూలప్పుడు పండిద్ది...... "బా" బండి తోల్తాడు, మామూలప్పుడు కప్పుచూస్తా పంట్టడు. " క్యాజీ ...... పైసలు ఏమన్నా కావాల్నా అని అడిగినప్పుడల్లా నాకెందుకురా... నేనేం చేసుకునేది. (పుట, 85)

ఈ విధంగా , కష్టాన్ని నమ్ముకొని నిర్లిప్తంగా సాగిన జీవితాలవి. “ బా ” జీవనం “ హల్కా, ఖర్చు తక్కువ గుర్రబ్బండి నుంచి – భారం ఖర్చెక్కువ ఎద్దుబండి నుంచి తనే ఓ ఎద్దులా లాగే చక్కబండి దాకా “ బా ” జిందగి కంప్యూటర్లు, హైటెక్కులు తెలవ్వు, పాకిస్తాన్, అయోధ్య గుజరాత్‌లు తన జీవితకాలంలో జరిగినప్పటి కీ తెలవ్వు.” (పుట, 89) ఒక మామూలు కష్ట జీవికి తన గోడేదో తనది గాని ఈ మత పిచ్చి వుండదని రచయిత యీ వాక్యాల్లో సూచించాడు. అసలు ఏ మతంలోని పేదకైనా అతని జీవనభారం మాత్రమే ప్రధానమై కూర్చుంటుంది. అందువలన వేరే విషయాలకు ప్రాధాన్యతనీయడు.

ఒక కొడుకు తండ్రి గురించి “అలా జరిగి పోతాడని ఎవరం ఊహించలేదు. గుండె నొప్పిగుందని చెక్క రిక్షామీదే పడుకున్నాడు. అంతే” (పుట, 90) చివరికి “ దస్మాఅయినాక, చాలిస్మాకు వస్తామని చెప్పి ఇంటి నుంచి బస్టాపుకు వచ్చాం. ఊర్లో ఎప్పుడుదిగినా కొద్ది దూరం నడవగానే “బా” ఎదురొచ్చేవాడు. అరుగుల మీద మా కోసమే కాచుకొని ఉండేవాడు. వొళ్లంతా ప్రేమ నింపుకొని సూట్‌కేసు అందుకొనేవాడు పోయేటప్పుడూ అంతే మా బస్సు కనుమరుగయ్యే దాకా మమ్మల్ని చూస్తూనే ఉండేవాడు” అంటాడు. అటువంటి తండ్రి. కనుమరుగైనా కన్నబిడ్డల కండ్లల్లో జీవిస్తాడు.

ఇది “బా” కథ – కష్టాల కడగండ్లతో, ధైర్యాన్ని ఊపిరిగా కుటుంబాలను దారిద్ర్యం నుంచి బయట పడేయటానికి, రెక్కల్ని నమ్ముకొని, రక్తమాంసాలను కరగబెట్టి బ్రతికిన బ్రతుకులు, అటువంటి మనుష్యుల్లో వున్న నిస్వార్థతను, గుండెను కరిగించే ప్రేమకు జీవం పోసిన కథ “బా ” జీవిత కథ. పేదరికం ప్రధాన స్రవంతి ప్రజల సమస్య మాత్రమే కాదు. అందరిదీ, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఎవరో రచయిత అన్నట్లు, పేదరికం ముస్లింలను కొంచెం ఎక్కువ సమానంగా ప్రేమిస్తుంది ఈ దేశంలో.

## III.2. ఖదీర్ బాబు పోలేరమ్మబండ కథలు

ఖదీర్‌బాబు కథల్లో సున్నితమైన వ్యంగ్యం దాగుంటుంది. కథలోని వస్తువు పట్ల, శిల్పం పట్ల, ప్రత్యేకమైన శ్రద్ధకనుపరుస్తాడు. ఇతని కథలోని సంఘటనలన్నీ మన జీవితాలలో జరిగినట్లు వాస్తవికంగా ఉంటాయి. ముస్లింల కథారచయితల్లో ప్రథమ శ్రేణిలో ఉండే ఖదీర్‌బాబు కథలను పరామర్శించడం వలన సమాజంలోని ఏ అంశాన్ని తన కథల్లో దృశ్యీకరించాడో అవగతం కాగలదు.

## III.2.A. బతికానురా తండ్రి కుమార స్వామీ

ఈ కథ బాల్యాన్ని గుర్తుచేస్తుంది. అయిదవ తరగతి చదువుకొని, మంచి స్కూల్లో, చదవాలనే కోర్కెతో వున్న బాలవిద్యార్థి తక్కువ మార్కులు వచ్చిన ఫీలింగ్ తో సతమతమవుతూ వుండి కుమారస్వామి అనే ఉపాధ్యాయుడు దగ్గరకు వెళ్లి, ఆయన అడిగిన ప్రశ్నకు సరిగ్గా సమాధానం చెప్పలేక, What is your Father ? అనే ప్రశ్నను అర్థంచేసుకొని సమాధానం చెప్పిన తీరు, స్కూల్లో సీటురావడం వలన కలిగిన ఆనందంతో ఉక్కిరిబిక్కిరి కావడంతో కథముగుస్తుంది. నెల్లూరు జిల్లా మాండలికంతో కథసాగుతుంది. బాల్యంలోని మధురస్మృతులను వెల్లడించడంలో కథ సఫలమైంది.

## III.2.B. ముక్కాలు, అపురేటు, బజ్జి బజ్జి

ఈ కథ పూర్వం రోజుల్లో పిల్లలు ముఖ్యంగా శ్రామికవర్గం నుంచి వచ్చే పిల్లలు టెస్టు పుస్తకాలను నోట్ పుస్తకాలను కొత్తవి కొనలేక పడే బాధను రచయిత రమ్యంగా చిత్రీకరించాడు. పుస్తకాలు కొనేటప్పుడు, నలగకుండా కొత్త పుస్తకాల్లా వుండాలి. ముప్పావురేటుకి, కొద్దిగా నలిగిన పుస్తకాలు సగం రేటుకి, బాగా చినిగిపోయి జీర్ణ వ్యవస్థలో ఉన్న పుస్తకాలు పావురేటుకి అమ్ముతూ వుంటారు. ఒక విద్యార్థి కొత్త పుస్తకాలు కొనలేక పాత పుస్తకాలను , నోటు పుస్తకాలను కొనలేక తన మిత్రుడి పాత నోటు పుస్తకాలలో రాయకుండా మిగతా కాగితాలను చించి నోటుపుస్తకాలను తయారు చేసుకొన్న విధానం, చదువుకోవడానికి ఒక పేదవిద్యార్థి ఎంతగా శ్రమించాలో పుస్తకాలను అమర్చుకొనే పద్ధతిని వివరించి రచయిత ఒక దయనీయమైన సన్నివేశాన్ని సున్నితంగా చెప్పడం వలన కథ ఆలోచింపజేసే విధంగా వుంది.

## III.2.C. మా దాదీమా వాళ్ల నానమ్మ నడుమ బామ్మ

రచయిత "మా నాయనమ్మకి ( దాదీమా) మూడు వస్తువులంటే ఇష్టము" అని కథ మొదలుపెడతారు. చదివే పాఠకుడి ఆ మూడు వస్తువులు ఎంత గొప్పవో అని చదివితే అవి చాలా సామాన్యమైనవి అవి ఆమె స్వహస్తాలతో కట్టుకొన్న "బొంత", అటకమీద పెట్టిన ఎర్రపూలట్రంకు పెట్టె, అంగడి దగ్గర నుంచి తెచ్చే పావలా ముక్కుపొడి పొట్లం. ఈ మూడు వస్తువులు వాస్తవంగా విలువలేనివి. అవి పాత కాలపు 'నాయనమ్మకు' ఇష్టపడేవి అనేసరికి ఆమె పేదరికం జ్ఞాపకం వస్తుంది ఎవరికైనా !

ఇంకొక బామ్మ ఉంటుంది. కథలో, స్టీలు గ్లాసు నిండా కాఫీ, ఆమె భర్తపిలవగానే వెళ్లి చేసే సేవ, మనవడు మురళి – ఆమె ఇష్టాలు.

ఇంకొక ముసలమ్మ రెడ్ల కుటుంబంలో ఉంటుంది. – ఆమె ఈ సాయిబుల పిల్లగాడిని లోపలికి రానివ్వదు. చాలా గంభీరంగా , జాగ్రత్తగా ఎప్పుడూ ముంగిటలోనే వుంటూ ఆస్తిపాస్తుల విషయంలో  అతిశ్రద్ధగా వుండి భర్త పోయినా పెద్ద సంసారాన్ని ఇంకా సంపన్న కుటుంబంగా మారుస్తుంది.  తన తెలివితేటలతో!

ఇక్కడ మూడుకుటుంబాలు, మూడు కులాలు, ఆకులాల్లోని ఆర్తికస్థితి గతులు కథలో ఛాయామాత్రంగా సూచిస్తూ, రచయిత ఒక పేద, మధ్య తరగతి, సంపన్న కుటుంబాల స్త్రీలను ముఖ్యంగా వృద్ధురాళ్లను తీసుకొని ఎక్కడా వాచ్యం కాకుండా ధ్వని ప్రాయంగా వ్యక్తుల వ్యక్తిత్వాలను వాళ్ల ఆర్ధిక పరిస్థితులు సంఘంలోని వారి స్థితిగతులు ఏ విధంగా ప్రభావితం చేస్తాయో దృశ్యీకరించాడు.

ఈ ముగ్గురు ముసలమ్మకు ముగ్గురు మనవళ్లు. ఆ ముగ్గ చుట్టూర తిరుగుతుంది కథ. వాళ్ల తార తమ్యాల ద్వారా ఏ వర్గాల వాళ్లు ఏవిధంగా ప్రవర్తిస్తారో తెలుస్తుంది. ఈ విధమైన బేధభావం సమాజంలో సహజంగా ఏర్పడటం వలన పసి మనసుల్లో ఏర్పడే ఒక న్యూనతా భావం జీవితాంతం వెంబడిస్తుందనే స్పృహ కలిగిస్తుంది.

## III.2.D. మంచుకన్న తెల్లనైన మనసులున్నదెవరికి

సహజంగా స్కూల్లో ఉపాధ్యాయుల, లెక్చరర్ల పిల్లలకి ఎంతో విలువుంటుంది. స్కూల్ ఏనవర్సరీ పంక్షన్లలో పాటలు పోటీ జరుగుతుంది. మంచి సాహిత్య రచనలను పాడిన 'ఐవోర్ల'  పిల్లలకు ప్రైజులోస్తాయి. 'ఐవోర్ల ' పిల్లలు గనుక వారికి బహుమతులు వచ్చినవని అనుకొంటారు. అయితే వాళ్ల తల్లిదండ్రులు చదువు కొన్నవారు గనుక వారు సుప్రసిద్ధకవుల గీతాలను ఎంపిక చేసి తమ పిల్లలతో పాడించి, మంచి ఇంప్రషన్ కలిగించి బహుమతులు పొందుతారు. ఎటువంటి విద్యాగంధం లేని కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలు ఈ విషయాన్ని గ్రహించి వీరుకూడా క్లాసికల్ పాటలు పాడి తరువాత సంవత్సరము బహుమతులు పొందుతారు. విద్యార్థి నేపథ్యాన్ని బట్టి అతని ఆలోచన ఉంటుందని తెలియజెప్పేకథ. విద్యార్థిలోని ప్రతిభను

గుర్తుపట్టి అతని యొక్క సాంస్కృతిక స్థాయిని పెంచి ఈ స్తటిక్ సెన్స్‌ని కలిగిస్తే, అది జీవితంలో ఉపయోగపడుతుందని వెల్లడించిన కథ!

## III.2.E. కంచంపొత్తు కందుల మాలకొండారావుతోటే...

ఇక్కడ కథ వెనుక బడిన వర్గాల ఇండ్లల్లో అన్నం తినే తంతు, బ్రాహ్మణ కుటుంబాలలో భోజనం చేసేపద్ధతి గురించి తేటతెల్లం చేసిన కథ.

ముస్లింల పిల్లగాడు, బ్రాహ్మణుల పిల్లగాడు, స్నేహితులు. అసలు శూద్రులకు , బ్రాహ్మణులకు తినే తిండిలో తేడా ఏవిధంగా వుంటుందో వారి మాటల్లోనే ! ముస్లిం పిల్లగాడు "మామా, నువ్వు అన్నం తింటావుంటే చూసే కోరిక తీరకుండానే చచ్చిపోతానేమోనని భయంగా వుంది మామా" (మహమ్మద్ ఖదీర్ బాబు, 2004, పుట,26) అని అడిగి చివరకు "అంతంత సేపు ఏమేమి తింటుంటావురా"? అని ప్రశ్నించి బ్రాహ్మణ స్నేహితుడి నుంచి వివరాలు సేకరిస్తాడు.

" పెట్టుకునేది ఎక్కువ , తినేది తక్కువరా నేను . ముందర ఒక ఆవకాయ గాని, ఒక పచ్చడి గాని వుంటుంది. అదయినాక ఒక తాళింపు వుంటుంది. తర్వాత ఒక తియ్యగూర, , రొంతపప్పు, రొంత సాంబారు, చివరకు నాలుగు గెరిటల రసం. చివరలో మజ్జిగ గాని, పెరుగు గాని.... లేచే ముందర ఒక అరటిపండుగాని సగం కోసి పెట్టిన జామకాయ గాని, ఇదిరా సింపులుగా మా లిస్టు" (పైదే) అని చెప్పి ముస్లిం మిత్రుడికి అనుమానం నివృత్తి చేస్తాడు. ముస్లిం మిత్రుడి ప్రతిస్పందన ఈ విధంగా వుంది.. "నాకు కడుపు కాలి పోయింది అది వింటే" "మావా ! ఈ వాటాన యిప్పటి దాకా నేను తిని వుంటే యీ పాటికి దారాసింగు అమ్మమొగిడిలా తయారయ్యుండే వాణ్ణిరా. మా అమ్మరెండు పూటలకు కలిపి ఒకే కూర చేసి ఇదే పచ్చడనుకో , ఇదేపప్పునుకో, ఇదే సాంబరనుకో, ఇదే మజ్జిగనుకో , ఇదే పరమాణ్ణం అనుకో.... అని చెప్పే జగజ్జంత్రి. (పైదే) "మా అమ్మ చేసింది కాదని, ఏది ఏమీ యిలా చేసినావు. అని ఒక్కముక్క అడిగే దానికి, మా నాయనకు గాని, మాకు గాని, దమ్ములు లేవు. పెట్టింది తిని లేవడమే తప్ప అన్నపూర్ణా హోటల్లో లాగా ఇంత లిస్టు మేము ఎప్పుడు ఎరగం మామా" (పైదే) అని అంటాడు. ఇది శూద్రుల ఇంటి పరిస్థితి.

ఇక్కడ రచయిత ఒక బ్రాహ్మణ కుటుంబం లోని భోజన పద్ధతులను , ముస్లిం కుటుంబములోని తిండి తినే పద్ధతులను ఒక చోట చేర్చడం వలన , ఒకే స్థాయిలో వున్న కుటుంబాలైనా, మొదటి నుంచి ఆచార వ్యవహారాలు , అలవాట్లు కంటిన్యూ అయి పోతూంటాయని, ఈ పద్ధతులు , భౌతిక మైనవి. మనిషి ఆలోచనను శాసిస్తాయని అందువలన ఏ కుటుంబమైనా మంచి పద్ధతులు ఎవరిలో వున్నా స్వీకరించాలని సూచించాడు. సున్నితంగా!

ఈ ముస్లిం, బ్రాహ్మణ పిల్లలిద్దరికి " ఒకరి ఇంట్లో ఇంకొకరు భోజనం చేయాలనే ఆశ వుంటుంది గాని " అది ఇండ్లల్లో వుండే కట్టుబాట్ల వలన అది దుర్లభమని గ్రహిస్తారు. "ఏనాటికైనా మాయింట్లో నువ్వు మీ యింట్లో నేనూ ఎప్పుడు పడితే అప్పుడు మెక్కే రోజులు రావాలిరా..." (పైదే) అని అనుకుంటారు. దీన్నిరచయిత సామాన్య మైన విషయంగా చెప్పినప్పటికీ, ఇందులో కులమతాల అడ్డుగోడలను కూల్చాలనే బలమైన సందేశం ఇమిడి వుంది.

అయితే ఈ ముస్లిం పిల్లగాడిని కందుల మాలకొండారావు అనే స్నేహితుడు భోజనానికి పిలిచి" భుక్తాయాసం వచ్చే దాక" తన ఇంట్లో భోజనం పెట్టి పంపిస్తాడు. ఈ సన్నివేశంతో ఎప్పటికైన మైనారిటీ , వెనుకబడిన వర్గాలు కలసిపోవడానికి, అవగతంచేసుకోవడానికి అవకాశం వుందనే సందేశాన్ని రచయిత యిస్తాడు. భోజనాలను 'మిషగా' కథకు భారం కాకుండా యిటువంటి ఆలోచనాధారను ప్రవహింపజేయడం ఖదీర్‌బాబుకు వెన్నతోపెట్టి విద్య.

బ్రాహ్మణ పిల్లగాడు ఇంట్లో చేసిన పిండి వంటకాలను దొంగతనంగా తెచ్చి స్నేహితులకు పెట్టడం,రెడ్ల పిల్లగాడు కూడా ఇంచుమించుగా అంతే ! ఇంకపోతే బలిజల కుర్రాడు, ముస్లిం కుర్రాడు మాత్రం కంచం పొత్తు వీలైనప్పుడంతా సాగుతూనే వుంది. బ్రాహ్మణ, రెడ్ల యిండ్లండ్లో భోజనం చేయాలనే కోరిక ముస్లిం కుర్రాడికి, వాళ్ళింట్లో ఎప్పుడో వీళ్లు పెద్దయిన తరువాత పెండ్లిలోనో సాధ్యమైంది. వాళ్ల భోజనాలు రుచిచూడాలనే కోరిక అలాగే మిగిలి పోయింది.

సామాజిక వివక్షత, మానవసంబంధాలు ఎంతకాలం వున్నా కులాలు మధ్య అలాగే నిలిచిపోతాయనే సత్యాన్ని ఈ కథా రచయిత దర్శించి, మనల్ని దర్శింపచేశాడు.

## III.2.F. గణగణ గంటలు మోగెను...

పరీక్షల్లో ముందు పిల్లల మానసిక ప్రవృత్తిని చక్కటి కథగా మలచారు.

" ఫేర్‌వెల్ పార్టీలో కొటేషన్లు అదుర్స్ '. కథలో పదవతరగతిలో వీడ్కోలు సభ జరుగుతుంది. ఆటో గ్రాఫులు ఒకరి కొకరు మంచి మాటలు వ్రాసుకుంటారు. ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులను ఎంత అభిమానంగా, తన పిల్లలను చూసుకున్నట్లు చూసుకుంటాడో, వారి భవిష్యత్తు పట్ల ఎంత జాగురూకుడిగా ఉంటాడో తెలియపరచే ఈ వాక్యాలు ప్రామాణికంగా నిలుస్తాయి.

"డియర్ స్టూడెంట్స్" "ఈ రోజు మీ జీవితములో మరుపురాని రోజు, హైస్కూలు చదువుతో, మన ఇశ్వోదయతో మీ అనుబంధం ముగిసి పోతావున్న రోజు, ఇంక మీరు ప్రిపరేషను హాలిడేస్ మీదపోబోతా ఉన్నారు. మధ్యలో హాల్‌టికెట్ల కోసం వచ్చినా, మార్కుల లిస్టు కోసం వొచ్చినా మనందరం కలుస్తామో లేదో మాట్లాడుకోబోతామో లేదో. అందుకనే ఈ రోజున హాయిగా మాట్లాడుకుందాం ఇంతకాలం మీరు మా దగ్గర ఉన్నారు. మేం మీకు పాటాలు చెప్పినం ఒకరు మెత్తగా చెప్పినాం, ఒకరు గట్టిగా చెప్పినాం, ఒకరు తిట్టినాం, ఒకరు కొట్టినాం, ఎవరు ఏంచేసినా మేమందరము మీ బాగుకోరే చేసినాం. తొందరపాటులో కోపాలలో ఒక్కోసారి మా వల్ల కూడా తప్పులు జరిగి వుండవచ్చు కానీ మేమెప్పుడూ మీకు పగవాళ్లం కాము. మీరు వృద్ధిలోకి వస్తే కడుపునిండా సంతోషపడేవాళ్లమే గానీ మీ నుంచి ఆశించే వాళ్లమూ కాదు రేపు మీరు ఇంజనీర్లయ్యి డాక్టర్లయి పెద్ద పెద్ద ఆఫీసర్లు అయినాక మమ్మల్ని, మీకు చదువు చెప్పిన ఇ స్కూలుని మరచిపోకండి. మేము ఎదురుపడినప్పుడు పక్కకి తొలగిపోకుండా – సార్, ఇదిగో నేను ఫలానా, మీరు అట్టా సాదటం వల్ల యిదిగో యిట్టా ప్రయోజకుణ్ణయ్యాను, అని చెబితే అదే మాకు లక్ష రూపాయలు, మీరు పెద్దోళ్లయి మా బుజాల పక్కన బుజాలు రాసుకుంటూ నిలబడినప్పుడు అదే మాకు నిజమైన సంతోషం." (మహమ్మద్ ఖదీర్‌బాబు, 2004, పుట,41)

ఒక నిజమైన నిజాయితీ గలిగిన ఉపాధ్యాయుని అంతరంగాన్ని రచయిత అవిష్కరించడం ద్వారా, విద్యార్థుల, ఉపాధ్యాయుల మన: ప్రవృత్తులను రచయిత బాల్యస్మృతుల్ని, హైస్కూలు రోజుల్లో తెలిసీ తెలియని వయస్సులో ఉండే స్నేహ మాధుర్యాన్ని కుటుంబాలలో వుండే హెచ్చు తగ్గుల్నీ, సమాజం, కులం మతం అనే తారతమ్యం లేకుండా పెరిగే బాల్యం యొక్క ఔన్నత్యాన్ని, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వుండే సున్నితమైన ఆత్మీయతను, తన కథల్లో దృశ్యీకరించి

తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా కథా సాహిత్యంలో తనదైన ముద్రను నిలిచిపోయే విధంగా వేసి, సహృదయ పాఠకుల మన్ననలను పొందాడని, తన రచనను మానవీయకోణం నుంచి సార్వజనీనం చేశాడని చెప్పడం సహజోక్తి మాత్రమే.

## III.3. దర్గామిట్ట కతలు

ఇది 'దర్గామిట్టకతలు' కథాసంపుటికి పీఠిక, ఇది కూడా ఒక కథలా వ్రాశాడు ఖదీర్‌బాబు. ఈ కథలకు పీఠిక వ్రాస్తూ ముళ్లపూడి వెంకటరమణ గారు ' ముబారక్ ' అనే ముందు మాట వ్రాస్తూ అన్న మాటలు పునశ్చరణ చేయాల్సిందే! " వేదంలా ప్రవహించే తెలుగు జీవనదిలో ముస్లిం జీవనస్రవంతి ఇంత కాలం అంతర్వాహినిగా కనపడకుండా ప్రవహిస్తూ వుండాలి. ఖదీర్‌బాబు దర్గామిట్ట కతలతో భగీరథుడిలా ఆ నదిని మనముందు మళ్లించాడు. ఈ నది నీటిలో ప్రతిబిందువు ఒక ఆణిముత్యం, మంచుని ఎగజిమ్మే అగ్ని పర్వతం " (ముళ్లపూడి,1999, పీఠిక) అని అన్నారు. ఈ దృక్కోణం నుంచి యీ కథలను పరిశీలించవలసిన ఆవశ్యకత వుంది.

మహమ్మద్ ఖదీర్‌బాబు, దర్గామిట్ట కతలు వ్రాయడానికి ప్రేరణ ' నామిని ' సినబ్బకతలు వగైరా ! ఈ కథలు పుట్టడానికి గల కారణాన్ని చక్కగా వివరించారు. ఖదీర్‌బాబు, అది కథరాయాలనుకొనే వర్ధమాన రచయితలకు మార్గదర్శకంగా ఉంటాయనడంలో ఆశ్చర్యం లేదు. యీ వాక్యాల్లో.. 'దావత్, జమీన్ కు (ఖదీర్‌బాబు కథలు) పడినట్టుగా యీడ కష్టపళ్లా యాతనపళ్లా. ఖైరతాబాదు ఫ్లై ఓవరు కింద నా రూములో కూచొని కావలిలోని మా అమ్మతట్టూ, నాయన ఊరుచుట్టూ ముస్లిం ప్రపంచం తట్టూ, మానవ జాతి తట్టు ఒక చూపు చూస్తే చాలు ఎమ్మట్నే కతపుట్టేది." (ఖదీర్‌బాబు, 1999, ముందుమాట)

ఇటువంటి చూపు కథా రచయితకు గాని కవికిగాని ఏర్పడితే కథ వ్రాయడం కాని కవిత వ్రాయటం కాని సులభ సాధ్యం ఔతుంది. అంటే రచయిత తన దృష్టిని సవరించుకొంటే విస్తరించుకుంటే స్రష్ట కావడం తేలిక అనేది ఈ రచయిత వాక్యాల సారాంశం. రచయిత కుటుంబ సంబంధాలను, తన జాతిజనుల దీనగాథలను, మానవజాతి పడే కష్టసుఖాలవైపు తన దృష్టి పారిందని, అందువల్లనే అది పుష్టివంతమైనదనే భావనను పై వాక్యల్లో కలిగించాడు.

దర్గామిట్ట కతలు సంపుటిలో మొత్తం ఇరవైదు కథలున్నాయి. ప్రతి కథలో రచయిత చెప్పిన విషయాలను పరామర్శించినప్పుడు , రచయిత దృక్పథంలోని సామాజిక అంశాలు ఏవిధంగా ప్రతిబింబింప చేసినదీ స్పష్టపరచడం, యీ విశ్లేషణ యొక్క ఆంతర్యం. ఈ కథలు సమాజ సంస్కృతి యొక్క ప్రతి ఫలనం యీ కథల్లో వ్యక్తమయిన తీరు గమనార్హం.

## III.3.A. నా పేరు పెట్టింది మీసాల సుబ్బరాజు

ఈ కథలో రచయితకు చిన్నప్పుడు పేరు పెట్టడంలో జరిగిన "తంటా'ని చక్కగా విశదీకరించారు. ఖదీర్ బాబుకు వాళ్ల నానమ్మపెట్టిన పేరు ఖదీర్ మొహమ్మద్ – పేర్లు హిందువులు కూడా పలకడానికి సులభంగా ఉండాలనే ఆయన ఉద్దేశ్యానికి విరుద్ధంగా ఖరీద్‌బాబు నాయనమ్మ యీ పేరు పెడుతుంది. ఇంట్లో పెద్దరచ్చ. స్కూలులో పేరు వ్రాయడానికి వెళ్లినప్పుడు తండ్రి స్నేహితుడు 'ఖదీర్ బాబు' అని వ్రాయడంతో, ఖదీర్‌బాబు తండ్రికి మనశ్శాంతి కలుగుతుంది.

ఖదీర్ అనే పదాన్ని ఏవిధంగా పలకాలో రచయిత చెప్పిన తీరు హృదయంగమంగా వుంది."వాస్తవానికి మా నాయిన బాదంతా నాకు పేరు పెట్టినందుకు గాదు, యిట్టాంటి నోరు తిరగని పేరు పెట్టినందుకు. ఖదీర్‌లో 'ఖ' ని 'ఖ' అనకూడదు. 'క' అనకూడదు. గొంతులో నీళ్లుపోసుకొని గరగరవాడిస్తాయే– అట్లా అంటా 'ఖ' అని పలకాలా ( ఎట్టాచెప్పేదిరా మౌలా) అని తానే విధంగా ఉఛ్చారణను చేయాలో అక్షరాలలో పెట్టలేక 'హాస్యరసాన్ని' ఒలికిస్తాడు ఖదీర్ బాబు. ఇది 'అల్లా' కు వున్న పేర్లలో ఒకటి అరబ్బీ నుంచి వచ్చిన పదం గనుక ఖదీర్‌బాబు ననుసరించి 'ఖ + గ' గా ఉచ్చరిస్తే సరిపోతుంది. ఉర్దూ ఉచ్చారణలో శబ్ద ధ్వని కొంత తమిళ శబ్దాల ధ్వనిని పోలివుంటుంది. భాష యొక్క అభివృద్ధి వివిధ భాషల మధ్య వుండే సారూప్యత విశిష్టమైన అంశం.

## III.3.B. అలీఫ్, బే,తే మా నాయినమ్మకు గోరీకడితే

అలీఫ్, బే, తే, ఉర్దూపదాలు కలిపి మా నాయనమ్మకు గోరికడితే అని పిలగాండ్లు ఉర్దూబాధపడలేక తమాషాగా అనుకున్న మాట రచయిత చేతిలో ఒక కథగా రూపు దాల్చింది.

ఖదీర్ ఇంట్లో వాళ్ల నాయినమ్మకు తప్ప ఎవ్వరికీ ఉర్దూ రాదు. నమాజులు, ఖురాన్ చదవటం రాదు. వాళ్ల యింటి దగ్గరకు ఒక ఉర్దూ పండితుడు వస్తాడు. అతని దగ్గర ట్యూషన్‌కి

పిల్లలనందరినీ పంపాలని ఖదీర్‌నాయనమ్మ చుట్టు ప్రక్కల ఇళ్లల్లో పిల్లలనందరినీ జమచేసే ప్రయత్నం చేస్తుంది. ఆ ప్రయత్నం పిల్లలకు తెలిసిపోయి ఈ 'ఉర్దూ' బాధ నుంచి ఎలా తప్పించుకోవాలో ప్రయత్నించి వేరే పనికిరాని, సరిగ్గాచెప్పని 'ట్యుటోరియల్ 'లో చేరాలని పెద్ద వాళ్లను ఒప్పించి 'ఉర్దూ' బాధ నుంచి తప్పుకుంటారు.

ఒక ప్రక్క ఇంగ్లీషు బాధ, ఇంకొక ప్రక్క తెలుగు బాధ అదనంగా యీ ఉరుదూ బాధ. ఈ బాధనుంచి తప్పించుకున్న రచయిత యీ విధంగా అనుకోవడం సమంజసంగా వుంది రచయిత మాటల్లో' ఆ తర్వాత ఇప్పటి వరకు కూడా ఉర్దూ నేర్చుకోలేదని గానీ, అరబీ రాదని గానీ, తెలుగులో తప్పితే ఆ భాషల్లోని ఖురానుని తాకను గూడా తాక లేదని గానీ నేను యింతంటే యింత గూడా బాధపళ్లా " అని అంటూ హైదరాబాద్ వచ్చిన తరువాత మిత్రుల ద్వారా విని సాయిబై వుండి ఫయాజ్ అహమ్మద్, జిలాని, సిరాజుద్దీన్‌మకాం" లాంటి ఉత్తమ కవుల రచనలు చదవ లేక పోయాననే బాధ కలిగి, నిజంగా నాయినమ్మకు గోరీ కట్టాలని పిస్తుంది. బ్రతిమాలాడో బుజ్జగించో, బెదిరించే ఉర్దూ భాషను నేర్పించనందుకు ! అవును మరి చదువుకోవడానికి మళ్లీ మళ్లీ అవకాశాలు రావు గదా!. ఇక్కడ రచయిత తన గురించి ఒక మాటను తేలిగ్గా చెప్పినట్లని పించినా, 'ఖురాన్' ను తాకను గూడా తాకలేదు. అని అనడం ఒక ముస్లిం రచయితగా ఒక గొప్ప సాహస విషయం తనకు మత దృక్పధం లేదని నిర్ధారించినట్లయింది. ఇందువలన ఖదీర్‌బాబు ఒక ప్రగతిశీల వాద దృక్పధం కలిగిన రచయితఅని అవగతం ఔతుంది.

## III.3.C. మా యిస్కూలు యానివర్సిరీకి దుమ్ము లేపేసినా

హైస్కూలు స్థాయిలో తరగతి గదుల్లో 'మొద్దబ్బాయిలను' ఏ విధంగా చూస్తారో, అందరికి తెలిసిందే. వాళ్లకి గూడ తమ ప్రతాపం (ప్రతిభలాంటిది) అనేక సందర్భాల్లో చూపించాలని అనిపిస్తుంది గాని, అటువంటి అవకాశాలు రావు. అయితే అటువంటి అవకాశాన్ని అంది పుచ్చుకొని తన ప్రతాపాన్ని చూపిన విద్యార్థి కథయిది. అదే స్కూలు యానివర్శీలో ఈ కథలో వాడిన మాండలికంలోని రమ్యత, కథలోని వ్యంగ్యోక్తులు హాస్యాన్ని పుట్టించేవయినా ఒక విషాద హృదయం ఈ కథలో కనిపిస్తుంది. అదే రచయిత పేదరికం. ఆపేదరికాన్ని కూడా క్యాజువల్‌గా చెప్పిన తీరు యీవిధంగా వుంది.

“మడతలు పడిపోయి – నల్లంగా మాసిపోయిన యూనిఫారమ్ వేసుకొస్తానని (మూడు నెల్లుపంతం పట్టినా రెండు జతల యూనీఫారమ్ కుట్టించలేక పోయిన మా నాయిన్ను ఏంచేసినా పాపంలా) చెడ్డీలు వెనకతట్టు చిరిగిపోతే లోపల్నించి పిన్నీసులు పెట్టు కుంటాననీ (కుట్టడానికి దారం దొర్కపోతే టెంపరరీగా మా నాయినమ్మ చేసేదట్ట) వాళ్లందరికీ బలే చిన్న చూపు. (మహమ్మద్ ఖదీర్ బాబు, 1999, పుట,25) హోమ్ వర్కు చేయక, క్యారేజీ రెడీకాక (రెడీగాకాపాడా! వండక) ఇస్కూలు ఎగనూకి నందుకు ‘ బడికి రాని మొద్దు – చదువురాని ఎద్దు ‘ అని ఏడిపిస్తా వుండేవాళ్లు నన్ను (పైదే)

పేద కుటుంబాల నుంచి రావడం ఒక్క ఎత్తయితే ఇతర మతాలు, ముస్లిం, క్రైస్తవాల నుంచి వచ్చే వారికి, ఈ చదువెందుకురా బాబు! అనిపిస్తుంది. ఏదైనా పనిచూసుకొని పొట్ట గడుపుకొంటే బ్రతక లేమా? అనే ప్రశ్న తలయెత్తి, అర్థికభారానికి, దళిత, మైనారిటీ వర్గాలలో నుంచి వచ్చిన విద్యార్థులను ఏ విధంగా వివక్షతతో చూసే విధానం వలన ఎంత మంది ప్రతిభావంతులైన పిల్లలు భవిష్యత్తు భంగపడిందో యీ కథలో సూచ్యమైనది.

ఈ కథలోని రమాదేవి టీచరు మాటలు చూడండి. “ నీకు తెలుగేమి వచ్చురా ‘ నీకీనాకీ’ మాకీమీకీ ముండా ? ఇస్కులికి సరిగా రారానాయినా అంటే రాడుగానీ అయ్యకి డ్రామాలు కావల్సోచ్చినవా ” (పుట, 24) ఇట్లాసూటి పోటీ మాటలు – పంతుళ్లయితే ఈ వెనుకబడిన విద్యార్థులపై బడి ‘ పిడిగుద్దులే’! ఈ ధాటికి వాడు ఇంచుమించుగా బడిదొంగవుతాడు – ఈ కథలో అవకాశం ఇస్తే ‘ మొద్దబ్బాయి’ లైనా తమకు ఇష్టమైన రంగంలో రాణించగల ప్రతిభను చాటతారని సందేశం ఇవ్వడం కూడా జరిగింది.

## III.3.D. కసాబ్‌గల్లీలో సేమ్యాల ముగ్గు

రంజాన్ నెల + సంబరాలు వెరసి యీ కథ రంజాన్ నెలలో కసాబ్ గల్లీలో సందడి. సేమ్యాలు పెట్టడానికి మిషిను దొరక్కపోతే చేతితో ముగ్గురాళ్లు సేమ్యాలు చేస్తారు. ఎంతలేమిలోనైన ఆనందంగా జీవించవచ్చునే ‘ ధ్వని’ యీ కథలో ప్రతిధ్వనిస్తుంది.

“పొగలు కక్కేపొయ్యిలెదురుగా కూచొని ‘ సహర్’ వంట చేస్తానే కొందరు ఆడోళ్లు వాళ్లమొగోళ్లతో ‘కుదవబెట్టిన కమ్మలు యీ పండక్కిఅయినా విడిపించరాదా’ అనో పిలకాయలకు

బుష్ కోట్లు కుట్టిస్తానన్నావ్, అదయినా వుందాలేదా' అనో డిమాండింగులు చేస్తావుండేవాళ్లు". (పుట, 32) ఈ మాటల్లో వాళ్లజీవితాలు ఏవిధంగా సాగుతుంటాయో సూచించబడుతున్నాయి. అయితే ఆనందంగా ఉండటానికి సంతృప్తి ప్రధానంగా నిసంపద ప్రధానం కాదనే సంకేతార్థం యీ కథలో వుంది. పండగ రోజులకు కొంచెం ముందుగా, కమ్మలు, కడియాలు, బిందెలు లాంటివి తాకట్టులో వుంటే అవి విడిపించుకోవడం, సేమ్యాలు చేసుకోవడం, వున్నంతలో కొత్త బట్టలు కుట్టించుకోవడం లాంటివి చేయడంతో పేద ముస్లిం కుటుంబాలు పండగకు తయారయ్యే పద్ధతి ఒక అనందకర సన్నివేశాల సమాహారంగా వుంటుందని రచయిత సూచించడం ఇస్లాం సంస్కృతిలో ఆనందంగా జీవించే ప్రక్రియ ఒక అంశంగా మనకు గోచరిస్తుంది.

## III.3.E. పండగపూట పలావు ముక్కల కత

ఏదో పిసినారితనం ఉన్న కుటుంబాలలో తప్పితే పండగపూట నలుగురికి పెట్టాలనే తపన ఇది వరకు రోజుల్లో వుండేది. అదే విధంగా కరీం సాయిబు, పండుగ సందర్భంలో, భార్యా, తల్లి కష్టపడి చేసిన పలావుని, వాళ్లు తినకముందే, పనినేర్పి తనను నిలబెట్టిన రవికి, పలావు కేరేజి, ఇంకా వాళ్లింట్లో వాళ్లు వచ్చారని, వెంకారెడ్డి ఇంటికని క్యారేజీలు తీసుకెళితే, చివరకి ఆడవాళ్లకి తినడానికి ఏమీ మిగలదు. " తన్ను మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం" అనే సూక్తి జ్ఞాపకం వస్తుంది. పండగ రోజు గూడా ఇంట్లో ఆడవాళ్లకి సుఖంగా ఉండనీయరు కడుపునిండా తిండితిననీయరు కొంత మంది ' మగమహారాజులని' రచయిత చెప్పక చెప్పినట్లయింది. అయితే మనిషిలోని ఉదారత్వం, స్నేహం లాంటివి తనకున్నదీ లేనిదీ పట్టించుకొనే స్థితిలో వుండదు. ఇది గొప్పతనమనాలో, అమాయకత్వమనాలో తెలియదు.

## III.3.F. చీదలు పంజారాలు మాగలు కండసుదుములు

ముస్లిం కుటుంబాలలో 'నీసు'(మాంసాహారం) కు ఇచ్చే ప్రాముఖ్యత ఈ కథలో వుంది. ఈ కథలో పెద్ద విశేషం ఏమీలేదు. అసలు నీసు 'శూద్ర కుటుంబాలలో ఖర్చుకి దారితీసి, పేదరికాన్ని దాటకపోవడానికి కారణమని కొందరనడం కొంత నిజమైనప్పటికీ తరతరాలు అలవాట్లు మారతాయా ! అయితే శరీరం త్వరగా రోగగ్రస్తం కాకుండా వుండాలంటే శాఖాహారం ఎంతో మేలయినది. అయితే మొదటి నుంచి మాంసాహార కుటుంబాలు యీ అలవాట్లను మానుకోలేక పోతున్నవి. ముస్లిం కుటుంబాలు మాంసాహారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఈ విధంగా మాంసాహారం తినడం వాళ్ల సంస్కృతిలో ఒక భాగం.

## III.3.G. ఇది మా నాయి నిచ్చిన ఆస్తి -

కథ ఈ విధంగా మొదలవుతుంది. “ చీకటిలో నిద్రలేచే పనికంటే ఇంకో నామర్ధాపని మా ఇంట్లో మేమెరగం” – ఇదీ కథవస్తువు. తండ్రి పిల్లల్ని పొద్దున్నే నిద్రలేవగొట్టనిచ్చే వాడుకాదు. ఇదే అలవాటు కొనసాగుతుంది. నిద్రప్రొద్దున్నే లేవలేక పోవడము ఒక బలహీనత క్రింద లెక్కయినా రాత్రింబవళ్లు కష్టపడే కుటుంబాలలో ఆ మాత్రం ఉదయం రిలీఫ్ అవసరమని పిస్తుంది. ఇది తండ్రి నుంచి సంక్రమిస్తుంది. కొడుక్కి. కథ పేరు వినగానే తండ్రి ఏమి ఆస్తి ఇచ్చివుంటాడా కొడుక్కి అని ఆసక్తి చదివితే, ఆశ్చర్యం కలిగించే విధంగా ‘ నిద్ర ‘ అని తేలుస్తాడు రచయిత. పొద్దున్నే నిద్ర లేవలేకపోవడంతో ఎన్ని విధాలుగా నష్టపోయిందీ రచయిత స్పష్టపరచాడు. అనువంశికంగా వచ్చే అలవాట్లు ప్రభావితం చేసి మనిషి జీవితంలోని చోదకశక్తిని హరించి వేస్తుందని రచయిత సూచించాడు. పని సంస్కృతిని పాడుచేసే అలవాటు మంచిది కాదనే సంకేతం కథలో వినిపిస్తుంది.

## III.3.H. నేరేళ్ల మస్తాన్ సురేష్ నాదేవుడు....

నేరేళ్ల మస్తాన్ సురేష్ నాదేవుడన్నాడంటే, ఎవరో పెద్దమనిషి అనుకుంటాం గాని, రచయిత సహవిద్యార్థియే! ఇద్దరూ చదువులో మొద్దులేగాని ఈ సురేష్ మరీ మొద్దు పరీక్షల్లో చూపించినందుకు శెట్టిగారబ్బాయి, ప్రశ్నకింతని యిచ్చేవాడు. వాటితో రచయిత జల్సా చేసేవాడు – ఒకసారి వీళ్లనాన్న యాభై రూపాయలిస్తే అవి మధ్యలో పోతాయి. వీళ్లంటిలో పస్తులుండ కుండా, ఆ యాభై రూపాయలు శెట్టి కొడుకు సురేష్ ఇచ్చి వచ్చే ప్రమాదాన్ని తప్పిస్తాడు. విద్యార్థి దశలో వుండే సహకారము ఒకరిపట్ల ఇంకొకరికి వుండే అభిమానం, కృతజ్ఞత తెలిపే కథ.

ఖదీర్‌బాబు కథలన్ని వస్తుభారం లేకుండా, తేలిగ్గా అర్థం ఔతూ సామాజిక స్పృహను కలిగి కథా లక్షణాలను పుణికి పుచ్చుకొని వుంటాయి.

మహమ్మద్ ఖదీర్ బాబు “ పోలేరమ్మ బండ’ కతలు, దర్గామిట్టకతలు ముస్లిం తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని పొందాయి. ఈ కథలు ఇరవైఅయిదు పోలేరమ్మబండ కథా సంపుటిలోనూ, ఇరవై అయిదు ‘దర్గా మిట్టకతలు’ లోనూ ఉన్నవి. ఈ కథలన్నీ చదివిన తరువాత మహమ్మద్ ఖదీర్ బాబు సాహితీ వ్యక్తిత్వం ఏమిటో అభివ్యక్త మౌతుంది.

ఖదీరుబాబు కథల్లో సీరియస్‌గా సమాజాన్ని బాగుచేద్దామనో, ముస్లిం జీవితాల్లో కష్ట సుఖాలని బయట పెట్టి పేరు ప్రఖ్యాతులు సంపాయిద్దామనో కాంక్ష ఉండదు. హాయిగా చదువుకొని ఆనందిద్దామనుకొంటే కుదరదు. ఆ కథలను చదివి ఆలోచించకుండా ఉండలేము. సీరియస్‌నెస్ లేకుండా కథలల్లి వాటిని గురించి ఆలోచింపజేస్తాడు ఖదీర్‌బాబు. సామాజిక సంబంధాలు వివిధ వర్గాల వారి మధ్య ఏవిధంగా ఉన్నయో, వివిధ కులాల మధ్య స్నేహ సంబంధాలు ఏవిధంగా ఉన్నయో, అవి పసితనాన్ని ఏవిధంగా ప్రభావితం చేస్తాయో, తేట తెల్లం చేస్తాయి ఖదీర్‌బాబు కథలు, వస్తు, శిల్పాల దృష్టినుంచి చూసినప్పుడు కూడా ఖదీర్‌బాబు ' గొప్పకథకుడని' మనకు సులభ గ్రాహ్యంమౌతుంది.

ఖదీర్‌బాబు కథలకు పేరు పెట్టడంతోనే ఒక వైచిత్రి వ్యక్తమౌతుంది. ఒక వ్యంగ్య స్ఫూర్తి కలుగుతుంది. ఉదాహరణకు బతికానురా తండ్రీ కుమారస్వామీ, ముక్కాలు ఆఫ్‌రేటు, బజ్జీబజ్జీ, ముక్కులందు పుణ్య ముక్కులు వేరయా, దట్ ఈజ్ పాము ఆటరా ! – ఈ కథల పేర్లు పాఠకుడిని వెంటనే కథలోకి తీసుకుపోతాయి. కథను చదివించే నేర్పు రచయితలో పుష్కలంగా వుంది.

ఖదీర్‌బాబు కథలన్నీ అతని బాల్యం చుట్టూ, అతని కుటుంబం చుట్టూ, తన ఊరుచుట్టూ పరిభ్రమించాయి. అందువల్ల కథల్లో వాస్తవికత ప్రతి వాక్యంలోనూ, ప్రతి సన్నివేశంలోనూ ప్రతిఫలిస్తూ ఉంటుంది. ఇందువలన ఒక కథకుడు, దార్శనికుడి మాదిరిగా సమాజాన్ని దర్శించిన తీరు వ్యక్తమౌతుంది. ఖదీర్‌బాబు దర్శనంలో కట్టుబాట్లు, ఆచారవ్యవహారాలు, కుల మతాల మధ్య ఉన్న అడ్డుగోడలు, మానవ సంబంధాలు పరిమళం, బాల్యస్నేహాల సురభిళం వ్యక్తమౌతాయి. ఈ కథలన్నింటినీ ఈ అధ్యాయంలో స్థూలంగా పరిచయం చేసి చర్చించబడినవి.

## III.4. ఖదీర్‌బాబు "ఢాకన్"

మహమ్మద్ ఖదీర్ బాబు వ్రాసిన ఇంకొక పెద్దకథ 'డాకన్' అనేది! ముస్లింలు గిన్నెలపై పెట్టే మూతలను 'ఢాకన్' అంటారు. ఈ కథ ముస్లిం జీవితాలలోని విషాదాన్ని ఎగజిమ్మింది. ఎంత 'పరదా' చాటున భద్రత వుందనిపించినా, సమాజ జీవితంలోని విషాదం కుటుంబాన్ని మింగివేస్తుంది. ఒక ముస్లిం కుటుంబం తాము చేయని తప్పులకు, కేవలం మైనారిటీ అన్న కారణంగా ఏవిధంగా బలైపోయిందీ ఖదీర్‌బాబు విషాదాంతంగా మలచాడు.

అల్లర్లు , నిరసనలు, దహనాలు
మనుషులు పారిపోయిన వీధులు
మూతబడ్డ దుకాన్‌లు, మృతదేహాలు
మందిర్ - మస్జిత్
రామ్ జన్మభూమి

ఎవరో ఎక్కడో అన్నమాట శుక్రవారం పూట మక్కా మసీదు దగ్గర భాస్వరమై మండేది. (ఖదీర్‌బాబు, 2004, పుట 12) ఇటువంటి మంటల్లో కాలి పోయిన " ముస్లిం కుటుంబం యొక్క రూపమే ఈ 'ధాకన్' కథ. 2004 లో ప్రచురించబడిన 'ధాకన్' కథ సమకాలీన వాస్తవాన్ని ప్రతిబింబించిన కథగా ముస్లిం రచయితలు సృజించిన తెలుగు సాహిత్యంలో వెలుగులీనుతుంది.

ఈ కథను గురించి యీ అధ్యాయంలో కథలను పరిశీలించే క్రమంలో మరలా ప్రస్తావించడం జరుగుతుంది. ఉత్తమ కవితను గాని, ఉత్తమ సాహిత్యానికి సంబంధించిన ఏ అంశము గాని పరిశీలించడంలో పునరుక్తి అనే సమస్యరాదు.

పలువురు ముస్లిం కథకులక కథనాలను ఒకేచోట చేర్చిన కథల సంపుటి "వతన్". స్కైబాబా యీ ప్రసిద్ధ కథా సంపుటికి పీఠిక వ్రాస్తూ ఇవి కహానీలు కావు. జిందగీలు అనడం సమంజసంగా వుంది. ఆయన ఈ విధంగా ఉన్నారు. "ముస్లింలు ముస్లింలుగా మాట్లాడటం ముందు కవిత్వంలో జరిగింది. ప్రస్తుతం కథల్లో ఇంకా విస్తృతంగా జరుగుతున్నది. అందుకు యీ సంకలనమే నిదర్శనం. ఈ సంకలనం నిండా ముస్లిం జీవితాలు ఎదలోతుల్ని స్పృశిస్తాయి. ప్రస్తుత అస్తిత్వం ఉద్యమాల నేపథ్యం - ఎవరి జీవితాన్ని ఎవరి అను భవాన్ని వాళ్లే మాట్లాడే చైతన్యాన్ని ప్రేరణను కలిగించింది. అందువలన వాళ్ళ జీవితంలో సంఘటనలే జీవితమే కతలుకతలుగా రాయడానికి వస్తువైంది. అంతే కాక ముస్లింల వరకు వచ్చే సరికి తెలుగు సాహిత్యంలో ముస్లింల నుండి ముస్లింల జీవితాన్ని చిత్రీకరించిన వాళ్లు లేరు. ఈ కారణంగా ఈ కథకులు రాసిన సబ్జెక్టు ఎవరూ స్పృశించకుండా మిగిలేవుంది. దాంతో వీళ్లంతా కల్పనలకు, ఊహలకు పోకుండానే తమ జీవితాల్నే ఇలా కథలుగా మలచడం నాణ్యమైంది." (స్కైబాబా, (సం.) 2002-2004, పీఠిక)

ఈ విశ్లేషణలో కొన్ని కొత్త విషయాలు బహిర్గతమైనవి.

1. తెలుగు సాహిత్యంలో ఎందరో మహామహులైన కథకులు బుచ్చిబాబు, చలం, గోపీచంద్, కొడవటి గంటి, చాసో, రా.వి.శాస్త్రి బీనాదేవి, లత లాంటి అనేక మంది రచయితలు/రచయిత్రులు తమ కథలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసినప్పటికి వీరు సమాజంలో భాగస్వామ్యులైన " ముస్లిం" ల జీవితాలను చిత్రీకరించడంలో శ్రద్ధచూపలేదు. అందుకు కారణం వారికి ముస్లిం జీవితాలను గురించి, ఆచార వ్యవహారాల గురించి, వారి కష్ట సుఖాలను గురించి వారి, సంస్కృతిని గురించి పూర్తిగా తెలియకపోవడమే అక్కడక్కడా కొన్నిచోట్ల ముస్లిం పాత్రలు సాహిత్యంలో ప్రవేశించినా అవి రేఖచిత్రాలే!

2. పైన పేర్కొనబడిన కారణంగా ముస్లిం జీవితాలు. సమాజం ఒకానొక చీకటి గుహలో బంధించబడి ఉన్నట్లు వెలుగులోనికి రావడం జరగలేదు.

3. అందువలన, ముస్లింల సంస్కృతిని గురించి ఆ కమ్యునిటీ నుంచి వచ్చిన ముస్లిం రచయితల వలన, వారి జీవితాలలోని వెలుగు చీకటులు మిగతా సమాజానికి అవగతం అయినవి.

ఇటువంటి పంథాలో సాగిన 'పటిక' కథ గురించి ఖాజా గారు చెప్పిన విషయాలను ఇక్కడ ఉటంకించడం సమంజసంగా వుంటుంది.

"ముస్లిం రాయడం మొదలు పెట్టాక తెలుగు కవిత్వానికి, కథకు కొత్త సంస్కృతి, కొత్త భాష, కొత్త పదాలు ఎన్నో పరిచయ మయ్యాయి. నిజానికి తెలుగు భాషలోనే బ్రాహ్మణీయ పదాలు, అగ్రహార వాక్యాలు తప్ప నిజ జీవితాల్లోని పదాలు సాహిత్యంలోకి రావడం తక్కువే. దళిత, స్త్రీ వాదాల తరువాత భాషపరిధి కొంత మేరకు పెరిగింది. అది ముస్లిం వాదం వచ్చాక ఒక కొత్త రుపాన్ని తీసుకుంది. ముస్లింల కథల్లో అనేక ఉర్దూ పదాలు, ఉర్దూటచ్ వున్న తెలుగు పదాలు కనిపిస్తాయి. ముఖ్యంగా తెలంగాణ ముస్లింలు రాసిన కథల్లో ముస్లింల - జీవితం - సంస్కృతి తో పాటు తెలంగాణ, హిందూ ముస్లింల రోజువారి జీవితంలో ఉపయోగించే చాలా పదాలు సాహిత్య ప్రపంచానికి పరిచయం అయ్యాయి. దీని వల్ల తెలుగు సాహిత్యం కొత్త గౌరవానికి (వాల్యు అడిషన్) నోచుకుంది." (ఖాజా, 2002-2004, పుట, )

ముస్లిం కథా సంస్కృతి సాహిత్యంలో తెచ్చిన మార్పులను ఖాజా విశ్లేషించిన విధానం చాలా వాస్తవికంగా ఉంది. తెలుగు సాహిత్యంలో నిమ్న కులాలకు సంబంధించిన సాహిత్యం ప్రవేశించడంవలన , తెలుగు సాహిత్యం భ్రష్టుపట్టి పోయిందని భావించే కొందరు సాహితీవేత్తలకు, కవులకు ఈ విశ్లేషణ కళ్ళు తెరిపించేదిగా వుందనడంలో అత్యుక్తిలేదు.

' కథ ' కవిత, నాటకం, లాంటి ఏ సాహితీ ప్రక్రియ అయినా సామాజిక స్పృహ కలిగి ఉండాలనే నియమం పాతుకొని పోయి, ఒక నిర్ధుష్ట సూత్రంగా రూపొందింది. సమాజ జీవితాన్ని ప్రతిబింబించని కళ నిరుపయోగమనే దశకు సాహితీ విమర్శకులు, కళాసమీక్షకులకు చేరుకున్నారనడం అతిశయోక్తికాదు. కళ కళ కోసమే, కళ సమాజం కోసం అనే రెండు వాదాలు చిరకాలం నుంచి సంఘర్షించుకొని, ఈ రెండు పదాలు తమ తమ మార్గాల్లోపయనిస్తున్నాయి. కళకళ కోసమే అనే వాదన కొంత విడిపోయినట్లు కనిపించినా పూర్తిగా అస్తిత్వాన్ని కోల్పోలేదు. కళసమాజం కోసమే ననే వాదన సాహితీపరంగా, కళా రంగాన్ని పూర్తిగా ఆక్రమించుకొన్నట్లు అనిపించినా అదివాస్తవం కాదు. ఈ రెండు వాదాలు సహజీవనం చేస్తున్నాయి సాహితీరంగంలో..

ముస్లిం కథారచయితల్లో ఈ రెండు కళా సిద్ధాంతాలకు లేక అభిప్రాయలకు అద్దం పట్టిన రచనలు ఉన్నాయి. ఆయా కథలను ఈ అధ్యాయంలో సంక్షిప్తంగా స్థూల విశ్లేషణ చేయడం జరిగింది. ఇంకా కొంత వివరణ అవసరంగా వస్తువు కోరుతుంది.

ముస్లిం రచయితల్లో మహమద్ ఖదీర్ బాబు తన ' దాదీమా' చెప్పిన కథలను "పుప్పూజాన్ కథలు " గా ప్రచురించారు. ఇందువలన మనకు రచయిత విన్నవి కన్నవి " శిల్పీకరించి" కథలు కూర్చడం, చెప్పడం అనాది కాలం నుంచి ఆధునిక కాలం వరకు ఒక అనుస్యూత సంప్రదాయంగా సాగుతుందని తెలుస్తుంది.

కొంతమంది ముస్లిం కథారచయితలు ఇంటిలో జరిగిన విషయాలను సంఘటనలను, పెద్దలకు ఉన్న అనుబంధాలను సైతం "వస్తువుగా" స్వీకరించి కథా నిర్మాణం చేయడం జరిగింది. ' కాదేది కథకనర్హం' అని మార్చుకోనేటట్లు కథా సాహిత్యం విస్తృతమైంది.

ఇకపోతే మచ్చుకి "రహమతుల్లా కథలు" ముఖ్యమైనవి. కవిగాని కథకుడు గాని, వస్తువు కోసం ఎక్కడో వెదకకుండా తన అనుభవాలు వేసిన "మనోముద్రలు" నుంచి వస్తుశ్రద్ధను పెట్టి

శిల్పీకరించడానికి అనువైన సంఘటనలను స్వీకరిస్తే ఆ కవిత గాని, కథగాని సజీవంగా ఉంటుందని నిస్సంశయంగా భావించవచ్చును. ముస్లిం వర్గ ప్రజల దుర్భర జీవితాన్ని, తన కుటుంబం యొక్క నేపథ్యాన్నుంచి, మొత్తం పీడిత ముస్లింల వ్యథల నుంచి, యెదల నుంచి కథలను పండించారు. రహమతుల్లా! ఈ సందర్భంగా "జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత" విష్ణునామన శిరవాడ్కర్ సాహిత్యం గురించి చెప్పిన మాటలు  రహమతుల్లా " బా " కథల్లో చూపిన అభివ్యక్తికి, రచనా పరంగా రహమతుల్లా సాధించిన ప్రగతి శీలదృక్పధానికి తార్కాణంగా పరిగణనలోకి తీసుకోవచ్చును. ఆయనంటారు. " కవిత్వరచనగాని, మరేవిధమైన సాహిత్య సృజన కానీ నది ఉద్భవం లాంటి ఒక నైసర్గిక, నిరపేక్షఘటన, కాని నది ఎప్పుడు ఉద్భవించిన చోట ఆగిపోదు. ఆగిపోతే అది నది అనిపించుకోదు. కవిత్వధార లేక సాహిత్య సృజన కూడా తన ఉద్భవ స్థానం వద్దనే ఆగి వుండిపోదు. నది వలననే ఆత్మహద్దులను దాటి ప్రజా జీవితంలోకి ప్రవేశిస్తుంది. ఈ ప్రవేశం యొక్క సాఫల్యం ఒకరిగా ఉన్నది పలువురి కోసంగా మార్పుచెందడంలో వుంది" (మిసిమి, 2008, పుట, 10).

దీన్నే మనం "సాధారణీకరణం" అని అంటుంటాము. వ్యక్తిగత అనుభవం రచన ద్వారా సమాజపరంఔతుంది. రహమతుల్లా, తనకుటుంబంలో, తను యెరిగిన ముస్లిం సమాజాన్ని తన వైయక్తిక అనుభూతులతో సమ్మేళనం చేసి వ్యక్తీకరించడంలో, "బా" కథలు విశిష్ట గౌరవాన్ని పొందాయి. సాహితీజగత్తులో!.

"వతన్" కథా సంపుటిలో ముస్లిం కథారచయితలందరూ తమ సంస్కృతిని, తమ జీవితంలోని సుఖదుఃఖాలను, ముస్లిం సమాజం ఏవిధంగా వేరుగా చూడబడుతుందో, ఈ వివక్షత ఇంకెంత కాలం సాగాలి? ముస్లింలంటే సమాజంలోని ఇతర వర్గాలు అకారణ ద్వేషాన్ని ఎందుకు ఏర్పరుచుకున్నారు? లాంటి ప్రశ్నలను సంధిస్తున్నారు. "కహనీలు కావు జిందగీలు" అని అంటున్నారు.

తెలుగు సాహిత్యంలో ముస్లిం కవులు, రచయితలు, మేధావులు ప్రవేశించడం వలన , సాహిత్య దృక్పధం విస్తృతమైంది. అప్పటి వరకు తెలుగుసాహిత్య సంస్కృతి అంటే, సాంప్రదాయ పద్యకావ్యాలు, అవధానాలు, భావకవిత్వం, దిగంబర కవిత్వం, పైగంబర కవిత్వం, నిరసన కవిత్వం స్త్రీ వాద దళిత కవితా వాదాలు ప్రాచుర్యంలో వున్నవి. కవిత్వం ఇన్ని వాదాలలో

నుంచి ప్రవహించినా, భిన్నత్వం అంతగా గోచరించలేదు. ఈపై వాదాల్లో దిగంబర కవిత్వం కేవలం సమాజానికి ఇవ్వడానికి "విచ్చలవిడితనాన్ని ప్రదర్శించి తన ప్రత్యేకతను చాటు కోవాలని ప్రయత్నించినా, మిగతా వాదాలన్నీ తెలుగు భాష తెలుగు సంస్కృతుల ప్రతిబింబాల గానే తమ వాణిని ఎక్కువ భాగం వినిపించాయి.

అయితే ముస్లిం మైనారిటీ కవిత్వం గాని కథలు గాని, మరే ఇతర సాహిత్య రచనలు గాని, మనలో ఉంటూ, జీవిస్తూ, మనకు తెలియని వ్యధల్ని , వేదనలని పొందుతున్న ఒక కమ్యునిటీ గురించి, తమ స్వంత బాణీలో తాము మాట్లాడే భాషలో, ప్రత్యేక మైన తమ కష్టాలను, నష్టాలను, తెలుగు ప్రపంచం ముందు ముస్లిం రచయితలు అభివ్యక్త పరచడం, శిష్టుల మనే వారికి ఇబ్బంది కలిగించినా, అవి అనేక వాస్తవాలను కళారూపంలో మనముందు నిలిపి ఆలోచింపజేస్తాయి.

ఈ క్రమంలో " వతన్ " కథా సంపుటి ప్రథమ స్థానంలో ఉందనడం సహజోక్తి మాత్రమే! ఈ కథాసంపుటిలో ముప్పయి తొమ్మిది మంది ముస్లిం రచయితలు 54 కథలు వ్రాసి, సగటు ముస్లిం జీవితాన్ని అక్షరీకరించి వివిధ వర్ణాల సమ్మేళనంతో ఒక అపురూప చిత్రాన్ని చిత్రీకరించారు.

ఈ కథా సంపుటికి పీఠిక వ్రాస్తూ "ఖాజా" అన్న మాటలను గమనిస్తే ఈ కథలను మున్ముందు ఎలా పరిశీలించాలో తెలుస్తుంది. ప్రముఖ రచయిత ఖాజా అంటారు. " ముస్లింల గురించి నెగెటివ్ ప్రచారాలు చేస్తూ సాయెబుల్ని మెజారిటీ సమాజానికి శత్రువులుగా పరిచయం చేస్తున్న బ్రాహ్మణీయ నోళ్లను ఈ కథలు మూపిస్తాయి. ఈ కథల్ని చదవడం ద్వారా ముస్లిమే తరులు ముస్లిం జీవితాల్లోని బాధల్ని సంతోషాల్ని అర్థం చేసుకోగలుగుతారు." (ఖాజా, 2002-2004, పీఠిక) ఈ కోణంను "వతన్" కథాసంపుటిలోని ముఖ్యమైన కథల్ని ఈ అధ్యాయంలో స్థూలంగా సమీక్షించడం జరుగుతుంది.

'పాచికలు' కథా సంపుటి ముస్లిం మహిళల జీవితాలను ప్రతిబింబించిన కథా సంపుటి. ఈ కథా సంపుటికి పీఠిక వ్రాస్తూ ప్రముఖ రచయిత దాశరథి రంగాచార్య గారీ విధంగా అన్నారు. "సత్యాగ్ని గారు స్త్రీల పరిస్థితులను చాలా చక్కగా వాస్తవంగా చిత్రీకరించారు. ఈ కథలన్నీ స్త్రీల దయనీయ పరిస్థితులను గురించి వివరించినవే. అయితే ఈ రచయిత ఛాందసుడు కాదనిచెప్పడానికి ఈ కథలే నిదర్శనం. కథ ముగింపు ఆచారానికి అనుగుణంగా జరగదు. ముగింపులో మానవ స్పందన వుంది." (రంగాచార్య దాశరథి, 1989, పీఠిక)

షేక్ హుసేన్ సత్యాగ్ని ‘ పాచికలు ’ కథా సంపుటికి పెట్టిన పేరును బట్టి ముస్లిం సమాజంలో “ స్త్రీలు ” పాచికలు మాదిరిగా పురుష మతహంకారం, ధనిక వ్యవస్థ ఆడే ఆటలో ఉపయోగిస్తున్నారనే ‘ ధ్వని ’ వ్యక్తమౌతుంది.

ఈ ‘ పాచికలు ” కథా సంపుటికి పీఠికలాంటిది వ్రాస్తూ రచయిత సొదుం జయరాం “పురుషాధిక్యత గల సమాజంలో స్త్రీల ఒక ముడి సరుకు కన్నా హీనం. “ తలాఖ్, “ ముత్తా” లాంటి అనేక దుష్ట సాంప్రదయాల మధ్య ఆమె తరతరాలుగా నలిగి పోతుంది. ఏదుష్ట సాంప్రదాయమైనా అశేష జన జీవిత వికాసానికి ప్రతి బంధకముగా తయారయినప్పుడు, బాధితులు ఎదురుతిరిగితే అది బ్రద్దలుకాకతప్పదు.” అంటాడు. (జయరాం సోదుం, 1989, పీఠిక)

మతం పేరుతో ముస్లిం సమాజంలో వినిపించే, కనిపించే దౌష్ట్యాన్ని ఆధునిక దృక్పథం కలిగిన ముస్లిం రచయితలు అక్షరీకరించడం వలన ఒక సామాజిక ప్రయోజనం ఏర్పడింది. ఇదంతా విధి, ఇదంతా పవిత్రగ్రంథాల ఆధారంగా జరుగుతుంది.’ మత విశ్వాసాలను ప్రశ్నించకుండా ఆచరించడమే మన విధి ” అని నమ్మే ముస్లిం మహిళల్లో హేతుబద్ధ ఆలోచనలు కలిగించడానికి “ పాచికలు ” కథా సంపుటిలోని 8 కథలూ ప్రయత్నించినవి.

‘నయాఫత్వా’ మూడు కథల సంపుటి. రచయిత ఎం. హరికిషన్ 2001 ప్రచురణ ఈ కథల్లో రచయిత దృక్పథాన్ని పరిశీలించి ముస్లిం వర్గ ప్రజల చైతన్యానికి ఆయన తన కథాసంపుటి ద్వారా ఏవిధంగా ప్రయత్నించిందీ విశ్లేషించవలసిన ఆవశ్యకత వుంది. ఈ క్రింది వాక్యాలలో హరికిషన్ దృక్పథం అవగతం కాగలదు. “ ఫత్వాలకు చర్చలుండవ్, ప్రవక్తలకు ఎదురుండదు. ఎదిరిస్తే బమియాన్ బుద్ధ విగ్రహాల్లా బద్దలై పోతారు” (హరికిషన్ ఎం, 2001, పుట,4) ఇది అహేతుకమైన ఫత్వాల గురించి రచయిత చెప్పిన మాటల్లో ‘ ఫత్వా ’ యొక్క నిరంకుశత్వము వెల్లడి అవుతుంది. బమియాన్ బుద్ధ విగ్రహాలను ధ్వంసంచేయడం మతమౌఢ్యానికి నిదర్శనంగా వుందని రచయిత సూచించడం సమంజసంగా వుంది.

ఈ ‘నయాఫత్వా’ వలన ఒక విషయం స్పష్టమౌతుంది. ముస్లింలు సున్నీ, షియాలకు వివాహ సంబంధాలుండడానికి తిరస్కరిస్తారు. హిందువులు కూడా తమ కులం వారితోనే

సంబంధబాంధవ్యాలు నెరవేర్చుకుంటారు. ఈ ‘ నయాఫత్వా’ మత వ్యవస్థపై , కులవ్యవస్థపై కులాచారాలపై ‘తిరుగుబాటు కథలు’

స్కైబాబ, ముస్లిం కథా రచయితల్లో, కవుల్లో, విమర్శకుల్లో ఎన్నదగిన రచయిత. ఆయన కవి, కథకుడు, సాహితీ విమర్శకుడు కూడా! ఆయన రచన ‘ లోహం ’ అనేది పెద్ద కథ. ఇది ఒక ప్రేమ కథ ఈ కథలో సామాజిక అంశం ఏమిటనేది తరచి చూడవలసిన అంశం.

పద్మజ ‘సుల్తాన్’ అనే ముస్లింని ప్రేమిస్తుంది. అతను పేదవాడు. అతని పేదరికాన్ని చూచి పద్మజ భయపడుతుంది. కిరణ్ పద్మజని ప్రేమిస్తాడు. చివరకు పద్మజ భద్ర జీవితం వైపుకే మొగ్గు చూపుతుంది. తరువాత అనుకోకుండా సుల్తాన్ కనిపించి, తను సహజీవనం చేస్తున్న సలీమా దగ్గరకు తీసుకెళతాడు. నిరాలంకారమైన, నిష్కపటమైన, ఆలోచనాత్మకమైన సుల్తాన్ సలీమాల జీవన సరళిని, తన జీవితాన్ని పోల్చుకొని, భద్ర జీవితంలోని కృతిమత్వాన్ని ధనదాహాన్ని, ఆడంబరత్వాన్ని, ప్రేమలేని తనాన్ని అర్థంచేసుకొని పద్మజ స్వేచ్ఛ కోసం పరితపించడంతో కథ ముగుస్తుంది. ‘లోహ ప్రతిమల మధ్య మనిషి లోహయంత్రంగా జీవించగూడదనే సందేశాన్ని స్కైబాబ తన కథల ద్వారా అభ్యిక్తపరచాడు.

# IV. ముస్లిం కవుల మత, తాత్త్విక దృక్పథం సామాజిక లక్ష్యాలు

"నేనుపుట్టక ముందే
దేశద్రోహుల జాబితాలో
నమోదైవుంది నాపేరు"

కన్నబిడ్డను సవితి కొడుకుగా
చిత్రించింది చరిత్ర
అన్నదమ్ముల్నించి చీల్చి
నన్ను ఒంటరివాణ్ణి చేసింది చరిత్ర"

- ఖాదర్ మొహియుద్దీన్

మతం అనేది ఒక విశ్వాసం. ఈ విశ్వాసంలో తార్కికతకు చోటులేదు. అందువలన మతధోరణి విచక్షణ, వివేకము అనే వాటికి దూరంగా వుంటుంది. మొట్టమొదట మనిషి అలోచనా క్రమం ప్రారంభం అయిన తరువాత ఈ సృష్టికి ప్రకృతికి వున్న సంబంధాన్ని గురించి, ప్రకృతికి మానవుడికి వున్న సంబంధం గురించి అనేక సిద్ధాంతాలు, మతాలు, తంత్రాలు చేయబడినవి. అయితే ఆనాడూ యీనాడు మూల కారకాన్నిగాని మౌలిక సూత్రాలు గాని తెలుసుకోలేని మానవుడు ఒక అతీతశక్తిని ఊహించుకొని దానిని ఆరాధించడం మొదలు పెట్టనాడు. మనిషి వేదకాలంలో ప్రకృతికీ, ఉపనిషత్ కాలంలో తాత్వికచింతనకూ, బుద్ధుని కాలంలో జిజ్ఞాసకు సత్యా న్వేషణకు ఆధునిక కాలంలో వైజ్ఞానిక సత్తాతో అన్వయించబడిన సత్యాన్వేషణకూ, వివేకానికీ మానవుని అలోచనా క్రమం ఇట్లా సంకీర్ణతల నుంచి ఒక విశాలత్వంలోకి, విమలత్వంలోకి పరిణామం చెందుతూ వచ్చింది.

అయితే ఆదిమ కాలం నుంచి ఆధునిక కాలం వరకు మానవుడు సుదీర్ఘ ప్రయాణం చేసినప్పటికీ పరిణామంచెందినప్పటికీ, భావరీత్యా ఎక్కువ శాతం వికాసం జరుగకుండా వికాసం అనేది భౌతికతత్వానికి నాగరికతకే పరిమితమై పోయింది. చంద్రమండలం వెళ్లిన శాస్త్రజ్ఞుడైనా, అణుబాంబుని కనిపెట్టిన మేధావి అయినా, బిగ్‌బ్యాంగ్ ప్రయోగం జరిపిన శాస్త్రజ్ఞుల బృందమైనా తొలుత దైవ ప్రార్ధనలు చేయడం, దేవుని కృప వలన తమ పరిశోధనలు సజావుగా జరుగుతున్నాయని వ్యాఖ్యానించడం ఆశ్చర్యకరమైన విషయం– ఇందువలన స్పష్టమయ్యే దేమంటే సమాజంలో ఇప్పటికీ వివిధ అపరిణిత ఆలోచనలు రాజ్యం చేస్తున్నాయనేదే!

మొదట ప్రకృతిని పూజించిన వైదికమానవుడు, తన ఆలోచన పరిణతి చెందినట్లుగా భావించి, ప్రకృతి దేవతలను సృజించుకొని, తర్వాత త్రిమూర్తులను ముక్కోటి దేవతలను తానే

సృజించుకొని తానే పూజించుకుంటూ తనకే ఒక బంధనాన్ని ఏర్పరుచుకున్నాడు. క్రైస్తవ, ముస్లిం, శిక్కు మతాలు కూడా ఇందుకు మినహాయింపు కాదు.

సమాజంలో ఎప్పుడైతే భిన్న మతాలు ఏర్పడినవో వాటివాటి అస్తిత్వం కోసం ఘర్షణలు ఏర్పడినాయి. ఏర్పడుతున్నాయి కూడా! ప్రపంచ వ్యాప్తంగా యీ ఘర్షణలు శతాబ్దాల నుంచి జరగుతున్నాయి. ఇందుకు భారతదేశం మినహాయింపుకాదు. ఇస్లాం జిహాద్ అనే నినాదం నేడు ప్రపంచాన్ని భయపెడుతుంది.

ఇస్లాం పవిత్ర గ్రంథంలో 'జిహాద్' ద్వారా మత వ్యాప్తి చేయమని స్పష్టంగా వుంది. అందువలన భారతదేశంలో విభిన్న రాజ్యాలుగా, అనేక సంస్థానాలుగా విభజించబడిన కాలంలో ఐకమత్యం లేకపోవడం వలన, విగ్రహారాధన చేసే కాఫిర్‌లను విశాల దృక్పథంలోకి, అంటే ఇస్లాం మతంలోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో భారతదేశంపై దండయాత్రలు, గజినీ, ఘోరీలు, మొగలాయిలు ఖిల్జీలు మొ॥ వారు చేసి తమ మత ప్రాముఖ్యాన్ని బోధించి, బాధించి ఇస్లాం మతాన్ని కొంత మంది హిందువులు స్వీకరింప చేయడంలో సఫలీకృతులైనారు. ముస్లిం మతాన్ని స్వీకరించింది ప్రధానంగా దళితులే.

"ఇస్లాం" అనేది "సలామ్" అను అరబ్బీ ధాతువు నుండి పుట్టిన పదం. దీనికి స్వయం సమర్పణ, విధేయత, ఆజ్ఞ, పాలన అనే అర్థాలున్నాయి. "ఇస్లాం" దేవునికి పరిపూర్ణ స్వయం సమర్పణను, విధేయతను ప్రబోధిస్తుంది. 'ఇస్లాం' అనే పదానికి 'శాంతి' అని కూడా అర్థం వుంది." (రహంతుల్లా షానీ, 2003, పుట, 3)

సహజంగా ఏ మతంలోనైనా కొన్ని ఆదర్శాలు వుంటాయి. అవి కొంత మానవీయ గుణాలుగా కీర్తించబడతాయి. క్రైస్తవంలో కూడా కరుణ, దయ, బాధ లాంటి వాటి కనుగుణంగా పవిత్ర గ్రంథాలు నిర్మించబడినవనే ఒక సూచన కనిపిస్తుంది. మతంలో లోతుకు పోయిన కొద్దీ వైరుధ్యాలు, ప్రశ్నించ వీలులేని మహిమలు, అమానుష శక్తులు, చిత్రవిచిత్రాలు పాదుకొని వుంటాయి. మతానికి దైవభావన, విశ్వాసాలు, అలౌకిక శక్తుల అండదండలు సమకూర్చడంలో ఆయా మత గ్రంథాల రచయితలు (ప్రవక్తలు) సఫలీ కృతులైనారు. అయితే అవి హేతు బద్ధంగా వుండవు.

ప్రసిద్ధ కాలమిస్టు ఎ.జి.నూరనీ "ఇస్లాం జిహాద్" అనే గ్రంధానికి పీఠిక వ్రాస్తూ. "ఇస్లాం చాంధసవాది అని చెప్పబడుతున్న వ్యక్తి ఒక మోసగాడు. మహోన్నతమైన మత విశ్వాసాన్ని ఒక రాజకీయ ఆయుధంగా దుర్వినియోగం చేశాడు." (నూరాని ఎ.జి., 2003, పుట,1) ఈ దృక్పధం నుంచి ఇస్లాంలోని ఉగ్రవాదిని ఇస్లాంలోని 'మతవాదిని' మనం భిన్న దృక్పధంతో చూడవలసిన ఆవశ్యకత అవగతం ఔతుంది.

మతం యొక్క పరిధిని నిర్ధేశిస్తూ ప్రసిద్ధ మేధావులు రోమిల్లా దాపర్/సుమత్ సర్కార్ తమ గ్రంధంలో యీ విధంగా అన్నారు – "మత మనేది వ్యక్తి గతమైన స్వంత వ్యవహారంగా వుండాలని సెక్యులరిజం చెబుతోంది. ఒక మతానికి చెందిన వారికి రాజకీయ సిద్ధాంతాలు బోధించి మతం ప్రాతి పదికన అధికారంలోకి వచ్చే ప్రయత్నాలను సెక్యులరిజం వ్యతిరేకిస్తుంది. దాన్ని ప్రభుత్వపరంగా ఉపయోగించకుండా సాంఘిక నీతి గురించి చెప్పడం సాంఘిక నీతి సమాజంలో అత్యవసర భాగమనే దాన్ని నొక్కి చెప్పడమే. భారతదేశంలో యీ భాగమే క్రమక్రమంగా అవకాశం పొందింది. (రోమిల్లా ధాపర్/సుమత్ సర్కార్, 1993, పుట, 4)

"చరిత్రలో మతాలు" అనే గ్రంధంలో సోవియట్ రచయిత సెర్గియ్ తోకరోవ్ యీ విధంగా అన్నారు. శైశవ ఇస్లాం సిద్ధాంతాన్ని ఆచారాలను, నీతులను స్థాలీపులాక న్యాయంగా పరిశీలించి నప్పుడు యివి ప్రధానంగా యూదు –క్రైస్తవ సూత్రాలపై ఆధారపడినట్లు కనిపిస్తాయి. కాని ఇస్లాం అంతకన్నా ప్రాధమికమైన సామాజిక నిర్మాణాన్ని స్వీకరించింది. పతనోన్ముఖమైన దిశలో వున్న తెగల సంప్రదయాల నుండి పుట్టుకొచ్చినదిది. ప్రజలకు, ప్రత్యేకించి ఆసియాకు చెందిన సంచారజీవులకు, వ్యవసాయదారులకు ఇస్లాం ఆదర్శాలు సులభ గ్రాహ్యంగాను, స్పష్టంగాను కనిపించాయి. ఆదేశాలు సంక్లిష్టమైనవికావు. ఆచరణకు సుసాధ్యమైనవి" (సెర్గియ్ తొకరోవ్, 1998, పుట, 104)

ఇస్లాం మతం యొక్క మౌలిక స్వభావాలు ఏర్పడిన విధానాన్ని సెర్గియ్ తాకరోవ్ చక్కగా విశ్లేషించారు. ఏ మత సిద్ధాంతమైనా స్వతంత్రంగా జన్మించదు. పూర్వమత సిద్ధాంతాలను, ప్రజల సంప్రదాయంలోని, ఆలోచనల్లోని లోటుపాట్లను, రాజకీయ వాతావరణాన్ని సమీక్షించుకొని సమన్వయించుకుంటూ క్రొత్త మతంగా ఏర్పడుతుంది. ఈ విధానమే ఇస్లాం మతం ఏర్పడటానికి ప్రధాన కారణమైంది.

ప్రజాస్వామ్య ప్రభుత్వాలు, ఎన్నికలపై ఆధారపడి జీవిస్తాయి. ఏ పార్టీ ప్రభుత్వమైనా అధిక సంఖ్యాకులకు అనుకూలంగా, వుంటుంది. అల్ప సంఖ్యాకుల పట్ల కొంత అలక్ష్యాన్ని ప్రదర్శించడానికి వెనుకాడదు. ఈ అల్ప సంఖ్యాకులు స్వతంత్రంగా వ్యవహరించలేక, ఏదో ఒక పార్టీ ద్వారానో, సంస్థల ద్వారానో తమ హక్కులను గురించి మాట్లాడుతుంటారు. అయితే ఈ మైనారిటీవర్గాలు, సమాజంలో అభద్రతా భావానికి గురి అయివుంటాయి. సమాజంలో నిర్భయంగా తలెత్తుకొని ధైర్యంగా జీవించ జాలవు. మన సమాజంలో మైనారిటీలు క్రైస్తవులు, ముస్లింలు, బౌద్ధులు, జైనులు ఇంకా చిన్నా చితకా వర్గాలు వున్నాయి. ఇటువంటి స్థితిలో వున్న మైనారిటీలకు, ఆయా వర్గాలలో వున్న కవులు, కళాకారులు, మేధోజీవులు తమ వర్గం యొక్క స్థితిగతులను, అందులోని దుస్థితిని సమాజానికి చెప్పడానికి, ప్రభుత్వాలకు వినిపించడానికి, తమ గళాలను, కలాలను, కుంచెలను ఉపయోగించి కళా సృజనసాగించి, మేధో విశ్లేషణ కలిగించే రచనలను చేసి, తమ వర్గ ప్రయోజనాలను కాపాడటానికి ముందుకు నడుస్తున్నారు. ఈ ప్రకరణంలో ప్రధానంగా ముస్లింకవులు, తమ వర్గం యొక్క కష్టనష్టాలను, మూఢ ఆచార వ్యవహారాలను, హక్కుల కోసం, ముఖ్యంగా స్త్రీ సామాజిక హక్కుల కోసం, ఏవిధంగా తమ కలాలను, గళాలను సంధించారో విశదీకరించడమే ప్రధాన ఉద్దేశ్యం.

ఎవరో ఒకరు గళం విప్పకపోతే, కలం కదలించక పోతే గజ్జెకట్టి నర్తించకపోతే, సామాజిక కళారూపాలను నిర్మించక పోతే, వాస్తవిక పరిస్థితులు, జనం ముందుకి రావడానికి ప్రగతిశీల దృక్పథం కలిగించడానికి వీలుకలగదు. అందువల్లనే కవులు, కళాకారులు, మేధోజీవులు తమ లక్ష్యాలను చేరుకోవడానికి నిరంతరం, సృజనాత్మక, సాంఘిక, రాజకీయ వేదికలపై కనిపిస్తుంటారు. తమ గళాన్ని వినిపిస్తుంటారు. ఇందులో భాగంగా ముస్లిం కవులు/ కవయిత్రులు తమ ఆదర్శాలను, ఆశయాలను , సంస్కృతిలో భాగంగా నినదిస్తున్నారు.

ప్రముఖ పాత్రికేయులు, రచయిత శ్రీ కె.రామచంద్రమూర్తి గారి వాక్యాలను ఇక్కడ పొందుపరచవలసిన ఆవశ్యకత వుంది. ఆయనంటారు “ ప్రపంచంలో ఇండోనేషియా తరువాత అత్యధిక సంఖ్యలో ముస్లింలు ఉన్న దేశం భారత్. దేశవ్యాప్తంగా వారు గ్రామాలలో పట్టణాలలో సమాజంలో భాగమై పాలలో నీళ్ళలాగా కలిసిపోయి జీవిస్తున్నారు. స్వార్థపరులైన కొందరు రాజకీయవాదులూ, వ్యాపారులూ, హిందువులలో, ముస్లింలలో మతావేశాన్ని రగిలించి తమ స్వార్థ సంకుచిత ప్రయోజనాలు నెరవేర్చుకొనే క్రమంలో మత కులపరంగా మారణ హోమాలు

జరుపుతున్నారు. జరుగుతున్నాయి. కానీ సాధారణ హిందువులూ, సాధారణ ముస్లింలు శాంతియుత సహజీవనం కోరుతున్నారు. " ప్రముఖ మేధావి కె. రామచంద్రమూర్తి గారన్నట్లు సగటు భారతీయుడు మతంతో సంబంధం లేకుండా " శాంతియుత సహజీవనాన్ని " ఆర్థిక స్వావలంబనను కోరుచున్నాడు. అయితే యీ క్రమంలో సమాజంలో మత శక్తుల వలన కొన్ని అనర్థాలు జరుగుచున్నవి. ఈ సంఘటనలతో సామూహిక మత చేతనలో మార్పుజరుగుతుంది. ఈ మార్పుల వలన సంఘర్షణ జరుగుచున్నవి. వీటిని అనుసరించి ముస్లిం కవులు రచయితలు సరియైన విధానాల్లో ప్రతి స్పందించినారు. (రామచంద్రమూర్తి కె, 2003, పీఠిక)

ముస్లిం కవులు, కవయిత్రులు, తెలుగు సాహిత్యంలో యీనాడు పదుల సంఖ్యలో వున్నారు. గట్టిగా చూస్తే వందకు పైచిలుకు ఉన్నారేమో! అయితే వారందరి రచనలను స్పృశించడం, పరామర్శించడం, సమీక్షించడం అంతగా కుదరని పని గనుక, ముఖ్యమైన కవుల రచనలను, వారి దృక్పథాన్ని సమీక్షించడం వరకే యీ ప్రకరణాన్ని పరిమితం చేయడం జరిగింది. మొదటిగా ముస్లిం కవయిత్రుల రచనలను సమీక్షించడం జరుగుతుంది.

## IV.1. మెహజబీన్ - ఆకురాలు కాలం

మెహజబీన్ కవిత్వంలో రెండు ప్రధాన లక్షణాలు గోచరిస్తాయి. ఒకటి అభివ్యక్తి సౌందర్యం రెండు మార్క్సిస్టు సామాజిక దృక్పథం - కవయిత్రిది మతదృక్పథానికి వ్యతిరేకమైన విప్లవ పంథా ఆమె తాత్విక దృక్పథం సాయుధ విప్లవం ద్వారానే సామాజిక న్యాయం జరగుతుందనేది ఇది ఒక రకంగా పాక్షికధోరణి అయినప్పటికీ పీడితవర్గాలు, బలహీన వర్గాలు, అంటరాని వాళ్లుగా పరగణించబడేవాళ్లు. తమ అస్తిత్వానికి భంగం కలిగినప్పుడు విప్లవాన్ని ఆహ్వానిస్తారా? లేక ఓటు ద్వారా, ప్రజాస్వామిక విప్లవాన్ని సాధిస్తారా? అనేది చర్చనీయాంశం.

ఈ కవితా సంపుటి ఆకురాలు కాలం (1997) లో ప్రచురించబడింది. ఆకురాలు కాలం అని కవయిత్రి పేరు పెట్టడంలోనే ఒక వైచిత్రి ధ్వనిస్తుంది. ఒక రాలిపోయిన విప్లవ యోధుడిని సూచిస్తుంది. ఈ కవితలో తన సహయాత్రికుని, ప్రేమికుని, చెలికాని యొక్క పరిమళ జ్ఞాపకాలలో కవయిత్రి ఉద్వేగ భరితురాలవుతుంది. ఒక జవరాలిగా మారిపోయి ఈ విధంగా అంటుంది.

" అతనెప్పుడూ అంతే
ఒంటరిగా రమ్మంటే వసంతాన్ని వెంట తెస్తాడు "
" అతనెప్పుడూ అంతే
వస్తూవస్తూ పక్షుల పాటల్ని వెంట తెస్తాడు "
" అతని సమక్షంలో
పొగొట్టుకున్న బాల్యం తిరిగి ప్రవహిస్తుంది.
శరీరం అనుభవాల పాఠశాల అవుతుంది." (మెహజబీన్, 1997, పుట, 40)

ఈ కవితా వాక్యాలలో ఒక ప్రేమించే హృదయం , రసార్ద్రతతో ద్రవించే స్త్రీ హృదయం కనిపిస్తుంది. కవయిత్రి అతనెప్పుడూ కూడా ఒంటరిగా యాంత్రికతను మోసుకురాకుండా "వసంతాన్ని " నిత్యచైతన్య స్ఫూర్తిని , ఆనందాన్ని, సౌందర్యానుభూతుల్ని తనతో పాటు తీసుకువచ్చి పంచిపెడతాడని , తన జీవితాన్ని వసంతోత్సవముతో నింపివేస్తాడని సూచించింది.

పక్షుల పాటల్ని వెంటతెస్తాడనడంలో ఒక "రాగలయను" కలిగించే పక్షుల పాటలను , తన స్వరములో తన వర్తనములో పలికించి జీవనాన్ని కూడా "లయాత్మకం" చేస్తాడని కవయిత్రి సూచిస్తుంది. అతని సమక్షములో తన బాల్యం తిరిగి తనకు వస్తుందని, భౌతిక శరీరం - అనేక రసస్పర్శల సాంద్రతతో అనుభవాల పాఠశాలగా మారిపోతుందని, అక్కడ తాను ఒక విద్యార్థిగా అతని అనుభవాల సారాన్ని సంగ్రహిస్తానని కవయిత్రి మెహజబీన్ సూచిస్తుంది.అదే కవితలో ఇంకొక పార్శ్వం కూడా దాగి వుంది.

" ఝామురాత్రి
నిర్ధాక్షిణ్యంగా నన్ను లేపి
మంజీరనాదాల్ని తూటాలు వేటాడిన వైనం చెబుతాడు" (పుట, 41)

అని కవయిత్రి అనడంలో సామాజిక చైతన్యం కోసం , సమసమాజం కోసం పోరాడే విప్లవ కారుడు కనిపిస్తాడు - అదే వరుసలో ఆగీతాన్ని ముగిస్తూ.

" అతనిప్పుడు లేడు
ఈమధ్య అర్ధాంతరంగా వచ్చిన
ఆకురాలేకాలానికి ఎక్కడ రాలిపడ్డాడో " అని అంటుంది. (పైదే)

సామాజిక న్యాయం కోసం పోరాడే విప్లవకారుల జీవితంలోకి కవయిత్రి ప్రవేశించి, ఒక సుకుమార, స్నిగ్ధ హృదయేశ్వరిగా మారి, వారి జీవితాలలో, విషాదాన్ని, వారిని ప్రేమించిన వారి జీవితాలలోని హృదయగత నైరాశ్యాన్ని, సమాజం కోసం "బలివితర్ది" ఎంత బలీయమైనదో ఈ గీతిక సూచిస్తుంది. అయితే రచయిత్రి మెహజబీన్ సామాజిక పోరాటాలను ప్రత్యక్షంగా కాకుండా కవితాత్మకంగా, పరోక్షంగా సమర్థించినట్లయింది. వస్తువుని స్వీకరించడంలోనూ అభివ్యక్త పరచడంలో మెహజబీన్ పద లాలిత్యం, వ్యంజన, ధ్వని ప్రాయంగా వినిపిస్తాయి.

అదే కవితా సంపుటిలో, యీ విధమైన సమర్ధనకు కొనసాగింపుగా ఉన్న గీతాలను పరామర్శించవలసి వుంది. ఈ కవితా సంపుటిలో ఉద్యమ నేపథ్యాన్ని సూచించే కవితలు 1) ఆకురాలు కాలం 2) లోయ 3) అతని సమక్షంలో 4) ముందు జాగ్రత్త చర్య 5) స్పర్శ 6) జీరో అవర్ 7) జ్ఞాపకం 8) అనురాగ స్మృతికి 9) జావళి 10) సన్నిహిత సంబంధం – ఈ కవితలన్నీ కూడా ఉద్యమ నేపథ్యం కలిగిన ప్రేమరసైక మూర్తి హృదయ ఆర్తికి సంబంధించినవి.

ఒక కవితా సంపుటిలో ఇన్ని ఉద్యమ స్ఫూర్తి కలిగించే కవితలను పొందుపరచడంలో, మెహజబీన్ దృక్పథం ఏమిటో స్పష్టమౌతుంది. – ఆమె ఆంధ్రదేశంలోనే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా జరిగే ఉద్యమాలను ఒక కవయిత్రిగా సమర్ధించినట్లు కనిపిస్తుంది. ఈ సమర్ధనలో ఆమె సామాజిక న్యాయం కోసం పోరాడే విప్లవ వాదులు తమ జీవితాలను కరుడు గట్టిపోనీయకుండా, ప్రేమ, మానవత, అనే వాటిని తమలో నింపుకోవాలని భావిస్తుంది. సామాజిక న్యాయం కోసం తమపంథాలో తాము ప్రస్తుత వ్యవస్థను వ్యతిరేకించి మారణాయుధాన్ని పట్టింది పీడిత మానవుల కోసమేనని గుర్తించాలని మైనారిటీ వర్గాలేకాకుండా, అన్నింటా వెనుకబడిన, క్షుభిత మానవులకు, అన్నార్తులకు, దుఃఖార్తులకు, ఒక విప్లవ విమోచన మార్గం ద్వారానే మేలు జరుగుతుందని, ఒక సంకేతం ఇచ్చినట్లయింది. ఈ దారిలో సాగిన మిగతా కవితలను ఇక్కడ పరామర్శించడం జరుగుతుంది. 'స్పర్శ' అనే కవితలో యీ విధంగా అంటుంది. ఇది ప్రేమకవితగా కనిపిస్తుంది గాని, ఇది మాములు ప్రేమకవిత్వం కాదు. 'స్పర్శ' కవితలో 'శారీరక స్పర్శ' కనిపించదు. ఒక అలౌకిక స్పర్శ, ఒక మాధురీపూర్ణమైన స్పర్శ ఒక అనిర్వచనీయ 'స్పర్శ' – హృదయాన్ని తాకే రసస్పర్శగా వుంటుంది.

ఈ కవిత విప్రలంభ శృంగారంలోని వియోగ బాధను సూచించదు – ఒక ఉద్యమ కారుని, ప్రియతమనేస్తం, తన కన్నులలో, శరీరంలోని ప్రత్యణువులోనూ 'దూరతీరాలలో' వున్నా మమేకం అయినా, ఇంకా జీవితంలోకి రాలేని, రాని ఒక ఆదర్శ, సామాజిక సైనికుని 'విరూప' చిత్రాన్ని, మెహజబీన్ చిత్రించింది. ఒక్కొక్క కవితలో రూప చిత్రణ స్పష్టంగా వుంటుంది. కొన్నిటిలో నైరూప్య చిత్రణ కనిపిస్తుంది. అంటే కవితలో రూపం కనిపించకుండ ఒక 'ఆభాస' కనిపిస్తుంది. " విరూపం " చెందిన కవితలో రూపం దృశ్యా దృశ్యంగా కనిపిస్తుంది. అదే యీ కవితా పంక్తుల్లో:

"ఆకాశం మీద నిలబడి
పట్టపగలు భూమ్మీద నీకోసం

వెతుక్కుంటాను" – అని అంటూ "నేస్తం, శతాబ్దాల కొత్తది మనస్పర్శ" (పుట,22-23) అని ముగిస్తుంది. ఈ "స్పర్శ కవితను" – పై కవితా వాక్యాలలో అడివిదారిలో, చెట్లల్లో, పుట్లల్లో, బండరాళ్లల్లో, కొండ గుహల్లో వానలకు, వరదలకు, సెగలకు పొగలకు, అదరక చెదరక తిరిగే ఒక విప్లవ కారుడైన తన ప్రేమికుడిని కలవడానికి "ఆకాశం మీద నిలబడి" లేక ఆకాశంలో సంచరిస్తూ నిన్ను వెతుక్కుంటాను". అని అంటుంది – ఒక విప్లవ కారుడిని పట్టుకోవడానికి గాని, ప్రేమతో పట్టుకోవడానికి గాని ఆకాశగమనమే మార్గమని కవయిత్రి సూచిస్తూ, – "నేస్తం – దూరంగా తొలగి పోయిన ప్రాణ హితుడా – మనం యీనాటి వాళ్లం కాదు, మన స్నేహస్పర్శ, శతాబ్దాల నాటిదని, ఎంతో పురాతన, ప్రాకృతిక ప్రేమ అని మెహజబీన్ – తన కవితా 'స్పర్శ' లో వ్యక్త పరచింది. – ఒక విప్లవకారునితో అనుబంధం కలిగిన హృదయాలు ఏవిధంగా కలచివేయబడి, నలిపి వేయబడతాయో యీ కవిత సాక్ష్యం ఇస్తుంది–

'జ్ఞాపకం' కవితలో యీ విధంగా అంటుంది కవయిత్రి 'మెహజబీన్'

"తొలిపొద్దు చీకట్లో
వాల్ పోస్టర్లు అతికించివచ్చి
నువ్వు తలుపుమీటిన జ్ఞాపకం –

తలుపు తెరిచి నీ నుదుటి మీద
ఉద్యమానికి పట్టిన చెమటను
చీరకొంగుతో అద్దిన జ్ఞాపకం
అప్పుడే పైట జారిన జ్ఞాపకం
పైట మీద నీవెచ్చని జ్ఞాపకం" (పుట, 28)

ఇదీ ఉద్యమకవితే : ఇక్కడ ఒక దృశ్యం, ఒకదాని తరువాత ఇంకొకటి సాగి పోతూ వుంటుంది. విప్లవోద్యమానికి సంబంధించిన కార్యక్రమంలో భాగంగా వాల్ పోస్టర్లు అంటించి వచ్చిన విప్లవశీలి, నెమ్మదిగా తన ప్రేయసి యొక్క తలుపుతట్టడం, ఆమె తలుపు తెరచి "ఉద్యమానికి" పట్టిన చెమటను తనచీరకొంగుతో అద్దడం, అప్పుడు అతను సేద తీరిన తరువాత, ఆమెపైట జారిపోవడం, అతని చూపుల్లోని వెచ్చని తనం ఆమె హృదయానికి తాకడం, కవితలో ఒక దృశ్యక్రమం గోచరిస్తుంది. ఇంకా యీ కవితలోని వాక్యాలు

"తొలి నిశ్శబ్ద నిమిషాన్ని భగ్నంచేస్తూ
వాళ్లు తలుపుకొట్టిన జ్ఞాపకం
నిన్నులాక్కెళుతున్న అలవాటైన జ్ఞాపకం
నువ్వు ఎన్‌కౌంటర్‌వో, లాకప్‌వో
తెలియని సందిగ్ధ జ్ఞాపకం
రావని మాత్రం తెలిసిన చేదు జ్ఞాపకం" (పుట, 29)

ఇక్కడ మెహజబీన్ కవితావాక్యాలు స్త్రీ హృదయం నుంచి ఉద్యమం యొక్క స్వరూపాన్ని పాఠకుడి ముందుకు తీసుకువెళుతుంది. ఇక్కడ నుంచి, ఈ దృక్పథం నుంచి చూసిన, చదివిన పాఠకుడు ఎటువెళ్లలేడు – ఉద్యమ స్వరూపం గురించి, సామాజిక పరిస్థితుల గురించి ఆలోచించకుండా వుండలేడు – పాఠకుడి జ్ఞాపకంలో "చేదు జ్ఞాపకం" నిలిచి పోతుంది. సామాజిక వాస్తవికతను అవగాహన చేసుకోవడం, దానిని గురించి ఆలోచించడం నిజంగా ఒక చేదు జ్ఞాపకమే! పరిస్థితులను అర్థంచేసుకుంటే " చేదుగుళిక " మింగకతప్పదు. ఎవరైనా!

విప్లవ సందేశం సమాజంలో నినదించడానికి 'ప్రయోగశీలి' గా నిరంతరం జ్వలించే వ్యక్తికి కూడా హృదయం ఉంటుందని, ఆ హృదయంలో బూర్జువా వర్గాలు భావించినట్లుగా

కాఠిన్యం మాత్రమే ఉంటుందని భావించడం పొరపాటని, అడవుల్లో, మైదానాల్లో, విప్లవగీతాలు పాడేవారికి, వారిని ప్రేమించేవారికి ఒక దుఃఖాశ్రువుని, ఒక దుఃఖగీతాన్ని మెహజబీన్ అభివ్యక్తపరచి అంకితం చేసింది. ఇదెంతో కరుణ రసప్లావితంగా వుంటుంది.

"అతని సమక్షంలో" – ముందుగా ప్రస్తావించిన గీతాల లాంటిదే! ఈ కవితలో "అక్షరాలను వొదిలి కవిత్వం / మమ్మల్ని పెన వేసుకుంటుందని అనడంలో వీళ్లిద్దరి ప్రణయసౌరభం, కవితామయంగా కళామయంగా ఉందని కవయిత్రి సూచిస్తుంది – ఒక విప్లవకారుని హృదయం కక్ష, కార్పణ్యాలతో, హింస,ప్రతిహింసలతో కాకుండా ఒక ఆర్ద్రీభూతమైన దృక్కోణం వుంటుందని మెహజబీన్ స్పష్టంచేసింది. ఇది వాస్తవం కూడా! ఎంతగా మనిషి చలించకపోతే పీడితుల పక్షాన పోరాడటానికి ప్రాణాలను తృణప్రాయంగా భావిస్తాడు. విప్లవ కారుని హృదయం స్త్రీ మార్దవత్యానికి, దీనుల, అన్నార్తులను చూసి చలించే తత్త్వం వుంటుందని విశదమౌతుంది. ఈ కవితా గానంలో! ఈ సందర్భంలో ప్రముఖ కవి శివారెడ్డి యీవిధంగా అన్నారు. "ఆమె (మెహజబీన్) కవితలో ఒక ఆప్తత ఉంది, అనుభవ సాంద్రత వుంది. ఆత్మీయ వ్యక్తీకరణవుంది. ఒక Lyrical touch ఒక రూపశ్రద్ధ వుంది" (శివారెడ్డి.కె, 1997, పుట,10) ఈ మాటలు మెహజబీన్ కవితా సౌందర్యాన్ని అద్దంలో చూసినట్లున్నాయి అనడంలో ఏలాంటి సందేహంలేదు. మెహజబీన్ "ముందుజాగ్రత్త చర్య" కూడా పైకవిత లాంటిదే! "'జీరోఅవర్' కవితలో, ఒక్కోసారి హృదయం/ కల్లోలిత ప్రాంతం" అనడంలోనూ అదే విషయం స్పష్టమౌతుంది.

"అతన్ని చూస్తుంటే
అడవిలో తిరుగుతున్నట్లుండేది".
"మా సంయుక్త స్వప్నాలు
మానిఫెస్టో చదువుతున్నట్లుండేది"
"యుద్ధం మొదలవక మునుపే
పోగొట్టుకున్న ఆయుధం అతను" (పుట, 51)

ఇక్కడ ఒక ప్రేమికురాలి హృదయం కొంచె కనుమరుగయి, ఒక సామాజిక యుద్ధ ప్రేమికురాలి హృదయం కనిపిస్తుంది. అడవిలో తిరగటం, మేనిఫెస్టోచదవడం, యుద్ధం

మొదలవకమునుపే ఆయుధంలాంటి అతనిని పోగొట్టుకొన్నానని, యిక అసలైన యుద్ధం, సామాజిక న్యాయం కోసం జరగాలని కవయిత్రి వ్యంజనప్రాయంగా చెప్పింది.

'సన్నిహిత సంబంధం' అనే కవితలో:

"బ్రతుకు చౌరస్తాలో నిలబడి
స్త్రీల గురించి తప్ప
ఇక్కడ మాట్లాడుకోవటానికి మాటలేమీలేవు
ప్రపంచం,
Women sexuality చుట్టూ తిరుగుతుంది" (పుట, 52)

అని ఒక కఠోరవాస్తవాన్ని మోహజబీన్ కవిత్వరీకరిస్తూ 'అతను' గురించి 'ఇతను' గురించి చెబుతూ ఎవరినీ పోగొట్టు కోవాలనిపించదని అసలు నిర్లక్ష్య పరచలేమని ఒక "ద్వైత భావంతో" పలికిన వాక్యాలు జీవన మార్మికతను వ్యక్తీకరిస్తున్నాయి."అనురాగ స్మృతికి" అనే కవితలో కూడా

"ఒక నూరేళ్ల జీవితం
అర్ధంతరంగా చిత్రపటమై పోయింది"
(అని అనడంలోనూ)
"నిన్ను ప్రేమిస్తున్నాను
నీ దేహాన్ని ప్రేమిస్తున్నాను
అని స్పష్టంగా చెప్పేయాలి
నువ్వంటే ఇష్టం
నీ మనసు నీ తెలివి...
నీతో అనుభవం కావాలి" (పుట, 57)

అని స్పష్టమైన, వాస్తవమైన దృక్పథంతో విప్లవ తరంగాలతో కురంగాలతో మమేకంకావాలనే బలమైన ఉద్యమ ప్రేమను వ్యక్తీకరించింది మెహజబీన్. కవయిత్రి ప్రధానోద్దేశ్యం ఏమిటంటే ఒక విప్లవకారుడికి 'ప్రేరణ' గా నిలిచి, అతని మార్గంలో ఇంకా బలీయంగా సాగిపోవడానికి ఉపయోగపడాలనేది మాత్రమే!

ఈ విధంగా సాగిన మెహజబీన్ 'బతికిన గోడలు' అనే కవితలో

"చీకట్లో మేం గోడల్ని స్పర్శిస్తాము
నినాదాలలో గోడల్ని స్పర్శిస్తాము
ఎర్రని వాస్తవాలతో గోడల్ని అలంకరిస్తాం"
తెల్లని గోడలమీద ఎర్రని నిజాలు
మమ్మల్ని రెచ్చగొడ్తాయి". (పుట, 15)

అని అనడం ద్వారా, ఆమె చూపు విప్లవ పంథాను, మార్క్సిజం– లెనినిజం – మావోయిజం వైపు సాగినదని, తన కవితా సంపుటికి ప్రధానంగా చేతులకు గోరింటాకును అద్దినట్లుగా ఒక ఎరుపుదనాన్ని అద్ది, ఇంకా సామాజిక అంశాలను, వాటిలోని నిమ్నోన్నతాలను సృజించి "ఆకురాలు కాలం" ఎంతో కాలం వుండదని ఆమె కవితా పంక్తులలో, అనుభూతులను రసానుభూతిగా, ఆలోచనలను ప్రగతిశీల సమాజం వైపుకి మరలించిందనడంలో ఎలాంటి సందేహంలేదు. విప్లవ కార్యాచరణతో దోపిడీరహిత సమాజం ఆవిర్భవించాలని కవయిత్రి ఆకాంక్ష.

ఇంకా తన కవితాసంపుటి " ఆకురాలు కాలం"లో స్త్రీవాదం జ్వలిస్తుంది. అవి "డాటర్స్ కింగ్‌డమ్" లోనూ 'ఒక పచ్చని జీవితం' కవితలోనూ, 'అజ్నబి' 'చీకట్లోంచి వెలుతురులోకి', " నవస్మృతి" "అమ్మకళ్లు" " మేఘం రాల్చని వాన" " చిన్నతల్లి " లాంటి కవితల్లో, స్పష్టమౌతుంది. అయితే ఒకే ఒక కవితలో పర్దావద్దని అంటూ " రసోయిఘర్, ఖిల్వత్ " యీ రెంటిమధ్య జీవితం కావాలి అని కోరుకుంటుంది. యీ  కవితా సంపుటికి " వెనుకమాట" వ్రాస్తూ చేరా "జబీన్" కవిత్వంలో ఇతర కవుల ఛాయలు కనిపించవు. పూర్తిగా సొంత గొంతుక. ఆమె కవితలో విప్లవ సానుభూతి, స్త్రీవాద దృక్పథం అనే రెండు డైమన్షన్లు ఉన్నాయి" అని అన్నారు చేరా. వారి అభిప్రాయం అందరూ ఆమోదించవలసినదే.(రామారావు చేకూరి, 1997, పీఠిక)

సమాజంలోని ప్రధానమైన ఆర్థిక దోపిడీ, జెండర్ వివక్షతలను తన సుకుమార కవితాశస్త్రాలతో ఖండించి మొహజబీన్ సమాజం యొక్క సంస్కృతిని క్రమబద్ధీకరించాలని ప్రయత్నించింది. ఆమె కవితా సంపుటిలో ఎక్కడో ఒక చోట తప్పితే ముస్లిం వాద ఛాయల్లో ఆమె కనిపించదు. ఒక సమగ్రత వైపుకి తన దృష్టిని సారించిన ఉత్తమ కవయిత్రి 'మెహజబీన్' – ఒక కాంతి రేఖ. ఒక కవితా జ్వాల ! ఈ కవయిత్రి లోని కవితా దీప్తి విప్లవ పంథాననుసరించే

నక్సలిజం వైపుకి మొగ్గి సాయుధ పోరాటం ద్వారానే సమాజానికి విముక్తి అనే తన ఆశయాన్ని సుకుమార మైన కవితాభివ్యక్తి ద్వారా మెహజబీన్ ప్రకటించింది. ముస్లిం సంస్కృతి నుంచి వచ్చి ధైర్యంగా, సహజంగా, కవితాత్మకంగా మోహజబీన్ స్వతంత్ర భావాలగుచ్ఛంగా యీ కవితాసంపుటిని వెలువరించడం, సాహితీవేత్తలను, సాహిత్యాభిలాషులను ఆశ్చర్యపరచింది.

## IV.2. షాజహానా - నఖాబ్

ప్రముఖ కవయిత్రి 'షాజహానా నఖాబ్' కవితా సంపుటికి వెనుక మాట వ్రాస్తూ తన సామాజిక లక్ష్యాన్ని యీ విధంగా నిర్ధేశించుకొన్నారు. పవిత్ర గ్రంథం చదివేవాళ్లు ప్రపంచాన్ని కూడా చదవాల్సిన అవసరం వుంది. పవిత్ర గ్రంథంలో అట్లా లేదు ఇట్లా లేదు అనే వాళ్లు తప్పుగా అన్వయించబడుతున్న విషయాల్ని దానివల్ల నష్ట పోతున్న జిందగీల్ని సరిచేసే పనులు చేయాలి... లేదంటే బలైపోతున్న బతుకులకు ఆ తరువాత ఎవరు విలువ కట్టిస్తారు? (షాజహానా, 2005, పుట, 73) స్త్రీవాద రచయిత్రి షాజహానా తన 'నఖాబ్' కవితా సంపుటి ద్వారా ముస్లిం చాంధసవాద దుర్గాన్ని  చేధించాలని ప్రయత్నించింది. మెహజబీన్ కవిత విప్లవ భావవాద సమర్ధననూ, విశిష్ట ఆలోచనధారను కలిగివుంటే షాజహానా కవిత మైనారిటీ వర్గంలోని అమానుషత్వాన్ని స్త్రీ వ్యతిరేక, అణచివేత చర్యలను ప్రశ్నిస్తుంది.

ముస్లిం సాంప్రదాయంలో స్త్రీలపై నిర్భంధాలు ఎక్కువ. ఈ నిర్భంధాల నుంచి, ముస్లిం స్త్రీ తన చుట్టు ఉన్న సమాజాన్ని అవలోకించవలసి వస్తుంది. మనిషికి కావలసిన వాక్ స్వాతంత్ర్యము లేదు. పర్దా నుంచే ప్రపంచాన్ని చూడాలి. 'నఖాబ్' తీసివేస్తే పరపురుషుడిని కోరినంత తప్పుగా భావిస్తారు.అయితే యీ " పర్దా " కేవలం ముస్లిం సాంప్రదాయంగా యీ నాడు గుర్తించబడినా, ఇది ముస్లిం సాంప్రదాయంలోకి హిందూ తదితర సాంప్రదాయాల నుంచి వచ్చిచేరింది అనడం సహేతుకం. ప్రముఖ చరిత్ర కారుడు సతీష్ చంద్ర " మధ్య యుగాల భారత దేశం " అనే గ్రంథంలో యీ విధంగా అన్నారు.

" ఉన్నత కులాల మహిళల్లో పర్దా ( పరాయి మగాళ్ల ఎదుట ముఖాన్ని పూర్తిగా కప్పేయటం) పద్ధతి సర్వ వ్యాపితంగా ఉండేది. పరాయి మగవాళ్ల వక్రదృష్టి నుండి కాపాడానికి మహిళలను ప్రత్యేకంగా  ఉంచే పద్ధతిని అగ్రకులాల వారు పాటించేవారు. ఇదే పద్ధతి ఇరాన్, గ్రీకు దేశాల్లో వుండేది. తర్వాత ఆ ఆచారాన్ని అరబ్బులు, తురుష్కులు స్వీకరించి తమతో పాటు భారతదేశానికి

తీసుకువచ్చారు” పాలకుల ఆచరించడం వలన పర్దా ఆచారం దేశం అంతా వ్యాపించింది. (సతీష్ చంద్ర, 2005, పుట,109)

క్రమక్రమేణా హిందూ సంస్కృతిలో కూడా పాటించిన యీ పర్దా ఆచారం ముస్లిం మతస్తులకే పరిమితం అయ్యింది. అందుకే షాజహానా తన మత సాంప్రదాయంలోని దురాగతాలను, లొసుగులను, దోషాలను, అమానవీయతను తన స్వేచ్ఛాగళంతో గట్టిగా, ధైర్యంగా, సాహసంతో వ్యతిరేకించింది “పర్దాహటాకో దేఖో” అనే కవితలో యీ విధంగా అన్నది

“జీవితం పర్దాల మాటున ఖైదీ అయినచోట
అణగదొక్క బడుచున్న కొద్దీ ఆడదాన్ని అణచాలనుకునే
వెర్రి ఆచారాల మర్రి వృక్షాలున్నచోట
ఒక్కసారి ముసుగు తీసిచూడు ... !”
లోపలి స్వేచ్ఛా వెలుతురు పరిమళాన్నంతా
వెదజల్లి వెలుగుతున్న నాగుల్‌మోహర్ ఆడవాళ్లనుచూడు.....”

(షాజహానా, 2005, పుట, 7-8)

అని అంటూ ఒక్కసారి ముసుగు తీసి పారవేస్తే ముస్లిం స్త్రీల మానసిక కాంతి, స్వేచ్ఛా చింతనతో పరిమళవంతమౌతుందనే వాస్తవాన్ని షాజహానా కవిత్వీకరించింది.మనిషికి స్వేచ్ఛ లేనప్పుడు, మనస్సుకు సంకెళ్ళు పడతాయని ఎంతమందికి అవగతం ఔతుంది?

ఇక్కడ 1921 వరకు జీవించివున్న అక్బర్ హుస్సేన్ అక్బర్ కవిత ఒకటి పర్ధా గురించి చెప్పినది ఉదహరించాలి.

“చేపర్ధ కల్‌జూ అయి నజర్ చంద్ బీబియా
అక్బర్ జామీమే గీరతే - ఖోమీసె గడిగయా
పూఛాజూ ఉన్‌సె అప్కా పర్ధావో క్యాహువా
కప్నేలగీకె అకల్‌పె మర్ధోంకి పడ్‌గయా”

(నిన్న కొందరు మహిళలు పర్ధా లేకుండ కలిశారు. కవి అక్బరు జాత్యభిమానం వలన తలదించుకున్నాడు. “ అమ్మా నీ పర్ధా ఏమైంది? అని ప్రశ్నిస్తే వారు అది పురుషులు తెలివి

మీద పడింది" అన్నారు.) (అక్బర్ హుస్సేన్ అక్బర్, 1970, పుట, 63) ఈ విధంగా పర్దా గురించి మంచి కవితలు ఉర్దూ సాహిత్యంలో లభిస్తాయి.

స్త్రీ జీవనభద్రత కోసం అణిగిమణిగి బానిసలుగా బ్రతకవలసిన అవసరం లేదని అంటూ –

"పొట్టకూటి కోసం నాలుగురాళ్లు సంపాదించడంకోసం
రాళ్లనైనా పగలగొట్టగలిగిన సత్తా నాకుంది" అని (పుట,9)

స్వేచ్ఛకోసం, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం "రాళ్లనైనా పగల గొట్టి" నాలుగురాళ్లు సంపాదించి బ్రతకటం మేలని షాజహానా ఘంటాపథంగా చెబుతుంది. ముస్లిం సమాజంలో, సంస్కృతిలో స్త్రీ తిరుగుబాటు జెండా కవితా కేతనంగా షాజహానా ఎగరేయడం  గమనించవలసిన విషయం.

'అనార్కలి' కవిత ఒక స్త్రీ హృదయజ్వాలగా కనిపిస్తుంది. ఆకవితలో షాజహానా అంటుందిలా

"పెదవిప్పనీయని పడగ కింద
ఎంత కాలం శరీరాల్ని ఛిద్రం చేయడం ? (పుట, 11)

అని ప్రశ్నిస్తుంది. స్త్రీ ముఖ్యంగా ముస్లిం స్త్రీ పాము పడగ క్రింద జీవిస్తుందని , పెదవి విప్పితే వెంటనే కాటుపడుతుందని , తన పెదవి విప్పితే తప్పు పట్టే మనిషి క్రింద, శరీరాన్ని ప్రక్కలు చేసుకోవడం, మనస్సు ముక్కలు చేసుకోవడం, ఎందుకని షాజహానా పై రెండు కవితా వాక్యాలలో అతి జీవంతో వ్యక్తీకరించింది.

"కాటుక కళ్ల మత్తులో సోలిపోయే ఏ ఒక్కడూ
కాటుక చాటు కన్నీటిని స్పృశించడు– అని అనడం. (పుట,11) మగవాడి హృదయ రాహిత్యాన్ని ఎండగడుతుంది. కామంమత్తులో జోగేవాడికి మూగగా రోధించే స్త్రీ హృదయం సంగతి, ఆమె కన్నీటికి కారణం తెలుసుకోలేని మూఢుడని ఆ కవయిత్రి భావన సమంజసంగా వుంది.

"ప్రతి అమాయక  చూపుల ఆశల జింకల్ని
అతి క్రూరంగా హలాల్ చేస్తుందేం షరియత్‌ఖడ్గం" (పుట, 11)

అని స్త్రీల పై మతఖడ్గం వేసే వేటుని సూటిగా, ఘాటుగా విమర్శిస్తుంది షాజహానా! అమ్మ మీద మన కవులు , కవయిత్రులు అనేక గీతాలు రాసేరు గాని ఇది ఒక కొత్తదనాన్ని పాఠకుడికి అందజేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. షాజహానా గురించి ప్రముఖ విమర్శకుడు, కవి అఫ్సర్ ఈ విధంగా అన్నారు. ఎలాంటి గోషా పర్దా లేకుండా " భావాలను నిస్సం కోచంగా వ్యక్తంచేసింది. షాజహానా... ఇతర వర్గాల స్త్రీలతో సరి సమానంగా జీవితాన్ని అనుభవించలేని స్థితిని షాజహానా చిత్రించింది'. అని వివేచించారు. (అఫ్సర్, 2005, పుట, 59)

'తస్వీర్' అనే కవితలో తన తల్లి సౌందర్యం ఏవిధంగా 'అడవిగాచిన వెన్నెల' మాదిరిగా నిర్లక్ష్యానికి గురి అయినదో, తన తల్లి హృదయం భర్త అనే మృగం చేతిలో ఏవిధంగా నలిపి వేయబడిందో, చివరకు జీవచ్ఛవం చేసి ఏవిధంగా కళేబరంగా మార్చి వేయబడిందో అద్భుతంగా యీ కవితలో చిత్రీకరించింది షాజహానా! కవయిత్రి తన తల్లిపై వున్న మమత్వం కవిత్వంలో మహత్వంగా వ్యక్తీకరించబడిందా అనేంత సహజంగా యీ కవిత ఒక రససరితలా సాగి పోతుంది.

పాత జ్ఞాపకాలను రేపిన తల్లి తస్వీర్‌ని చూసి దుఃఖోద్వేగానికి గురై యీ విధంగా వర్ణించింది షాజహానా!

"ఒంటినిండా ఆభరణాల్లా
మది నిండా కొత్త ఆశల్తో ఉన్న
నీ తస్వీర్‌ని నా గుండె అద్దుకుంటుంది
అన్నీ ఒలుచుకొని
నీ బోసి కొట్టే మనసుకు
అవమానాల్ని రోగాల్నీ
దారిద్ర్యం మఖమల్‌లో చుట్టి
బహుకరిస్తున్నాడు కదమ్మా నీనవాబు
బలాబందీగా నీయవ్వన మధువును పీల్చి
మధ్యంతరపు ముసల్తనాన్ని నీకాపాదించి

అబ్బాజాన్ బడీ దీదీగా
బతుకు ఆల్బమ్‌లో దిద్దిన
నీభగ్న చిత్రాన్ని చూస్తూ
కదిలి పోతున్నా అమ్మీజాన్
రగిలిపోతున్నా- (పుట, 14-15)

ఎంతో ఆర్తికి, కుటుంబంలో తండ్రి దౌర్జన్యానికి విసిగివేసారి నలిగి పోయిన వ్యక్తి నుంచి మాత్రమే ఇటువంటి వాక్యాలు వెలుగులోకి వస్తాయి. వస్తువుతో తాదాత్మ్యత చెందడం వలన కూడా కవి యీ విధంగా స్వీయానుభవాలు అనే రీతిగా అభివ్యక్త పరుస్తాడు.

అందరి ముస్లిం స్త్రీలజీవితానికి ప్రతిబింబంగా, ప్రతీకగా తనతల్లి పొందిన వేదనామయ జీవితాన్ని షాజహానా వర్ణించింది. వాస్తవంగా కవిగాని కవయిత్రి గాని వస్తువును స్వీకరించేటప్పుడు, తన జీవితంలోని సంఘటనలను స్వీకరించవచ్చు, లేకుంటే, తన దృష్టిలో పడిన సంఘటనను స్వీయానుభవంగా తీర్చిదిద్దవచ్చును. ఏది ఏమైనా తీసుకున్న వస్తువు రసస్ఫూర్తిని పాఠకుడికి కలిగిస్తుందా? లేదా? అనేది ప్రధానాంశం.

ఈ వాస్తవ దృశ్యాన్ని కన్నులకు కట్టినట్లుగా కవిత్వీకరించి ముస్లింసమాజంలోని ఆచారాల అనాచారాలను, పురుష ద్వేషానికి బలిఅవుతున్న తన తల్లి లాంటి ముస్లిం స్త్రీలకు కనువిప్పు కలగాలని, వారి బానిసత్వంలోని భయంకర పార్శ్వాన్ని సమాజానికి అవగతం అయ్యే రీతిలో యీ తస్వీర్ కవిత గొప్ప ఉనికి కలిగి ఉంది.

ఇంకొక కవిత 'గుంగీ' కవితలో వివాహవ్యవస్థలో స్త్రీ ఏవిధంగా బానిస ఖైదీ అవుతుందో వ్యక్తీకరించింది షాజహానా, ఆ కవితలో ఆమె అంటుందిలా:

"నిజంగా నికాహ్ కుట్రే...
షాదీ ఐన్నాటి నుండి
నేను అతని హవాలా అయిన్నాటి నుండీ
ఆకాశమంత నవ్వుని కత్తిరించి

చిర్నవ్వుగా మార్చాడు!
నన్ను బావిలో ఊటని చేశాడు
ఎవరితో మాట్లాడినా నరాలు తెగ్గొట్టే హావభావాలు!
మాటలెక్కడా మనసులెక్కడా
కన్నీళ్లతో పాటు అవెప్పుడో రాలిపోయాయి
నామాట నానవ్వు.....
అన్నీ నిషేధాలైపొయ్యాయ్" (పుట 17-18)

ఒక ముస్లిం స్త్రీగా తనపై నిర్బంధాలు ఏవిధంగా పనిచేస్తాయో షాజహానా 'వేదనాశకలం'గా శబ్దీకరించింది. ఇది వాస్తవ చిత్రణ, కవితలో 'రసాత్మ' ప్రతిధ్వనిస్తుంది. తనకు భర్త విధించే 'నిషేదాజ్ఞలను' బలీయంగా నిరసించింది. నిర్భయంగా! ఏఫత్వాజారీ అయినా నాకేమిటి? అనే ధోరణిలో షాజహానా రచించింది. పురుషదౌష్ట్యాన్ని, ముస్లిం సమాజంలోని కఠినమైన ఆంక్షలను అక్షరాకృతిని నుంచి వాటికి వెన్ను చూపవద్దనే సంకేతాన్ని షాజహానా ఇస్తుంది.

'లద్దాఫీ' కవిత కూడా సాంద్రత వున్న కవితే ! 'ఖబడ్దార్' కవిత ఒక తిరుగు బాటు బావుటా! కవయిత్రి షాజహానా యీ కవితలో

"మగ మృగతనానికి బలికావడానికి
సంప్రదాయపు కొండ చిలువని నల్లపూసలుగా చుట్టుకొన్నవాళ్లం" (పుట,22)

అని అంటూ

"గుబురు గడ్డాలు - తెల్ల టోపీలు
పైజామా కుర్తాలు - ఐదుసార్లు నమాజులు
అయ్యా మీరంతా పవిత్ర మూర్తులు
పవిత్రాచారాలను కాపాడే రాతి దర్వాజాలు" (పుట,22)

సాంప్రదాయ ముస్లిం చాంధసత్వాన్ని షాజహాన్ ఎదుర్కొన్నట్లుగా ఏ ముస్లిం కవయిత్రి ఎదుర్కోలేదేమో! ఈ చాంధసవాదులను 'రాతి దర్వాజాలు' గా పోలుస్తూ, వాళ్లలోని కఠినత్వాన్ని, కరుకుదనాన్ని, కాపట్యాన్ని వ్యంజన ప్రాయంగా చెప్పింది. ఇక్కడ మత సూత్రాలను / సూరాలను

వ్యతిరేకించడం కాదు. వాటిని సమాజంలో అమలు చేసేవారి కాఠిన్యాన్ని , మారిన కాలం దృష్ట్యా మారలేని మతవాదుల చర్యలను తూర్పారాపట్టింది. మతంలో కూడా కొన్ని అంగీకరించవలసిన అంశాలుంటాయి. ఉదాహరణకు – " ఇన్న అక్రమ కుం ఇందల్లాహి అత్ఖాకుం" " సత్ప్రవర్తన గల వ్యక్తి భగవంతుని దృష్టిలో అందరికన్న మిన్న" (అబ్దుల్ అలా మౌదూది మౌలానా సయ్యద్, 1996, పుట,49) లాంటి వాక్యలు వున్నప్పటికీ, అవి మెరుపులుగా కనిపిస్తాయిగాని మెరుగుగా గోచరించవు.

'ధుత్కార్' కవితలో
"ఈ మహళ్ల పరదాల వెనుక
నేనింక నిలబడలేను
ఈ ఉక్కు సంకెళ్లలోంచి
బయటపడుతున్నదాన్ని!
ఎంత క్రూరమైనాసరే
మతమూ, తండ్రీ, మొగుడూ! (పుట,28)

అంటూ ముస్లిం స్త్రీ సమాజాన్ని పీడిస్తున్న శక్తులేమిటో షాజహానా గుర్తించింది. అతిస్పష్టంగా అవి మతమూ, తండ్రీ, మొగుడూ అని తేల్చివేసింది.

మతమును అనుసరించే పురుష సమాజం స్త్రీపై ఎక్కువ వత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తుంది. ఈ కార్యక్రమంలో మత సూత్రాలను విరివిగా ఉపయోగిస్తుంది. స్త్రీని, స్త్రీ స్వేచ్ఛను, స్త్రీ హృదయాన్ని నలిపి వేస్తుంది. ఈ అణచివేత ఒక ముస్లిం సమాజంలోనే వుందని అనుకోవడం పొరపాటు. అక్కడ ప్రత్యక్షంగా కనిపిస్తుంది. మిగతా హిందూ, క్రైస్తవ మతాలలో కూడా అణచివేత కార్యక్రమము మత వాదుల ద్వారా, ఆ మత వాదులను అనుసరించే అనుచర వర్గం ద్వారా నిర్విఘ్నంగా కొనసాగుతుంది. శతాబ్దాల నుంచి నేటి వరకు కూడా!

'ఖైసెఖిజా' కవితలో రచయిత్రి తిరుగుబాటు ధోరణి మరీ స్పష్టంగా కనిపిస్తుంది.

"ఎవరితోనో లేచిపొయ్యి
ఎక్కడ మత కాలుష్యాన్ని చేస్తానేగా

గోషాల చెరసాలలు ” (పుట,37)

ఇక్కడ “లేచిపోవడం” అనడం వెనుక నిశ్చయంగా చలం గారి ప్రభావం కనిపిస్తుంది.

“కొట్టాల్లో పశువులు
ఫారాల్లో కోళ్లు
చీకటి కొట్లలో మేము! ” (గొప్ప అలంకారిక ధ్వని)
“చదువులేదు ఏ ఇచ్ఛా వుండకూడదు
ఎడ్లమూతికి బుట్టలాగా

గాలికూడా పీల్చే స్వేచ్ఛ లేకుండా నఖాబ్‌లు” (పైదే) ఈ ముసుగు వలన ఏర్పడిన ఆర్తి ఎడ్లమూతికి బుట్టలాగా వున్నాయనే స్పృహ తిరుగులేనిది. కవితాత్మకత అందంగా వుంది.

ఈ కవిత పురుషహంకారానికి గొడ్డలి పెట్టు. షాజహానా ‘వజ్రాయుధం’ ఉపయోగించింది. కత్తివేటు వేసింది. పర్వత శిఖరాన్ని కూల్చింది. స్త్రీని యీ విధంగా అణచడంలోని ఆంతర్యం పురుషుడిలో ఉండే ‘భయం’ న్యూనతాభావం, తన స్త్రీ / భార్య ఎవరితోనో లేచి పోతుందేమోననే చచ్చేంత అనుమానం. ఈ మానసిక అనారోగ్యాన్ని, మానసిక భ్రమలను తన భార్య యొక్క వ్యక్తిత్వ, మూర్తిమత్వాల వలన తాను ‘మరుగుజ్జు’ అయినట్లు, బోన్సాయ్ వృక్షమైనట్లు ఒక విభ్రమకులోనై, తాను ఏమిచేస్తున్నాడో, తననే నమ్మి, తన వారందరినీ, చిన్నతనం నుంచి ప్రేమగా చూసిన వారినందరినీ వదిలి వచ్చిన స్త్రీతో సంస్కార వంతంగా, సారవంతంగా, సానునయంగా, ఆర్ద్రంగా, మైత్రీపూర్వకంగా మసలే జీవనకళ తెలియక పోవడం వలన పురుషులు / భర్తలు ఏ విధంగా ‘జులుం’ చేస్తారో, ఏవిధంగా స్త్రీయొక్క వ్యక్తిత్వాలను హత్యచేస్తారో యీ కవితలో, వస్తువు, శిల్పం సమపాళ్లలో నడిచే విధంగా ఒక కవితాస్త్రాన్ని సంధించింది, షాజహానా! ఈ అస్త్రం సమాజం పై బాగా పనిచేసి ఆలోచింపజేసింది అనడంలో సందేహం లేదు.

‘ఇన్సానియత్’ అనే కవితలో
“ఎప్పుడో కూల్చబడ్డ దేవాలయాల బరువు
ఇప్పటి నాభుజాలపై వేయొద్దు
నొప్పితో సలుపుచున్న గాయాల్ని
కవిత్వీకరించుకుంటున్న మమ్మల్ని
ఈగల్లా మతవాదులన్న ముద్రతో సతాయించొద్దు” (పుట,44)

ఇక్కడ దేవాలయాల ప్రసక్తి తీసుకుని వచ్చి ఎప్పుడో కూల్చబడిన ఆలయాల ప్రభావం యీనాటికీ ఆయా వర్గాల పై వేసి ఇంకా రాచిరంపాన పెట్టే పద్ధతిని మానుకోమని రచయిత్రి చెబుతుంది. షాజహానా లాజికల్ గా ఆలోచిస్తుంది. అందువల్లనే ఆమె కవిత ఎంతో మందిని ఆకట్టుకుంది. ఆమె తార్కిక శక్తిని గురించి పరోక్షంగా ప్రముఖ కవి కీ.శే. మద్దూరి నగేష్‌బాబు గారు యీ విధంగా అన్నారు. "ఆలోచన చేస్తే తర్కం మొదలవుతుంది. తర్కం మొదలైతే ప్రశ్న పుడుతుంది. ప్రశ్న హేతువుని వెదుకుతుంది. హేతువు కోసం వెదుక్కోవడం మొదలైతే అక్కడొక కొత్త సృష్టికి భీజం పుడుతుంది." (నగేష్‌బాబు మద్దూరి, 1998, ఆంధ్రజ్యోతి దినపత్రిక) నగేష్ బాబు తార్కిక పరిణామ క్రమాన్ని చెప్పినట్లుందిగాని, అటువంటి పరిణామం షాజహానాలో కలిగిందనే విషయం విస్మరించరానిది.

షాజహానా గుజరాత్ విధ్వంసం మీద ప్రతి స్పందించిన తీరు పాఠకులను ఆవేదనకు గురిచేసే విధంగా వుంటుంది. 'కాలీదునియా' అనే కవితలో స్త్రీలు ఉపయోగించడానికి ఇష్టపడని భాషను సైతం షాజహానా వాడింది. ఈ సామాజిక దురాగతాలకు, వివక్షతలకు ఎంత వేదన చెందితేనో తప్ప ఒక స్త్రీ నుండి అటువంటి లైంగిక పరిభాష వెలువడదు. కాషాయంపై ధ్వజమెత్తిన షాజహానా కాషాయ సంస్కృతిలోని దుర్మార్గాన్ని ఎండగట్టింది కూడా!

"మగ నా కొడుకుల ఊపిరి
బయటికి రాకుండా నొక్కేస్తే
పీడా పోతుందని ఒక్కసారైనా
మీ అమ్మ అనుకునే వుండాలి" - అని కవితాత్మంగా నిందిస్తూ -
"సృష్టికి ఒక్కరే తల్లి తండ్రీ అని నమ్ముతున్నదాన్ని
నీకునాకు మధ్య రక్త సంబంధం లేదంటావా?
గుండెల్ని పెకిలించి
పొట్టలు చీల్చి
యోనుల్లో ఆయుధాలు పొడిచి
ఇవ్వాళ నువు చావు విందులు చేసుకొనుండొచ్చు
కానీ 'నన్ను' హత్యచేయలేవు

అనంతంగా సాగే జీవనదిని
నేను బతకడమే కాదు
నిన్ను పుట్టించి బతికించేది నేనే!
అయినా
స్త్రీ తప్ప మగాణ్ణి క్షమించేదెవరు ?
ఎప్పటికీ ప్రపంచం
నారొమ్ము తాగుతున్న పసిబిడ్డే! (పుట,56)

"నఖాబ్" కవితా సంపుటిలో షాజహానా ఒక గొప్ప స్త్రీవాద కవయిత్రిగా దర్శనమిస్తుంది. స్త్రీ బాల్యంనుంచి, యవ్వనం నుంచి పేర్చుకొన్న అవమానాలను అవహేళలను, అణచి వేత చర్యలను సహజంగా కవిత్వీకరించి ముస్లిం సమాజంలోని సంస్కృతిలోని చీకటి పార్శ్వాలను అభివ్యక్తి పరచింది. చివరకు పురుషుడి అజ్ఞానాన్ని మన్నించి, అతనిని ఒక శిశువుగా మార్చివేసింది. కవయిత్రి షాజహానా ఉదాత్త ప్రవృత్తితో! – ఈ కవితా వాక్యాలలో భారతీయ మహిళ ఓర్పు ,ఔదార్యం సహనం అనేవి ఉవ్వెత్తున కెరటంలా లేచాయి.

షాజహానా కవయిత్రిగా లౌకికవాది. ఈమె లౌకికవాదానికి దగ్గరగా చాంధసత్వానికీ దూరంగా ఉండి పోరాడటానికి ప్రధాన కారణం, ఆమె కులం ముస్లిం – హిందూ వాదులతో ఆవహేళనకు గురి కావడమే – దూదేకుల కులం గురించి ఖాజా చెప్పిన మాటలు సమంజనంగా వున్నాయి. ఆయనంటారు " ఆర్థిక పేదరికంతో పాటుగా దూదేకుల్లో సాంస్కృతిక వెనుకుబాటు తనం వుంది. ఆ వెనకబాటు కారణంగా వీరిలో, సగం ముస్లిమీయ సంస్కృతి సగం హిందూ సంస్కృతి ఉంది. వేషం, భాష, ఆచార వ్యవహారాలన్నింటిలోనూ ఈ సంయుక్త సంస్కృతి కనిపిస్తుంది. ఈ దేశంలో నిజమైన లౌకికవాదులు ఎవరైనా ఉన్నారంటే వాళ్లు దూదేకులే ! – ఎందుకంటే ముస్లిం – హిందూ సంస్కృతుల సమ్మేళనంగా వుంటూ ఈ రెండు మతాల మధ్య దూరాన్ని చెరిపి వేశారు" (ఖాజా, 2005, పుట,106)

ఈ విధంగా షాజహానా తన కవితా దృష్టిని విస్తృతం చేసి మతాని కన్నా మానవత్వం మిన్న అనే సామాజిక లక్ష్యాన్ని ప్రతిపాదించింది. మతాన్ని విస్మరించి మానవత్వాన్ని పునరుద్ధరించమని లక్ష్యాన్ని నిర్దేశించింది. పురుషసమాజంలో స్త్రీ పట్ల వున్న వివక్షతకు వ్యతిరేకంగా తన కలాన్ని నడిపింది షాజహానా! స్త్రీ ఆత్మ గౌరవంతో జీవించడమే షాజహానా లక్ష్యం.

ప్రముఖ కవి డా॥ ఎండ్లూరి సుధాకర్ , షాజహానా స్థానాన్ని ఈ విధంగా పదిలపరిచారు. ఆయనంటారు. "ఆధునిక తెలుగు కవిత్వంలో ముస్లిం స్త్రీ వాదం కొత్త గాలుల్ని, కొత్త ఆలోచనల్నీ, కొత్త ద్వారాలని తెరిచింది. తెలుగు కవిత్వాన్ని తేజోవంతం చేసింది. ముస్లింవాద కవిత్వానికి స్త్రీ ప్రతినిధిగా షాజహానాని ఈ విధంగా గుర్తించవలసి యుంటుంది. (సుధాకర్ ఎండ్లూరి, 2003, పుట 201)

ఇంకా ముస్లిం రచయితలు / రచయిత్రులలో పదునైన కలంతో అరుదైన రచనలు చేసిన వారున్నారు. వారిలో కొందరి రచనలు పరామర్శించవలసిన ఆవశ్యకత వుంది.

## IV.4. ఖాదర్‌మొహిద్దీన్ - పుట్టుమచ్చ

ఈ కావ్యాన్ని ఖాదర్ మొహిద్దీన్ 1991లో ప్రచురించాడు. సాహిత్యంలో 'పుట్టుమచ్చ" కావ్యం విశిష్టతను కలిగిఉంది. ప్రథమంగా ఈ కావ్యాన్ని ప్రచురించడం ఒక గొప్ప సంచలనాన్ని సాహితీలోకంలో కలిగించింది.

ఖాదర్ మొహిద్దీన్ 'పుట్టుమచ్చ' కావ్యంలో వెలువరించిన ఈ భావాలను విశిష్టమైనవిగా విమర్శకులు పేర్కొన్నారు. ఖాదర్ మోహియుద్దీన్ పుట్టుమచ్చతోనే ముస్లిం గొంతుక వినటం మొదలైందంటూ ఆవుల మంజులత ఇలా అన్నారు. "హిందూత్వ శక్తులు ఏకమై తమ పునాదిని విస్తరింప చేసుకుంటున్న కాలంలో ఈ కవిత వచ్చింది. సాహిత్య రంగంలో ఇతరేతర వర్గాలనేకాక, మైనారిటీలకు చెందిన కవుల్ని, రచయితల్ని మేల్కొల్పింది. సాహిత్యంలో, సమాజంలో తమ ఉనికిని చాటుకోవలసిన అవసరాన్ని గుర్తింప చేసింది. దేశంలో హిందుత్వ శక్తులు బలపడే క్రమం 1980ల మధ్య కాలంలోనే మొదలైంది. ఆమేరకు మత ఛాందసవాదం విస్తరించింది. మైనారిటీ వ్యతిరేక భావాలన్ని ప్రోది చేసింది. ఈ ఛాందసవాదం చివరకు బాబ్రి మసీదు విధ్వంసానికి దారితీసి, మైనారిటీల మనుగడను ప్రశ్నార్థకం చేసింది. 1992 డిసెంబర్ 6 మైనారిటీలలో అప్పటి వరకు ఉన్న భయాందోళనలని తీవ్రతరం చేసింది. 1990ల ఆరంభం నాటికై మైనారిటీ స్పృహ ఏర్పడింది. స్థూలంగా చెప్పుకోవాలంటే, ఖాదర్ పుట్టుమచ్చతో ఆరంభమైన మైనారిటీ కవిత్వ ప్రయాణం డిశంబర్ 6, 1992 తరువాత స్పష్టమైన నిర్దుష్టతను సంతరించుకుంది. మైనారిటీ చైతన్యంగా, వాదంగా రూపుదిద్దుకుంది". (మంజులత ఎ. (సం) 2005, పుట,239)

ఖాదర్ కవి మెజార్టీ భాషయొక్క అధీకృత భావాలను (Dominating ideas) యీ విధంగా అందంగాచెప్పారు.

“కలలు నా మాతృభాషలో
రావటం మానుకుంటాయి
నా ఆలోచనలు సయితం
అధికులభాషనే ఆశ్రయిస్తాయి” (ఖాదర్ మొహియుద్దీన్,1991, పుట,52)

ప్రజాస్వామ్య పంథాలోసాగే సమాజంలో అత్యధికులు పోయిన బాటలోనే అత్యల్ప సంఖ్యాకులు అయిన ప్రజలు/ మైనార్టీలు పోవలసిన అగత్యాన్ని ; వారి యొక్క భావ జాలాన్ని వ్యక్తీకరించే స్వేచ్ఛ ఏ విధంగా హరించబడుతుందో యీ కవితా వాక్యాల ద్వారా శక్తి వంతంగా ఖాదర్ మొహిద్దీన్ తెలియ పరిచారు.

‘పుట్టుమచ్చ’ కావ్యంలో అచ్చమైన కవితా వాక్యాలు మనకు దృగ్గోచరమౌతాయి. వస్తువు ‘లీలగా’ దర్శన మిస్తుంది. గాని, తానే కవితపై పెత్తనం చేసినట్లు కనపడదు అందువలన వస్తు రూపాలు సమశృతిలో లయాత్మక స్వర సంచార స్వభావాన్ని కలిగి ఉంటాయి. ‘సంధ్య’ అనే తొలి కవిత చదివినప్పుడు శ్రీ శ్రీ గారి ‘సంధ్యా సమస్యలు’ గుర్తుకు రాకపోవు.

ఒక విలక్షణత కలిగిన దృశ్యజగత్తును మనముందు నిలుపడంలో కవి సఫలీకృతుడైనాడు. తొలి పఠనంలో అర్థం కాక రెండవసారి జాగ్రత్తగా గమనించితే తప్ప అర్థంకాని ఈ కవితా దృశ్యాలను ఒకసారి పరికించవలసిన ఆవశ్యకత వుంది.

“ఊరు
పక్కనే సెలయేరు
వేళ్ల కాళ్లని నగ్నంగా బారజాపి
ఏటినీటిలో నీడల్ని శీర్షాసనం వేయించి
తపస్సు చేస్తున్న చెట్లు -
పసిపిల్లాడిలా చేతులాడిస్తున్న
బెల్‌బాటం లాటి చెట్టు -
ఎవరో చచ్చిన ఆవుని

మోసుకు పోతున్నారు
దాని తోక
నేలమీద ఎలిజీరాస్తోంది -
మతిభ్రమించిన శిల్పిలా
మేఘాల్ని చెక్కుతున్న గాలి
ఏటినీటిపై నీలంరంగు
పెయింటు వేస్తున్న ఆకాశం -
స్మశానంలో దీర్ఘంగా
ధ్యానిస్తున్న సమాధులు
వెలుగు చీకట్లు
పల్టీలు వేస్తూ
ఎర్రలంగోటా చుట్టుకుని
కాలం వేసిన / శీర్షాసనం
ఈ సంధ్యా సమయం" (పుట, 5-6)

దృశ్య జగత్తును ఒక కవితా వైచిత్రి ననుసరించి వ్యక్తపరిచి చెప్పిన కవులు చాలా అరుదుగా వుంటారు. ఇక్కడ కవి "చెట్లను" యథాతథంగా చూడడు, మనకు చూపించడు. "ఏటినీటిలో" కనిపించే చెట్లను ఇక్కడ దృశ్యీకరించడము, "చచ్చిన ఆవు" తన యొక్క దీనస్థితిని నేలమీద పారాడే తోకతో ఎలిజీగా వ్రాయడం; మేఘాలను ఇష్టం వచ్చినట్లు చెల్లా చెదురుచేసే గాలి యొక్క స్వైర విహారం; నీటిలోని ఆకాశం యొక్క దృశ్యం యొక్క రమణీయత, స్మశానంలో సమాధులు జీవితం యొక్క ఏవో విలువల సంకేతాన్ని ఇస్తున్నట్లుగా ధ్యాన సముద్రంలో వుండటమూ; అభివర్ణిస్తూ - "కాలం వేసిన శీర్షాసనం ఈ సంధ్యా సమయము" అంటూ కవి, ఒక "విలోమ క్రమంలో, సంగీత రాగాలాపనలోని అవరోహణా క్రమంలో కవితను అవగతం చేసుకోవలసిన పద్ధతిని "శీర్షాసనం" అనే పదం ద్వారా కవి సూచిస్తున్నాడు.

'తట్టినట్లు' అనే కవితలో కూడా కవి ఒక విలక్షణమైన వాయులీన దృష్టిక్రమాన్ని మన ముందు చిత్రీకరిస్తున్నాడు. ఉదాహరణకి రెండు వాక్యాలు

"విరామంలో
నిర్విరామంగా
డాబామీంచి చాపిన చూపూ, నింగీ
ఊదిన వూదారంగు రబ్బరు బూరలా కదుల్తున్నప్పుడు
చెల్లాచెదురైన గులకరాళ్లలా కదలాడే కొండచరియల్లో
మనస్తాదాత్మ్యం పక్షుల్తో కలుస్తుంది" (పుట,9)

కవి సంవేదన విలక్షణమైంది. ఇవి ప్రేరణలు ఏవిధంగా పాఠకుడిలో కల్పిస్తాయో, పాఠకుడి ప్రతిస్పందన ఏ విధంగా వుంటుందో సమీక్షించడం, కవితను అర్థం చేసుకునే క్రమంలో ఇటువంటి భావ, విభావ, సంచారీ భావాలను పరిగణనలోకి తీసుకోవలసిన ఆవశ్యకతవుంది. ఖాదర్ మొహిద్దీన్ కవిత "భావనాత్మక భావం" (ideational) మాదిరిగా కనిపిస్తుంది గాని ఆయన కవితల్లోని భావాత్మక దృశ్యం, వాస్తవిక రూపానికి ప్రతిబింబంగాని అన్యం కాదు. ఇంకొక మనోవైజ్ఞానిక సత్యం యీ కవితలోని వాక్యాల ద్వారా సువ్యక్తమౌతుంది. కేవలం కవితా వాక్యంగా వీటిని చూడకూడదు.

"ఏ సుప్త చైతన్యం నించో
ఇసకేస్తే రాలనన్ని ఆలోచన్లు"

ఈ వాక్యాలను తరచిచూస్తే ఒక సత్యం సుబోధకమౌతుంది. మనిషికి ఆలోచనలు రావాలసింది జాగృత మనస్సు నుంచి, అయితే కవి తన సుప్త చైతన్యం – నిదురించినట్లు కనిపించే చైతన్యం, అధోచైతన్యం నుంచి "ఇసకేస్తే రాలనన్ని ఆలోచనలు వస్తున్నాయి అని తేలిగ్గా చెప్పినట్లు ఉంటుంది గాని దానిలో ఒక తాత్త్విక భావన నిక్షిప్తమై వుంది. తనలోని సుప్త చైతన్యానికి తలుపు తీసి కవి చూస్తున్నాడని అర్థం – తన రహస్య ఆలోచనా పేటిక నుంచి అంతర్దృష్టి ద్వారా తన జీవితాన్ని విశ్లేషించుకున్నట్లు అవగతంఔతుంది.

"కల్లోలిత సముద్రం
శిరస్సులో సుళ్లుతిరుగుతుంది" – (పుట,10) అని కవిచెప్పడం లోనూ ఆంతర్యము అదే ! ఒక సముద్ర ఘోష మానసికావరణములో చెలరేగుతుందని కవి చెప్పడం ఉదాత్తంగా వుంది.

అదే కవితలో

“ రక్త శిఖరం నిలువునా కదిలి పోతుంది”
అని అనడంలోనూ –
“అపుడు నువ్వే
నిజంగా నువ్వే
సుతారమైన సజీవ సితారతీగల్ని తడిమి
నా కలల తలపుల్ని తట్టినట్లు
మళ్లీ మళ్లీ తట్టినట్లు” (పైదే)

ఈ “తట్టినట్లు” కవిత, కవికి ప్రేరణ కలిగించిన ఒక మనోహరి, స్త్రీ స్నేహ హస్తమే, జ్ఞాపకమే అనేది స్పష్టమౌతుంది – వస్తువుతో “మమేకత్వం” ఎక్కువగా యీ కవితలో దృగ్గోచరమౌతుంది.

ఇంత సుకుమారంగా కవిత చెప్పగలిగిన ఖాదర్ మొహిద్దీన్ “పుట్టుమచ్చ” కావ్యంలో “పుం స్త్రీ లింగం” అనే కవితలో ఒక నగ్న దృశ్యాన్ని వర్ణించడం కవితా పరంగా సబబుగా అనిపిస్తుందేమోగాని స్త్రీలను కించపరిచే విధంగా కొంత కనిపిస్తుంది. ఆ కవితా వాక్యాలను ఇక్కడ ఉదాహరించడంలేదు. ఉదహరించడానికి కూడా మనసొప్పని వాక్యాలు అవి. ఇక్కడ కవితను, కవిని నైతిక దృష్టితో చూడటం కాదు గాని, కొన్ని సందర్భాలలో వెలువడే పదాలు, ఔచిత్యాన్ని దాటి పోకూడదు. కవికి గాని కవితకు గాని ‘ఔచిత్యం ” ప్రాణం లాంటింది. ఔచితీ విచారచర్చ సాహిత్యంలో ప్రముఖమైనది.

“భావరశ్మి” అనే కవిత కూడా ఒక భావ కవితను తలపిస్తుంది. ఈ వాక్యాలు చూడండి:

“ఆ షెహనాయి ఎందుకలా రోదించడం
నీళ్ల నునుపుమీద నీటి చుక్క జారిపడినట్లు
ఒంట్లోని యింట్లో, ఇన్‌వాల్వింగ్ చెయిర్లో
ఒంటరిగా తలొంచుకొని ఏడ్వటం
ఏమిటీ యీ సెల్ఫ్‌పిటీ
అర్ధరాత్రి అద్దం ఏడుస్తున్నట్లు” (పుట, 14)

ఇవి మంచి కవితా వాక్యాలు అనడంలో ఎలాంటి సందేహం లేదుగాని, యీ కవితా వాక్యాలు పాఠకుడిని ఒక భావకవితా జగత్తులోకి తీసుకెళ్తూ వుండినట్లు ఉండడం వలన వాటి 'ఉనికి 'ని ప్రశ్నించవలసిందే ?

"తప్పదిక" అనే కవిత గూడా ఆత్మవిచారణాత్మక కవితే

"పాడుమనసు తాను పడుకోదూ
నన్నుపడుకోనీయదూ! – (పుట, 15) అని అనడంలో ఇది స్పష్టము.

'పెదాలచితి' అనే కవిత ఇంచుమించుగా శ్రీశ్రీ "కవితా ! ఓ కవితా!" అనే గీతంలా సాగి పోతుంది. ఒక "వచనగేయలయ", కవితనంతా విస్తరించు కొని వుంటుంది. కొన్ని వాక్యాలు మాత్రమే ఇక్కడ ప్రస్తావించడం జరుగుతుంది.

"ఎక్కడా ఏమీ లేక ముందు
హృదయమై స్పందించిన నా పాట –
మనిషి అన్న మార్మోగి
దిక్కుల లోంచి దద్దరిల్లి
పరితపించిన నా పాట –
కరిగి కరిగి పరమాణువై
పంచభూతాలు గర్భపీఠం మీద పగిలి
ప్రళయమై రేగి,
అల్లకల్లోలమై
సుళ్లూ, సుడిగుండాలై
చెలగి
చెలరేగి
లోయల్లోయలుగా
శిఖరాలు శిఖరాలుగా
అడవులు బీళ్లు మైదానాలుగా

నదులు సెలయేళ్లు సముద్రాలుగా
తోటలు తూనీగలు వసంతాలుగా
బ్రహ్మాండగోళాలుగా
సాగి
స్తంభించి
ఆగి
ప్రజల్తో పాటు పరవళ్లు తొక్కుతూ
ప్రపంచమై పరవశించిన నా పాట –
మట్టిలో పుట్టి, మట్టిలో పెరిగి
మట్టే సర్వస్వమై, మనిషి మస్తిష్కంలో
స్వేచ్ఛాసౌందర్యమై శోభించిన నాపాట
ఊపిరి వట వృక్షానికి కాసిన
వెచ్చటి గుండె కాయలాంటి నాపాట
అన్యాయమై, ఆకలి కన్నీళ్ళచివికి
పల్లవి పగుళ్లనించి
నాదాల నెరవల్నించి
నెత్తుటి మెత్తదనంలా
ఆవేదనలా, ఆర్తనాదంలా
నలిగి నలుపెక్కిన ఆత్మారావంలా
వినిపిస్తున్న నాపాట
పేర్చిన నా పెదాల చితి మీంచి
పచ్చటి మంటలా వెలుగుతుంది". (పుట 18,19)

ఈ పాట కవి హృదయంలోనుంచి జాలువారి, వాగై, వంకై, వరదై నదీ ప్రవాహం అయి రసజ్ఞుడైన పాఠకుడి హృదయ కుహరంలోకి ప్రవహించింది.

ఈ "పెదాలచితి" కవిత ఒక మౌనసంగీతాన్ని వినిపిస్తుంది. ఒక మనో ధర్మ సంగీత కారుని సంవేదనను మనకు ఒక రాగాలాపనలాగా, ఒక మూర్ఛన లాగా, ఒక గమకంలాగా

మనలో ఒక విషాద సౌందర్యజ్వాలను వెలిగిస్తుంది – ఈ కవితా గానంలో పరవళ్లు తొక్కినది మనిషి తత్త్వం, మానవత్వం, స్వేచ్ఛా సౌందర్యం, నిశ్శబ్ద తాత్త్విక దృక్పథం, ప్రపంచం చుట్టివచ్చిన పాట, మట్టే సర్వస్వమైన పాట ఒక అనాహతనాదంలా, ఒక ఆవేదనా శకలాన్ని పాఠకుడిలో కలిగిస్తుంది. ఒక నిశ్శబ్ద, నీరవగాఢానుభూతిని కలిగించడంలో "పెదాలచితి" కవిత ప్రథమ స్థానంలో నిలచింది.

"ఒక నిర్లిప్తపాటు" కవితలో కూడా ఒక తాత్త్విక రుచి తగులుతుంది.

> "పెన వేసుకున్న పద్మాసనం మీద
> బౌద్ధభిక్షుని మహాయానం
> తమసోమా జ్యోతిర్గమయా" అనే వాక్యాలలో
> "ఒకేఒక్క నిర్లిప్తపాటులో
> దేహం వెళ్లి పోయి, శరీరం మిగుల్తుంది" (పుట, 25) అనడం సూచిస్తున్నవి.

"ఆత్మహత్యాగ్రహం" అనే కవిత ఒక ఎలిజీ – బంగోరె మీద వచ్చిన ఎలిజీలలో ఇది ఎన్నదగినది – ఎలిజీరాయడంలో కవి తన యొక్క ప్రాణ స్పందనను వెల్లడి చేయడానికి మార్గం వెదికినట్లయింది.

"పుట్టుమచ్చ" కావ్యంలో ఖాదర్ మొహిద్దీన్ కవితల్లో "చెప్పుల్తొడుక్కున్నశవం" కవిత విశిష్టమైనది. ఈ కవిత పూర్తి పాఠం పారవేసుకున్న కవి / మరచిపోయిన కవి తన మననం ద్వారా యీ అద్భుతమైన భావ చిత్రాలు వున్న కవితను మనకందించాడు. అందులో ఒకటీ రెండూ భావచిత్రాలను ఇక్కడ ఉదహరిస్తున్నాను:

> "అజ్ఞానం, దారిద్ర్యం
> కడలిలోతుల్ని కొలుస్తున్న
> గడకర్రలాంటి శవం
> పట్టెడు మెతుకులకోసం
> పక్కలో పడుకుంటున్న శవం
> గర్భం ధరిస్తున్న శవం

గర్భం ప్రవిస్తున్న శవం
తల్లి శవం
తల్లి శవం మీదకి
విటుల్ని పిలుస్తున్న శవం" (పుట, 32-33)

ఒక వైశ్య జీవితాన్ని హృదయ విదారకంగా వర్ణించడంలో ఆ వృత్తిలోని నికృష్టతను అందుకు కారణాలను సంక్షిప్తంగా శక్తివంతముగా చెప్పడం వలన ఒక విషాద రేఖ పాఠకుడిని కమ్ముకుంటుంది. వాస్తవికతకు దగ్గరగా రావడంలో కవి సఫలీకృతుడైనాడు.

కవి సమాజంలోని చీకటి పార్శ్వాలను వెలికి దీయడంలో యీ కవితలోని భావచిత్రాలను వాస్తవిక వర్ణాలతో దృశ్యీకరించాడు.

"ప్రశ్నావశేషం" కవిత గూడా శ్రీశ్రీ కవితకు అనుసృజనే ! – ఇక ఈ కవితా సంపుటిలోని కవితను పరామర్శించడంద్వారా, విస్తృతి పెరిగే ప్రమాదం ఉందిగనుక, చివరిగా యీ కవితా సంపుటికి తలమానికమైనా 'పుట్టుమచ్చ' కవితను పరామర్శించడం తప్పనిసరిఔతుంది. పుట్టుమచ్చ కవిత సాహితీ జగత్తులో కవికి మంచి పేరు సంపాదించింది.సాహితీపరుల హృదయాలలో నిలచిపోయింది. ముస్లిం సమాజం యొక్క మనో వేదనకు అద్దం పట్టిన కవితా వాక్యాలనేకం ఈ కవితలో చోటు చేసుకున్నాయి. మచ్చుకి.

"నేనుపుట్టక ముందే
దేశద్రోహుల జాబితాలో
నమోదైవుంది నాపేరు"
కన్నబిడ్డను సవితి కొడుకుగా
చిత్రించింది చరిత్ర
అన్నదమ్ముల్నించి చీల్చి

నన్ను ఒంటరివాణ్ణి చేసింది చరిత్ర" (పుట,46-47)

ముస్లిం మైనారిటీలను "దేశద్రోహులుగా పుట్టకముందే నిర్ణయించే మతాహంకారాన్ని, ఈ గడ్డమీద పుట్టి, ఈ గడ్డమీద జీవించి, మరణించే ఒక జాతిని "సవతిబిడ్డగా" చూసే దృక్పథాన్ని

కవితా వాక్యాలలో పదునుగా అభివ్యక్త పరచాడు ఖాదర్.ఒక మతానికి సంబంధించిన వ్యక్తి పుట్టకముందే "దేశ ద్రోహిగా" ముద్రవేయబడడం అమానుష చర్య. ఈ ఆటవికచర్యను తీవ్రంగా గర్హించి కవి, ఆ దృక్పథాన్ని సమాజం దృష్టికి తీసుకువచ్చాడు, కవితాశక్తితో!

"నా ప్రమేయం లేని పరిణామాలకు
నన్ను కర్తను చేస్తూంది వర్తమానం" (పైదే)

ప్రస్తుత సమాజంలో జరిగే పరిణామాలను, మంచి చెడులను అందరి తలకుచుట్టడం ఎవరోచేసిన దానికి ఇంకెవరినో కారణభూతం చేయడం సమంజసం కాదని , న్యాయం కాదని కవి వాదన సమంజసమూ, సహేతుకమూ కూడా !

"హిందీ- హిందూ- హిందూస్థాన్
ముస్లిం జావో పాకిస్థాన్"
ముసల్మాన్‌కే దోహీస్థాన్
పాకిస్థాన్ యా ఖబరస్తాన్" (పుట, 48)

ముస్లింలపై ద్వేషభావం ఏ స్థాయికి చేరుకున్నదీ యీ పై స్లోగన్లు స్పష్టపరుస్తాయి. ఈ కవితలో ఖాదర్

"రాజ్యాంగం నాభుజం తట్టదు
మీసాల గుబురుల్లోంచి
ముసిముసిగా నవ్వుకుంటూన్న
మూడు సింహాల సింహాసనం
నాకేసి ముఖం తిప్పదు" (పైదే)

అని అనడం ముస్లిం సమాజం యొక్క ఆక్రోశాన్ని, ఆవేదనని మూడు ముక్కల్లో, రాజ్యాంగ రక్షణ లేక పోవడం, "మూడు సింహాల సింహాసనం" న్యాయాన్ని కల్పించకపోవడం పదునుగా, హృదయానికి హత్తుకు పోయే విధంగా కవి కవిత్వీకరించాడు.మైనారిటీ వర్గానికే కాకుండా, నిస్సహాయులకు, నిర్భాగ్యులకు, గర్భదరిద్రుల వైపుకి అధికారం, చట్టం, న్యాయం లాంటివి చూడవనే నిత్య సత్యాన్ని వెల్లడించినట్లయింది.

కుట్రను గురించి కూడా వ్యంజన పరాకాష్ట నందుకొంటుంది, ఈ విధంగా:

“అవును నేను కుట్రదారుణ్ణి కదూ!
అవును ఇస్లాంకీ – ఇస్లామాబాదుకీ మధ్య
అభేదాన్ని పాటించడం కుట్రకాదు
పుట్టి పెరిగిన దేశంలోనే
నన్నొక కాందిశీకుణ్ణి చేయడం కుట్రకాదు
ఖండ ఖండాలుగా నరికి
నిలువునా నన్ను నిర్మూలించి
అఖండ భారతం నిర్మించాలని
కలలు గనడం కుట్రకాదు” (పుట, 49)

ఒక హిందూ వర్గం యొక్క దృక్పథాన్ని గట్టిగా ఖండించి కవిత్వాన్ని పండించాడు ఖాదర్ మొహిద్దీన్. “ముస్లిం మైనార్టీలు చేసే వృత్తుల గురించి దాని ద్వారా వారు ఎంత దయనీయంగా జీవిస్తున్నారో తెలియపరిచే ఒక పద్యం, ఈ కవితలోనే;

“పట్టెడన్నం కోసం
పేవ్‌మెంటుల మీద పూలమ్ముకుంటాను
పళ్ళమ్ముకుంటాను, పల్లీలమ్ముకుంటాను
గొడుగులుబాగు చేస్తుంటాను
గడియారాలు బాగు చేస్తుంటాను
వీధి అరుగులమీద దర్జీపనిచేస్తుంటాను
దూదేకుతుంటాను దినం గడుపుకొంటాను
ఏగొడవ లేకుండా
బతుకును వెళ్ల మార్చాలనుకుంటాను”
ఉన్నట్టుండి ఎందుకోమరి
నగరాల నడి వీధుల్లో
నానెత్తురు తీర్థ స్నానఘట్టమౌతుంది. (పుట, 50)

ఈ కవితలో ముస్లింలలోని గరీబోళ్ల జీవన దృశ్యం కనిపిస్తుంది. ఇంత పేదరికంలో ఉన్న ముస్లింలు ప్రశాంత జీవనాన్ని కోరుకోక మరేం కోరుకుంటారు? ముస్లింలు సమాజంలో విధ్వంసాన్ని కోరుకునే వాళ్లు కాదని, సంకేతించాడు కవి. అయితే ఇలాంటి ప్రశాంత జీవనాన్ని గడుపుతున్న ముస్లింల రక్తం “ నగరాల నడివీధుల్లో” స్నానఘట్టమౌతుంది అని చెప్పడం వలన ఉగ్రవాదుల దాడులు జరిపితే హిందూ సమాజానికి నష్టం కలుగుతుంది. హిందుత్వ వాదులు దాడులు జరిపితే “ దూదేకు కొని పూటగడుపుకొనే వాళ్ళు , గొడుగులు, గడియారాలు బాగుచేసుకొనే వాళ్ళు ప్రశాంతంగా జీవించే వాళ్ళు బలి అయిపోతున్నారని ఆవేదన వ్యక్తపరిచాడు కవి.”

ఇంకా ఈ దీర్ఘ కవిత పుట్టుమచ్చలో అనేక పార్శ్వాలను, నిజాలను, కవి వాస్తవీకరించడంలో సఫలీకృతుడైనాడు. ప్రధానంగా ముస్లిం సమాజం యొక్క సంస్కృతీ సభ్యతలను అధిక సంఖ్యాబలం గలిగిన మెజార్టీ వర్గాల ఏ విధంగా చూస్తున్నవో ఈ కవితను విశ్లేషించడం ద్వారా అవగతం చేసుకోవచ్చు. కవి ఖదీర్ అంటాడు.

“ఎన్నికల ముందు
ఎన్నెన్నో సంఘటనలకు ముందు
దేశ చరిత్ర దిశానిర్దేశానికి
నానెత్తురు గూడు పట్టివుంది
పార్లమెంటు భవనంలో వాలేందుకు
నా నెత్తురు పాదలేపనమవుతుంది.” (పుట, 51)

అని కవి అనడంలో మత రాజకీయాల వలన, కుల రాజకీయాల వలన, కుతంత్రాల వలన, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి “ఓట్లుదండుకొని” “సీట్లు పండించుకొని” అసెంబ్లీల్లో, పార్లమెంటులో అడుగుపెట్టే వికృత రాజకీయ పార్టీల స్వరూపాన్ని బట్టబయలు చేయడం హర్షణీయం. ఇంకా :

“ నా రక్తం రియల్ఎస్టేట్
వ్యాపారమవుతుంది. ”
“ నా రక్తం రాజ్యాధికారానికి
రక్షణ కవచమౌతుంది.” (పుట, 51)

అనడంలో ముస్లిం వర్గం ఏ విధముగా ఉపయోగించుకోబడుతుందో స్పష్టీకరించి నట్లయింది. వివిధ పార్టీలు ముస్లిం మైనారిటీ వర్గాన్ని ఏవిధముగా ఓటుబ్యాంకుగా వాడుకుంటుందో కవి స్వరములోనే.

"నారక్తం పదవీసోపానికి
అభయహస్త మవుతుంది"
నారక్తం 'భరతమాత' నుదుటి
తిలకమవుతుంది, పూజా 'కమల'మవుతుంది (పైదే)

ప్రధాన పార్టీలు రెండూ ముస్లిం వర్గాన్ని ఆసరాగా తీసుకొని అధికార పీఠం ఎక్కే క్రమాన్ని కమనీయంగా కవితాత్మకంగా వ్యక్తపరచాడీ కవి : తన భావనా ప్రపంచంలో భారతీయ సంస్కృతీ సభ్యతలకు సంబంధించిన భాషనే ఆశ్రయిస్తానని, నన్ను పరాయివానిగా, ఈ పురిటి గడ్డనుంచి వేరయినా వ్యక్తిగా భావించవద్దని మనవి చేస్తున్నాడు.

"క్షమించండి, నా స్నేహితుల్లారా!
వక్రీకరణకి వత్తాసుగా
పదబంధాన్ని సృష్టించి
నన్ను వెక్కిరించడానికి వెనుదీయని
మహాకవిని నేను మన్నించలేను" (పుట, 53)

మహాకవి శ్రీశ్రీ 'కసాయి', 'సాయిబు' అనే పదాలను కలిపి "కసాయిబు"గా ఒక కొత్త పదబంధాన్ని 'ప్రాసక్రీడలు' అనే కావ్యంలో సృజించాడు. ముస్లింలు, కసాయి తత్త్వం కలిగిన వారని ధ్వనీ కరించాడు. కవి, మహాకవి పదబంధాన్ని " కసాయిబు " తప్పనడం, శ్రీశ్రీ నయినా క్షమించలేనని పలకడం, కవి యొక్క ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తుంది. కసాయి + సాయిబు అనే పదాలను 'కసాయిబుగా' శ్రీశ్రీ తమాషాగా పదబంధాన్ని సృష్టించడము తప్పే! శ్రీశ్రీ వెలువరించిన భావాలు, ముఖ్యంగా తన సమకాలీన కవులైన విశ్వనాథ, జాషువా, కృష్ణశాస్త్రి, జరుక్ శాస్త్రి, లాంటి వాళ్లపైన ఆయన విసిరిన వ్యంగ్యాస్త్రాలు, ప్రసిద్ధాలు. అయితే కొన్ని వాస్తవంగా వుండక కొంత ఇబ్బందిని కలిగిస్తాయి. అటువంటి వాటిల్లో యీ " కసాయిబు " పదం ఒకటి. ఈ క్రమంలోనే ప్రజాకవి సుద్దాల హనుమంతు గురించి వ్రాస్తూ కవి

“మన్నించండి, నా మిత్రుల్లారా!
రాజుకీ, పేదకీ మధ్య
బేధాన్ని చూడలేని
ప్రజాకవి ఉద్రేకానికి
నేను ఉగ్రూతలూగలేను” అంటాడు (పుట, 53)

ప్రజాకవి సుద్దాల హనుమంతు, తెలంగాణా రైతాంగ పోరాటానికి ఊపునిస్తూ పాడిన / వ్రాసిన పాట: “వెయ్‌వెయ్‌ర దెబ్బవెయ్ తరగర, నరకర తురకలు గుండాగొయ్యలు” అని అనడంలో, నిజాం రాజుకీ, సామాన్యులు, బీదాబిక్కి అయిన “ముస్లింలకు” ఉన్న బేధాన్ని గుర్తించలేక పోయారని స్పష్టమౌతుంది. ఈ విషయాన్ని ఖాదర్ కవి ప్రస్తావించడంలో ముస్లిం మీద సాంస్కృతిక దాడిని కవి గుర్తించి దానిని వ్యతిరేకించడంలోని సమర్ధనీయత అర్ధమౌతుంది.

ఇంతకీ యీ ‘పుట్టుమచ్చ’ కవితకి పరాకాష్ట, యీ పుట్టుమచ్చ ఏ విధంగా వ్యాప్తమైందీ కవిత చివరలో ప్రస్తావించడం జరిగిందిలా

“అవును నాది మచ్చపుటక అన్నారు కదూ!
నన్ను ఏకంగా పుట్టుమచ్చగా పునీతం చేశారు కదూ!
పెత్తందార్ల ఎత్తుగడలు, వ్యూహాలకీ
నా చుట్టూ అల్లుకుంటున్న ఉరితాళ్లకీ మధ్య
ఏమిటీ అనుబంధం అని అడగలేను
వాళ్లూ వాళ్లూ కలసి పంచుకున్న ఊళ్ల మధ్య
అర్ధరాత్రి సరిహద్దు రేఖలా పారిన నెత్తుటి యేరుతో
ఏమిటీ నాకున్న సంబంధం అని నిలదీయలేను” (పుట, 55)

కవి, కవివెనుకనున్న ఒక మైనారిటీ వర్గం ఏనాడో జరిగిన దుర్ఘటనలకు కారణం ఎలా అవుతుంది. దాదాపు మూడుతరాలు గడిచిపోయిన, తరువాత వచ్చే / వచ్చిన మార్పులను గమనించకుండా, యీనాడు పూర్తిగా యీ పురిటి గడ్డమీద ఆధారపడిన అల్ప సంఖ్యాక వర్గాలవారిని “మచ్చపుటక” అని నిందించడంలో అర్ధమూ, పరమార్ధమూ లేదు, స్వార్ధదృష్టి మాత్రమే వుంది. ఈ విషయాన్నే తన పై కవితా వాక్యాలలో స్పష్టీకరించాడు.

"త్రిశూలాల మొనల మీదా
పి.ఏ.సి. తుపాకుల కొనల మీదా
బాలెట్ బాక్సుల కొసలమీదా
నెత్తురోడుతున్న నా పుట్టు మచ్చను గురించి
ప్రశ్నించలేనని" (పుట, 55-56)

అంటూ అసలు 'పుట్టుమచ్చ' మూలాల్లోకి వెళ్ళి ముగిస్తున్నాడు, ఈవిధంగా

అవును, పుట్టుమచ్చ నా ఉనికి
పుట్టుమచ్చ నా అస్తిత్వం
పుట్టుమచ్చ నా పౌరసత్వం
నేను ఊపిరి పీలుస్తూ మసలుతున్న
నేలగాలీ పరిసరాలు
నాకు దాఖలు పరచిన వారసత్వం పుట్టుమచ్చ
ఎప్పటికీ మానని గాయం యీ పుట్టుమచ్చ" (పైదే)

సమాజం - సంస్కృతి అన్న దానిలో మమేకం అయి, తమ ప్రత్యేక అస్తిత్వాన్ని నిలుపుకుంటూ జీవిస్తున్న మైనారిటీ వర్గాల, వేదనను, సంవేదనను వ్యక్తీకరించడంలో 'పుట్టుమచ్చ' కావ్యం సాహితీ జగత్తులో తిరుగులేని అజరామరత్వాన్ని పొందగలిగింది.

కావ్యం ప్రారంభంలో, వైయక్తిక అనుభూతులను గూడా తల్లక్రిందులైనట్లు వర్ణించడం వలన తన బ్రతుకు తలక్రిందు అయిపోయినదనే సంకేతాన్ని వ్యక్తి పరంగా ఇచ్చాడు. తరువాత తన వర్గం సాముహిక జీవనం కూడా తలక్రిందులు అయినదనే భావననూ కావ్యమంతటా విస్తరించడం జరిగినది. అసలు తను చెప్పవలసిన సామూహిక భావజాలానికి నేపథ్యంగా, తన వైయుక్తిక అనుభూతులను ఉపయోగించి, తన ముస్లిం సమాజం ఏవిధంగా అవమానాలకు అవహేళనలకు గురి అయిందో, రాజ్యాంగం దృష్టిలో సైతం చిన్న చూపు చూడబడుతుందో, సమాజంలో తమకెలాంటి స్థానం ఉందనే వాస్తవాలను కవితాపరంగా 'పుట్టుమచ్చ' కావ్యంలో ఘనీభవింపచేశాడు ప్రముఖ కవి ఖాదర్ మొహిద్దీన్ - ఈ కవి యొక్క కవిత, వస్తురీత్యానే కాకుండా శిల్పరీత్యాకూడా గణనీయ, రమణీయ కావ్యంగా తీర్చి బడిందనటం సమంజసం.

"పుట్టుమచ్చ" కావ్యం ద్వారా ఖాదర్‌మొహిద్దీన్, ఒక సామాజిక లక్ష్యాన్ని నిర్దేశించారు. హిందూత్వవాదులు, మైనారిటీ వర్గం పట్ల వివక్షతను చూపడం, సామాజిక ధర్మం కాదని, " నా రక్తం రాజ్యధికారానికి రక్షణ కవచం కాకూడదని, మతో ద్రేకాల వీడి శాంతియుత సహజీవనం కోరే ఎక్కువ శాతం హిందూ – ముస్లింలను జీవితాలను చిద్రం చేయకూడదని కోరుతూ మైనారిటీలకు సామాజిక భద్రతను కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం కాకూడదని సూచిస్తున్నారు. ఆయన ప్రతిపాదనలు కవితా మయంగా సమంజసంగా వున్నాయి. ముస్లిం భావజాలాన్ని సంస్కృతిని యీ కావ్యం విలక్షణంగా ప్రతిపాదిస్తూ, ముస్లిం సమాజం ఏవిధంగా వివక్షత గురి ఔతుందో, యీ కావ్యం నిరూపించింది.

## IV.4. షేక్ కరీముల్లా - సాయిబు

షేక్ కరీముల్లా దీర్ఘకవిత 'సాయిబు ' – ఈ కవితా సంపుటికి 'సాయిబు' అని పేరు పెట్టడం వెనుక మేము ఎంతకాలమున్నా యీ నేలమీద 'సాయిబు', 'తురక' అనిపించుకోవడం తప్పదనే ఒక ఆత్మన్యూనతాభావం వ్యక్తమౌతుంది. "సాయిబు" అనేది ఒక నిందా వాచకంగా సమాజంలో వాడబడుతుంది. ఆ నిందాపూర్వక పదాన్నే కవితా సంపుటికి పేరు పెట్టడంలో ఒక గడసరితనం కనిపిస్తుంది.

ఈ కవితా సంపుటికి పీఠిక వ్రాస్తూ ప్రముఖ విమర్శకుడు డా. అద్దేపల్లి రామమోహనరావు అన్న వాక్యాలు విస్మరించరానివి. ఆయన అంటాడు.

1. "భారతదేశానికి హిందువులు, ముస్లింలు రెండు కన్నుల వంటివారు, ఏ కంటికి గాయమైనా యావత్ దేహం బాధపడుతుంది." "అని (సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్) అన్న ఒక మేథోజీవి ఆలోచన సమంజసంగా, సహేతుకంగా ఉంది".

2. "భారతదేశంలో ఈనాడు ముస్లిం ప్రజలు తీవ్రమైన అభద్రతా భావానికి గురౌతున్నారు, దీనికి దేశంలోని పరిస్థితి ఒకకారణం, ప్రపంచంలోని పరిస్థితి రెండో కారణం" (రామమోహనరావు అద్దేపల్లి, 2004, పుట,4) అని ఈ సమస్య యొక్క పూర్వాపరాలను రెండు వాక్యాల్లో విశదీకరించారు డా. అద్దేపల్లి. ఇంకా వారు "ఈ దీర్ఘకవిత మొత్తం ముస్లిం కవిత్వంలోనే ఇస్లాం

వాదమనే సరికొత్త వాదంతో తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించడం, ఆ వాదంలో తొలి దీర్ఘకవిత కావడం గమనించదగిన విషయం". అని అన్నారు. (పుట, 4)

డా॥ అద్దేపల్లి చెప్పినట్లు ఒక నూతన దృక్పథాన్ని కవి షేక్ కరీముల్లా ఏవిధంగా అభివ్యక్త పరచాడో విశదీకరించవలసివుంది.

ఇందులోని అంశాలు

1) దేశీయమైన అస్తిత్వ దుఃఖం

2) అంతర్జాతీయమైన అస్తిత్వవేదన

ఈ రెండింటి సమ్మేళనంతో, ప్రధానమైన రెండు అంశాల మధ్య కవి తన యొక్క కవితాకళకు వన్నెతగ్గకుండా దీర్ఘకవితను పండించిన విధానాన్ని సమగ్రంగా అంచనా వేయవలసి వుంది.

అంతర్జాతీయ 'ఉగ్రవాద' ప్రచారంలో సమిధలౌతున్న యిక్కడ సామాన్య ముస్లీంల తరపున కరీముల్లా తీవ్రమైన స్వరంతో గళమెత్తాడు

"మా తల్లుల గర్భాలు
టెర్రరిస్టు క్యాంపులా?
శాంతిని వల్లించే మదరసా పాఠాలు
జిహాదీ కోర్సులా?
పాలకోసం ఏడ్చేనాబిడ్డేడుపు
తీవ్రవాదమా"
....................
తురుష్కుడ్ని కాని నాపై
తురకముద్రలద్దిన కురూపుల్లారా
హూణుల్ని హూణులనలేదు
కుషానుల్ని కుషానులన లేదు

ఆర్యులను ఆర్యులన లేదు
కాని.....
ఈ మట్టి కణాల్లో కణమైనోణ్ణి
ఫలాల్లో తీయనిఫలమైనోణ్ణి
నేనెట్లా తురకనయ్యానో
కొద్దిగా చెబుతారా స్వాములు?
మూలవాసినైన నాపై
పరాయితనం పరదాకప్పి
అనుక్షణం కుళ్లబొడిచే పదం 'తురకోడు' (పుట, 19-21)

'తురకోడు' అనే పదం ముస్లింలను కించపరచేది- ఇందులోని అనౌచిత్యాన్ని, హేతు వాద దృక్పథంతో విశదీకరించాడు కవి కరీముల్లా!

ఇస్లాం మతంసూచించే శాంతి మార్గాన్ని కవి ఆధునీకరించాడు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని కూడా కవి విస్మరించలేదు.

"హంతక **ISI** ముఠా
ఉన్మాద క్రీడ షరామామూలయ్యింది
మతం వాసనెరుగని చిగురాకులు
పండుటాకుల్లా రాలాయి
నిన్న పార్లమెంట్
నేడు అక్షరథామ్
రేపు మరేదో?
నయవంచక పాక్ పాలకుల్లారా
అల్లహ్ మిమ్మల్ని క్షమించడు" (పుట, 95-96)

ఇక్కడ కవి ఉగ్రవాదానికి కేంద్ర బిందువయి, మతాన్ని అడ్డు పెట్టుకొని జీవనం సాగించే పాక్ పాలకుల 'ద్వంద్వనీతిని' వ్యతిరేకిస్తాడు. మతం యొక్క కొన్ని మౌలికమైన విలువలకు ప్రాధాన్యత నివ్వాలనే అంశాన్ని కవి చెప్పడం, కొంత ఎలివేషన్ దృష్టి కనపడుతుంది. అయితే

కవి, మత దృక్పథాన్ని మించి ఇంకా ముందుకువెళ్లి ఒక శుద్ధతాత్త్విక దృక్పథానికి చేరివుంటే బాగుండేది. అప్పుడు సత్యాన్ని మత దృష్టితో కాకుండా తాత్విక దృష్టితో చూడటానికి వీలు కలిగేది – అప్పుడు కవియింకా విశాలత్వంలోకి, విమలత్వంలోకి పయనించడం జరిగేది. ఏది ఏమైన కవి తన యొక్క సమాజం యొక్క ఉగ్రవాదం యొక్క సమస్యలకు మతసూక్తుల నుంచి పరిష్కారాన్ని చూపిస్తున్నాడు. కాని, ఏ మతం అయినా అంటే హిందూ, ముస్లిం, క్రైస్తవ, శిక్కు, మతాల ధోరణి హేతువాదానికి తార్కికతకు దూరంగా ఉంటుందనే విషయం, కవులూ, మేధావులు విస్మరించరాని విషయం.

మతం నుంచి తత్వశాస్త్రం ఎప్పుడో విడిపోయింది. పూర్వం మతమూ – తత్వశాస్త్రం కలిసి మెలిసి సహజీవనం చేశాయి. కాలక్రమేణా మిగతా అన్ని శాస్త్రాలలో మాదిరిగా , సత్యన్వేషణ వేయి ముఖాలుగా వికసించింది. అయితే కొంత మంది కవులు మాత్రం. “ మత దృక్పధాన్ని” వీడినట్లు కనిపించడంలేదు. ఏది ఏమైనా ఒక పటిష్ఠమైన తాత్విక నేపథ్యం కలిగిన కవి ఎక్కువగా తన భావజాలాన్ని విశ్వవ్యాప్తం చేయగలుగుతాడు. మన రవీంద్రుడు, శరత్ చంద్రుడు, అరవిందుడూ అలాంటి కవులూ, రచయితులే! అయితే ఒక సిద్ధాంతానికి గాని ఉద్య మానికిగాని కమిట్ అయిన కవి దృష్టి ఎక్కువ శక్తివంతంగా కనిపిస్తుంది. అటువంటి కవి కరీముల్లా.

షేక్ కరీముల్లా దళితులు – సాయిబులుగా తమ ఉనికిని మార్చుకున్నారనే సత్యాన్ని యీ కావ్యంలో కవిత్వీకరించారు.

> “మలబార్‌ని తాకిన ఇస్లాం పవనం
> తొలకరి జల్లు కురిపించింది
> పెదివిదాటిన
> నాదళిత ఎంగిలిని
> షర్బత్‌లా చప్పరించింది” (షేక్ కరీముల్లా, 2004, పుట,16)

తరతరాలుగా బానిసత్వానికి, సమాజపీడనకు గురి అయిన వర్గాలు ఇతర మతాల తరుచ్ఛాయల్లో ఎలా సేదతీరిందీ యీ పై వాక్యాలు తేట తెల్లం చేస్తున్నాయి.

"కార్గిల్‌లో బలిదాన మిచ్చిన
నేటి హమీద్‌ని, మస్తాన్‌వలీని
నా ఉనికిప్పుడు ప్రశ్నార్ధకమైంది." (పుట,17)

అని కవి అనడంలో, జాతీయ భావంతో కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన ముస్లిం వీరజవానుల "బలిదానం" గుర్తుకు రాలేదా ! మెజార్టీ సమాజానికి ? అని అంటూ సూటిగా హృదయాలకు నాటుకొనే విధంగా, తన దేశభక్తిని శంకించవద్దని హెచ్చరిస్తున్నాడు. భారతదేశం, సరిహద్దు యుద్ధాలలో నున్నప్పుడు, తన వర్గం, జాతి, తన తోటి ముసల్మానులు చిందించిన రక్తాన్ని జ్ఞాపకం చేసుకొమ్మని వేడుకుంటున్నాడు. ఈ మట్టిలో పుట్టి, ఈ మట్టిలో ఆడుకొని, పెరిగి పెద్దయి మమేకమయిన ముసల్మానుల దేశభక్తిని శంకించడం అంటే తల్లి తన పిల్లవాడి యొక్క ప్రేమను ప్రశ్నించినట్లు, తన మాతృత్వాన్ని తానే మలినం చేసుకున్నట్లు భావించడంలో దోషం లేదనుకుంటాను.

ఇక్కడ ఇంకో ప్రశ్నని సంధిస్తున్నాడు కవి కరీముల్లా:
అయినా....
నమ్మకాల్ని నమ్ముకున్న నన్ను
నమక్‌హరామ్ నంటున్న నాజీ మూకల్లారా!
ఈ జమీన్ జమీనంతా
బ్రిటీషోడి రాక్షస రతికి గురైనపుడు
ప్రాణాలను పేలాలుగా పేల్చిందెవరు?
తెల్లోడి తూటాకు బెంబేలెత్తి నోళ్లంతా
టిప్పుఖడ్గానికి మసిపూస్తుంటే
సామరస్యాన్ని పంచే సూఫీ సమాధులపై
కంకర రోడ్లు వేస్తుంటే
'సారే జహాసే అచ్చా' రాసిన మా కలాలే
నిప్పులు కురిపిస్తాయని తెల్సుకోండి
ఏ బద్మాష్ **ISI** గాడో

డిల్లీలో పేల్చే గలీస్ బాంబుకీ
గల్లీల్లో పల్లీలమ్ముకొనే భుక్కాఫకీరుకూ
సంబంధమేంది భయ్! (పైదే)

అవును, కవి సంధించిన ప్రశ్నకు జవాబు చెప్పవలసిన అవసరం మతవాదులందరికీ ఉంది. ఎవడో **ISI** ఏజెంట్ బాంబు వేస్తే, గల్లీలో పల్లీలు అమ్ముకొనే ముసల్మానుకు, పేదఫకీరుకి ముడి పెట్టడం బట్టతలకూ, మోకాలికి ముడి వెయ్యటం లాంటిదే! ఏమతం వారు ఉగ్రవాదులుగా మారినా, అది మతానికి సంబంధించిన అంశం కాకపోవచ్చుగాని 'మతపిచ్చి' తలకు చుట్టుకొన్న వాడిపనే! హిందూ చాంధసవాదులు మసీదును కూల్చడం కూడా ఇటువంటి దృష్టితోనే చూడవలసిన ఆవశ్యకత వుంది. ఏ మతంలోనైనా కొన్ని మంచి మాటలుంటాయి. అవి మత్మోనాదం మాటున మూగ పోతాయి.

ఇంకొక ప్రశ్న కూడా తలెత్తుతుంది కరీముల్లా కవితలో:

"అమెరికా ఎక్కడుందో తెలీని
అ,ఆ లు రాని అమాయక సాయిబుకు
ఆల్ఖైదాకు లింకేంది భయ్" (పుట, 18-19)

ఇది నిజం కూడా ! ఎక్కడ ఏంజరిగినా యిక్కడ ముస్లిం వ్యక్తిని అనుమానితుడిని చెయ్యడం మానవత్వం సహించలేని విషయం. 'తురకోడు' అని నిందించడానికి యీ కవి చెప్పిన జవాబు ఎంతో శక్తివంతమైంది.

"ఫజర్ నుండి ఇషా వరకు
పసీనాలో తడిసి తడిసి ముద్దయితే
తల్వారై చీల్చేపదం 'తురకోడు'
వేయి పడగలు విప్పిన పాము
పంచేంద్రియాల్ని వెక్కిరిస్తుంటే
భయం నీడలో నన్ను నేను

ఆవిరిచేసుకుంటూ భరించిన పదం ‘తురకోడు’
మూలవాసినైన నాపై
పరాయితనం పరదాకప్పి
అనుక్షణం కుళ్లపొడిచే పదం ‘తురకోడు’
తప్తమైన విలువల సాక్షిగా
ఫిల్టర్ కాలేని మురికి డ్రైనేజీలా
నాసికల్ని తాకే పదం ‘తురకోడు’ (పుట, 20-21)

ఈ ‘తురకోడు’ పదం, ‘తురకా మరకా ఎగరేసి నరకా’ అనే గాలివాక్యం, ఎదుటి వారి మనసుల్లో, జీవితాల్లో ఎంత అలజడి రేపుతుంటాయో యీ పై వాక్యాలు బలమైన సాక్ష్యమిస్తాయి. అయితే యీ ‘తురకోడు’ అనే పద ప్రయోగం ఒక దశాబ్దం వెనుకే వెనకబడి పోయింది దాని స్థానంలో “సాయిబు”, ‘ సాహెబు ’, అనే పదాలు బాగా వాడుకలో ఉన్నాయి. ఇప్పుడు కొంచెం సామాజిక స్పృహ పెరగడంతో “ తురకోడు ” అనే పదం మూలపడిపోయింది. ఇక్కడ పై కవితా వాక్యాలలో ఒక విస్పష్ట ప్రకటన చేస్తున్నాడు. ఈ దేశానికి “ మూలవాసి ” ని నేనేనంటున్నాడు. ఇది కూడా ఆలోచించవలసిన విషయమే !

ప్రథమ సర్గలో తన కవితను ముగిస్తూ కరీముల్లా ఒక ఐక్యతారాగాన్ని యీ విధంగా ఆలాపించాడు, సమన్వయ సామరస్య దృష్టితో:

“ఐదు వేళ్లు కలిస్తేనే కద
పిడికిలి
బొటన వేలు చిటికెన వేలును
పరిహసించినా
చిటికిన వేలు బొటన వేలును
తెగనరికనా
ఈ బిగింపుకు విలువుందా?
ఈ చేతికి బలముందా?” (పుట, 22)

ఐదు వ్రేళ్లు వుంటేనే సమైక్య దేశం అని, ఒక వేలు ఇంకొక వేలుని నరికివేస్తే, చేతిలో బిగువుపోయి బలహీనమయి, దేశం బలహీనమై పోతుందని ప్రపంచపటంలో పలచన అయిపోతామని ఒక హెచ్చరికను జారీ చేస్తున్నాడు, క్రాంత దర్శి అయిన కవి కరీముల్లా!

దేశంలో ఘర్షణలు జరిగినప్పుడు, పేలుళ్లు సంభవించినప్పుడు ముస్లిం ప్రజ ఏ విధంగా భయంకరమైన టార్చర్‌కి గురి అవుతుందో కరీముల్లా వ్యక్తీకరించాడు. దేశ సమైక్యతకు ముస్లిం కవులు/రచయితలు ఏ విధంగా ఒక గొప్ప స్ఫూర్తితో తమ తమ రంగాలలో పనిచేశారనేది స్పష్టమైంది. ముస్లింల జాతీయభావాలు ప్రశ్నించరానివని, ముస్లింలకు వేరే సమాజం సంస్కృతి అనేది ఒక మిథ్యా భావన అని, ముస్లింలంతా ఎక్కువభాగం భారతీయతపైనే తమ దృష్టిని ఉంచారనేది విస్పష్టం.

> "కాలనాగుల్ని చేతికి చుట్టిన
> కాలయముడిలా రాజ్యం
> ప్రతిగడ్డం వెంట్రుకను
> సోదాచేస్తుంది" (పుట, 27)

ఈ సోదాల్లోముస్లిం జీవితాలు, ముఖ్యంగా పేద ముస్లింల జీవితాలు వ్యథాభరితమై పోతాయి. అటువంటి సన్నివేశాలను యీ దీర్ఘ కవితలో కరీముల్లా చక్కగా అభివ్యక్తపరిచాడు. ఇక్కడ ఒక వ్యంజన కూడ వుంది. ప్రభుత్వ దళారులు కోడిగ్రుడ్డుకు ఈకలు పీకినట్లు " ప్రతి గడ్డం వెంట్రుకను సోదా చేస్తుంది." అనడం! సాయిబు జీవితం ఎంత సంక్షుభితమౌతుందో యీ వాక్యాలు పట్టిస్తాయి.

> "నా జీవన చిత్రం
> ముళ్ల పొదలో నక్కిన పిచ్చుకగాయం
> నెత్తురోడుతున్న ఛిద్ర స్వప్నం
> కసాయి చెరలో
> కన్నీరొలుకుతున్న ప్రాణం
> దారిద్ర్యానికి చిరునామా ఏదని
> ఇప్పుడెవర్నడిగినా ఇట్టే చూపిస్తాడు" (పుట, 31)

దళితులు, ముస్లిం పేదవర్గాలు, ఇంకా అనేకమైన చేతి వృత్తుల వెనుకబడిన వర్గాల వారు దారిద్ర్య దేవతకు అనుంగుపుత్రులు. ఆ ఇనుప గజ్జెల తల్లి వీళ్లను తన అక్కున చేర్చుకొని ఎల్లప్పుడూ తోడూనీడగా వుండటం పై వాక్యాల్లో కనిపిస్తూ, యీ జాతులు 'దారిద్ర్యం మా జన్మహక్కు' అనే దాకా పోయింది. అందువల్లనే కవి యీ శక్తివంతమైన కవితా వాక్యాలతో దరిద్రుని రూపాన్ని అభివ్యక్తి పరచారు. ఇది కేవలం మైనారిటి ముస్లింల దరిద్రమే కాకుండా, దళితుల పేద వర్గాలకు కూడా వర్తిస్తుంది. ఒక వాదనను బట్టి ముస్లింలు కూడా దళితులే! అందుకే ప్రజాశక్తి దినపత్రిక కరీముల్లా కవితలను యీ విధంగా అభివర్ణించింది. "కరీముల్లా కవితలు బలమైన అక్షరాయుధాలను మోసుకెళ్లే యుద్ధ విమానాలనిపిస్తాయి" (ప్రజాశక్తి దినపత్రిక, జనవరి, 2003)

పేదరికంలోనూ కోల్పోని "ఆత్మగౌరవాన్ని" కరీముల్లా చక్కగా వివరించాడీవిధంగా :

"పట్టెడు మెతుకులకోసం
పాచిపనికెళ్లినా జారని తలపై కొంగును
ప్రతి కనుగుడ్డు రెప్పవాల్చి గౌరవిస్తుంది" (పుట, 35)

ఎంత పేదరికం, అయినా, ఆత్మ గౌరవం కాపాడు కోవడంలో తిరుగులేని వారమని అది మా సాంప్రదాయమని కవి సూచించడం హృద్యంగా వుంది. ఇక్కడ ఎంత పేదరికంలో ఉన్నా ముస్లిం మత సాంప్రదాయాలను ఆచరించడం వలన సమాజం ఎటువంటి చిన్నపని చేసినా గౌరవంగా చూస్తుందని కవి అభిప్రాయ పడటం వలన మతాచారాల పట్ల కవికి వున్న అభిమానం ఇక్కడ స్పష్టమవుతుంది. ఇక్కడ 'మానవయాగం' ఏవిధంగా జరుగుతుందో స్పష్టీకరించాడు కవియిలా :

"ఇక్కడ గొంతులు కోయడానికి
తడి గుడ్డలవసరం లేదు
అంతా స్వేచ్ఛగానే
మరింత స్వేచ్ఛగానే
మానవ యాగం సాగుతుందిక్కడ? (పుట, 45)

ఈ మానవయాగాలకు అంతెక్కడ? అవి నిరంతరం జ్వలించే బడబాగ్నిలా మారుతూనే వుంటాయి. రావణకాష్టంలా రగులుతూనే వుంటాయి. ఇక్కడ ముఖ్యంగా పేర్కొనవలసిన Stanza ఒకటుంది ఈ కవితలో :

"చంటోడు పాల కోసం ఏడిస్తే
పళ్లగాట్లకు పచ్చి పుండైన స్తనాల్ని చూసి
యా అల్లాహ్!
నాకెందుకిచ్చావీ అమ్మతనాన్ని అంటూ
కన్నీరై కరిగి వాలిన నిస్సహాయతలలోనూ
రసికతను వెతికే
అపర వాత్స్యాయనుడు కదా!
అవును శీలమే వాడిపునాది! (పుట, 53)

ఒక తల్లి తన పిల్లవాడికి స్తన్యమీయలేక పోతుంది. అందుకు కారణం పశుకామంతో, ఆమె స్తనాలు పచ్చిపుండ్లయి పోయాయి. పాలుతాగే పిల్లాడిని ఒడిలో వేసుకొని, మగవాడి శరీర దౌర్జన్యానికి గురి అయి, ఆ ఫలితం వలన తన పిల్లవాడికి పాలీయలేని దుస్థితిలో పడిపోయింది. మనిషి పశు దశను దాటి ప్రయాణించలేదని ఇటువంటి సన్నివేశాలు అనేకం రుజువు చేస్తాయి. ప్రఖ్యాత మేథావి బ్రాడ్లీ అంటాడు "Man is not a man at all unless social, but not above the beasts more than social" - (సంజీవ దేవ్, 1990, పుట, 35) ఈ సూక్తి ఎల్లవేళలా వాస్తవమే – మనిషి మనిషిగా వుంటేనే సామాజికుడు ఔతాడు, పశువులకన్న మిన్నగావుండాలంటే కేవలం సామాజికుడిగా వుంటే సరిపోదు. అంతకన్నా మిన్నగా ఉండాలి. ఇదంతా చూస్తుంటే సమాజంలోని ఎక్కువ మంది ఏ స్థితిలో జీవిస్తున్నారో అవగతం ఔతుంది.

స్త్రీ యొక్క 'శీలం' అనే దానిమీద నిత్యం వత్తిడి చేసే పురుషుడి తత్త్వాన్ని ఎంత తొందరగా స్త్రీ సౌందర్యాన్ని నాశనం చేసే పద్ధతులు అవలంభిస్తే ఆ స్త్రీ బానిసగా పడివుంటుంది. కొంత మంది పురుషుల దృష్టిలో రసికత్వం అంటే శారీరకంగా హింసించడ మనే భావనను స్పష్టీకరిస్తూ కవి ముస్లిం కుటుంబ జీవనంలో ఒక చీకటి కోణాన్ని వెలికి తీశాడు. ఇది అన్ని మత కుటుంబాలలోనూ కనిపిస్తుంది.

భారతమంతా ఒక్కటే, హిందూ తత్త్వమే ప్రధానమనుకొనేవాడు హిందూ – ముస్లింల సమైక్యతను ఏ విధంగానైనా విచ్ఛిన్నం చేయాలనే ప్రయత్నంలోనే వుంటాడని కరీముల్లా కవి సూచించాడు. కరీముల్లా కవిత్వం గురించి ఆంధ్ర ప్రభ కరీముల్లా తన అస్తిత్వాన్ని, దేశభక్తినీ నిలదీసేవాళ్లను ఎండగడతాడని, ఇదంతా దేశభక్తితో అంటాడు. ఈ నేలనీ, ఈ గాలినీ, ఈ నీటినీ ప్రేమిస్తూ ఉంటాడు దేశం ఇప్పుడున్న సందర్భంలో ఆలోచింపజేసే కవిత్వం కరీముల్లా కవిత్వమని అంది" – ఒక ముస్లిం ఈ నేలను, గాలినీ, నీటినీ ప్రేమిస్తాడని కవి ప్రత్యేకంగా చెప్పడంలో ఒక అంతరార్థం వుంది – ముస్లింలు ఒక ప్రత్యేక భాషను, సంప్రదాయలను సంస్కృతిని ఆచరించినప్పటికీ యీ మట్టి వాసనపై వారి మక్కువ, ప్రేమ, భక్తి ప్రశ్నించరానివని కవి స్పష్టీకరిస్తున్నాడు. "సబ్‌లోగ్ హమరా భాయి హై! అనడం సామరస్యపూర్వక జీవనాన్ని ప్రతిపాదించడమే!

"మనుషులంతా ఒక్కటన్న'
ఖురాన్ భావాన్ని విశ్వసించటం
న హిందూ
న ఈసాయీ
సబ్‌లోగ్ హమారే భాయీహై
అయియో భాయియో
అల్లాహ్‌సె దుఆకరో
ఔర్ దవా భీ రఖో
ముఠ్ఠీ బన్ కరో చలో తక్త్‌కీ తరఫ్
మిఠ్ఠీకీ జల్ జలా హోకే చలో
హక్ కే లియే
మా దేశం కోసం
మా ప్రజల కోసం
సకల ధరిత్రి కోసం
సజల ధరిత్రి కోసం
రా వసంతమా రా! (పుట, 98)

కవి కరీముల్లా

“జనహృదయాలలో శుభం పూయాలని
దేశస్థులంతా మానవతాసందేశం వినాలని
ప్రతి హృదయంలో ప్రేమపూలు పూయాలని
అల్లాహ్‌ని ప్రార్ధనా పూర్వకంగా కోరుకుంటున్నాడు. (పైదే)

మత గ్రంథం చంకలో పెట్టుకొని మానవతా రాగాన్ని ఎవ్వరూ ఆలపించలేరు. ఒక వేళ పాడినా అందులో ఎక్కడో ఒక్కచోట అపశృతి వినిపిస్తుంది. ఆ అపశృతి పాడే గాయకుడిదీ కాదు, కవిగాయకుడిదీకాదు - ఏ మత గీతంలోనైనా రాగప్రస్తారం అంతే! ఏది ఏమైనా కరీముల్లా ఆశావహదృక్పథం ఆహ్వానించదగినదే అనటంలో సందేహంలేదు– కరీముల్లా సందేశం ఒక మానవాత్మఘోష!

## IV.5. దిలావర్ ‘కర్బలా’

దిలావర్ కవిలోకంలో ప్రసిద్ధుడు. ఆయన అనేక రచనలు చేశాడు. తన కవితా మార్గంలో అనేక కావ్యసుమాలను పూయించాడు. అందులో ‘కర్బలా’ కావ్యం ఒకటి.

దిలావర్ కాలానికి సంబంధించినంత వరకు ఆధునిక కవికాదు. ‘ భారతి’ లో అనేక కవితలు, వ్యాసాలు దాదాపు 3,4 దశాబ్దాల వెనుక వ్రాసిన ప్రౌఢ కవి, రచయిత దిలావర్ గారు అనేక కవితా సంపుటాలు, కథా సంపుటాలు, సాంప్రదాయిక విమర్శనా గ్రంథాలు రచించారు. సాహిత్య జగత్తులో ఆయన నిత్య కృషీవలుడు.సాంప్రదాయ దృక్పథం బలంగా ఉన్న కాలం నుంచి వచ్చిన దిలావర్‌లో ప్రగతి శీల ఆధునిక భావాలకు కొదవలేదు.

ప్రముఖ కవి దిలావర్‌ని గురించి ప్రసిద్ధ సాహితీ వేత్త ‘చేరా’గారి మాటలను ఇక్కడ పొందుపరిస్తే సమంజసంగా వుంటుంది. ఆయనంటాడు “ దిలావర్ ” కవిత్వంలో మెరుపులు మెరిపించడు గాని నింపాదిగా మంచి కవిత్వం రాస్తాడు. కవిత్వంలో గాఢత గూఢత వంటివాటి మీద అతనికి మోజులేదు. నడతలో లాగే, మాటల్లో లాగే ఇతనికి సారళ్యం అలవాటయిన పద్ధతి, ఇష్టమైన మార్గం”. (రామారావు చేకూరి, 1999, పీఠిక)

చేరాగారు, దిలావర్ కవిత్వాన్ని గురించి విశ్లేషిస్తూ ఏర్పరచిన మార్గం నుంచి, వారి 'కర్బలా' కావ్యాన్ని అనుశీలించవలసివుంది. పై పెచ్చు, ఆకావ్యం ద్వారా దిలావర్ సామాజిక దృక్పథాన్ని సమీక్షించవలసిన ఆవశ్యకత కూడా వుంది.

పూర్వం " భారతి" లో తిలక్, శేషేంద్రల ప్రేరణతో రచనలు సాగించిన దిలావర్ గారికి అఫ్సర్ చెప్పినట్లు 'కర్బలా' ఒక పునర్జన్మే! అందువల్లనే 'కర్బలా' కావ్యాన్ని ఎన్నుకోవడం జరిగింది.

'దిలావర్' కవితల్లో ఏదో ఒకటి పత్రికాఫీసు నుంచి తిరిగి వచ్చేవుంటుంది. ఎంత ప్రముఖుడికైనా ఏదో ఒకనాడు ఇటువంటి సన్నివేశము ఎదురౌతుంది. ఆ సన్నివేశాన్ని రమణీయంగా "తిరిగొచ్చిన పజ్జెం' కవితలో యీ విధంగా దిలావర్ అన్నారు:-

"రాత్రెడు ఆవేదన మెడకు
ఆశల పాటనుకట్టి
నీ గుండెలో అచ్చు కావాలని
ఎగరేస్తాను పోస్టులో
నీ'లార్జెస్ట్ సర్కులేటెడ్' బుద్ధితో
నాకువకువలాడే పాటను
పీకనొక్కి నిర్లక్ష్యంలోకి గిరాటువేస్తావు" (దిలావర్, 1999, పుట,1)

రచన యొక్క విలువను గుర్తించకుండా వేస్ట్‌బాక్సులోకి వెళ్లి పోతుంటాయి, సంపాదకుడి చేతినుంచి. ఈ సన్ని వేశాన్ని బాగా బలంగా చిత్రీకరించాడు దిలావర్.

- బుస కొట్టే నీ అట్టహాసం ముందు
బెక బెకలాడుతూ నాపాట- (పైదే)

పాము, కప్ప సామెతను సంపాదకుడు, రచయితలకు అన్వయించి కవి వ్యంగ్యీకరించాడు!

"ఇక యీ రాత్రి ఇంతే" - కవితలో వస్తువు కర్ణా కర్ణిగా తెలుస్తూనే వుంటుంది. ఈ రాత్రి సామాన్యమైనది కాదు. ఇది మత అల్లరులు జరిగిన రాత్రి, కర్ఫ్యూవిధించిన రాత్రి చీకటిలో **ISI** ఏజంట్లు అని ముద్ర వేసి అమాయక యువకుల్ని లాక్కొని వెళ్లే రాత్రి అయినా

కావచ్చును. ఏది ఏమైనా ఇది కాళ రాత్రి – నపుంసకులైన 'రక్షకులు' అనాథల మీద, అభాగ్యులమీద జులుం చేసే రాత్రిగా దీనిని భావించవచ్చును.

దిలావర్ అంటారు:

"నేనీ విషాద రాత్రిని పానం చేస్తాను
నేనీ విశాల రాత్రిని గానం చేస్తాను" (పుట, 3)

కవి దిలావర్ రాత్రి యొక్క భయంకరతను తట్టుకోలేక 'పానం'చేసి, 'గానం' చేసినట్లుగా భావించవచ్చును ప్రస్తుతం, ఏ పార్టీ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా, మైనారిటీల పట్ల వివక్షత చూపుతున్నారని సమాజంలో అల్ప సంఖ్యాక వర్గాలు 'దమననీతికి' బలియిచ్చే ప్రక్రియ కొనసాగుతుందని, రాజ్య హింస బలహీనుల పై సాగుతుందని, ఇదేం దుష్ట సాంప్రదాయమని కవి ప్రశ్నిస్తున్నాడు. ఏ దుర్మార్గపు పని చేసినా రాత్రేగదా! అందువల్లనే కవి అంటాడు

"తుఫానులను శ్వాసించడం
సముద్రాలను పుక్కిలించడం
రాత్రుల్ని తగలబెట్టేవాడికి కూసువిద్యేకదా" (పైదే)

అని అనడంలో మనకు ఎవరు ఎవరో తేలిపోతుంది. చైతన్యాన్ని, విప్లవ జ్వాలికల్ని సదా ఊదేవారు "తుఫానులుగా" మారడం " సముద్రాలు " గా మారి ఉప్పొంగటం వరకు తెలిసిన విషయమే! మనిషిని పరిస్థితుల వల్ల, అతనిపై వచ్చే వత్తిడి వలన అతనిని సమాజం చూసే విధానం వలన ఏ విధంగా కరుడుగట్టిన తీవ్రవాదిగా తయారవుతాడో దిలావర్ స్పష్టీకరించాడు.

"నగరం నడిబొడ్డు కిందజారిన చీకటిలో
సామూహిక స్కలనాల్లో తడిసిన ప్రియురాలి పొలికేక
శూన్యం కాదుకదా" – (పైదే)

ఇక్కడ ఒక భయంకర దృశ్యాన్ని అలవోకగా చిత్రించాడు కవి. వర్షంలో తడవటం, వరదల్లో తడవటం, భూమితడవటం, చెట్టూ చేమా తడిసి పులకరించడం మనకుతెలుసు : కాని, కవిచెప్పిన; బలాత్కరించబడిన స్త్రీ – స్కలనాలతో తడిసి పోవడం అనేది మానవమృగాల క్రూరత్వానికి పరాకాష్ట.

"తుపాకి వనంలో విరిసిన బులెట్ల మధ్య
వీచిన తుఫానైన వీరుని ఆర్తనాదం / శూన్యమెలా అవుతుంది? (పుట, 3-4)

ఒక వాస్తవిక సౌందర్య దృష్టితో వెలువరించిన యీ వాక్యాలలో 'వీరుని ఆర్తనాదం' లోని భీభత్సం మనకు దృగ్గోచరమౌతుంది. ఇంకా 'వీరుని ఆర్తనాదం' వెనుక, అతని తల్లి ఘోష భయంకరంగా వర్ణించబడింది. ఎక్కడ ఏ ఆర్తనాదం మనం విన్నా, దాని వెనుక ఒక మాతృహృదయం యొక్క 'రోదన' తప్పనిసరిగా ప్రతిధ్వనిస్తుంది దాన్నే కవి యీ విధంగా కవిత్వీకరించాడు – సమాజంలో ఒక యుద్ధ సంస్కృతి, భీభత్సం అలుముకొని వుంది. సమాజం ఏ దిశకు పయనిస్తుందీ దాని వలన ఎన్ని మాతృ హృదయాలు గాయపడుతున్నాయో, రక్తసిక్త మౌతున్నాయో కవి దృశ్యీకరించాడు.

"భళ్లున మాతృత్వం పగిలి
తెగిన పేగుబంధం కోసం
చీకటిలో చీకటిగా మిగిలిన రూపం శూన్యమెలా
అవుతుంది? (పుట, 4)

ఈ విధంగా దిలావర్ "ఇక యీరాత్రి యింతే .... అయినట్లుగా కొన్ని ప్రాంతాల్లో, మన సమాజంలో, దేశంలో అన్ని రాత్రులు ఇంతే నన్నట్లుగా అభాగ్యులు, అమాయకులు, బాధాసర్పద్రష్టులు జీవిస్తూ ఉండటం అంతరాంతరాల్లో ఘర్షణ ప్రాధాన్యత కలిగి యుండటం అభివ్యక్తపరచడం వలన కవి యొక్క సామాజిక బాధ్యత సరిగ్గా నిర్వర్తించినట్లు తెలుస్తుంది.

రక్త ఘోషలో బతుకు వ్యవసాయంలో, భ్రమల విత్తనాలు నాటి; రైతుజీవితమే వ్యవసాయమై, భ్రమల విత్తనాలు,నకిలీ విత్తనాలకు అనడం కవి పెట్టిన పేరు వాస్తవికంగా వుంది. – రైతుని "నేటి భారతంలో / నువ్వు మరో కర్ణునివి కానిదెప్పుడు? అని రైతుపట్ల కవి హృదయసంవేదనను పలికించాడు. రమ్యాక్షరాలలో! కవి బాధను వ్యక్తపరిచినా ఆ అక్షరాల కళాత్మకంగా రసజ్ఞుని హృదయంలో నాటుకుపోతాయి. చివరిలో రైతుకి ఒక సందేశాన్నిస్తాడు దిలావర్ " బతుకొక పత్తి చేనై పోకుండా / నువ్వొక కొత్త విత్తనంగా మొలకెత్తాలి"– అని అంటాడు – అవును నిజమే, రైతు "ఒక కొత్తవిత్తనం కావాలి" – ఒక సామాజిక విప్లవ వృక్షం మొలకెత్తాలంటే రైతు కొత్త

విత్తనం కావాలసిందే!– దీనిని బట్టి అవగత మయ్యేదేమిటంటే ముస్లిం కవులు, ఇతర కవుల మాదిరిగానే సామాజిక అంశాలపట్ల తమ బాధ్యతను విస్మరించడం లేదనదే స్పష్ట మౌతుంది.

'మృత్యుపాశాలు' అనే కవితలో

"పొట్టకూటికోసం
బతుకు గోడల మారుమూలల్లో
చేనేత గూళ్లు అల్లుకుంటున్నసాలీడు" (పుట, 9)

అని చేనేత కార్మికులపై వ్రాసిన ఎలిజీ 'హృదయవిదారకంగా ఆత్మహత్య చేసుకొని చనిపోయిన చితికిన చేనేత బతుకులను అక్షరీకరించింది.– కవి కవిత ముగింపులో:

"ఇన్నాళ్లు లోకం మానాన్ని కాపాడిన నూలుపోగులు
దయతో మృత్యు పాశాలై బిగిసి
ఇప్పుడతని అభిమానాన్ని కాపాడుతున్నాయి" (పుట, 10)

చేనేత కార్మికుడైనా, కర్షకుడైనా తన అభిమానాన్ని కాపాడు కోవడానికి జీవితంలో ఎలాంటి 'ఆశాదీపం' మినుకుమినుకుమంటూ కనపడక పోవడంతో, వ్యవస్థ ఎలాంటి సహాయహస్తాన్ని అందించక పోవడంతో,ఆత్మ హత్యను చేసుకొని తన గౌరవాన్ని కాపాడుకోవడం కోసం, అత్యహత్య అనే పరిష్కారాన్ని కనుగొంటున్నాడు – ఒక పేద, దుర్మార్గపు వ్యవస్థలో శ్రమించినా, బ్రతక లేక పోవడానికి కారణాలను వెతికి పరిష్కార మార్గాలు వెదుకవలసిన ఆవశ్యకత వుంది అని దిలావర్ గుర్తు చేస్తూ, ముస్లిం కవులు – రచయితలు కేవలం కళ్లు మూసుకొని తమది ప్రత్యేక వర్గమని భావించడం లేదని సమాజంలోని విభిన్న వర్గాలు పడే బాధను తమ బాధగా భావించే విశాల సామాజిక దృక్పథం కలిగిన వారని చేనేత బతుకులను గురించి అక్షరీకరించడంతో దిలావర్ స్పష్టపరిచాడు.

ప్యార్ కా నగ్మా లో "నేనొక బహార్నై నీ జిందగీలోకి రావాలనుంది" అని అనడంలో ఇదొక ప్రణయగీతం అని తెలిసిపోతుంది. ఒక ప్రక్కన చేనేత కార్మికుని ఆత్మహత్య గురించి దయనీయంగా వర్ణించిన కవి, వెనువెంటనే కమనీయంగా ప్రణయగీతికను ఆలాపించడం. రస భంగంఔతుంది. రెండు కవితల్లోని స్థాయి భావాలు భిన్నమైనవి. ఒక కావ్యంలో ఖండికలను

అమర్చేటప్పుడు ఆ కవితలు యొక్క వస్తువుని బట్టి, వాటిని వెలువరించిన రసదృష్టి క్రమాన్ని బట్టి అనుసంధానం చేయవలసి వుంటుంది. ఒక బలమైన యుద్ధ గీతికను పాడి వెంటనే ఒక శృంగార గీతాన్ని పాడితే వినేశ్రోత చెవి, రసదృష్టి ఇబ్బంది పడిపోతాయి – ఈ విషయాన్ని 'దిలావర్' గారు గమనించినట్లు లేరు. ఒక వేళ గమనించినా కవితల నన్నిటినీ సంపుటీకరించాలనే దృష్టి అయినా అయివుంటుంది.

'ఈద్‌ముబారక్' కవితలోకూడా "దయామయుడైన అల్లాహ్ పేరుమీద రోజా విజయవంతమైంది' (పుట, 13) – అనడం కూడా మత దృక్పథాన్ని ప్రోత్సహించడమే కాకుండా కవులను, కళాకారులను దూరంగా వుంచే ముస్లిం సంప్రదాయవాదుల ఉగ్రరూపం ఏ విధంగా తమ పై పడుతుందేమోననే అభిప్రాయం వున్న కొందరు ముస్లిం కవులు తమ రచనలో మత దృక్పథాన్ని బలపరచడం కనిపిస్తుంది. అదే దోరణి దిలావర్‌లోనూ కనిపిస్తుంది. ఇది వరకు సంప్రదాయాన్ని వ్యతిరేకించే దార్శనిక రచనలు చేసిన కొంత మంది ఆదిలోనే దేవతాస్తుతి లాంటివి చేసి, తాము సంప్రదాయ వాదులమేనని భ్రమ కలిగించేవారు – ఇది సమాజ దండనీతిని ఎదుర్కొనలేక పాటించే పద్ధతి – ఇదే విధానంలో మతదృక్పథాన్ని దిలావర్ వెల్లడించారేమో తెలియదు. "Man is the meaasure of all things" అని గ్రీకు తత్వవేత్త ప్రొటాగరస్ సూక్తిని కవితా ఖండికకు పేరుగా పెట్టడం జరిగింది. సూక్తి మంచిదయినా చదివే పాఠకుడిని కొంత అసౌకర్యానికి గురి చేస్తుంది. తెలుగు కవితలకు ఇంగ్లీషు సూక్తులను తగిలించే పద్ధతి ప్రముఖ కవి శివారెడ్డి గారి నుండి వచ్చింది. అది అంత ఆమోద యోగ్యంగా కనిపించదు – కవిత్వమంటే సూక్తులు చెప్పడం కాదుగదా!

"వాడు పితృదేవతలకు పెట్టిన పిండాలమీద
నాపసితనపు ఆకలి కాకిలా వాలినపుడు
తురకోడు అపవిత్రం చేశాడని కుళ్లబొడిస్తే
కన్నీళ్లలో నా ఆకలి మంట లార్పుకున్నాను" (పుట,14)

ఈ వాక్యాలు చదివినప్పుడు, ఎంత కవిత్వమైనా కొంత వాస్తవికతకు పూర్తి విరుద్ధంగా వుందనే విషయం స్పష్టమౌతుంది. పితృ దేవతలకు పెట్టే పిండాలకు ఏ దళితుడు / మైనార్టీ వ్యక్తి ఎగబడిన సందర్భాలు వుండవు. ఒక ఆకలి బాధను తీవ్రంగా చూపాలను కొనే దశ కవికి

వుంటుంది గాని, అతిశయోక్తిని కూడా దాటి పోయే పరిస్థితులు వుండవు. ఒక సీనియర్ కవి నుంచి ఇటువంటి కవితా వాక్యాలను ఆశించలేము.ఒక వేళ ఇటువంటి అరుదైన సంఘటనను కవి చూసి వుండవచ్చునేమో!

దిలావర్ గారు వ్రాసిన 'కర్బలా' కవిత ఎంతో స్ఫూర్తిని కలిగించే విధంగా వుంది. అమానుషత్వం పై ఎత్తిన జెండాలా ఉంది.

"నువ్వు రాజకీయపు ఊదుపొగ వేసినప్పుడల్లా
జనాలు వెర్రి పీర్లయి శివాలెత్తడం మరచి పోలేం కదా"
"ఎన్నికల మైదానంలో
మమ్మల్ని కోడి పిల్లల్నిచేసి
నువ్వు గద్దాట ఆడినపుడల్లా
మాకు మిగిలేది విషాదపు 'షర్గతే'
"మా విశ్వాసాన్ని ఇరవైకోట్ల తలకాయలుగా కోసి
నీ కాళ్ల దగ్గర రాశిపోసి
ఈ దేశాన్ని ఒక కర్బలా మైదానం చేస్తున్నావు" (పుట, 15-16)

ఎంతో ఉద్వేగపూరితంగా, కవితాత్మకంగా యీ కవిత అద్భుతంగా సాగింది. ఒక ముస్లిం కవి ప్రస్తుత ఎన్నికల చిత్రాన్ని సమర్ధవంతంగా దృశ్యీకరించాడు. మైనారిటీ కవిగా పరిమితం కాకుండా ఈ దేశంలోని అణువణువు నాదే నన్న ఒక సామాజిక విశ్వాసాన్ని నెత్తికెత్తుకున్నాడు.

'అరే ఓ గాడ్సేకి ఔలాద్' కవితలో మత తత్వంపై విరుచుకు పడి పోయాడు కవి. మతతత్వాన్ని ఎదర్కోవడం, నిరసించడమూ ఇప్పుడు కవులకు ఒక బాధ్యత - ఏ కవి అయినా మతతత్త్వాన్ని దుయ్యపట్టేటప్పుడు, ఆ మతతత్త్వం నుంచి తానుపూర్తిగా వైదొలగివున్నానా ? లేనా? అనే ఆత్మ విమర్శ చేసుకోవలసిన అవసరం కూడా వుంది. అయితే దిలావర్ మాత్రం ఎక్కడో కొద్దిగా మతం పట్ల సానుకూలత ఉన్నప్పటికీ మతం సృష్టించే ఫాసిజానికి పూర్తిగా వ్యతిరేకి!

"పీకల దాకా నల్ల మందు సేవించిన మతం
ఉన్మాది చేతిలో రాయిగా మారినా
ప్రమాదపు సరస్సులో
ఫాసిజం వేయి రేకులై విచ్చుకున్నా
ఆశ్చర్యపడటానికేం లేదు"
ఇది వాస్తవ దృశ్యచిత్రణగా వుంది. (పుట, 17)

సమాజాన్ని ఒక సక్రమ మార్గంలో నడిపించే బాధ్యతను ఒక మైనారిటీ కవిగా దిలావర్ విస్మరించలేదు. కవి దిలావర్ కూడా "శ్రీశ్రీ" సృష్టించిన పదబంధం కసాయి + సాయిబు 'కసాయిబు'ను వ్యతిరేకించారు – దిలావర్ శ్రీశ్రీని అభిమానించే కవి అయినప్పటికీ తన జాతి గౌరవాన్ని కించ పరిచినప్పుడు రాజీపడలేదని అయనంటారు.

"నేను 'కసాయిబు'ను కాను
అనివార్య హింసాప్రవృత్తిలో జీవన పరామార్థాన్ని దర్శించే
ముస్లిం 'ధర్మవ్యాధుడ్ని' (పుట, 20)

సాంప్రదాయ గ్రంథంలో 'ధర్మవ్యాధుడి' అనే మాంసం విక్రేత ధార్మిక, న్యాయ సూత్రాలను అనేకం తనదగ్గరకు సందేహ నివృత్తికి వచ్చిన ఒక మునికి చెప్పడం జరుగుతుంది. వృత్తికి – ప్రవృతికి సంబంధం లేదని చెప్పే కథయిది. దిలావర్ 'ధర్మవ్యాధుడితో తనను పోల్చడం సరియైన పోలికే! కటిక వృత్తి మానసిక కాఠిన్యాన్ని కలిగిన వృత్తి, అందులో సందేహంలేదు – ఆ వృత్తిని ఏ మతస్థుడు కులస్తుడు చేపట్టినా శ్రీశ్రీ చెప్పినట్లు 'కసాయిబే' కసాయితనం ప్రధానంగా అర్థంచెప్పుకోవాలి.'. – ముస్లిం కాకుండా ఇతరత్రా అనేక కులాల వారు కూడా యీ వృత్తిలో వున్నారు.

"ఏ సంస్కృతి ఆనవాలు" – అనే కవిత 'ఎక్కుపెట్టి వదిలిన శరం' లా వుంది. సంస్కృతి గురించి అనేక ప్రశ్నలు సంధించబడినవి. హిందూ సంస్కృతిలోని లొసుగులను, లోపాలను ప్రశ్నించడం జరిగింది. హిందుత్వమే గొప్పది, ప్రధానమైనదనే ధోరణిని ఈ క్రింది వాక్యాల్లో ఎండగట్టాడు. ఒక బలమైన హిందుజాలు లేక హిందుత్వవాదులు తమ సంస్కృతిని అంగీకరించని వాళ్లని జాతీయ భావన లేని వారని నిరసించడాన్ని, ఇక్కడ దిలావర్ గట్టిగా వ్యతిరేకించాడు.

"ఈ నేలమీద మొలకెత్తిన ఏమొక్కైనా
కమలేతరంగా కుసుమిస్తే నీకళ్లకది విజాతీయమే"
పక్కా 'సంస్కృతిపక్షం' గా హిందుత్వాన్ని అలంకరించి
కనక రాసుల కోసం మైకేల్ జాక్సన్‌కుతార్చి
కడుపారా నువ్వారగించింది పడుపుకూడు కాదా?"
"ఆకాశమంత స్వార్థాన్ని
ఫోక్రాన్‌లో విస్ఫోటించావ్
ఓట్ల కోసం కోట్లాది జనసమూహాల భవితవ్యపు సౌధాలను
ఒక్క పోటుతో కూల్చివేశావ్"
"ఏమూడో ప్రపంచపు యుద్ధానికి
తాంబూలాలు పుచ్చుకుంటున్నాయి" (పుట, 21-22)

ఈ వరస క్రమంలో ఒక వినాశకర సంస్కృతిని పోషించే మతతత్త్వాన్ని తూర్పారబట్టడంలో కవి సఫలీకృతుడైనాడు. ఓట్ల రాజకీయాలలోని అమానుషత్వాన్ని తేటతెల్లం చేయడం ద్వారా సమాజాన్ని వక్రదిశగా రాజకీయ వేత్తలు నడపడానికి ప్రయత్నిస్తారో కవి చిత్రించడము, కవితాత్మంగా, వాస్తవంగావుంది.

'దృశ్యం మారనిదృశ్యం' కవితలో
"మానవత్వం, రాజకీయం ముందు
మానభంగమై తలవొంచుకుంటుంది" (పుట, 24)

సహజ సిద్ధంగా వుంది భావన. రాజకీయవేత్తల అమానుషత్వం ఏవిధంగా ఉంటుందో చెప్పడం లో కవి వెనుకాడలేదు. "నెత్తురోడుతున్న దృశ్యం"లో స్త్రీ సమాజంపై జరుగుతున్న పాశవికచర్యలు అక్షరీకరించబడినవి.

"మగతనం ఆవులించి జూలు దులిపినప్పుడల్లా
ఆడతనం బలిపశువుగా మారుతూనే వుంది.
పైశాచికత్వం మీద కామాన్ని ఎక్కుపెట్టి విడిచినప్పుడల్లా
స్త్రీత్వం భళ్లున ముక్కలు ముక్కలుగా పగిలిపోతూనేవుంది" (పుట, 25)

ఈ పంక్తులలో రక్తదాహంతో పరుగులెత్తే క్రూర జంతువుతో పురుషాహంకారాన్ని జత కలపడం, మానవత్వాన్ని మరచిపోయిన పైశాచికత్వం స్త్రీ మనస్సుని, శరీరాన్ని ఏ విధంగా చిద్రం చేస్తాయో స్పష్టంగా దృశ్వీకరించబడినాయి. ఆకాశంలోని సగాన్ని 'భువనఘోషగా' మారితేనే విముక్తి నీకు అని సంకేతిస్తున్నాడు కవి.

"సగం ప్రపంచం' కంఠంలోని రక్త ఘోష
భువన ఘోషగా మారనంతవరకు
బతుకు పట్టాలమీద ఆడతనం
నెత్తురోడుతూనే వుంటుంది." (పుట, 26)

ఇక్కడ కవి సందేశం సూటిగా వుంది. స్త్రీ కంఠంలో వ్యక్తంగాని ఆవేదన ఒక రక్త ఘోష – ప్రపంచాన్ని కదిలించే ఘోషగా మారాలంటే స్త్రీ శక్తి అంతా ఒక ఉద్యమంగా మారాలని కవి కవితాత్మకంగా చెప్పడంలో దిలావర్ సమాజంలోని స్త్రీ పట్ల వున్న తన వేదనని అక్షిరీకరించినట్లు కనిపిస్తుంది.

'సాదృశ్యసాగరం' కవితలో

ముసలి అరబ్ డాలర్ల సుడి గుండంలో చిక్కుకుని
తల్లడిల్లుతున్న 'ఆమీనా' పసిగుండెను గుర్తు చేస్తుంది
క్రూరంగా విరుచుకుపడే కెరటాలమీద
చుండూరు శవాలు కొట్టు కొస్తున్నట్లనిపిస్తుంది.
నాగరికుల చూపుల్తో నగ్నీకృతమైన అలల్లో
చలకుర్తి ద్రౌపది సిగ్గుతో బిక్క చచ్చిపోవడం కనిపిస్తుంది" (పుట, 27)

వ్యక్తి భావన నుంచి సామూహికచేతనలోకి కవి తర్జుమా కావడం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. దిలావర్ సమదృష్టి అమీనాను, చలకుర్తి ద్రౌపదిని సమానంగా చూడటంలో వ్యక్తమైంది. 'చెత్తకుండీ' కవితలో చెత్తకుండీకి ఒక కొత్త నిర్వచనం ఇచ్చారు.

"అడ్రస్ తెలీని ఏ మేనకలో కుంతీకన్యలో-
చీకటి పాపాలను
చేటలతో గుమ్మరించి చక్కాపోతారు
బెత్లహేములోని పశువుల పాకలా
పరిశుద్ధాత్మలకు పురిటిల్లవుతుంది. - (పుట, 30)

చెత్త కుండీలోకి విసిరేయబడిన ఒక పసితనం, అమ్మలేని తనం, యుద్ధసైనికులు, శత్రురాజ్యాలను గెలిచినప్పుడు, అక్కడ చేసే అరాచకాలకు, మాన భంగాలకు, ఎంతమంది బాలికలు, యువతులు భరించరాని గర్భాన్నిదాల్చి, ఆక్రోశించి వుంటారో తెలియదుగాని, యీ చెత్త కుండీలో పారవేయబడిన శిశువు, యీ అనాగరిక వ్యవస్థయొక్క దుశ్చేష్టకు సాక్షీభూతంగా నిలిచి పోయినట్లు కవి వాస్తవీకరించడం హృద్యంగా వుంది. కవి మానవీయత మతాల కతీతమైందని స్పష్టీకరించాడు.

ఈ విధంగా సామాజిక సంఘటనల్ని వాస్తవ దృశ్యాలుగా అక్షరీకరించిన ప్రముఖ కవి దిలావర్ "శృంగార సరస్సు" ఈ నగరం "ఊసరవెల్లి", "నిరీక్షణం", "శిథిలస్వప్నాలు" "ఆకలిది ఒకటే యూనిఫాం" "మనిషి సముద్రం అయినప్పుడు" - లాంటి ఉత్తమకవితలు, యీ "కర్బలా" కవితా సంపుటిలో వుండి, కవి యొక్క సామాజిక బాధ్యతను ప్రతిబింబించేటట్లుగా, వాస్తవికాంశాలు ప్రతిఫలనంగా ఉన్నాయనడం సహజోక్తి ఔతుంది. కవిగా ఆయన సామాజిక బాధ్యతను దిలావర్ చక్కగా నేరవేర్చినట్లు అవగతం ఔతుంది.

## IV.6. సలీం : నీలోకి చూసిన జ్ఞాపకం

సలీం కవిగా ప్రసిద్ధుడు; ఆయన అనేక కావ్యాలు, రచనలు చేసినప్పటికీ "నీలోకి చూసిన జ్ఞాపకం" వస్తు స్వీకరణలో, శిల్ప వైచిత్రిలో సముచిత స్థానంలో వుండటం వలన యీ కవితా సంపుటిని ఎన్నుకోవడం జరిగింది. కవి యొక్క ఇతర రచనలు వున్నప్పటికీ, యీ సంపుటిలోని ఆర్ద్రత, పద లాలిత్యము లాంటివి విశిష్టంగా కనిపించడమే ఇందుకు కారణం. 'కలయిక' అనే కవితలో ఒక రసభావన హృద్యంగా చెప్పబడింది.

"ఎప్పుడో ఓసారి
ఎడారిలా - ఒంటరిగా నడుస్తూ
ఒకే ఒక క్షణం
ఆశానిరాశల మధ్య
వారధిలా వంగి - విరిగిన
నీ కను రెప్పల్లోకి చూశాక
ఎంతాశ్చర్యం నావయస్సుకు ఒయాసిస్సులా
విచ్చుకున్న నాకళ్లలో
అనాదిగా సాగుతోన్న నా అన్వేషణ
ఆఖరిమజిలీ! (సలీం, 1999, పుట, 2)

ఈ కవితలో వైయక్తిక ఉచ్ఛ్వాస నిశ్వాసాలే వున్నాయి. ఒక అనంత అన్వేషణ ఆఖరి మజిలీకి చేరుకున్న వైనం 'కలయిక' కవిత ద్వారా చెప్పాడు కవి. 'ఖైదు' కవిత కూడా ప్రణయవాసనలను వెదజల్లిన కవితే!

"నేనేం పాపంచేశానని
నాశ్వాసనీ, వూపిరినీ
ఇలా శాసిస్తున్నావు?
నామెదడుని ఖైదుచేసి
మరమేకులు కొడ్తున్నావు? (పుట, 3)

ఈ వాక్యాలు స్పష్టం: ప్రేమికుల ఆర్తి, తనకు దూరమైన మోహనాంగి తనను ఏవిధంగా శాసిస్తుందో పై వాక్యల్లో కవి వేదనామయ స్వరంతో చెప్పాడు.

'సంగమం' కవితలో

"నీ ప్రేమ సాగరంలో
పదిలంగా దాచేస్తా" (పుట, 4)

'స్త్రీ' అనే కవితలో

"ఆ పాదాల చెంత హృదయాన్ని ఉంచే
అతి సామాన్యవ్యక్తి ఆరాధనకే
నీ కళ్లల్లో మెరుపు మెరుస్తుందని
అవిప్రేమను కురిపిస్తాయని
నిన్ను పోగొట్టుకున్నాకే
తెల్సుకున్నాను" (పుట, 5)

ఈ విధంగా పూర్వం "భావకవుల" ధోరణిలో కొన్ని కవితలు, "ఆమె", 'నీవునేనూ' వంటివి ఈ కవితా సంపుటిలో ఉన్నవి. ఒక సుకుమారమైన భావుకత కొన్ని కవితల్లో ప్రస్ఫుటమౌతుంది.

డెమోక్రసీ, కాశ్మీర్ నాదేశం లాంటి కవితలు కవియొక్క సామాజిక దృక్పథాన్ని తెలియపరుస్తున్నాయి.ఏది ఏమైన వ్యక్తిగత ప్రణయదృక్పధమూ, సామాజిక దృక్పధము ఒకే కవితా సంపుటిలో వుండడం పాఠకుడికి కొంత అస్పష్ట భావన ఏర్పడుతుంది. కవి ఎటువైపు పయనిస్తున్నాడు? అనే మీమాంసలో పడిపోతాడు పాఠకుడు.

కవితల్లో వస్తైక్యము తప్పని సరిగా ఉండాలి.మహాప్రస్థానం, పెన్నేటిపాట, కొయ్యగుర్రం, మోహనా! ఓ మోహనా! వర్తమానంలాంటి కావ్యాల్లో ఒకే భావం అన్ని కవితల్లో అంతస్సూత్రంగా వుంటుంది. కవి యొక్క నిబద్దత ఎటువైపు వుందో స్పష్టమౌతుంది. ఆవిధంగా కాకుండా భిన్నమైన, వైరుధ్యం కలిగిన భావసమీకరణ వలన పాఠకుడికి కవి యొక్క నిబద్ధత అవగతం కాదు. అందువల్ల కవితా సంపుటి అంతా ఒకే సిద్ధాంత పరిధిలోని భావజాలం కలిగి వుంటే రససిద్ధి కలుగుతుంది, కవితా పాఠకుడికి! విప్లవ కవిత్వమైనా సామాజిక దృక్పథం కలిగిన కవిత్వమైనా రససిద్ధి కలిగితేనే కవిత పాఠకుడికి చేరుతుంది.

## IV.7. యాకూబ్ - సరిహద్దురేఖ

ఈ కవితా సంపుటి 200 పేజీల బృహత్ గ్రంథం. ఇందులో మొత్తం 121 కవితలు

ఉన్నవి. బహుశా యీ దశాబ్దంలో వెలువడిన బృహత్ కవితా సంపుటిగా యీ ‘సరిహద్దు రేఖ’ను గుర్తించవచ్చును. ఇందులో కవితలు భిన్న పార్శ్వాలు కలిగి వున్నవి.

ప్రముఖ రచయిత బి. తిరుపతిరావుగారు ఈ ‘సరిహద్దురేఖ’ కు విపులమైన పీఠిక వ్రాస్తూ యీ విధంగా అన్నారు. “రూప పరంగా కవికి ఉండే సౌలభ్యాన్ని అందరూ ఒకేరకంగా వాడుకోలేరు. ఆ విషయంలో యాకూబ్ చాలా ముందున్నాడు. గత పదేళ్ల కాలంలో దాదాపు మన సమాజంలో చోటుచేసుకున్న ఏమార్పుని, సంచలనాన్ని, సంఘర్షణని, చర్చలను, ముందుకువచ్చిన ఉద్యమాలను యాకూబ్ విస్మరించలేదు. ప్రతి అంశమూ తన కవిత్వవస్తువయింది. నిర్దిష్ట, రాజకీయ, సాహిత్య ఉద్యమాలలో ఉండే రచయితలలో మాత్రమే కన్పించే ఈ లక్షణం యాకూబ్‌లోనూ కన్పిస్తుంది. యాకూబ్ స్పందనలన్నీ చిక్కటి కవిత్వ రూపంలో ఉండటంవల్ల అవి పాఠకుడిని కదిలించగలుగుతున్నాయి. ఈ శక్తి యాకూబ్‌ని సమకాలీన కవుల్లో ప్రముఖుడుగా నిలబెడుతుంది.” (తిరుపతి రావు బి, 2002, పీఠిక) తిరుపతిరావు గారి వాక్యాలు సమర్థనీయాలు.

‘అవ్వల్‌కలిమి’ కవితలో యాకూబ్ అంటాడీవిధంగా :

> “చెబితే నమ్మరుకానీ
> మా బాధలెవరూ మాట్లాడటంలేదు
> మళ్లీ ఇక్కడ కూడా పదిపదకొండు తరాలతరువాతి వాళ్లే
> తమ కోల్పోయిన వైభవాల తలపోతల్ని
> మా అందరి భాషగా మాట్లాడుతున్నారు.” (యాకూబ్, 2002, పుట, 3)

మేము పేదపకీరులం మా భాష వేరు, మా సంస్కృతి వేరు, సమాజంలో మాకు స్థానం లేదు. అని ముస్లిం వర్గంలో తన స్థానాన్ని తెలుసుకుని కవి, వాస్తవాన్ని మనకు తెలియపరుస్తున్నాడు.

> షేక్ సయ్యద్, పఠాన్ – మీ దర్పాల హోదాల కాందాన్ల
> పేర్లు చెప్పి మమ్మల్ని దగ్గరికైనా చేరనిచ్చారా
> లద్దాఫ్, దూదేకుల, కసాబ్, పింజారీ...
> వృత్తిని కులమై కరిచిన కాలపు గుర్తులయ్యాం

మీ యిళ్లల్లో నీళ్లు నింపి 'చివిస్తీలమై'
గుడ్డలుతికే 'దోభీ' 'ధోభన్'లమై
జుట్టుగొరిగితే 'హజ్జామ్' లమై
దొడ్లు కడిగితే మెహదర్ 'మెహతరానీ' (పుట, 4-5) లమై పోయాం వృత్తిని కులమై కరిచిన కాలపు గుర్తులుగానే ఉండిపోయాం"

ఈ కవి చెప్పే విషయంలో ఒక కొత్త కోణం తెలుస్తుంది. ఏమతంలోనైనా, ఆ మతంలోని సంపన్న వర్గాల వారు, కులీనతని అనుభవిస్తూ వాళ్ళ వంశపరంపరల యొక్క ఆధిక్యతభావంలో ఉరకలేస్తూ, తమ మతంలో, వృత్తి రీత్యా వెనుకబడిన వాళ్లను ఎంత హీనంగా చూసేది ఈ కవితనిండా వ్యక్తమయివుంది. ఇంత వైరుధ్యాలు ఉన్నాయా! అని ఆశ్చర్యం కలుగుతుంది కూడా. ఇది అన్ని మతాలలో వున్న జాఢ్యమే! ఈ సమస్యను గుర్తించడం దానిని కవితామయం చేయడంలో యాకూబ్ సఫలీకృతమైనాడు.

ఈ కవి వెలువరించిన తెలుగుభాషాభిమానం ఎంతో విలువైనది. అందరూ గమనించదగినది. ఒక ముస్లిం తన యొక్క మతమూలాలను, వదిలి, భాషాసంస్కృతుల విషయంలో ప్రధాన స్రవంతిలో కలిసి పోవడం వలన ముస్లిం కవులు, రచయితలు లౌకిక వాద దృక్పథంతోనే ఎక్కువమంది తమ రచనావ్యాసంగములో వున్నారని తెలుస్తుంది. యాకూబ్ మాటలు వినండి, ఎంత మనోజ్ఞంగా ఉన్నాయో:

మా కలలన్నీ తెలుగే, కన్నీళ్లు తెలుగే
ఆకలై అన్నం అడిగినా, ఆర్తనాదం చేసినా
మొత్తం భావ వ్యక్తీకరణమంతా తెలుగే" (పుట, 5)

యాకూబ్ "అణచి వేయబడ్డ వాళ్లంతా దళితులే – కాదనం / కానీ అణచి వేతల నిర్వచనం కావాలిప్పుడు "/ అని అంటున్నాడు. 'అణచివేతకు' ఒక కొత్త నిర్వచనం కనుగొన్నాడు కవి. యాకూబ్, ఈ అణచివేతల వెనుకవున్న మతలబు, అగ్రవర్ణ అహంకారం, స్వార్ధం, దోపిడీ విధానం అవగతం చేసుకోవాలని యాకూబ్ సూచిస్తున్నాడు.

'పిల్లాడు' కవితలో యాకూబ్ 'పసితనం' 'పసిడితనం' కనిపిస్తుంది.

"తన బుడిబుడి అడుగుల్తో పొర్లాటల్తో
భూమి రుణం తీర్చు కొనేందుకు తర్లాడే ఊరులాంటివాడు
మట్టిని అన్నంలా తినేవాడు
గంధంలా పూసుకొనేవాడు" (పుట, 9)

ఇటువంటి 'మిసిమిలాంటి బాల్యాన్ని కవి సాధారణీకరించి అందరికీ బాల్యాన్ని గుర్తుచేస్తాడు. ఈ కవిత సరళంగా కనిపించినా, ఒక పనిపిల్లవాడు మట్టిలో ఆటలాడే క్రియ 'భూమి రుణం' తీర్చుకున్నట్లుగా కవికి కనిపించడము మహత్తరంగా వుంది.

"కుడికాలు" కూడా ఒక సామాజిక, కౌటుంబిక సంబంధాన్ని అందంగా మలచిన కవి. స్త్రీ అత్తింటిలోపెట్టిన 'కుడికాలు' ఎంత గణనీయమైందో యీ కవిత తెలియపరుస్తుంది.

"అలసిపోతున్న నాకు మళ్లీ ఇలా ఆశలా
ఎదురయ్యావు
కలలు లేని రాత్రిలో
సేదతీర్చే కవితలా మారావు
రహస్యాలు లేని రోజులకు
నీవే రూప శిల్పివయ్యావు
కవి యోధుని కాపాడే
ఊహవయ్యావు, భావుకత వయ్యావు
గాయపడిన దేహంపై
వాలిన అమృతహస్తంలాంటి పక్షివయ్యావు
వసంతంలా భూమి వరించిన
రంగురంగుల నవ్వువయ్యావు
సీతాకోక చిలుకలా మారిన
రూపాంతర జీవన పరిణామానివయ్యావు" (పుట, 14)

ఇంట్లోకి ఒక కొత్త వ్యక్తి 'అర్ధాంగి' రూపంతో రావడంతో 'కుడికాలు' పెట్టడంతో, ఎటువంటి ఆత్మీయ ప్రకంపనలు కలుగుతాయో అవి జీవితానికి ఎంత ప్రేరణాత్మంగా వుంటాయో యీ కవిత సాక్ష్యం. ఏదో ఏవో ఇజాలలో కొట్టుకు పోయే కవితల్లో నుంచి బయటపడి, ఇటువంటి కవితలను చూసినప్పుడు 'జీవన వాస్తవికత' వెల్లడవుతుంది. జీవన సంగీతానికి మించిన తాత్త్వికదృక్పథం లేదని ఇటువంటి కవితలు రుజువుచేస్తాయి.

"నీ కుడికాలు నా జీవితపు వాకిలిలో
మోపినప్పుడే
నేను అపూర్వమైన ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడాను" (పుట, 15)

ఈ 'ఆత్మవిశ్వాసం, స్త్రీ జీవిత భాగస్వామి కావడం వలన కలుగుతుందని కవి నిర్ద్వందంగా అంగీకరించాడు. యాకూబ్ వర్ణించిన మహిళ పరిణత హృదయిని అయిన స్త్రీగా గోచరిస్తుంది.

ఇంకా యీ 'నిరసనవాక్యం' కవితలోని 'కవి నిరసన'ను పరిశీలించాలి.

"మనసు బాగోలేదు
బాగోలేదని, ఉండదని ఖచ్చితంగా తెలుసు
ఇది ఇలా ఈ జీవన యుగమంతా బాగా ఉండకుండా ఉండడంలోనే
నా విజయమంతా ఉంది" (పుట, 16)

"అశాంతి, అసంతృప్తి, అన్వేషణ, దాహం లాంటివని కవి నిర్వచిస్తున్నాడు.

"కొత్త ఆలోచనల్లోకి, ఆలోకనల్లోకి పచ్చపచ్చని ప్రకృతిగా విస్తరించనీయరా" అని కవి భావుకత రమణీయమై ఆహ్వానించదగినది.

బహుళజాతి సంస్థల మీద మంచి వ్యంగ్యాస్త్రంలా ఉంది "ఒకానొక శవయోగధారుడు", అనే కవిత చూడండి.

"నా జేబులోని పైసాను ఖర్చు చేస్తున్న వాడెవడో
నేను చేయని అప్పును వసూలు చేసుకుపోతున్న
బహుళ జాతి అప్పుల వాడెవడో
నా నాణేన్ని నా నుంచి లాక్కెళ్లి పోయాడు" (పుట, 18)

– ఇది మనకు తెలియకుండా, మన ప్రమేయం లేకుండా జరిగే దోపిడీని చక్కగా అభివ్యక్త పరచాడుకవి. ప్రతి మనిషి, వినియోగదారుడి జేబుకి చిల్లువేసే ప్రపంచీకరణ యొక్క వికృత ఫలితాలు ఇక్కడ సూచించబడినవి.

"లౌకిక స్వప్నం గురించే మాట్లాడతాను" అని యాకూబ్ స్పష్టంగా చెబుతున్నాడు. ఇక్కడ యాకూబ్ కలే లౌకిక స్వప్నం, మతాల కతీతంగా, సర్వజనుల శ్రేయోభిలాషిగా, సామాజిక ప్రగతిశీల దృక్పధానికి, ఉదారవాదానికి, ప్రతి మనిషి రాజ్యాంగం ఏర్పరచిన ఫలాలను అందుకోవాలనే ఆకాంక్ష యీ లౌకిక స్వప్నంలో కనిపిస్తుంది. మతాతీత రాజ్యం యొక్క ఆవశ్యకతను యాకూబ్ యీ కవితలో యీ విధంగా సుందరంగా వ్యక్తపరచాడు.

"ఊపిరి పోసుకోక ముందే మతాన్ని నిర్ణయించే భూమ్మీద
నన్ను కొత్తగా ఆవిష్కరించుకొనే ప్రయత్నం చేస్తున్నాను"
"నేనే ఒక కట్టడాన్ని
నన్నెవరు కూల్చడానికి ప్రయత్నించినా
నేను మనిషిలా ప్రశ్నిస్తాను
ప్రతిసారీ నేను లౌకిక స్వప్నం గురించి మాట్లాడతాను" (పుట, 23)

అన్ని మతాలు, ఇంకా భిన్న భావజాలాలు కలిగిన వ్యక్తులు, సమూహాలు సామరస్య సహజీవనం చేసే "లౌకిక స్వప్నం" కవిగాంచడం సహేతుకమూ, సమంజసము కూడా!

'వల' రైతు జీవితాన్ని అక్షరీకరించిన మంచి కవిత – ఈ కవితలో యాకూబ్ అంటాడు

"సరికొత్త బోయవానికి
రైతుకన్నా గింజలంటేనే అతిప్రేమ
రైతుకు మారుపేరు 'తాకట్టు'
"మానవీయ సంబంధాలు
డాలర్ అలంకారాన్ని పులుముకొంటుంటే
రైతు
ప్రకృతిలోంచి యంత్రంలోకి ఒదిగి పోతున్నాడు" (పుట, 25)

ప్రకృతిలో వినిపించే పాటయి, పల్లవియై, రాగమయి పరవశించే రైతు ప్రకృతి తాదాత్మ్యత నుంచి వెలియై 'యాంత్రికత' లోకి మారిపోతున్నాడని కవి చెప్పడం అతని పరిశీలనకు పరాకాష్ఠగా వుంది. రైతుని దోపిడీ చేసే వర్గాన్ని 'బోయవానిగా' పోల్చడం సమంజసంగా వుంది. ఈ బోయవాడు వేటాడేది రైతు పండించిన పంట ఏ విధంగా దళారీల, పెత్తందార్ల పాలవుతుందో స్పష్టీకరించబడింది.

'సరిహద్దురేఖ' కవిత, యీ కావ్యానికి పెట్టిన పేరుతో ఉన్నకవిత – మనిషికి మనిషికీ మధ్య మతం అడ్డుగోడగా నిలబడిన సరిహద్దురేఖను, తుడిపేయాలనే కవి ఆకాంక్ష యాకూబ్ తాత్వికంగా ఎదిగిన తీరుని యీ కవిత ప్రత్యక్షరంలోనూ ప్రత్యక్ష మౌతుంది. మతాంతర వివాహాన్ని ప్రాతిపదిక పై యీ కవిత నడుస్తుంది. రెండు బలమైన ఆచారాల మధ్య, అలవాట్లమధ్య, సంస్కృతుల మధ్య మనసులు ఏవిధంగా నలిగి పోతాయో యీ కవిత చక్కని ఉదాహరణ:

"ప్రేమించడం నేరం కాదు  
బొట్టు వుండటం, పొలిమేరల్లో బొట్టు చెరిపేసు కోవడం నేరం కాదు  
అలవాట్లు, ఆచరణలు కొట్టవచ్చిన జీవిత కొలమానాల్లో  
'సరస్వతీ నమస్తుభ్యం"  
అల్లాహోఅక్బర్  
జీవితాల మధ్య పేర్లనుంచి  
పెరుగుతున్న ఆంక్షల పీర్ల నుంచి  
ఆమె మందిరం, నేను మసీదుగానే మిగిలిపోతుంటాం  
ఇక  
మా దాంపత్యపు గుర్తుగా చిన్నోడికి  
ఏ త్రిశంకు మందిరాన్ని నిర్ణయించాలో?" (పుట, 27-28)

మతాంతర వివాహాలు చేసుకొన్న వారు త్రిశంకు మందిరం లో నివసించవలసిన అగత్యం ఏర్పడిందని కవి విశదీకరించాడు కవిత్వ భాషలో! కవితాత్మ వాస్తవాన్ని ప్రతిబించేదిగా ఉన్నప్పుడు సామాజిక ప్రయోజనాన్ని బహుధా విస్తరిస్తుంది. ఇక్కడ మతాంతర వివాహాల వలన ఇబ్బందులు ఏర్పడుతున్నాయనే బాధను కలిగిస్తాడు – ఇది కొంత వెనుకకు నడవటమే! సమాజంలో

కుటుంబ వ్యవస్థలో ఎన్ని కుల, మతాతీత వివాహాలు జరిగితే అంత మంచిది. ఈ విధమైన దృక్పధాన్ని అంబేద్కర్ కూడా "కులనిర్మూలన"లో బలంగా ప్రతిపాదించాడు కూడా! ఎప్పటికైనా కులాలు, మతాల ప్రభావం ప్రజాస్వామ్య సమాజం పై తగ్గవలసినదే!

ముస్లిం కవుల ప్రతినిధిగా సామాజిక లక్ష్యాలను వెల్లడించే తస్లీమా నస్రీన్ కవితలోని కొన్ని వాక్యాల్తో ఈ అధ్యాయాన్ని ముగిస్తే సమంజసంగా వుంటుంది.

'స్వీయ చరిత్ర' అనే కవితలో ఆమె అంటుందిలా!

" లేదు నాకు ఏ దేవుడిలో విశ్వాసం
కలదు నాకు ప్రకృతిలో, పదార్థంలో
స్వశక్తిలో, మానవ శక్తిలో
పరిశీలిస్తాను ప్రకృతిని
హేతుబద్ధ శాస్త్రీయ జ్ఞానంతో
పయనిస్తాను. ప్రగతి పధాన
ప్రగతి పథాలు పట్టుకొని.....
.......
మతచాంధసత్వం, మతోన్మాదం ప్రమాదకరం
ప్రపంచవ్యాప్తంగా, ఏం
చేయాలి మనం, మనం ఎలా
చేధించాలి మతం వేసిన
మేధో సంకెళ్లు? ఎలా రూపుమాపాలి?
అసమానతల విషవలయం
మతోన్మాద మాత్సర్యం
ఏలా పోరుదాం ఏకాకిగా? (తస్లీమా నస్రీన్, 2008, పుట, 126)

ఈ విధమైన ప్రగతి శీల ధోరణిలో మతానికి, చాంధసత్వానికి వ్యతిరేకంగా ఎక్కువభాగం ముస్లిం కవులు తమ కలాలను సంధించారు. అందువల్లనే ముస్లిం కవుల దృక్పధం, మత, తాత్విక అంశాలలోని ప్రామాణిక భావాలకు అనుగుణంగా వుండి ప్రగతిశీలదృక్పధాన్ని సమాజానికి నివేదించడంలో విజయం సాధించింది.

---

# V. ముస్లిం రచయితల సౌందర్యతత్వం

"గాయపడిన గుండె
జాగ్రత్తగా ఒడిసి పట్టుకోండి
మృదువుగా ముట్టుకోండి
కోటి వీణల తంత్రులతో నిర్మింపబడ్డది.
ఏతీగ మీటినా విషాదం పలుకుతుంది"

- మొహమద్

"రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం" అని ఆలంకారకుల మాట. ఈ రమణీయతను గురించి వివరించేది సౌందర్యతత్వం. ఈ సౌందర్యతత్వం లేక పోతే కళలు ప్రేతకళలు ఔతాయి. కళ అంటేనే సౌందర్యభరితం అని అర్థం కూడా చెప్పవచ్చు. అది శుద్ధసౌందర్య వాదుల భావన. లలిత కళలు అన్నీ కూడా మానవ మేధస్సు హృదయాన్ని క్రమబద్ధీకరించడమూ, మనిషిలో జీవనకళ యొక్క ప్రాముఖ్యాన్ని తెలియపరచడమూ, ఆనందింప జేయడం, ఆలోచింపచేయడమూ కళాప్రయోజనాలలో ప్రధానమైనవి.

సాహిత్యకళలో, అనేక మార్పులు జరిగి సామాజిక దృక్పథం అనే అంశం శక్తి వంతంగా సాహిత్య కళలో ప్రవేశించింది. ఈ క్రమంలో వస్తు రూపాలు అభివ్యక్తిని సంతరించుకొని సౌందర్యవంతంగా పాఠకుల ముందు అనేక ప్రక్రియలతో ముందుకు సాగుతుంది.

ఈ క్రమంలో కథ, కవిత, పాట లాంటివి ప్రత్యేకమైనవి. ముస్లిం కవులు/రచయితలు, తమ సమస్యలను కథల ద్వారా కవితల ద్వారా సౌందర్యతత్వాన్ని వీడకుండా రచనలు సాగించారు.

సౌందర్యతత్వం అనేది ప్రాకృతికమైన అంశం. మానవుడికి వికాసం కలిగించే అనేక అంశాలలో సౌందర్యం ఒకటి. ఒక సమగ్ర దృక్పథం ఏర్పడటానికి, ఒకతాత్విక దృక్పథం ఏర్పడటానికి, కనీసం ఎనిమిది శాస్త్రాలు దోహదం చేస్తాయని విజ్ఞుల పరిశీలనలో తేలిన అంశం. తాత్విక దృక్పథానికి (1) తర్కం (2) పారభౌతిక శాస్త్రం (Meta Physics), (3) జ్ఞానమీమాంస, (Epistmological Enquiry ), (4) నీతిశాస్త్రం (Ethics), (5) సౌందర్యతత్వశాస్త్రం (Aesthetics – రామణీయక మీమాంస - అలంకారశాస్త్రం), (6) మనస్తత్వశాస్త్రం (Psychology), (7) రాజనీతిశాస్త్రం (Politics), (8) చరిత్ర (History) అనేవి. వీటిని అధ్యయనం ద్వారా బోధపర్చుకొని, ఆచరణ ద్వారా నిగ్గుతేల్చుకొని, వీటిని సమన్వయం చేసుకొనిన ఒక ఉదాత్త చింతన లేక సౌందర్య తత్వచింతన

ఏర్పడుతుంది. సాహిత్యంలో తాత్విక నేపథ్యం , సౌందర్య తత్వం, సామాజిక దృక్పథం అనేవి తప్పనిసరిగా సమన్వయం చెందవలసిన ఆవశ్యకత వుంది.

ఏ కవులూ, కళాకారులు, మేధావులు అయినా ఇటువంటి శాస్త్ర పరిశీలన వలన ఒక దృష్టిని ఏర్పరుచుకొంటారు. తరువాత తమ తమ రంగాలలో సృజన కార్యక్రమాన్ని సాగిస్తారు. ఏదో విధంగా కీర్తి ప్రతిష్టలు సంపాదించు కొనే క్రమంలో వుండే వారిని యిందులో చేర్చలేరు. ఇది ముస్లిం కవులైనా, ఏ యితర కవులైన యీ మార్గములో పయనించవలసిందే! ప్రస్తుత ప్రకరణంలో ముస్లిం రచయితల సౌందర్య దృక్పథాన్ని పరిశీలించడం జరుగుతుంది.

అసలు సౌందర్యం యొక్క రామణీయకం కాంట్ నుంచి యీ మీమాంస విస్తృతమైంది. 'కాంట్ రామణీయకాన్ని రెండు విధాలుగా విభజించాడు.' (1) కేవల రామణీయకం లేక స్వచ్ఛంద రామణీయకం, (2) ఆశ్రిత రామణీయకం అనేవి. ( డా॥ జి.వి. కృష్ణారావు, జేగంటలు - పుట - 219 )

ఇకపోతే మహారామణీయకం అన్నది రెండు విధాలుగా విభజించడం జరిగింది. (1) పరిమాణాత్మక మహారామణీయకం (Mathematically Sublime), (2) శక్త్యాత్మక మహారామణీయకం (Dynamically Sublime) ఇది కూడా కాంట్ విభజనే (కృష్ణారావు జి.వి., 1999, పుట,222)

ఈ విధమైన రామణీయక విభాగాలు అతిసూక్ష్మదశలో పరిశీలించడానికి, సిద్ధాంత చర్చకు ఉపయోగపడతాయి. ఇంత సూక్ష్మ విభాగాలలో చర్చించే విధానానికి ప్రస్తుతం ఆవశ్యకత లేదు. అయితే సౌందర్యతత్వాన్ని స్థూలంగా అన్వయించుకొని ముస్లిం కవులు/రచయితలు తమతమ రచనల్లో ఏవిధమైన సౌందర్య దృక్పథాన్ని కలిగివున్నారో పరిశీలించవలసిన ఆవశ్యకత వుంది.

[2]తెలుగులో కళాతత్వ విచారణ 1925లో పురాణం సూరిశాస్త్రి గారు వ్రాసిన 'విమర్శక పారిజాతము'తో ప్రారంభమైంది. తరువాత 1926లో బసవరాజు అప్పారావు గారు రాసిన "ఆంధ్ర కవిత్వ చరిత్రము - కళాతత్వ శాస్త్రానికి" వీరిరువురూ ఆద్యులు. వీరి తర్వాత రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, విశ్వనాథ సత్యనారాయణ గారలు. గుంటూరు శేషేంద్ర శర్మ "కవిసేన మేనిఫెస్టో" ఆధునిక కావ్యశాస్త్రం, రక్తరేఖ పేర్కొనదగినవి. ఇంకా కళాతత్వ వివేచనలో ఆచార్య తుమ్మపూడి కోటేశ్వర్రావు గారు, డా॥ కోవెల సంపత్కుమారాచార్యగారలు ఉన్నారు.

ఇంకపోతే అచ్చంగా కళాతత్వశాస్త్రంలో విశేష కృషి చేసి కళాతాత్వికులని పేరుగాంచిన డా॥ సంజీవదేవ్, శ్రీకొండిపర్తి శేషగిరిరావు, ముదిగొండ వీరభద్రయ్యలాంటి వారిని ప్రముఖంగా పేర్కొవలసివున్నది.

ఈ సౌందర్యతత్వం గురించి స్థూలంగా ఇక్కడ చర్చించవలసిన ఆవశ్యకత వుంది.

అసలు సౌందర్యానికి, మానవజీవితానికి గల అనుబంధం విడదీయలేనిది. మానవుడికి (1) స్త్రీ సౌందర్యము, (2) ప్రకృతి సౌందర్యం, (3) మానసిక సౌందర్యం అనేవి వారి వారి స్థితిగతులను బట్టి, మానసికావసరాలనుబట్టి దగ్గరగా వుండి అనుభూతి చెందడం జరుగుతుంది. ఇది బాపిరాజు గారి విభజన. ప్రాచీన అలంకారికులు కూడా యీ విధంగా అన్నారు.

"అపారే కావ్యసంసారే కవిరేవ ప్రజాపతిః

యధాస్మై రోచతేవిశ్వం తధేదం పరివర్తతే" (లక్ష్మీకాంతం పింగళి, 1991,

పుట 4) (ఈ అనంతమైన కావ్యజగత్తులో కవియే సృష్టికర్త. తన కిష్టమైన తీరున యీ ప్రపంచాన్ని మలుస్తాడు) - ఇంకా అనేకమైన వ్యాఖ్యానాలు అభిప్రాయాలు కవుల పట్ల ప్రసిద్ధమైనవి ఉన్నవి. నిరంకుశాయః కవయః (కవి నిరంకుశుడు) కవి క్రాంతదర్శి; "కవిర్మనీషి స్వయంభూః పరిభూః " (కవి మనీషి - ఈశ్వరుడి మాదిరిగా స్వయంభువు) అని కవికి అతని దృక్పథానికి మన అలంకారికులు, ఉపనిషత్‌కారులు పట్టంకట్టారు. ఇటువంటి దృక్పథానికి సాహిత్య ద్రష్టలు రావడానికి ప్రధాన కారణం కవి యొక్క సౌందర్య దృక్పథం, సత్య దృష్టీ ప్రధానమౌతున్నవి. ఇటువంటి భారతీయ సంస్కృతిని, ప్రతిబింబించే విధంగా ముస్లిం కవులు/రచయితలు కూడా పూర్తి స్థాయిలో తమ ప్రతిభాపాటవాలను వెల్లడించారు.

కళాతాత్వికుడు డా॥ సంజీవదేవ్ "సౌందర్యం అంటే" అనే తన వ్యాసంలో యీ విధంగా అన్నారు. "సుందరం వేరు, సౌందర్యం వేరు. సౌందర్యం అనేది నైరూప్యం (Abstract) ఇది కంటికి కనిపించదు. సౌందర్యం వ్యక్తం కావటానికి ఒక వస్తువో, ఒక ప్రదేశమో ఒక వ్యక్తియో, మరింకేదేనైనానో అవసరం. దాని ద్వారా కాని సౌందర్యం వ్యక్తంకాదు. సౌందర్యం అనేది విశేషణం. అదేమాదిరి ఇంగ్లీషులో Beauty and the Beautiful. సుందరం నశిస్తుంది గాని సౌందర్యం నశించదు." (సంజీవదేవ్, 1999, పుట, 7)

సత్యానుసంధానం మానవ జీవితంలో ఎంతో ప్రధానమైంది. అదే విధంగా ప్రధానమైంది శ్రేయసాధన. ఈ రెంటితో సమంగా ప్రధానమైంది సుందరారాధన. ఈ మూటినే వరుసగా సత్యం-శివం-సుందరం అంటారు. మానవునికి సత్యం అవసరం, అది లేంది మనిషి అంధకారంతో కూడిన మిధ్యాజగత్తులో జీవిస్తాడు. మానవునికి శివం అవసరం అదిలేంది మనిషికి దుష్టశక్తులు అలవడతాయి. మానవునికి సుందరం అవసరం, అదిలేంది మనిషి ఆనందాన్ని కోల్పోయి విచారంలో వుంటాడు" (పైదే, పుట 8) సౌందర్య తత్త్వం గురించి ఈ వివరణ ఎంతో సాంద్రత కలిగి వుంది. ఈ దృక్పథం నుంచి ముస్లిం కవుల/రచయితల రచనలను పరిశీలించ వలసివుంది. భారతీయ సంస్కృతికి సత్యం-శివం-సుందరం అనేవి మూలధాతువులు. అయితే ముస్లిం రచియతలు కూడా తమ రచనల ద్వారా సత్యాన్ని అనుశీలించాలని, సమాజానికి నైతికత ఏవిధంగా వుండాలో బోధించాలని, రసమయ కవితలతో సౌందర్య తత్వాన్ని ప్రధానంగా రచించారు. ఇందువలన భారతీయ సమాజాన్ని సంస్కృతి ఎక్కువ భాగం ముస్లిం రచయితలు వ్యతిరేకించ లేదనే విషయం స్పష్టం ఇందుకు తెలుగు ముస్లిం రచయితలు మినహాయింపు కాదు. యాకూబ్ 'తీగలచింత' అనే కవితలో

> "దిగులుగానో
> దీనంగానో
> తప్పిపోయిన కొడుక్కోసం పొలిమేరల్లో
> నుంచున్న తల్లిలాగనో" - అని అంటాడు. (యాకూబ్, 2002, పుట, )

కవిగా యాకూబ్ "threatened conditions of human experience epitomise " ( పీఠిక - రమణమూర్తి - పుట ) గా చేస్తున్నాడని పీఠికాకర్త "రమణమూర్తి" పేర్కొనడం సమంజసంగా వుంది. కవితాత్మికధారలో పడి పోయినప్పడు అతని సౌందర్యదృక్పథం వెనకడుగు వేస్తుంది. రసోవైసః అన్నట్లు ఒకానొక దశలో రసయోగం, ఆధ్యాత్మికయోగం రెండూ "లీనావిలీనావస్థకు" చేరుకుంటాయి.

మహమ్మద్ ఖదీర్‌బాబు, చేసిన వర్ణన - పెండ్లికాని కుమార్తె గురించి, ఆమె యవ్వనం చేజారిపోయిన విధానాన్ని గురించి ప్రస్తావించిన తీరులో ఎంత వాస్తవ సౌందర్యము వెల్లివిరుస్తుందో గమనించాల్సి వుంది. 'ఢాకన్' అనే కథలో ఈ వాక్యాలు చూడండి.

"కానీ వయసు పెరిగే కొద్దీ రోజులు గడిచే కొద్దీ పెండ్లిసంబంధాలు చేజారే కొద్దీ ఆపండు గిడసబారి పోవడం, లోపలి గింజలు తడి ఆరిపోవడం, ఆమెస్తనాలతో పాటు కాయమే ఎండిపోయి ఒక పూచికపుల్లలా ఇంట్లో తిరుగాడుతుండటం ముబషీరా నిస్సహాయంగా చూస్తూవుండి పోయింది." (మొహమ్మద్ ఖదీర్‌బాబు, 2004, పుట, 10)

ఇక్కడ అసుందరమైనది కూడా రచయిత వ్యక్తీకరణలో సుందరమైనది. ఇందుకు ఉదాహరణగా తిక్కనగారు అభిమన్యుడు చనిపోయిన సందర్భంలో చెప్పిన పద్యం గుర్తుచేసుకోవచ్చు. దుఃఖావహమైన వాతావరణంలో కూడా, బీభత్సకరమైన సమయంలో కూడా ఆ వర్ణనలో రామణీయకం పఠితలను ఆకట్టుకొంటుంది.

ఈ విధంగా వుంది. ఈ భీభత్స, భయానక దృశ్యం వర్ణించేటప్పడు కూడా రామణీయకాన్ని రంగరించి దృశ్వీకరించడం కనిపిస్తుంది.

ప్రసిద్ధ కవి ఇస్మాయల్ 'నత్త ప్రణయయాత్ర' అనే లఘు కవితా సంపుటిలో యీ విధంగా అన్నారు.

"లోతుగా ఆలోచించి
లోతందక
చివరికి మరణించాడు"
"పిల్లల ప్రపంచం
పిల్లలే సృష్టించుకుంటారు
పెద్దవాళ్లకిది చేతకాదు" (ఇస్మాయిల్, 2004, పుట 11-12)

ఈ కవితలో సత్య దృష్టీ, సౌందర్యసృష్టీ వియ్యమందాయి. ఈ హైకూలను చదివినప్పడు ఒక సరళత, స్వచ్ఛత, శిశుహృదయం కనిపిస్తాయి. అవి కవితకు ఒక సౌందర్యాన్ని అందిస్తాయి. ముస్లింలు, ముస్లిం రచయితలు అన్నప్పడు ఒక జాతి పరంగా వారికి "కొంత కరుకుదనాన్ని, కాఠిన్యాన్ని" ఆపాదించడానికి సగటుమనిషి వెనుకాడడు. అయితే అది భ్రమాత్మకం, సున్నితమైన భావుకులు, కవులు, మేథావులు ముస్లిం సమాజంలో కోకొల్లలుగా వున్నారు. ఇక్కడ ఇస్మాయల్ వ్యంజనాత్మక కవితలు ఎన్నో రచించారు. మచ్చుకి ఒకటి

"ఆధునిక చిత్రకళ
నాకిష్టం; వాంగో అంటే
చెవికోసు కుంటాను"

ఇక్కడ ఒక సుందరమైన నేపథ్యాన్ని కవి సూచిస్తున్నాడు. వాంగోచిత్రకారుడుగా ప్రపంచప్రసిద్ధుడు. భావోద్వేగాల జీవితం ఆయనది. ఏ కళాకారుడైనా ప్రేరణాత్మకంగా జీవించాలంటే ఇటువంటి భావోద్వేగాలు సహజంగా అలవడిన వ్యక్తి అయి వుండాలి. అయితే వాటిల్లో విపరీతం వుండకూడదు. అయితే వాంగోలో విపరీత ధోరణి ప్రస్ఫుటంగా వుంది. వాంగో ప్రేమించిన స్త్రీ ఒక వేశ్య ఒక రోజు ఆమె ఒక "చెవిరింగు" లాంటిది తీసుకొనివచ్చి వాంగో తటస్థపడినప్పుడు ఆయన చెవికి దగ్గరగా యీరింగు పెట్టి నీ చెవి ఎంతఅందంగా వుందని ప్రశంసిస్తే "వాంగో" తన చెవిని కోసి ఆమెకు కానుకగా ఇస్తాడు - "వాంగో అంటే చెవికోసుకుంటాను" అనే కవితావాక్యంలో వాంగో ఒక స్త్రీ కోసం చెవి కోసుకున్నాడు. వాంగో యొక్క కళా సృజన, కళకు అంకితమైన తీరు వలన, వాంగో మేధావి కూడా అగుట వలన నాకు కూడా అతనంటే చెవి కోసుకునేంత ప్రీతి వుందనే విశిష్టార్థం యీ చిన్న హైకూలో వుంది. హైకూ సంప్రదాయం జపాన్ నుంచి మిగతా దేశాలకు వ్యాపించింది.

అసలు కవిత్వం ఛందోబద్ధమైతేనే, లయాత్మకత వలన, యతిప్రాసల వలన, సౌందర్యవంతం ఔతుందనేది ఒక వాదన మాత్రమేగాని వాస్తవంకాదు. ఈ కొలమానం అనేది తప్పనిసరిగా కవిత్వంలో ఉండనవసరంలేదని ఎప్పుడో పూర్వసాహితీ విమర్శకులు వ్యతిరేకించారు. ప్రఖ్యాత కళా విమర్శకుడు "కాల్‌రిడ్జ్" ఈ విధంగా అన్నారు. (కాల్‌రిడ్జ్, 1991, పుట 22) "**Poetry of the highest kind may exit without metre**" (ఉత్తమ కవిత్వము ఛందస్సు లేకయు ఉండవచ్చును.) ఇంకొక కళా విమర్శకుడు "సర్‌ఫిలిఫ్ సిడ్నీ" యీ విధంగా అన్నారు. "**The greatest part of poets have apparelled their poetical inventions in that numrous kind of writing called verse. Indeed verse, is an apparel only, being but an ornament and no cause to poetry, since there have been most excellent poets that have never versified and now swarm many versifiers that need never answer to the name of poets**" ( సర్ ఫిలిప్ సిడ్నీ, (అను) లక్ష్మీకాంతం పింగళి, పుట, 25) (కవులలో బహుసంఖ్యాకులు తమ కావ్యకల్పనకు పద్యమని చెప్పబడు గుణాత్మకమైన ఆచ్ఛాదనము తొడిగిరి. అది ఆచ్ఛాదనము

మాత్రమే. అది కవిత్వమునకొక బహిరలంకరణము మాత్రమేగాని మూలకారణముకాదు. పద్యరచనయే చేయని ఎందరో మహాకవులు కలరు. ఇటీవల కవినామార్హతలేని పద్యరచయిత లెందరో మూగుచున్నారు.) - ఈ వివరణ వలన స్పష్టమయ్యే విషయాలు రెండు :

1. కవిత్వములోని సౌందర్యతత్వానికి చంధోబద్ధత అవసరం లేదు.

2. కవిత్వంలో సౌందర్యతత్వం అనేది కవి యొక్క మానసిక సౌందర్యం పై ఆధారపడి వుంటుంది. అతని దృష్టిపై ఆధారపడివుంటుంది.

ఇందువలన విశదమయ్యేదేమంటే ఆధునిక కవుల యొక్క వచన రచనలు, కూడా పూర్తిగా సౌందర్యతత్వ వివేచనకు ఉపకరిస్తాయని తెలుస్తుంది. అందువలన ముస్లిం కవులు, వచన రచనలు చేసినవారు; కథా రచనలు చేసినవారిని సైతం యీ సౌందర్యవివేచన పరిధిలోకి తీసుకొనిరావడం జరిగింది. కవిత, కథ, పాట, ఏ ప్రక్రియలోనైనా కవి యొక్క దృష్టితోనే రామణీయకం ఔతాయి.

సుప్రసిద్ధ ప్రాచీన అలంకారికుడు ధనుంజయుడు “దశరూపకము”లో ఈ విధంగా అంటాడు. కావ్యవస్తువు రమ్యమైన, జుగుప్సితమైన, నీచమైన, ఉగ్రమైన, ప్రసన్నమైన, గహనమైన, వికృతమైన కాని అసలు వస్తువే లేక కేవలం భావమే ఉండని, భావుకుడైన కవిచే చక్కగా భావించబడితే ఈలోకములో రసవంతము కానిదేది లేదని. ఈ దృక్కోణం నుంచి కూడా ముస్లిం రచయితల రచనలు ఇక్కడ అనుశీలించబడినవి. ఉదాహరణకు “అజాఁ” - గుజరాత్ ముస్లిం కవిత్వం అనే సంపుటిలో ప్రసిద్ధ రచయిత కరీముల్లా “ధర్మం - శీలం - ఏకత” కవితలోని బీభత్స సౌందర్యాన్ని చూడండి :

“ధర్మం .......
అవును ధర్మమే కదా వాళ్లకు రక్ష
చుట్టూ విచ్చు కత్తులు ముసురుకుంటున్నా
కళ్లుమూసి తజ్‌వీ తిప్పకునే నన్ను
అమాంతం తగలెయ్యటం వాళ్లకు ధర్మమే
నా అస్తిత్వం ఖైమా తునకలై

సరయూలో మొసళ్లకు ఆహారమైనా
ఇంకా ఇక్కడేందో మిగిలుందని భ్రమసి
చిటికెడు ఆశతో వెంపర్లాడుతున్న నన్ను
వెంటాడి వేటాడి చంపడం వాళ్లకు ధర్మమే
శీలం ......
బూబమ్మల గౌరవాల్ని చిల్లరనాణాల్ని చేసి
తమ పురుషత్వాన్ని మాజెండా చెట్టుపై
రెపరెపలాడించారు కదా!
అవును శీలమే వాళ్ల పునాది!
చంటోడు పాలకోసం ఏడిస్తే
పళ్లగాట్లకు పచ్చిపుండైన స్థనాల్ని చూసి
యా అల్లా! నాకెందుకిచ్చావీ అమ్మతనాన్ని ........" (కరీముల్లా, 2002, పుట 28)

ఇక్కడ ధర్మం - శీలం - ఏకత అనే వాటి యొక్క 'ఉనికిని' (Existence) ప్రశ్నించిన కవిత ఇది. ధర్మం - శీలం - ఏకత అని పదేపదే అరిచే వర్గాన్ని ఈ కవితలో అవహేళన చేశాడు కవి - బీభత్స సౌందర్యాన్ని ప్రతి ధ్వనించాడు. ముస్లిం ఒక జాతిగా ఎంత వివక్షతకు గురి అయినదీ, యీ వాక్యాలు స్పష్టపరుస్తున్నాయి. కవితాత్మకంగా రమణీయంగా కూడా!

గుజరాత్ అల్లర్లలో మాడిమసి అయిపోయిన సాటి ముస్లింల, ముస్లిం స్త్రీల దయనీయతను అక్షరీకరించడంలో తెలుగు ముస్లిం రచయితల పాత్ర మరువరానిది. 'అజా' కవితా సంపుటిలో యీ వేదనాక్షరాలు ప్రతిపుటలో పుటం పెట్టినట్లు కన్పిస్తుంది. రచయిత అన్వర్ యీ సంపుటికి పీఠిక వ్రాస్తూ యీ విధంగా అన్నారు. "విషాదాన్ని కూడా పండుగ చేసుకునే మతతత్వ దుర్మార్గుల దురాగతాలకు నిరసనే, హిందూ దేవుళ్లకు ముస్లింల రక్తాన్ని తర్పణ చేశామనుకుంటున్న దుండగుల మతోన్మాదానికి ఆకుపచ్చని ధిక్కారమే" కవులుగా ముస్లింకు జరిగినదంతా చూపెడుతున్నామనికాదు అతివాద మితవాద మతవాద రాజకీయాలనుంచి - మానవీయతవైపుగా .... అరాచక అసాంఘిక శక్తుల గుండెల్లో మానవత్వమతాన్ని నూరిపోద్దాం" (అన్వర్, 2002 పుట iv)

ముస్లిం సమాజంలో బాబ్రీమసీదు విధ్వంసం, గుజరాత్ కల్లోలం అభద్రతాభావాన్ని బలంగా నాటుకొని పోయేటట్లు చేసింది. ఈ నేపథ్యంలో ముస్లిం రచయితలు తమ ఆవేదనను, ఆక్రోశాన్ని, నిరసనను కళారూపాలలో వ్యక్తపరచారు. సామాన్యుడు అంతకంటే ఏం చేయగలడు, హిందూ ఉగ్రవాదం, ముస్లిం ఉగ్రవాదం, మతబీజాలనుంచి మొలకెత్తిన విషవృక్షాలు - మతం కన్నా మానవత మహామానవత అనేవి ముఖ్యమైనవని ఆచరించవలసినవని ముస్లిం రచయితలు గుర్తించి సహేతుకంగా కళాత్మకంగా ప్రతిబింబింపజేశారు.

'అజా' కవితా సంపుటిలో ముస్లిం కవులు తమ నిరసనను తెలియపరుస్తూ సామాజిక బాధ్యతను ఏవిధంగా నిర్వర్తించిందీ, తమ వర్గం యొక్క స్పృహను ఏవిధంగా కలిగివున్నదీ పరిశీలించవలసిన ఆవశ్యకతవుంది. ఈ విధమైన పరిశీలన వలన, తమ వర్గం యొక్క సంస్కృతిని కాపాడుకోవాలనే ఆకాంక్షతో పాటు అసలు భారతీయ సంస్కృతిని వీరు గౌరవిస్తున్నారనే అనే విషయం అవగతం చేసుకోవాలసిన ఆవశ్యకత వుంది.

ఈ కవితా సంపుటి ప్రారంభంలోనే "వలీ గుజరాతీకీయాద్‌మే" అనే ముందుమాటలో ముస్లింలు భారతీయ సంస్కృతిని ద్వేషించేవారు కాదని యీక్రింది వాక్యాలలో "అన్వర్" స్పష్టీకరించాడు.

"వలీ గుజరాతీ మొదలు వలీ దఖనీ
దక్కన్‌ల పుట్టి పెరిగిన వలీ అహ్మదాబాద్‌లో చనిపోయారు
ఆయన సమాధిని
'ఛీనీ పీర్ క మజార్' అని పిలుస్తారు. (అన్వర్, 2002, అజా: ముందుమాట)

తొమ్మిది వందల ఏండ్ల నుంచి భారతదేశపు సంస్కృతికి ప్రతిబింబంగా నిలచివున్న ఆయన మజార్‌ను మొన్నటి గుజరాత్ దాడుల్లో కాషాయమూకలు నేల మట్టం చేస్తే మునిసి పాలిటీవాళ్లు దానిపై డాంబరు రోడ్డు వేశారు - సమాజంలో జరిగే మైనారిటీ వ్యతిరేక చర్యలకు ప్రభుత్వ వర్గాలు 'తమ వంతు సాయాన్ని' అందిస్తున్నావని పై సంఘటన వలన తెలుస్తుంది.

ఇదీ జరిగిన సంఘటన. ముస్లిం కవుల/రచయితల మనోభావాలను దెబ్బదీసిన దాడులు. సభ్య, ప్రజాస్వామిక సమాజంలో కులకక్షలు, మతద్వేషాలు పనికిరావనే సందేశాన్ని ముస్లిం

కవులు ఈ సంఘటను ఆసరాగా తీసుకొని ఉద్బోధిస్తున్నారు - అన్ని వర్గాలలో ఉన్నట్లే మా వర్గంలో కూడా "ఉగ్రవాదుల" ఉనికి వుందని, అది హిందూ సమాజాన్ని కడగండ్ల పాలు చేస్తుందని, దాన్ని ఆసరాగా తీసుకొని మొత్తం ముస్లిం సమాజాన్ని "ఉగ్రవాదుల నీడలుగా" భావించి 'గుజరాత్ అల్లర్ల లాంటివిచేసి, మొత్తం భారతీయ సమాజాన్ని వినాశనం వైపుకి నడిపించవద్దనే హితవు యీ కవితా సంపుటిలో కనిపిస్తుంది. అందువలన యీ కవితాసంపుటిలోని కవులు, భిన్న గళాలతో పలికించిన విషాద స్వరాలలోని మంద్రస్థాయిని గమనించవలసివుంది. మొదట స్కైబాబ వ్రాసిన "గుజరాత్ ముస్లింల గోసలోంచి"......' అనే ముందు మాటలో యీ వాక్యాలను గమనించాలి. ఇవి స్కైబాబ గుజరాత్‌లో పర్యటించి తెలుసుకున్న వాస్తవాలు.

"ఎవరూ వెళ్లని ఒక ఊరు - సంజేలి. 9 జూన్ రాత్రి 8 గంటలకు దాహోద్ జిల్లా కేంద్రానికి 60 కి.మీ.ల దూరంలోని గిరిజన ఏరియాలో ఉన్న ఆ ఊరిలో దిగాం.

..............................................

"ఆ 468 ఇండ్లలో చెంచా కూడా మిగలకుండా దోచుకొని 24 గంటలసేపు ఆ ఇండ్లను కూలగొట్టి తలగబెడితే కేవలం దేహాలు మాత్రమే దక్కించుకుని ఆకాళరాత్రి చెట్టుకొకరు పుట్టకొకరు పరుగులు పెట్టి 2 నెలల తర్వాతగాని తిరిగి తమ ఊరు భయం భయంగా చేరినవాళ్లు, తమపై పదివేల మందికిపైగా దాడి చేసిన భయ విహ్వల గాధని వివరిస్తుంటే మూడున్నరనెలల తర్వాత కూడా వాళ్ల ముఖాల్లో కనిపించని వెలుగుని వెతుక్కుంటూ ఉండిపొయ్యాం మేము. 'కహా జాయంగే ? మరేతో యహీ మరేంగే .... జన్మ్ భూమితో యహీహై' - గుజరాత్ బాధితులెందరి నోటినుంచే విన్నట్లు గానే అక్కడావిన్నాం." (స్కై. బాబా, 2002 పుట V)

"రామ్‌కే నామ్ ఇన్‌సానోంకో కాట్‌తేహై" - రాముడి పేరుతో గాని అల్లా పేరుతోగాని, క్రీస్తు నామంతో గాని జరిగే అకృత్యాలు సహించరానివి. అజాకవులు 38 మంది - వీళ్లందరినీ కూడా ముస్లిం సమాజానికి ప్రతినిధులుగా తీసుకోవచ్చును. వీరి భావజాలం కన్నాభిన్నంగా మిగతా ముస్లిం జనాభా యొక్క భావజాలం వుండదు.

'అనీస్ పర్వీన్' - మానూస్ బద్‌బూ కవితలో - ఒక యుద్ధ విధ్వంసక నేపథ్యాన్ని చూపిస్తుంది.

ఇది ఒక భయానక బీభత్స సౌందర్యగీతం-

“నేల నుంచి ఆకాశం దాకా పొగలే పొగలు
ఆ నల్లని పొగలు సుడులు సుడులుగా లేస్తున్నాయి
ఏం కనిపించడం లేదు
కొద్ది కొద్ది సేపటికి
గుండెల్ని పిండేసే ఆర్తనాదాలు .....” (అనీస్ పర్వీన్, (సం) అన్వర్ 2002, పుట 1)

ఈ ఆర్తనాదాలు పేదముస్లిం వర్గాలవారివి. ఈ ఆర్తనాదాలు భారతదేశాన్ని కదిలించివేశాయి.

“పీలీలు లేషినయ్” కవితలో అన్వర్‌కవి

“ఖభర్‌స్థాన్ లల్లకూడ
పూలుంటే బాగుండు చెట్లునీడుంటే బాగుండు
సుగంధ పరిమళ ముంటే బాగుండు
ఊట బావి నీటి చెలమ వజ్జుఖానా వుంటే బాగుండు అనుకునేముసల్‌మాన్” (అన్వర్, 2002, పుట, 3)

యీ కవితా వాక్యాలలోని సౌందర్యపరిమళం కవితా సంపుటి అంతా వ్యాపించినట్లు వుంది. ఎంత మనోహరమైన రసభావన - శ్మశానాన్ని తన వర్ణనలతో ఒక ఉద్యానవనంగా మార్చాడుకవి. ఈ కవిత ముగింపు కూడా విశిష్టమైనదే!

“అరే సాయిబూ
పిల్లల్ని పుట్టిచ్చుడేకాదు
ఇప్పుడు పిల్లల్ని కాపాడుకుందాం” - (పుట, 4)

ఈ హెచ్చరికలో ఒక బాధ, ఒక వ్యంగ్యం అందంగా అభివ్యక్త పరచబడింది. ఈ మూడు వాక్యాల్లోనే ముస్లింలందరికి ఒక గొప్ప హెచ్చరిక చేశాడు కవి - ఈ కవితా వాక్యాలు పఠిత హృదయములో పటిష్టముగా పాదుకొనిపోతాయి.

ఖామోష్ కవితలో కవి అబ్బాస్ అంటారు -

“ఎవరది ఆ దీపం వెలిగిస్తున్నది
ఆర్పండి ముందు

ఇక్కడంతా నిద్రపోతున్నారు

చప్పడు చేయకండి -" (అబ్బాస్, (సం) అన్వర్ 2002, పుట 10)

దాడుల్లో చనిపోయిన ముస్లిం సోదరుల గురించి వ్రాసిన వాక్యాలు కవితాత్మకంగా వుండి, హృదయాన్ని కలచివేస్తాయి. కవికళాత్మకత ఇక్కడ విప్పారివుంది.

డా॥ ఇక్బాల్ చంద్ 'పన్నాకజి' కవితలో :

"ఈతోటలోని కోయిలలు

వసంతాల్ని కోరవు

పాటలు కూడా పాడవు

ఆకలి చావుల్నీ ఆత్మహత్యల్నీ చూడవు

వెలిగాని కతలు చదవ్వు

పలచనవుతున్న నెత్తుటి రంగునిచూస్తూ

దేవస్తుతికి గుడికట్టడానికి

మనిషి ఎముకల్ని ఇటుకలుగా మోసుకెళ్తున్నాయి" (ఇక్బాల్ చంద్, 2002, పుట 16)

ఈ వాక్యాలలో గుజరాత్ భీభత్సం కనిపిస్తున్నప్పటికీ, యీ కవి సౌందర్య స్పృహను వీడలేదు. ఇక్కడ కవితా వేశం సౌందర్య దీపాన్ని ఉద్దీపన చేసింది. 'రక్తవర్ణచిత్రం' అనే కవితలో ఇషాఖ్ మహ్మద్ యీ విధంగా అన్నారు :

"అక్కడ మతోన్మాదం

రక్తపు హోళి ఆడుతుంది

అది రక్తం కాదు

రంగు నీళ్లని బుకాయిస్తుంది" (ఇషాఖ్ అహ్మద్ (సం) అన్వర్, 2002, పుట, 26)

హోళీ పండుగను జరుపుకున్నట్లు ఈ రాక్షసక్రీడ జరిపారని చెప్పడంలో కవి యొక్క వాస్తవిక దృక్పథం, హత్తుకొని పోయే విధంగా అందంగా చెప్పబడింది. ఈ వాక్యాల వెనుకవున్న దృశ్యం భయకంపితులను చేస్తుంది కూడా! 'నా పేరే నా మరణశాసనం' అన్న కవితలో ఖాదర్ మొహియుద్దీన్ ఈ విధంగా అంటున్నాడు, తన పేరు గురించి :

"నాపేరులోంచి చావువాసన
పుట్టబోయే బిడ్డకు నేను పెట్టబోయే పేరులోంచి చావువాసన
నలభై అయిదేళ్ల క్రితం
చచ్చిపోయిన మా అమ్మ సమాధిలో
కాలుతున్న కడుపులోంచి కమురువాసన
పురిటికీ చావుకీ ఒకటే నొప్పి, ఒకేవాసన -"... (ఖాదర్ మొహిద్దీన్ (సం) అన్వర్, 2002, పుట 31)

మతాన్ని తెలియపరిచే పేరు పెట్టుకోవడంలో ఎంత దుర్భర స్థితి ఎదురౌతుందో కవి, చావు, వాసన" అనే పదం ద్వారా అందంగా అభివ్యక్తపరచాడు. "యాడికి బోవాల ?" అనే కవితలో ఖాదర్ షరీఫ్ తన ఆవేదనను అందమైన మాండలికంలో యీ విధంగా అన్నారు.

"ఈ గడ్డ మీద బుట్టి
ఈ గడ్డ మీదే బెరిగి ఇంత జరిగినాక
ఎక్కడికెళ్లి బోవాల ? యాడదాంకోవాల ? యాడసావాల ?
మా మసీదులు కూల దోస్తావుండారు
మా బతుకులు గాలస్తా వుండారు
రేపు మా ఖబరస్తాన్‌లన్నీ తవ్వి
ఫిలాట్లు గట్టరని నమ్మకమేంది?" (ఖాదర్ షరీఫ్, (సం), అన్వర్ 2002, పుట, 36)

మతోన్మాదులు, మా స్మశానాలను కూడా వదలరని ధ్వని వుంది - ఇంతక్రూరత్వానికి విరుగుడు లేదా ? అనే ప్రశ్న కూడా దాగివుంది. "నా శవాన్ని నేనే భుజాన మోస్కుంటూ" అనే కవితలో ఖాదర్ షరీఫ్ కవి యీ విధంగా అనడం చూస్తుంటే అక్కడ ముస్లింలలో దాగి వున్న నిర్వేదం అర్థమవుతుంది. - ఆ కవితలో

"ఇజ్జత్ పోగొట్టు కున్నోళ్లం
చరిత్ర సచ్చిన ఈ భూమిమీద
విషాదపు గుడారాల్లో

వెల్తురు గద్దలకు, చీకటి తోడేళ్లకు భయపడి
మొదటి దృశ్యానికి, ఆఖరి దృశ్యానికీ తేడాల్ని గమనిస్తూ
మా గుండెలకి కర్చుకుపోయిన రక్తపుమచ్చల్ని
ఒకరి కన్నీళ్లతో ఇంకోళ్లం కడుక్కుంటున్నాం
తియ్యదనం కోసం పడిచచ్చే తిరుగుడుగాళ్లకిప్పుడు
మా ఆడ పిల్లలు కనిపిస్తే సంబరమయి పోయింది గదయ్యా" (పైదే, పుట 38)

శరణార్థులుగా గుడారాల్లోకి చేర్చబడిన బాధితుల కన్నీళ్లకు ఒక రూపం కల్పించడానికి కవి ప్రయత్నించడంతో వాస్తవ రూపాన్ని ఏవిధంగా శిల్పీకరించవచ్చో కొంత అవగతమౌతుంది. "జహన్నుమ్" కవితలో గౌస్ మోహియుద్దీన్ మనిషిలోని ఆటవికతను సౌందర్యాత్మకంగా వర్ణించాడు

"పావురానికి రాబందుకు జరిగేది ఘర్షణకాదు
ఘర్షణకై రెండు రాబందులు కావాలి
తోడేలు మేక పడేది ఘర్షణకాదు
ఘర్షణకై రెండు తోడేళ్ళు కావాలి
నీ మొహాన చిమ్మిన నెత్తురు
నాదేనన్నది స్పష్టమే
నీవు శూలానివైనందుకు
నా తెల్లటోపి
కుక్కనోటి పావురమైంది
తెగిపడ్డ నా గడ్డం
నీకు హోమగుండమైంది
నాచుట్టూ 'పద్మ'వ్యూహాలే
ఈ వ్యూహాలు అప్పటికప్పటివి
కానేకావు
కుర్చీలు కూలాల్సిన నా ఆర్తనాదాలకు ....
సబర్మతీ అహింస చెరచబడ్డా

చట్టం తన కళ్లకు
'పద్మం' మార్కు ప్లాస్టర్‌ను
తగిలించుకొంది -" (గౌస్ మొహియుద్దీన్ (సం) అన్వర్, 2002, పుట 40)

కవి "నా తెల్లటోపి కుక్కనోటి పావురమైంది" అనడంలో నా శాంతిమయ జీవనం ఎందుకూ పనికిరానిదై పోయిందనే వాస్తవాన్ని తెలియజేయడానికి ప్రయత్నించాడు.

"ఆమెనుదుటాకాశంలో
చందమామలేని తనమే
కుక్కలు చింపిన విస్తరి చేసింది -
ఆ చమేలీపువ్వు
నా జమీన్‌లో పూసినందుకే
రెమ్మారెమ్మా విరచబడింది
నాచమన్‌లో కాసినందుకే
ఆ పిందెలూ
రాల్చబడి నరకబడ్డాయి
నాచమన్‌లో పుట్టినందుకే
ఆ గోరింక
పెట్రోల్ తాగించి
అగ్గిపుల్ల తిన్పించబడింది -" (పైదే, పుట 41)

ఒక ముసల్మాన్ బాలిక ఏవిధంగా నేలరాల్చబడిందో, ఆమె అందం ఏవిధంగా అగ్గిలో కాల్చబడిందో, కవితాకళ ద్వారా అభివ్యక్తపరచబడింది - ఒక భీభత్స దృశ్యాన్ని కూడా శబ్దమాధ్యమం ద్వారా నిశ్శబ్దంగా అక్షరీకరించడం కవిత్వ మర్మజ్ఞత! కవిదుఃఖం పాఠకుల దుఃఖం కూడా!

ప్రముఖ ముస్లిం కవి/రచయిత డా॥ దిలావర్ కవిత ఒక సౌందర్య గీతిక మాదిరిగా సాగిపోతుంది. గజల్ కవి సమాధి నాశనం అయిన సందర్భానికి చలించిన దిలావర్ ఒక రసోద్వేగంతో యీ కవిత రచించాడు.

"ఓ ఉర్దూ వాల్మీకీ

షాహీదర్బార్‌లో నువ్వు

ఎగిసిపడిన ఒక గజల్ కెరటానివి ?

నువ్వు స్వరమెత్తితే

లక్షస్వరాలు శృతి కలిసాయి!

వెల్లువెత్తిన హిందీ పాటల వరద

నీ గజల్ గర్భంలో ఘూర్ణిల్లింది!

ప్రియురాలి కనురెప్పల రెపరెపలకే

గాయపడే సుకుమార గజల్ హృదయా!

పారసీ ఇష్క్ మజా

దేశీయంలో శిల్పించిన సాహిత్య శిల్పీ

రంగ్‌బిరంగ్ కలల వెన్నెలలను

ఉర్దూ అక్షరాల కళ్లలోగిళ్లలో నింపిన స్వాప్నికుడా!

మజ్‌హబీ 'కట్టర్‌పన్' లేని సాత్వికుడా

సూఫీపకీరుల బడితప్ప

దునియాలో ఏ మఖామ్ ఎరుగని తాత్వికుడా!" (దిలావర్ (సం) అన్వర్, 2002, పుట 48)

ఇక్కడ దిలావర్ కవితా ఘోష ఏమిటంటే కాంతి, జ్ఞానం, ప్రేమ లాంటి వాటిని బోధించే సూఫీ తత్వాన్ని అలవర్చుకొన్న కవి తాలుకా స్మృతిని కూడా మత వాదులు కూల్చివేశారనే ఆవేదనను వ్యక్తపరుస్తాడు. ఇంకా కవిత సాగిపోతూనే వుంటుంది ఒక రస స్రవంతిలా! ఒక కవి గాయకుని సంగీత, సాహిత్య సౌరభాలను యీ కవిత వెదజల్లింది - నలుదిక్కులా! ఒక పూర్వకవి 'వలి' తన చేతన ధారతో భారతీయ - పారశీక - ముస్లిం సంస్కృతులకు ఉత్తమ సమ్మేళనంగా వుండి మరణించి తర్వాత  జ్ఞాపకార్థం నిర్మించిన స్మృతి కట్టడాన్ని గూల్చివేయడం ఒక విషాద సన్నివేశంగా రమ్యంగా దిలావర్ శిల్పీకరించారు.  ఈ విధంగా దిలావర్ సాగించిన కవిత ఇంకొకటి "నాకు చెప్పాస్తలేదు" అనేది కూడా ఎన్నదగినది.

"నా జిందగీకా చమన్‌లో
ఇప్పుడు విరబూసే తమన్నాలు లేవు తన్‌హాయీలు లేవు
కాలిపోయిన మొండి గోడల మధ్య
చెదిరిపోయిన ఇన్‌ఖిలాబ్ మంజర్ శకలాలు ఏరుకుంటూ
కన్నీటి ఖడ్గ చాలనం చేస్తూ
నాకు సరిగ్గా చెప్పొస్తలేదు ......" (పుట 49)

ఇంత ఘోరాన్ని గురించి చెప్పడం, నావల్ల కాదు అంటూనే ముస్లింను దుష్మన్‌గా చూసే తత్వాన్ని ఎండగట్టాడు. నిసార్, 'బరబాదైతడు' కవితలో హిందూ పౌరాణిక గాధలను ఉదాహరిస్తూ స్త్రీలను అవమానపరచిన వాళ్లెవ్వెరూ బతికిబట్ట కట్టలేదనే సందేశాన్ని ఇస్తాడు.

"సీతనెత్తుకు పోయినందుకు
హనుమంతుడు లంకను తగులబెట్టిండు
ద్రౌపదిని తన తొడమీద కూర్చోమన్నందుకే
భీముడు దుర్యోధనుని తొడలు విరిచిండు
ఇవాల మా ఆడోళ్లను బరిబత్తల చేసి నానాహింసలు పెట్టిన వాడెవడైనా
ఈ దేశాన్నేల లేడు
వాడు బరబాదైతడు
బరకాసైతడు -" (నిసార్ (సం) అన్వర్, 2002, పుట 55)

ఈ కవితలో రామాయణ, భారత గాధల్లో జరిగిన అన్యాయాల వలన ఏ విధంగా వాళ్లు నాశనం అయ్యారో మరలా ఒక సారి హిందూ తీవ్రవాదులకు గుర్తుచేయడంలో వాళ్ళు మరచిపోయిన " నీతిని" మరలా గుర్తుచేస్తాడు కవి.

'జనాజా' కవితలో మెహమూద్ అంటాడు.

"గుజరాత్ గల్లీగల్లీ
ముసల్మాన్ రక్తం పిచ్‌కారీ చేయ బడింది
హోలీ పండుగ రోజులా -" (మహమూద్ (సం) అన్వర్, 2002, పుట 58)

ఇక్కడ వసంతోత్సవాన్ని గుర్తుచేస్తూ ఒక బాధాస్వరం కవితాత్మకంగా వినిపిస్తుంది. తరువాత "తప్పిపోయిన బంతిలా తన బాల్యాన్ని వెదుక్కుంటున్నాడు" ఈ పంక్తుల్లో అలంకారికశోభ వ్యక్తమౌతుంది. "గాయపడ్డ గుండె" అనే ఇంకొక కవితలో మెహమూద్ అంటాడీ విధంగా :

"గాయపడిన గుండె
జాగ్రత్తగా ఒడిసి పట్టుకోండి
మృదువుగా ముట్టుకోండి
కోటి వీణల తంత్రులతో నిర్మింపబడ్డది
ఏ తీగ మీటినా విషాదం పలుకుతుంది -" (పుట, 61)

గుజరాత్ కల్లోలం ద్వారా గాయపడిన గుండెను, మృదువుగా స్పర్శించి, అనేక వేల తంత్రులతో నిర్మింపబడిన యీ గుండెలోని ఏ తీగమీటినా స్వరాలు విషాదస్వరాలుగా వినిపిస్తాయని రమ్యాలోకన ద్వారా చెప్పాడు కవి!

యాకూబ్ పాషా "మాట్లాడే గాయం" కవితలోని శబ్ద చమత్కారం చూడండి

"సజీవ దహనాలు
మూకుమ్మడి హత్యలు
గ్యాంగ్ రేప్‌లు
'బాపు'రే! ....... -" (యాఖూబ్ పాషా (సం) అన్వర్, 2002, పుట 70)

బాపుని - ఆశ్చర్యార్థకంలో చూపాడు -

'జనోసైడ్' కవితలో రహమతుల్లా ముస్లిం మత సాంప్రదాయాలు గుర్తింపుకు గురై. అమానుషత్వానికి ఎర అయిన సందర్భాన్ని 'హైకూ' లాంటి వాక్యాలతో యీ విధంగా అంటాడు.

"హతమార్చడానికి రెండే పహచాన్‌లు
గుప్పెడు గడ్డం, నెత్తిన టోపి
ఊరకుక్కల్లా మీదపడ్డానికి రెండే
సల్వార్ కమీజు, బురఖా!" (రహమతుల్లా (సం) అన్వర్, 2002, పుట 78)

ఇటువంటి 'ప్రతీకలు' ప్రతి మతంలోనూ వుంటాయి - ఇవి వారివారి సంస్కృతినిబట్టి వుంటాయి. ఈ ప్రతీకల ఆధారంగా మతదాడులు జరుగుతాయని కవి సరళ సుందరంగా యీ భావాన్ని వ్యక్తపరచాడు -

'కాలీ దునియా' కవితలో షాజహానా -

"అయినా

స్త్రీ తప్ప మగాణ్ణి క్షమించేదెవరు ?

ఎప్పటికీ ప్రపంచం

నారొమ్ముతాగుతున్న పసిబిడ్డే" - నంటుంది - అందంగా - ఒక తల్లిలా (షాజహానా (సం) అన్వర్, 2002, పుట 85)

సయ్యద్ గఫార్ అంటాడు "అమ్మా ...... నేనే ...... నే ........" అనే కవితలో

"సృష్టినంతరంగరించి పోసినా

సాటిరాదు

అమ్మచిటికెడు చనుపాలకు

అమ్మకు ప్రత్యామ్నాయం అమ్మే" (సయ్యద్ గఫార్ (సం) అన్వర్, 2002, పుట 89)

ఈ కవిత 'అమ్మ' యొక్క విలువని చెప్పడంలో కవి సమర్ధవంతంగా కృత కృత్యుడవటమే కాకుండా అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని అమర్చాడు -

'అజా' కవితా సంపుటిని వెలువరించి కవులు ఒక ప్రక్కన జరిగిన గుజరాత్ ఘోరదృశ్యాల్ని మనోమందిరాల్లో వుంచి, ఇంకొకవైపు కేవలం ప్రతిధ్వనిగా కాకుండా రస ధ్వని అన్నట్లుగా, ఔచిత్యం హద్దులు మీరకుండా కవితల్ని సమకూర్చారు.

జిహాద్ కవితా సంపుటి ఒక యుద్ధ ప్రకటన కవిత్వం అయినప్పటికీ కవిత్వం యొక్క ప్రాధమిక లక్షణాలయిన నిరంతరం ప్రశ్నించడం కూడా కవితారంగంలో యుద్ధమే! సామాజిక వెనుకబాటుతనంపై, అస్తవ్యస్తతపై, భిన్నవర్గాల వైరుధ్యాలపై, ఆకలిపై, అవినీతిపై ఆధునిక కవిత్వం తన 'నగారాను' మ్రోగించింది. అందులో భాగమే విరసం ప్రచురణలు 'జిహాద్ - ఈ కవితా సంపుటిలో 54 కవితలున్నాయి - 20 మంది కవులున్నారు. ఒక విమర్శకుడు ఆధునిక కవిత్వంలో

సౌందర్యపు జాడను వెతికి వెతికి పట్టుకోవలసినదేనని అన్నారు. అందుకు కారణం, వస్తుశ్రద్ధ ఎక్కువకావటమే! వస్తు ప్రధానంగావున్న కవితల్లో రూపనిర్మాణం, శిల్పనైపుణ్యం అనేవి కొంచెం వెనుకతట్టున నిలుస్తాయి. అయితే ఆధునిక కవిత్వం, సాహిత్యం సౌందర్య భూమిక నుంచి దూరం కాలేదు - సౌందర్య దృక్పథం లేకుంటే అది కవితగా గుర్తించబడదు. జిహాద్ కవితా సంపుటిలో "ఆరోవర్ణం" అనే కవితలో ఇక్బాల్ చంద్ అంటారిలా.

"దూది ఏకీ ఏకీ
ఐదు వేళ్ళూ తెగిపోయాయి

నాకిప్పుడు కృతిమంగా వెలిసిన ఆరోవేలు ఒక్కటే మిగిలింది -"అని అంటాడు. (ఇక్బాల్ చంద్, 2000 పుట 1) కులవృత్తి చేసిచేసి అయిదువేళ్ళూ తెగిపోతే ఎందుకూపనికిరాని ఆరవ వేలునంటాడు కవి. జీహాద్ కవితలో ఖాజా "తాజ్‌మహల్" వర్ణన చూడండి :

"యమునా తీరంలో ఎవడో మా వెర్రిదాదా ఒకడు
దాదిమా మీద ప్రేమనంతా పాలనురగలు చేసి నిర్మించిన
వెన్నెల భవనం కనిపిస్తుంది" (ఖాజా, 2000, పుట, 3)

తాజ్‌మహల్‌ను, పాలనురగలు చేసి నిర్మించడం, తాజ్ మహల్‌ని వెన్నెలభవనం అనడం మనోహరంగా వుంది.

నల్ల వినోదం కవితలో అఫ్సర్ అంటారు :

"నా చెమటతో తడిసి ముద్దయిన
అందమైన వస్త్రం కావాలి" (అఫ్సర్, 2000, పుట 5)

తనకైతాను తయారు చేసుకొన్న, తన చెమటతో తయారయిన వస్త్రం నాకు మనఃశ్శాంతిని, ఆనందాన్ని అందిస్తుందని కవి వాక్కు.

సయ్యద్ గఫార్ "జనన వాంగ్మూలం" కవితలో ఒక చిత్రకల్పన చేస్తాడీ విధంగా :

"పెరటి గోడపై శీర్షాసనం వేసి
భూగోళం మోస్తున్నట్లు భ్రమించేవాళ్లకు
మానవ సంబంధాలన్నీను
అక్రమ సంబంధాల్లానే కన్పించవచ్చు" (సయ్యద్ గఫార్, 2000, పుట 7)

వ్యతిరేక భావనల గురించి కవి అందంగా వాస్తవంగా చెప్పడం గణించదగినదిగా వుంది. 'ఫత్వా' కవితలో ఖాజా "పెదాల వీణ మీద సొంతమాట శ్రుతి చెయ్యడమూ నేరమా ? అంతరంగంలోని అల్ప పీడనాలు అక్షరరూపెత్తుకోవడమూ నేరమా ?" (ఖాజా, 2000, పుట, 9). అంటూ ఒక ప్రశ్నను సంధించినట్లుందిగాని, 'పెదాలవీణ' "అంతరంగం అల్పపీడనలు" అనడంలో ఒక సౌందర్య స్పృహ కనిపిస్తుంది.

"బిస్మిల్లా ఇర్రహిమా నిర్రహీం" కవితలో కవి ఖాజా మసీదు కూల్చడాన్నివర్ణిస్తూ పరోక్షంగా, తదనంతర పరిణామాలను యీ విధంగా సుందరంగా అభివ్యక్తపరచారు.

"ఎక్కడా సాంబ్రాణి ధూపాలు పరిమళించడం లేదు
ఏ జెండాచెట్టూ నిర్భయత్వపు పచ్చజెండాలు ఊపడంలేదు
నిన్నటిదాకా ఆనందం దూద్ సేమ్యాగా తాగిన
గజల్ కచేరీల వహ్వాలు లేవు
ఉర్సులేవు ఫాతేహాల్లేవు నమాజుల్లేవు" ..... అని అంటూ

.........

సుహృద్భావ సమగ్రతా సామరస్యాల పూల గుత్తులు
మా చెవుల్లో గుచ్చండి" (పైదే పుట, 10)

అని అన్నారు. చెవిలోపువ్వు పెట్టడం, వెర్రివాళ్లను చెయ్యడం అనే ప్రసిద్ధమైన ఆధునిక భావచమత్కారాన్ని యీ వాక్యాలలో సమర్థవంతంగా వ్యక్తీకరించాడు కవి.

'అనాధ' కవితలో బాజి -
తోటల్లో సీతాకోకచిలుకలవెంట
కూనిరాగాలై విహంగించాల్సిన నాగొంతుక
సన్నాయి గుదిబండ తగిలించి
పెళ్లి పందిళ్లలో నన్నో కీలుగాడ్ని చేసింది - (బాజి, 2000, పుట 16)

అని కవి అనడంలో వ్యక్తీకరణలో, భావంలో ఒక అందం తొణికిసలాడుతుంది. "భైల్ కేదమాఖ్‌వాలే" కవితలో 'తాహర్' వ్యంగ్యవైభవం పరా కోటి నొందింది.

"ఓరి సాయేబు
హిందూవులంటే 'అల్లాటప్పా' అనుకున్నార్రా
మీలా నీచపు 'తోలుబొక్క' లోంచి
ఊడి పడ్డోళ్లమా ?
బ్రహ్మదేవుడి అవయవాల్లోంచి
రెల్లు పొదల్లోంచి
చేప కడుపులోంచి
కుండలోంచి పుట్టినోళ్లం"

ఈ కవితా వాక్యాల లోని వ్యంగ్యం సహజ సుందరంగా, సరళంగా అవగతమౌతుంది. "హిందూస్థాన్ ముసల్మాన్‌కా ఖబ్రస్థాన్" అని

ఇక్కడ
'తుర్కదాన్ని తులం బంగారట్టయినా అనుభవిస్తాం' అనీ
"నీగుండెల్లో దడపుట్టిస్తున్నా
ఏమీ ఎరగనట్టే వుంటారేం ?" (తాహర్, 2000, పుట 18)

సహజంగా, ప్రకృతిధర్మంగా పుట్టిన వాళ్లం మేము - మీలా చెట్లకీ, పుట్లకీ, చేపలకు, కుండలకు ముండలకు పుట్టినవాళ్లం కామనే 'నింద'. యీ కవితలో వ్యంగ్యధ్వని ద్వారా కవిత్వీకరించబడింది.

'కలోసియం' కవితలో అబ్బాస్ కవి అంటాడిలా :

"జన్మభూముల్ని వెతుక్కుంటూ
జీవితాన్ని నైవేద్యం పెడదాం
సారేజహాసే అచ్చా అంటూనే
జాతిని చెల్లాచెదురు చేద్దాం
రండి సోదరులారా
ముసుగులో గుద్దులాడుకుందాం" (అబ్బాస్, 2000, పుట 23)

ఎంత చక్కగా హిందూ-ముస్లింల మధ్య వుండే అగాధాలను చిత్రీకరించాడనిపిస్తుంది. సామరస్యంగా వున్నామంటూ ముసుగులో గుద్దులాటలెందుకు ? అని ప్రశ్నిస్తున్నాడు. కవిత అంతా కూడా ఈ విధంగా 'రక్తపిపాసను' అభివర్ణించాడు. 'హిజాబ్' కవితలో స్కైబాబ ఈ విధంగా అంటాడు.

"నా ముఖానికి వేలాడేసిన 'నఖాబ్'
ఎత్తి చూశావా ఎన్నడైనా ?
నాకళ్లు
రెండు అమవాస చంద్రుళ్లను మోస్తుంటాయి" (స్కైబాబా, 2000, పుట 22)

విషాదానికి 'చీకటి' సందేశం! కళ్లు రెండూ అమావాస్య చంద్రుళ్లు కావడం అలంకారిక సౌందర్యం. 'షరతు' కవితలో ఖాజా అంటాడిలా.

మిమ్మల్ని చూస్తే
పారిజాత పుష్పాలంకృత ఫరిష్తాను చూసినట్లుండాల్సింది
ఆకాశపు వెన్న కుండలో చేయి పెట్టి  చందమామను
అరచేతిలోకి తీసుకున్నట్లుండా ల్సింది
ఒక మరపురాని అనుభూతికొలనులో
మైమరచి మునకేసినట్టుండాల్సింది" (ఖాజా, 2000, పుట 39)

ఒక ప్రాకృతిక అనుభూతిని అక్షరీకరించి సౌందర్యమయం చేశాడు కవి. ఈ 'జిహాద్' కవితా సంపుటిని ఖాదర్ మొహియుద్దీన్ గీతం, సాహితీ జగత్తులో ప్రసిద్ధి పొందిన 'పుట్టుమచ్చ' గీతంతో ముగింపు పలకడం ఔచితీవంతంగా, శక్తివంతంగా వుంది.

"అవును పుట్టుమచ్చ నా ఉనికి
పుటుమచ్చ నా అస్తిత్వం
పుట్టుమచ్చ నా పౌరసత్వం
నేను ఊపిరి పీలుస్తూ మసలుతున్న
నేలా గాలీ పరిసరాలూ

నాకుదఖలు పరచిన వారసత్వం పుట్టుమచ్చ

ఎప్పటికీ మానని గాయం పుట్టుమచ్చ" (ఖాదర్, 2000, పుట 4)

మత దృక్పథంలేని రాజ్యాలూ, వర్గాలు ఏర్పడితే సమాజం. కాంతిపథంలో పయనిస్తుందనడంలో సందేహం లేదు.

డా॥ ఇక్బాల్‌చంద్ "ఆరోవర్ణం" కవితా సంపుటిలో 'ఋతువు' అనే కవితలో :

"గ్రీష్మాగ్నికి మండుతూ వెదురుపొద

తీగపై వగరుస్తూ

లేత పక్షి

వేణుగానాన్ని స్వప్నిస్తోంది"

ఒక చక్కని దృశ్యం ఆవిష్కరించబడింది ఇలా

"పూల రుతువులో

ఒక పక్షి

గాలిరెక్కల్లో ఎగురుతూ

వింత పుష్ప రూపం దాల్చింది -" (ఇక్బాల్ చంద్, 2001, పుట 72-75))

మనోహరమైన భావన యిది - పూలు పుష్పించి, వర్షించే దశలో ఒక పక్షి చిరుగాలిలో ఎగురుతూ, ఒక పుష్పరూపం దాల్చటం పక్షి అందం పూలకు వచ్చిందా ? లేక పూల అందం పక్షికి వచ్చిందా అనే మీమాంసను కవి కలిగించడం ఒక అద్భుతం. ఇంకా కవి అంటాడిలా :

"వసంతం వొచ్చింది

చిగురుటాకులు,

మామిడి పూత

మకరందం,

మరేమిటా ?

పంజరంలో కోయిల నిద్రపోయింది." (పుట, 76)

ఒక రసప్రకృతిలో రాగాలను ఆలపించిన కోయిల, పంజరంలో నిదరోయింది అనడం ఉదాత్తంగా వుంది. అందంగా వుంది.

"వేణువు
పరితపిస్తుంది
వెదురు పొదను చేరాలని
దివారాత్రులు కన్నుమూయక
తరచి తరచి చూసుకొంటే
మరణం కంటే భయానకం సౌందర్యమని తేలింది" (పుట, 183)

ఒకానొక సందర్భంలో సౌందర్యం కూడా భయానకంగా కనిపిస్తుంది - అయితే ఆ భీభత్సంలో సైతం అందాన్ని ఆస్వాదించడం రసజ్ఞుని లక్షణం :

డా॥ ఇక్బాల్‌చంద్ "ఋతుఘోష" కవిత ఆధునిక కవిత్వంలో ఆరురుతువులను వర్ణించిన సందర్భం :

ఎండాకాలం గురించి :

"అడవిలో రెల్లు గడ్డి మండుతూ
వెదురు పొదను అంటుకొంది
ఏ లయకారుని ఆత్మరగులుకుందో
ధరావిలయత్తలను ఏకంచేస్తూ
వనమంతా సామవేద వాయులీనం" -

"సామవేద గానం" వినిపించాడు ముస్లింకవి మనోజ్ఞంగా!

వానాకాలం కూడా వర్ణితమయింది :

"కాటుక రంగుతో కుండపోతగా వాన
గూటి కూనల గుండెల్లో అనాథ మంటలు
తల్లి పక్షి జాడ తేలలేదు" (పుట, 59)

గూడువదిలి ఆకలి యాత్రకు వెళ్లిన తల్లిపక్షి జాడ తెలియని గూడులోని కూనల పరిస్థితిని కవిత్వీకరించడం ద్వారా కవి హృదయ సౌందర్యం వ్యక్తమౌతుంది.

ప్రాచీన కవులు శోభయమానమైన శరత్కాలాన్ని అనేక విధాలుగా వర్ణించారు. మన ఆధునిక కవి ఇక్బాల్ చంద్ కూడా ఎంతో సౌందర్యభరితంగా వర్ణించాడు.

“జారుజంట సైగలోన రససూక్తం మేలు కొంది
తేటినీటి నది గూళ్లలోంచి పక్షుల గాత్రకచేరి
పూల నుంచి రంగుల దోచి అడవి హోళీ ఆడుతుంది
నిజానికీపూట ప్రకృతి స్త్రీని మించి కనిపిస్తోంది” (పుట, 160)

శరత్ కాల శోభ ‘జారు జంట’లో, పక్షుల గాత్ర కచేరీలో హోళీ ఆడే అడవిలో బంధించాడు హేమంత, శిశిరాలను, కొత్త సౌందర్యదీప్తిని వెలార్చుతూ రచించాడు కవి.

షాజహానా ‘నఖాబ్’ కవితా కేతనాన్ని తిరుగుబాటు పంథాలో ఎగర వేశినప్పటికి. అందులో కవితా సౌందర్యం అధికమే. మొదటి కవిత ‘పర్దాహటాకోదేఖోలో

“పుట్టిన్నాటి నుంచి వెన్నల రుచి
ఎరుగక,వానరుచీ ఎరుగక
వసంతం రుచీ ఎరుగక పెరిగి” - అనడంలో సౌందర్య రుచి వుంది. (షాజహానా, 2005, పుట 16)

“తస్వీర్ కవితలో -
తీసీతీయని ఘూంగట్ తెరవెనుక
ఒక ముగ్ధమనోహర చాంద్ మా .... మేరీమా ....
షాదీకీ తస్వీర్ మే మేరీహీ భోలీసీమా ....." (షాజహానా, 2005, పుట 18-16)

అని తన తల్లి సౌందర్యాన్ని మన కంటి యెదుట వుంచింది షాజహానా.... షాజహానా కవితల్లో అంతర్లీనంగా సౌందర్యలహరి ప్రవహిస్తూవుంటుంది.

డా॥ దిలావర్ "గ్రౌండ్ జీరో" దీర్ఘ కవితను రచించారు. అందులో అమెరికాలో కూలిపోయిన డబ్ల్యు.టి.సి. టవర్లు రెండు కూలిపోగా మిగిలిన నేల మట్టపు స్థలం పేరు 'గ్రౌండ్ జీరో' - అమెరికా జీవన విధానంపై సాగిన కవిత! ఆకవితలోని అక్కడక్కడా కనిపించే సౌందర్యాత్మకతకు స్థూలంగా పరామర్శించడమే ఇక్కడి అవసరం."

"జీవన వృక్షం మనుగడ
మట్టి పొరలలోని మూలాలలోనే
నిక్షిప్తమైనపుడు
మనసు పొరలలోకి వెళ్లడమంటే
మట్టిపొరలలోకి వెళ్లడమే!" (దిలావర్, 2004, పుట 1)

ఇక్కడ ఒక అందమైన భావం తాలూకా స్మృతి మదిలో మెదులుతుంది. మనిషి జీవితం యొక్క మూలాలన్నీ మట్టితోనే పెనవేసుకొని వున్నాయని, మనోవాల్మీకంలోకి తొంగిచూడటం అంటే మట్టిపొరలను తవ్వుకొని వెళ్లడమే, గతాన్ని నెమరువేసుకోవడం, మట్టి సంబంధంతోనే సాధ్యమనే విషయాన్ని కవి చెబుతున్నాడు - మనోజ్ఞంగా!

"నా చేతిలోని జ్వాజ్వల్యమాన జ్యోతిలో
స్వర్ణ ద్వారాలకు దారి చూపుతాను .... అంటూ
ఎంతటి ఉజ్జ్వల ఆశల నక్షత్రాలను
శిలాక్షరాలుగా వాగ్దానం చేశావు!" (పుట 5)

ఒక మనోహర దృశ్యం పాఠకుడి ముందు ప్రత్యక్షమౌతుంది - "వెలిగించవోయి కాగడా" అన్న గీతికలో మాదిరిగా, ఒక మార్గదర్శకుడు చేతిలోని జ్యోతితో, ఒక సువర్ణమయ ద్వారం గుండా, ప్రపంచ జనుల యొక్క ఆశలను, ఆశయాలను తీరుస్తానని ప్రతిన చేయడం ఇక్కడ కనిపిస్తుంది.

ఈ దీర్ఘ కవితలో బాలలను గురించి కవి కూర్చిన కవితా వాక్యాలు మనోజ్ఞంగా, కవితాత్మకంగా, ఆదర్శప్రాయంగా వున్నాయి. దిలావర్ ఒక శ్రీశ్రీ మాదిరిగా బాలల గురించి వ్రాసిన వాక్యాలు చిరస్మరణీయులు :

"బాలలంటే పోగుపడ్డ అమాయకత్వం
బాలలంటే రాశిపడ్డ బోసి వెన్నెల
బాలలంటే ఆశల వెలుగులు నిండిన రేపటి ప్రపంచం
ఎంతటి ఔన్నత్య శిఖరాల మీంచి
రేపటి ప్రపంచాన్ని మనసారా ఆహ్వానిస్తున్నావ్!
ప్రపంచానికి ఎంతటి భవిష్యత్తును
బాలల సంక్షేమ రూపంలో
హామీ ఇస్తున్నావ్!
పిల్లలంటే
నాపిల్లలూ, నీ పిల్లలే కాదు -
మెక్సికన్ పిల్లలు, చైనా పిల్లలు, జపాన్ పిల్లలు,
కొరియా పిల్లలు, వియత్నాం పిల్లలు
ఆఫ్ఘనిస్తాన్ పిల్లలు ..... ఇరాక్ పిల్లలు కూడా ......." (పుట 6)

ఈ కవితలో విశేషమేమిటంటే, ప్రపంచ బాలల్లారా మీకు దేశాల హద్దుల్లేవు, మతాల మత్తుల్లేవు - మీరంతా ఒక్కటే. ఈ ప్రపంచం మీది, వర్గ, వర్ణ విచక్షణ, ఆర్థిక అసమానతలు లేకుండా యీ ప్రపంచాన్ని మీరేలండి ? అనే సందేశం యీ కవితలో రమణీయంగా చెప్పబడింది.

దిలావర్ 'గ్రౌండ్ జీరో' కవిత ఇటువంటి ఉదాత్త భావనలతో నిండివుంది.

ఖాజా 'ఫత్వా' ముస్లిం కవితా సంపుటలలో ఎన్నదగినది. 'మా' కవితలో ఖాజా

"అమ్మను చూసి చాన్నాళ్లయింది
అమ్మ ముఖం మీది చిరునవ్వును చూసి చాన్నాళ్లయింది
నాపసితనంలో బుగ్గల్ని చిదిమి - చిచీ అనీ చిచ్చి కొట్టీ
హాయిగా నవ్విన అమ్మముఖంలో సంతృప్తిని చూసి చాన్నాళ్లయింది."

(ఖాజా, 1998, పుట 8)

అన్నప్పుడు ఒక దుఃఖగీతంగా ప్రవహించిన యీ కవిత ఒక దుఃఖానందాన్ని పఠితకు కలిగిస్తుంది.

"ఆమెను కలవాలి" అనే కవితలో ఖాజా ఒక భావకవిగా మనముందుంటాడు.

"ఒక నదిని చూడాలి
ఒక సముద్రాన్ని చేతుల్లోకి తీసుకోవాలి
ఒక ఆకాశాన్ని ముద్దాడాలి
ఆమెను చూడాలి
పున్నమి కెరటం లాంటి ఆమె తన్మయత్వపు చూపుల తడబాటు చూడాలి.
వెన్నెల ప్రవాహంతో కరచాలనం చేసి
మేఘాల జలపాతంలో ముద్దగాతడిసి
నక్షత్రాల పూలతోట ఒడిలో సేద తీరాలి" (పైదే పుట 16)

ఈ విధంగా ఒక ముగ్ధ సౌందర్యం కోసం కవి ఒకానొక స్వప్నలోకంలో విహరిస్తాడు. ఖాజా సామాజిక స్పృహతో అనేక కవితలు వ్రాసిన భావకవితా ధోరణిలో సాగిన కవిత ఇది వక్కటే! ఎక్కువగా శుద్ద సౌందర్యతత్వం ఇందులో గోచరిస్తుంది.

హనీఫ్ కవిత్వం "ముఖౌటా"లో "బాధలుపూసే చెట్టు" కవిత పేరులోనే ఒక విశిష్టార్థం, ఒక సౌందర్య బోధ వ్యక్తమౌతున్నవి. 'గుజరాత్' మృతుల కోసం అంకితమీయబడిన యీ కవితా సంపుటిలో సహజంగానే 'రక్తపు ఆనవాళ్లు' దర్శనమిస్తాయి. ప్రసిద్ధ పాత్రికేయుడు, రచయిత కె. శ్రీనివాస్‌గారు 'మరణాలు పొదిగిన అక్షరాలు' పీఠికలో హనీఫ్ కవిత్వ స్వభావాన్ని స్పష్టీకరించారు. ఆయనంటారు "హనీఫ్ అక్షరాలా మొదలుపెట్టిన ఈ గుజరాత్ కావ్యం చివరకు నెత్తుటి మడుగుగా హాహా కారాల సంపుటిగా, ఒక అశ్రుఘోషగా పరిణమించడం అందువల్లనే అనుకొంటాను" - (శ్రీనివాస్ కె, 2002, పీఠిక) ఈ వివరణ వలన వస్తువే ప్రధానమైందనే ధ్వనిప్రాయంగా కనిపిస్తున్నప్పటికీ కవితా దృక్పథం లేకుండా వుండదు. ఈ కవితా వాక్యాలు చూడండి :

"ఎవరికో మతి చెడింది
ఇంటిని పొక్కిలి చేశారు
గునపాలతో ఆలోచించి
గోరీలను తవ్వుకుంటున్నారు"

అని అంటూ.

ఒక చిత్రమైన దృశ్యాన్ని
పట్టం కట్టి మెడలో వేలాడేశావు
..............
ఛిద్రదృశ్యాన్ని అడ్డుపెట్టుకొని
మా శరీరాల మీద
వేనవేలగోరీలను తవ్విపాతేస్తున్నావు (హనీఫ్, 2002, పుట 20)

ముస్లింల వలన జరిగిన చిన్న సంఘటనను, జాతీయ కరించిన శక్తులకు 'ఛిద్ర దృశ్యం' నెపం మాత్రమేనని ప్రముఖ పాత్రికేయుడు కె.శ్రీనివాస్ గారు కూడా అన్నారు. 'మానవ హక్కులు' అనే కవితలో :

"మా వాకిళ్లనిండా
కుటుంబాల రక్తపుమడుగులు
అస్తికల ముగ్గును చల్లారు" (పుట, 17)

ఒక అస్పష్టత కవిత్వంలో అక్కడక్కడా కనిపించినా, హనీఫ్ సుందరమైన కవితా వాక్యాలు ఆలోచింప జేస్తుంటాయి. ఆర్ద్రంగా:

"గాయం ఎందువల్లనైతేనేం
రక్తం ఓడుస్తున్నది నాశరీరమే"
"పసి కందైనా ముసలైనా
మృగాల ముందు మాంసమే" (పుట, 18)

ఇటువంటి కవితావాక్యాలు "ముఖౌటా" కవితాసంపుటిలో దర్శనమిస్తాయి. మానవ హక్కుల వేదిక (**HRF**) ప్రచురించిన "గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం" అన్న గ్రంథంలోని వాక్యాలను ఇక్కడ ఉట్టంకించడం సమంజసంగా వుంటుంది. "ఈ నాగరికతలోని భిన్న సంస్కృతులలో ప్రజాస్వామిక లక్షణాలు ఉన్నాయి. అప్రజాస్వామిక లక్షణాలను తొలగిస్తూ వైవిధ్యాన్ని కాపాడుకుంటూపోవాలనీ, అందుకు కావలసిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రజలకివ్వాలనీ, ముఖ్యంగా మైనారిటీ సంస్కృతులకు ప్రత్యేక హక్కులు ఇవ్వాలనీ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు

అనుకోవడం జరిగింది." (గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం, 2002, పుట, 71) సమాజంలో ఘర్షణ వాతావరణంలోనే అనుకూల, ప్రతికూల సాంస్కృతిక పునర్జీవనం జరుగుతుంది. అయితే అవి మతఘర్షణలో, ఉగ్రవాద చర్యలో కాకూడదు.

మెహజబీన్ "ఆకురాలు కాలం" కవితా సంపుటీ, ముస్లిం కవుల/కవయిత్రులు సౌందర్యదృక్పథానికి అద్దంపడుతున్నదని చెప్పడంలో అతిశయోక్తిలేదు. ప్రముఖ కవి కె. శివారెడ్డి యీ కావ్యానికి పీఠిక వ్రాస్తూ మెహజబీన్ కవితను **"A Lyrical beauty"** అని అన్నారు. 'జావళి' అనే కవితలో ఆమె,

> "దేహం అట్టడుగుపొరల్లో
> అనుభవ నిక్షేపాల మధ్య
> కదలాడే జ్ఞాపకానివి నువ్వు
> శరీరారణ్యంలో వికసించిన
> తొలి గుల్ మెహర్ సుమానివి నువ్వు"
> "ఎంతకు రాత్రిగా మారని
> సుదీర్ఘ చలిసాయంత్రాలు
> మాటిమాటికి నిన్ను గుర్తు చేస్తున్నాయి
> నిన్ను గుర్తుచేసు కోవడమంటే
> ఒక మానవీయ సిద్ధాంతాన్ని
> మననం చేయడమే" (మెహజబీన్, 1997, పుట 61)

ఈ విధమైన కవితా వాక్యాలు, సౌందర్యసుమాలుగా మెహజబీన్ కవితా సంపుటిలో విస్తరించి వున్నాయి - ఒక సిద్ధాంతఛాయనుంచి కవితను, సెలయేటి గలగలలా రచించడం మెహజబీన్ యొక్క కళాత్మక నైపుణ్యం.

'కవిత్వం' కవితాసంపుటి ఒకటి, 'ప్రసేన్ వంశీకృష్ణ సీతాం అఫ్సర్' అనే పేరుతో వెలువరించారు. ఈ పుస్తకంలో సీనియర్ కవి 'అఫ్సర్' ముద్ర ఎంత వుందో తెలియదు :

మచ్చుకి :

"కొండలు దాటి, కోనలుదాటి
గుండె కానలు వీడి
ఆ చీమ శరీరాన్ని శ్రమైక జీవన సౌందర్యం చేసింది
ఒంటి మీది ఉప్పనీటి చారికలే
ధవళ వస్త్ర కాంతులు అనుకుంది" (ప్రసేన్, వంశీకృష్ణ, సీతారాం, అఫ్సర్, 2001,పుట 58)

ఇటువంటి అందమైన కవితావాక్యాలు యీ కవితా సంపుటిలో కనిపిస్తాయి. ఒక ప్రక్క వాస్తవికత కూడా యీ వాక్యాలలో ప్రస్ఫుటమౌతుంది.

సలీం "నీలోకి చూసిన జ్ఞాపకం" సంపుటిలోని ఒక కవితలో (రేఖల సంకెళ్లు) సౌందర్య బోధ :

సలీం భావ చిత్రాలు అందంగా కనిపిస్తాయి.

"నా వయస్సుకు బయాసిస్సులా
విచ్చుకున్న నీకళ్లలో"
"అనాధల్లా వదిలేసినా
అమానుషం వడగాడ్పై తాకినా
ఆకాశం కేసి తలయెత్తి
అమాయకంగా నవ్వే
రెండు గడ్డి పూవులు" - (సలీం, 1999, పుట 11)
"ఒయాసిస్సులు లేని ఎడారిలో
తడారిన గొంతులు
వసంతం తాకని సహారాలో
విసిరేసిన పూబంతులు" - (పుట18)

పై కవితల్లోని ఉపమానాలు, సలీం కవితా సౌందర్య దృక్పథాన్ని పట్టిస్తున్నాయి.

ఇంకా సలీం

"ఎండిన ఈ కాసారంలో
కలువలిక పూయవు
మండిన ఈ కాననంలో
కోయిలలిక కూయవు
వసంతం నాదాకా రాలేదు
నవోదయం నాకింకా కాలేదు
ఆశాలతలు అల్లకు
అనురాగాన్ని చల్లకు ఉగాది" (పుట 30)

అని అంటూ 'ఉగాది'కి స్వాగతిస్తూ, 'స్వాగతం' అనే కవితలో ఉగాది నాకు ఆనందం కలిగించకపోయినా "నిఖిలాంధ్ర హృదయంలో గుడికట్టుకుని నిల్చిపో" అని తన సహృదయతను చాటాడు. మనిషికి ఒకసందేశాన్ని కూడా ఇచ్చాడీ విధంగా :

"ఓసారి కుంచించిన నీగదిలోంచి
విశాలవిశ్వంలోకి అడుగిడిచూడు
వెల్తురు పక్షులు వయ్యారంగా వాలతాయి
ఓసారి కుంచించిన నీగదిలోంచి
విశాల విశ్వంలోకి అడుగిడుచూడు
మురిసే విరిసిన పువ్వులు
ముద్దులొలికే పసి పిల్లల నవ్వులు
నిన్ను ఆత్మీయంగా కావలించుకుంటాయి" (పుట, 19)

నీ ఇరుకు గదిలోంచి, సంకీర్ణతల నుంచి స్వేచ్ఛగా, విహంగంలా ఎగిరిచూస్తే, విశాల విశ్వంలోకి అడుగు పెట్టిచూస్తే, విరిసిన పువ్వులు, పసిపిల్లల నవ్వులు ఇంకా నిన్ను ఉన్నతుడినీ, ఉదాత్తుడినే చేస్తాయని సంకేతిస్తున్నాడు - ముడుచుకొని మూలన కూర్చోవడం, ఆలోచనలను విస్తరింప జేయలేకపోవడం, మనిషి యొక్క సంకుచిత్వానికి నిదర్శనమని, మనిషి, మనస్సు ఎదగాలంటే, మనచుట్టూవున్న లలితమైన విషయాల పట్ల అవగాహన, ఆరాధన వుండాలని, కవి మనోవిస్తృతికి ఒక సౌందర్యపథాన్ని నిర్దేశించాడు.

వేంపల్లి అబ్దుల్ ఖాదర్ కవితా సంపుటి 'చినుకు' అందులోని రమణీయకాన్ని గురించి సినారె యీ విధంగా అన్నారు - 'స్పందన' అన్న తమ అభిప్రాయంలో "వేంపల్లి ఖాదర్ భావుకత పండించుకున్న చిక్కని కవి -

"ఊగే గరికపోచ కొనకు ఉరేసుకున్న మంచు బొట్టు"

అనడం అచ్చమైన కవికి మాత్రమే సాధ్యం" (సి.నా.రె., 2003, పుట 1) అని అన్నారు. ఈ చిన్న భావచిత్రంలోనే ఖాదర్ కవితా తపస్సు అవగతం ఔతుంది. ఖాదర్‌ని గురించి ప్రముఖ సాహితీవేత్త ద్వానా శాస్త్రి అన్న వాక్యాలు కూడా ఉట్టంకించదగినవి. "ఎందుకంటే ఖాదర్ మూసలో కవీగాదు. గుంపులో కవీకాదు సొంత అనుభూతులతో, సొంతశైలితో, సొంత గొంతుకతో పలికే కవి. జంకుగొంకులేని కవి. లోచూపుగలకవి. విశేషించి సామాజికతపన, ఆవేశంగల కవి. ఇతని ఆవేశం "**Emotion recollected in tranquility**" కవిత్వమై పరిమళించే గుణం ఖచ్చితంగా అక్షరానికి ఉండాలిగానీ దానికి ఏనిబద్ధతా అడ్డురాకూడదు లాంటిది" (ద్వానా శాస్త్రి, 2003, పుట ix) ఇక కవితా వనంలోకి.

అబ్దుల్‌ఖాదర్ తన తొలి కవిత 'ఆహ్వానం'లో సృజనకు ఆహ్వానం పలికాడు. కవిలో సృజనాత్మకతకు ప్రేరణ అవసరం. చాలా మంది కవులు/రచయితలు మీరెందుకు రచనలు చేయడం లేదని, లేక మీ రచనాశక్తి పలుచబడిందా ? అని అడిగినప్పుడు 'ప్రేరణ' ఉండటంలేదని అంటారు. ఇది ప్రేరణ గురించి సరిగ్గా అవగాహన లేకపోవడమే, నిత్యచైతన్యశీలికి 'ప్రేరణ' దానంతటదే సహజంగా ప్రవహించి ప్రాప్తిస్తుంది.

"సీమతల్లి" కవితలో ఖాదర్ వ్యక్తిత్వ సౌందర్యం వికసిస్తుంది ఇలా :

"గుండె నిండా గాలి పీల్చుకుని గర్వంగ చెబుతున్నా,
ఇది నా పురిటగడ్డ
ఈ రాయీరప్పావంకా వాగూ కొండా కోనలన్నీ
నా చిననాటి తీపి గురుతులు
ఈ చెట్టూ పుట్టలతోనే నేను చెట్టా పట్టాలేసుకు తిరిగింది

మొండి రుతువులతో పోరాడే

బండ మనుషుల్నే నేను నిశితంగ చదివింది

రాళ్లు పుష్పించే ఇక్కడ బురదకూడా మల్లెవాసనలు కొడుతుంది

పుట్టగోచితో నిట్రాయిలా నిలబడ్డ ఎముకల గూళ్లువాళ్లు

ఆప్యాయతలకు, ఆత్మీయతలకు ఆనవాళ్లు నా పల్లెటూళ్లు" (అబ్దుల్ ఖాదర్ వేంపల్లి, 2003, పుట 3)

ఈ కవితలో పదప్రయోగాలు విపులార్థాన్ని, వాస్తవికతను చూపి కవితకు ఒక అందాన్ని ఆపాదించినవి : కవితకు అంతర్లీనంగా ప్రకృతి సౌందర్యం అభివ్యక్తమయింది.

1) మొండి ఋతువులు; 2) బండ మనుషులు; 3) ఎముకల గూళ్లు నావాళ్లు అనే పదబంధాలు సీమలోని నేపథ్యాన్ని, కవికి సీమలోని పల్లెటూళ్లలోని ఆప్యాయతలు, ఆత్మీయతలతో ఏవిధంగా పెనవేసుకొనిపోయిందీ, మానవ సంబంధాలలోని సౌందర్యాన్ని, విలువని యీ కవిత ప్రతిబింబించింది. "ఈ నేలమీద చినుకురాలనిదే నాకు కునుకులేదు" (పుట 4) అని అంటూ తన కవితా సంపుటి యొక్క నేపథ్యాన్ని చక్కగా ఆవిష్కరించాడు కవి.

అబ్దుల్ ఖాదర్ రచించిన విశిష్ట గీతిక "తలకోన తడి జ్ఞాపకం" ఒక అందమైన, ఆనందాన్ని అందించే కవిత : తలకోన సౌందర్యాన్ని తలస్పర్శిగా చెప్పిన కవిత. తెలుగు సాహిత్యంలో ఏ గొప్పకవి కవితలకూ తీసిపోని కవిత. ఆ కవితలో ఆయనంటాడు :

"శిథిల శిశిరం చిగురు టాశల నుండి

కర్పూర పరాగ పూర్ణ వసంతం

నాకనుపాప అద్దాల్లో ప్రతి ఫలించగానే

నిండైన 'నెలకోన' సహజ శిలాజరచన

ఆకు పచ్చ పత్రం అధరాల మీద ఒక పూల సంతకంలా సాగుతుంది" (పుట, 6)

ఖాదర్ రచించిన యీ 44 చరణాల కవిత పూర్తిగా ఉదాహరించ వలసినదే! కవి మానసం ప్రకృతి సౌందర్యానికి తలవూచి పదాల ఉయ్యాలచాచి, కవితామకరందాన్ని మనకందించారు. ముస్లిం కవుల - రచయితల సౌందర్య దృక్పథం ఒక రామణీయాకాన్ని రసజ్ఞులైన పాఠకుల హృదయాలలో నింపడానికి నిలపడానికి, వారి సున్నిత భావుకత్వం సమాజం అంతా

విస్తరించడానికి తోడ్పడింది. ప్రధానంగా ముస్లిం సంస్కృతి , మిగతా అన్ని సంస్కృతుల కన్నా భిన్నమైన దైనప్పటికీ, సౌందర్య దృక్పథంలో మాత్రము, భారతీయ సంస్కృతితో సహ జీవనం చేయక తప్పలేదు. ఏదీ ఏమైన ప్రముఖ రచయిత ఖాజా ముస్లింవాద తాత్వికత అనే గ్రంధములో అన్న మాటలను ఇక్కడ ఉదహరించవలసిన ఆవశ్యకత వుంది ఆయనంటారు. “ ముస్లింల జీవితములో సౌందర్యం ప్రధానమైనది. సాంప్రదాయంగా , సంస్కృతిలో భాగంగా సౌందర్యోపాసన, సౌందర్యాభిలాష ముస్లిం ల జీవితాన్ని అల్లుకుపోయాయి. ముస్లిం - స్త్రీ పురుషుల వేషదారణలో సౌందర్యంగా వుండడం, కనీసం అలా వుండేందుకు ప్రయత్నించడం, ఉన్నంతలోనే ఆనందంగా, తృప్తిగా సౌందర్యవంతముగా మలచుకోవడం ముస్లిం సంస్కృతిలో ప్రధాన అంశం.” (ఖాజా, 2005, పుట, 110)

ఈ దృక్పథం నుంచి ముస్లిం సంస్కృతి సమగ్రంగా సౌందర్య వంతంగా సౌందర్య తత్వం ముస్లింల జీవితాలలో విడదీయరాని ఒక ప్రధాన అంశం  అని చెప్పగలిగేట్లుగా కనిపిస్తుంద నడంలో సందేహంలేదు. అటువంటి ముస్లిం సమాజాన్ని సంస్కృతిని అక్షరీకరించిన కవుల సృజన, వాస్తవిక దృక్పథంతో సౌందర్యతత్వాన్ని మేళవించి, కవితలను , కథలను పరిమళవంతం చేశాయి.

---

# VI. ముస్లిం రచయితల హేతువాద దృక్పథం

తురుష్కుడ్ని కాని  నాపై
తురక ముద్రలద్దిన కురూపుల్లారా
హూణుల్ని హూణులనలేదు
కుషానుల్ని కుషానులనలేదు
ఆర్యులను ఆర్యులనలేదు
కాని ...
ఈ మట్టి కణాల్లో కణమైనోణ్ణి
ఫలాల్లో తీయనిఫలమైనోణ్ణి
నే నెట్లా తురకనయ్యానో
కొద్దిగా చెబుతారా స్వాములు ?
మూలవాసినైన నాపై
పరాయితనం పరదా కప్పి
అనుక్షణం కుళ్లబొడిచే పదం తురకోడు

- షేక్ కరిముల్లా

ముస్లిం రచయితలని, క్రైస్తవ రచయితలని అని అన్నప్పుడు మతపరంగానే సమాజం వారిపై దృష్టిని కేంద్రీకరించి, వీరిని మతవాద రచయితలుగా పరిగణించడం జరుగుతుంది. రచయితల మత రీత్యా వారి రచనలు హేతువాదానికి, దూరంగా వుంటాయనే ఒక అపభ్రంశపు ఆలోచన ఒకటే. ప్రచలితం అయివుంది. ఇది సరికాదు. కనుక, ముస్లిం రచయితలలోని హేతువాద దృక్పథాన్ని యీ ప్రకరణంలో సమీక్షించడం జరుగుతుంది. ముస్లిం రచయితలు అని అనడం సులభంగా గుర్తు పట్టడానికి మైనారిటీ రచయితలుగా గుర్తించడానికి మాత్రమే! ఈ అధ్యాయంలో సాంప్రదాయ ముస్లిం రచయితలను ఈ పరిధిలోనికి తీసుకురాకుండా కేవలం కొందరు ఆధునిక కవులను, రచయితలను యీ పరిధిలోకి తీసుకోవడం జరిగింది.

కార్యకారణ సంబంధాన్ని తెలియపరచేదే హేతువాదం. నాస్తిక వాదం, ఆస్తికవాదంలాంటివి సమాజంలో పెచ్చరిల్లిన సమయంలో యీ హేతువాదం మానవ జిజ్ఞాస నుంచి పుట్టి, ప్రతి విషయాన్ని ప్రశ్నించి జవాబును ఒక రీతి రివాజులో ఏర్పరుచు కుంటూ సాగి పోయే ప్రక్రియగా ఇది రూపు దిద్దుకుంది.

మత విషయాలను తర్కించకూడదు, ప్రశ్నించకూడదు. వాటిని యథాతథంగా విశ్వసించాలి. ఈ విశ్వాసం దౌర్జన్యానికి దారి తీస్తుందని అంటాడు. విఖ్యాతతత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి .అందువలన మత సాంప్రదాయాలనుంచి వచ్చిన ముస్లిం రచయితలు హేతువాద దృక్పథాన్ని అనుసరించి రచనలు చేయడానికి మత విశ్వాసాలు అడ్డువస్తాయి, అనే సందేహం కలుగుతుంది. అయితే ముస్లిం రచయితలలో ఎక్కువభాగం , లౌకికతత్వం వైపుకి, సామాజిక అసమానతల వైపుకి, సామాజిక న్యాయం వైపుకి, బ్రాహ్మణీయ భావజాలాన్ని వ్యతిరేకించే క్రమం వైపుకి తమ దృష్టిని సారించారు. అందువలన మతం నుంచి అనేక మెట్లు ఎక్కి ఒక విశాల,

వినూత్న భావజాలం వైపుకి పయనించారనే అంశం వారి రచనలను పరిశీలించితే అవగతం కాగలదు. ముస్లిం రచయితలు చాలా వరకు పూర్తిగా ప్రగతిశీల భావాలను వెలువరించారనేది ఒక వాస్తవం. అన్నింటా జీవితమూ, సమాజం అనేవి ప్రధానమై పోయినవి.

"వతన్" కథా సంపుటికి ఎంతో భావసాంద్రత కలిగిన పీఠిక వ్రాస్తూ ప్రముఖ రచయిత స్కైబాబా యీ విధంగా అన్నారు. "చైతన్య వంతుడైన హిందువు మతాన్ని వదిలేయడం వల్ల హిందువులకు నష్టమేమీలేదు. అదే చైతన్యవంతుడైన ఒక ముస్లిం తాను ముస్లింను కాదను కొని ముస్లింల గురించి మాట్లాడకుండా వుండటం వల్ల పీడితులుగా, బాధితులుగా, అణిచివేయబడుతున్న జాతిగా ఉన్న ముస్లింలకు ఎనలేని నష్టం కలుగుతుంది. ముస్లింల గురించి మాట్లాడేవాళ్ళు లేక పోతుండటం ఇందువల్లనే జరుగుతుంది. ఇవన్నీ పట్టని చాలా మంది ముస్లింలు తమ పేర్లు మార్చుకొని కొందరూ , మార్చుకోకుండానే కొందరూ బ్రాహ్మణీయ భావజాలంతో కొనసాగుతూ వస్తున్నారు. రచనలు చేస్తున్నారు. దీన్ని బ్రేక్ చేస్తూ ముస్లింల జీవితాన్నీ, అందులో ప్రతీకల్ని పదాలనీ తమ గోడునీ, గోసనీ, అణగారుతున్న తనాన్నీ, అసహనాన్ని కాళ్లక్రింద జమీన్ మాయమవుతున్న వైనాన్నీ... వీటన్నిటినీ ప్రశ్నించే ధిక్కారాన్ని కొత్తతరం ముస్లింలు కవిత్వంలో శక్తివంతంగా వినిపించారు . ఇప్పుడు కథలు రాస్తున్నారు. అలాంటి కథల సంకలనమే ఈ వతన్" (స్కైబాబా, 2002-04, పుట,4) స్కై బాబా అన్న ఈ మాటలు అక్షర సత్యాలని ఈ కథలను పరిశీలిస్తే అర్థమవుతుంది. ఇందులోని ప్రతి కథ తెలుగు ముస్లింల సాంస్కృతిక, సామాజిక నేపథ్యాలను సమస్యలను పఠితలకు పరిచయం చేస్తుంది. వారిలోని హేతు దృక్పథాన్ని ప్రశ్నించే తత్వాన్ని విప్పి చెప్తుంది.

## VI.1. షాజహానా సిల్‌సిలా

ఈ ధిక్కారస్వరాన్ని అందులోని హేతుతత్వాన్ని విశ్లేశించడానికి ముందుగా కవయిత్రి షాజహానా "సిల్‌సిలా" కథను పరిశీలించవలసిన ఆవశ్యకత వుంది. తెలంగాణా మాండలికంలో సాగిన యీ కథలోని సజీవమైన మాండలిక భాష , రమణీయంగా హృదయానికి హత్తుకొని పోతుంది.

"సిల్‌సిలా" కథ ఒక పేద ముస్లిం (దూదేకుల) కుటుంబంలోని స్త్రీ యొక్క సుఖదుఃఖాలను దృశ్యీకరించింది. ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాల స్థితిగతులను మానవీయ కోణం నుంచి వ్యక్త పరచడంతో షాజహానా సఫలీకృతురాలైంది.

మానవ సంబంధాలలోని ఆర్థిక కోణం బడెమ్మ (కరీంబి) మాటల్లో సాదాసీదాగా ఎలా కనిపిస్తున్నాయో చూడండి."ఇగ తర్వాత మీ అమ్మది, నలీమాది ఒక పాలే అయింది నిఖా. మీ బాపేమో సదు సెప్పెటాయనాయే, మీసిన్నాయనేమో బౌంకిల చేసేటాయనాయే. ఇగ మేమే తక్కువోల్లం అందర్ల కన్నట్లు. ఇక కాన్సరొచ్చిలాలక్క సచ్చేపోయ్యె. ఆల్లపిల్లల పెండ్లిండ్లాయే. మమ్ముల పురాగమర్సేపోతిరి." (షాజహానా, 2002-04, పుట,6)

అక్కచెలంగ్ర మధ్య వున్న ఆర్థిక వ్యత్యాసాల వలన, స్థితిగతులు మారిపోయిన వారు ఏ విధంగా మానసికంగా పేదరికం వలన ఎంతగా క్షోభననుభవిస్తారో పైవాక్యాలలో కరీంబి సహజంగా చెప్పింది. ఆమె జీవితం తర్కబద్ధంగా వుందని పై వాక్యాలే సాక్ష్యం.

కరీంబి తన జీవన విధానం గురించి క్లుప్తంగా యీ విధంగా చెప్పటం వలన, ఆమె యొక్క దృక్పథం కుటుంబ పరిస్థితుల గురించి ఎంత సరియైన హేతుబద్ధత కలిగి వుందో స్పష్టమౌతుంది.

‘‘ఇంగ మీ బడెబాపు ఎండ కాలంల వాయించబోతాడు, కతం, బిడ్డా ! గావాయించబోయినప్పుడు దెచ్చిన పైసలే పైసలు, ఇంగ పైసా సాంపాయించడు, మీంచి దినామూ తాగుడు కావాలి. గామూన్నెల్ల సంపాదన ఎన్నాలొస్తది నువ్వే చెప్పు బిడ్డా, నిఖా అయిన కాణ్ణుంచి ఇప్పటి దాంకా సుఖమంటేందో ఎర్కలేకపోయే ! నాట్లకు, కలుపుకు, కోతకు, బోవుడు.... అయినంక పెసలేర, దూదేర, మిర్చేరబోవుడు, ఏపని దొర్కితే దానికి బోయిన పుట్టెడు పుట్టెడు గింజలు దెచ్చి ఇంట్ల బోస్తుంటే సంసారం నడుస్తుండె మిర్చేర బోతే మిర్చోస్తుండె, ఇంత తోపులల్ల కాయలేరి పొట్టుదీసి గింజదీస్తే చింతపండొచ్చె, పత్తేరినంక ఆ లీల్ల కాల్మొక్కి ఆ కట్టెనంత మోపులుగట్టి ఇంట్లేస్తుంటే ఒక్కోపాలి ఆల్లుకూడ తిడుతుండ్రు.... నీ మొగనికి తాగెటందుకు మస్తుగ పైసలోస్తాయి, కట్టెపుల్లలకు లెవ్వా అని దెప్పిపొడుస్తుండె లోకం! ఏనాడన్న ఇంట్లెట్ల జర్గుతుంది. పెల్లాం పోరలు ఏం దింటున్నని పట్టించుకున్న పాపాన బోలేదు బడె బాపు. ఇంక నేన్దెఇచ్చిన గింజల్నమ్మి తాగొచ్చి ఒక్కటే లొల్లిచేసుడు! ఒక్క కాలం మమ్ముల సాదితే... రెండు కాలాల నేసాదాలె అందర్ని" (పుట, 7) ఒక మైనారిటీ కులం నుంచి వచ్చిన స్త్రీ తన మనోవేదనతో పాటు కుటుంబాన్ని ఏ విధంగా గట్టెక్కిస్తుందో, ఒక సారి పునరావృతం చేయడం అవసరం.

కరీంబీ భర్త సన్నాయి వాద్యకారుడు. అతనికి మూడు నెలలు మాత్రమే సీజను. ఆ తర్వాత ఏ పనీ చేయడు. రోజు మాత్రం. తాగడానికి భార్య డబ్బులివ్వాలిసిందే ! తాగిన వాడు నెమ్మదిగా వుండడు. ఆ నిషాలో భార్యను ఇష్టమొచ్చినట్లు గొడ్డును బాదినట్లు బాదుతాడు.. అతని ప్రవర్తన ఈ విధంగా వుంటూ ఆమెకు సుఖం అంటే ఏమిటో తెలియకుండా మర మాదిరిగా జీవితాన్ని నడపడానికి ఆమె శ్రమ స్వేదాన్ని కాక రక్తాన్ని చిందించడమే! నాట్లు వేయడానికి, కలుపుతీయడానికి, కోతకు బోవడం, గింజల్ని కొలిపించు కోవడం – ఇంకా ఏ సీజను లో ఆపనికి బండచాకిరి చేసే కూలీగా మారి పెనరచేలల్లో, పత్తి చేలల్లో, మిరపచేలల్లో, ఆరుగాలం శ్రమిస్తుంది. చింతగింజలు తీయడానికి పోయి చింతపండు తెచ్చుకొని చివరకు కట్టేలు కూడా కొనకుండా, పత్తికట్టెలు తెచ్చుకొని వంటచెరుకుగా ఉపయోగిస్తూ, మగవాడిపని ఆడమనిషిపని రెండూ చేస్తూ సంసారాన్ని లాక్కొస్తుంది. ఇంత చేసినా ఆమెకు కనీసం మెప్పుకూడా కరువవుతుంది. భర్త దగ్గర!.

ఒక మైనారిటీ ముస్లిం స్త్రీ యొక్క ఓర్పునీ, కష్టాన్ని, శ్రమనీ, బాధల్నీ, ఆందోళనలను గమనిస్తే, అనాది నుంచి భారతీయ మహిళ, అటుపేదరికంలో నుంచి వచ్చిన మహిళలకు ప్రతీకగా యీ కరీంబి నిలుస్తుంది. ఈ ఓర్పు, శ్రమజీవనం మన సమాజంలో సంస్కృతిలో భాగంగా వుండబట్టి యీ కుటుంబ వ్యవస్థ చలనం లేకుండా నిలబడిందని అవగతం చేసుకోవచ్చును.

సిల్‌సిలా కథ షాజహానా దృక్పధంలోని మానవీయ కోణాన్ని పరిపూర్ణంగా వ్యక్తం చేస్తుంది. "కరీంబి" పాత్రను సమర్ధవంతంగా హేతుబద్ధంగా చిత్రీకరించడం ద్వారా , అట్టఅడుగున ముస్లిం స్త్రీల ముఖచిత్రాన్ని షాజహానా మన కెదురుగా నిలిపింది. ఇక్కడ "ఈ నేపథ్యం నుండి చూస్తే ముస్లీం సాహిత్యం రాస్తున్న కొద్దిమందిలో స్త్రీవాద దృక్పధంతో రాస్తున్నవారు చాలా తక్కువమంది ఉన్నారు. వారిలోను శక్తివంతంగా రాసే కవయిత్రిగా షాజహానా నిలుస్తున్నారు. ఈ విధంగా విశ్లేషించుకున్నప్పుడు ముస్లిం స్త్రీవాదం షాజహానా చుట్టూ తిరుగుతుందని చెప్పవచ్చు". (వెంకటేశ్వర రావు, దార్ల, 2009, పుట,3) అని దార్ల అన్న మాటలు అక్షర సత్యాలుగా మనం గుర్తించవచ్చు.

## VI.2. షేక్ చిన మస్తాన్ వలి బ్యాండ్‌ట్రూప్

ప్రముఖ కవి, కథకుడు ఖాజా వ్రాసిన కథలో కూడా మైనారిటీ కుటుంబంలో స్త్రీ ఆవేదన, ఆశలు, ఏవిధంగా అడుగంటి పోయోయే అత్యంత హృదయవిదారకంగా, వాస్తవంగా చిత్రీకరించాడు.

ఈ కథలో మస్తాన్ వలి బ్యాండుట్రూప్‌లో సన్నాయి వాయించేవాడు. అతని భార్య ఉద్దండమ్మ – ముగ్గురు పిల్లలు – పెద్ద కొడుకుని చదివించాలనే కోర్కెబలంగా వుంటుంది. కథ అంతా ఉద్దండమ్మ స్వగతంలాగే సాగుతుంది. ఇంచుమించుగా ! ఆమె ఆలోచనలు గతం నుంచి వర్తమానానికి, భవిష్యత్తుకు సాగిపోయినా అంతా సహజమైన తర్కంతో సాగిపోతాయి. ఏ చదువూ లేకపోయినా, జీవితానుభవం నేర్పే పాఠాల వలన ఏ విధంగా మనుష్యుల ఆలోచనా క్రమం వుంటుందో యీ కథలోని ఉద్దండమ్మ పాత్ర ద్వారా తేలుతుంది. జీవితంలోని ఒడిదుడుకులు నేర్పేపాఠాలు మనిషిని హేతుబద్ధంగా ఆలోచించేటట్లు చేస్తాయి అనడానికి యీ ఉద్దండమ్మ ఆలోచనలు మచ్చుకి కొన్ని చూడండి.

" దడిబైట పిల్లగాల్లు గోలగోలగ ఆడుకుంటన్నారు. ఉద్దండమ్మ చిన్న బిడ్డలిద్దరూ మొత్తల పక్కనున్న పొన్నాయి చెట్టు క్రింద పూలేరు కొచ్చుకొని లోన కూసోని జడలల్లుతున్నారు. పొద్దట్నుంచి ఇంట్లో ఎవర్లేక పోటాన ఏడాడ తిరిగి ఎండలో ఆడొచ్చిర్నో, ఎండకి తలలెండి పాయి, మొకాలు మసిబారి వాడిన పొన్నాయి పూల లెక్క అయిపోయిర్రు. " అదే " కొడుకుంటే పిల్లల్ని బయట తిరగనియ్యకుంట వుండేటోడు. ఇంటి కాడుంటే ఎప్పుడు సదువుకుంటనో, రాసుకుంటనో, ఏదన్నా పని చేసుకుంటనోవుంటడు. నాబిడ్డ బంగారం, ఈ మనిషి సెలవుల్లో కూడ సుకంగా ఇంట్లో వుండనియ్యడు. మల్లిపైన యెమ్మటి బెట్టుకొని మేలానికి తీసక పోతన్నడు. ఈన చేసి సంపాయిచ్చిందేం లేదు గానీ మల్లి పిలగాన్ని యిందులో తిప్పుతున్నడు. " ఎంగిలి పీకలల్లో ఏ మొత్తదే ఎన్నాళ్లు వాయించినా, చేతికి మూతికి ఎడంపెరుగుదేతప్ప" అని మా నాయిన పెండ్లినాడే చెప్పిండు, ఈనేమొ ఏం పన్జేయలేదామె, విద్వాంసుడు కావాలని, కచ్చీరీలు చెయ్యాల్నని మెడర్పులు చేయించు కోవాల్నని ఎన్ని కలలు గన్నడు ఆఖరికి పెండ్లిల్ల మేలానికి పోతన్నడు. అనుకున్నయన్నీ అయితాయే?" (ఖాజా, 2002-04, పుట,11)

ఉద్దండమ్మ అనుభవంనుండి, జరుగుతున్న తన సంసారం యొక్క తీరునుంచి ఆమెలో మెదిలే భావాలు ఎంతో స్పష్టంగా, వాస్తవంగా వున్నాయి.

1. తన కొడుకు చదువు కుంటున్నాడు, బుద్ధి మంతుడు, అతను చదువుకొని వృద్ధిలోకి వస్తే కుటుంబం బాగుపడుతుందనే ఆశ. ఎంత కష్టపడి అయినా కొడుకుని చదివించాలనే తపన !

2. తన భర్త విద్వాంసుడు కావాలని, కచ్చేరీలు చేసి సంపాదించాలని, కీర్తి పొందాలని ప్రయత్నించి చివరకు పెళ్లి మేళాలను సన్నాయి ఊదడానికి వెళ్తుంటాడు. తోడుగా సెలవులకు వచ్చిన కొడుకుని తీసుకుపోతున్నాడనే దుగ్ధ !

3. తన తండ్రి చేసిన ఉపదేశం నిజమైందనే బాధ !

ఇటువంటి పరిస్థితుల్లో వున్న ఉద్దండమ్మకు భర్త అనారోగ్యంతో మరణించడం ఒక పెద్ద షాక్.

ఈ సందర్భంలో కొడుకు గూడా చదువుమానుకొని, కుటుంబాన్ని పోషించడానికి మరలా సన్నాయి పట్టుకోవడం ఆమెకు పెద్ద అశని పాతం.

వాస్తవ దృష్టితో గమనిస్తే వెనుకబడిన వారికి సమాజం/వ్యవస్థ ఏ విధమైన చేయూత నివ్వదని, వీళ్లంతా సొంత కష్టంపై బ్రతుకీడ్వటమేననే సందేశం యీ కథ ద్వారా ఖాజా ఇవ్వటం జరిగింది. సన్నాయి వూదేవాని కొడుకు, ఆర్థిక కారణాల వలన, సమాజంలో ఏలాంటి ప్రోత్సాహం లేక పోవడం వలన మరలా జీవితంలో పై కెదగ లేక సన్నాయి వాద్య కారునిగా తయారవడం ఒక సామాజిక వాస్తవికత. రచయిత తన యొక్క పాత్రలను సమాజం నుంచి స్వీకరించి హేతు బద్ధమైన అలోచనా ధోరణితో నడిపించడం ఇక్కడ స్పష్టమౌతుంది.

## VI.3. దూదే"కులం"

ఈ కథ ప్రారంభం హేతువాదధోరణిలోనే మొదలౌతుంది. "ఈ విశాల భారతంలో అతడు అందరికి మల్లేపుట్టాడు. అతడు పుట్టిన సమయాన ముక్కోటి హిందూదేవతలు నవ్వుపులుము కోలేదు. అట్లాగని అల్లాహ్ యికనీకు నేనుంటానని హామీ ఇవ్వలేదు". (యాఖూబ్ పాషా ఎం.డి.,

(సం) స్కైబాబా, 2002-04, పుట, 14) ఈ విధమైన ప్రారంభంతో యీ రెండు మాటలకు చెందని విషాదాన్ని ఏదో రచయిత చెబుతున్నాడనేది స్పష్టమౌతుంది.

ఆచార వ్యవహారాలన్నీ ముస్లింలు మాదిరిగానే దూదేకుల సాయిబులు కూడా నిర్వర్తిస్తారు. అందుకు యీ కథలోని పాత్ర ఫకీర్ అహమ్మద్‌కు సున్తీ కార్యక్రమం చేయడంతో వెల్లడవుతుంది. ఇక్కడ కథకు ఆయువు పట్టులాంటి రెండు సంఘటనలు వున్నవి. కులం విషయంలో ఎంతటి వివక్షతకు మైనారిటీ వర్గాలు గురి అవుతున్నవి యీ సంఘటనలను కల్పించడంతో రచయిత తార్కికత వెల్లడవుతుంది.

"ఒక రోజు స్కూల్లో ఫకీర్ క్లాస్ టీచర్ కామన్ రిజిష్టరు సరిచేసుకోవడానికి కులం ఇతర వివరాలు అడుగుతున్నాడు, క్లాస్ టీచర్ మాధవరావుది వెలమ కులం. కాస్త అగ్రకులం పొగరు జాస్తి. అందరిని తీసేసినట్లు మాట్లాడటం అతనికి జన్మతః వచ్చిన నైజం.

" పోరి ఏం పేరేనీది? అట్లానే కులం పేరు జెప్పు' మాధవరావు పేరు - మూలచ్చిమి, కులం, గౌండ్లోలం.

వోరి షిప్పిరెంటికలోడ! నీది

పేరు దడికబడ్ల నర్సయ్య, కులం హరిజన్స్

" హరిజన్స్ అంటే ?

యస్.సి.లం సార్

లంగ గాడిద! మాది గోల్లమని సక్కగ చెప్పురాదుర! కతలబడుతాన్నవు

సెక్ట్స్ ... నువ్వు జెప్పరీ

నా పేరు ఫకీర్ అహమ్మద్ సార్ ... మేము ముసల్మానులం

" ముసల్మాన్లా నాకు దెల్వని ముస్మలాన్లు ఎవరున్నార్ర ఊర్లో !

ఎవరి కొడుకువు నువ్వు ?

బస్టాండ్ కాడి ఇస్మాయిల్ కొడుకును సార్

ఓర్నియవ్వ! ఇస్మాయిల్ దెల్వదా? పక్కా దూదేకులోడు

కాదురవాడు - క్లాస్‌క్లాసంతా గొల్లుమంది. ఫకీర్ కుతల తీసేసినట్లయింది?

(పైదే పుట 17)

కులం పేరు చెప్పలేని పరిస్థితుల్లో, హరిజనులమని, ముస్లింలుమని, కొంచెం గౌణంగా చెప్పినా, వినకుండా కులాన్ని బట్టి గౌరవం, కులాన్ని బట్టి న్యూనతగా చూసే దృక్పథాన్ని ఇక్కడ యీ సంభాషణల ద్వారా రచయిత హేతుబద్ధంగా నిరూపించగలిగాడు. మసీదు కూల్చిన తరువాత ఉద్రిక్త దినాలలో పల్లెటూళ్లల్లో పరిస్థితిని కూడా రచయిత యీ సంబాషణ ద్వారా వ్యక్తపరచాడు.

" ఏంరా సాయబ్ ! చాన్నాళ్లకు కనబడ్తివి. గిట్లఊడిపడ్డవేందెర? – కాపు లింగయ్య

" సెలవు లిచ్చింద్రా బొమ్మర్ధి – ఫకీర్

" పట్నంల పయిలంగుండరమామ ! తుర " కోళ్లను " హలాల్‌చేత్తారంట – వీరారెడ్డి

" నన్నుముట్టే దమ్ములెవని కున్నయిరా – ఫకీర్

" మీకున్న బలుపు ఇదేర చిచ్చ – మిమ్ముల పాకిస్థాన్ వరకు తన్నుకుంటు ఎల్లాగొట్టాలే! గప్పుడు గని మీ బల్పు అణుగుద్ది " – శాస్త్రీ

" అరెకుత్తే...... నువ్వు అన్న అనక పోయినా మాదేశం ఇదేరా, పాకిస్తాన్ పోయ్యేది లేదు...పీకిస్తాన్ పోయ్యేది లేదు. మా జోలికొత్తే అడ్డంగా నరుకుతం – ఫకీర్

అప్పుడే అక్కడి కొచ్చిన మంగలిసోమడు " వాళ్ల సాయిబుల మీద చేయిబడితే నరుకుతడటనా ! మరి వీడు తురకోడు కాదుగదా ! వీని కెందుకంట ఇంత రోషం. ఈ దూదేకులోళ్లను తురుకోళ్లు దగ్గరికి దీత్తే, బిడ్డలు ఆగనే పోదురు. నీ కో విషయం తెల్సారా. వీళ్లను తురుకోల్లు శాన దూరం బెడ్తారు. వీళ్లె ఎచ్చులుకని మేం ముసల్మాన్లమని గొప్పలకు పోతారు. దుదేకుల్లోని తరీఖగా వుండు చిచ్చ! లేకుంటే యవ్వారంచెడ్తది"

చెల్ పోర, నీదోసోది – ఫకీర్ ! (పైదే, పుట, 18)

ఈ విధంగా ఫకీర్ మహమ్మద్ విషయాన్ని తేలగొట్టివా అతనితో యీ విషయం గురించి, తన తోటి వారు తనను అవహేళన చేసిన విధానం గురించి మధన పడతాడు. ఆ అంతర్మధనలలో తేలిన సంగతి యిది.

మెజారిటీ ఫాసిజానికీ, మైనారిటీ అపహాస్యానికి మధ్య నలిగి పోయి ఇట్లా అనుకుంటాడు.

" ఈ కులంల ఎందుకు పుట్టినానురా!

కొజ్జా. తాను మగ అని చెప్పలేడు. ఆడా అని చెప్పలేడు. సందిగ్ధస్థితి అట్లాతాను హిందువు కాడు, ముసల్మాను కాడు. కొజ్జాల లాగే తమకూ అపహాస్యాలే ! అవమానాల జీవితమే! (పైదే)

ఇంతగా మైనారిటీ కులం నుంచి వచ్చిన వ్యక్తి సమాజ అవహేళనలకు ప్రతిస్పందించడమూ, సామాజిక వాస్తవికతను గుర్తించడం సహేతుకంగా రచయిత దృశ్వీకరించడం శక్తివంతంగా వుంది.

## VI.4. మహమ్మద్ నిస్సార్ ముల్కి -

ఈ కథ మహమ్మద్‌నిసార్ కలం నుంచి వెలువడింది. పీర్లపండుగకు అన్ని కులాల వారు సామరస్యంగా , అన్నదమ్ముల్లా మెలగడం పండుగ చేసుకొనే సందర్భం ఇది. మనుష్యుల మధ్య అంతరాలు లేకుండా ఒక ఆదర్శమయ జీవనం గడిపాలనే చక్కని సందేశాత్మక మైన కథ. రజకార్ల దాడులున్నప్పుడు ఒక ముస్లిం కుటుంబాన్ని, ఆ గ్రామస్తులు ఏ విధంగా కాపాడి, తమ అక్కన చేర్చుకున్నదీ " పీర్ల " పండుగ సందర్భంలో , జ్ఞాపకం చేసుకుంటారు. ఇది వరకు వున్న మానవ సంబంధాలు ఇప్పుడు కూడా వుండాలనే సందేశాన్ని యీ కథ ఇస్తుంది. ఈ కథ హేతు బద్ధంగా సాగి ఒక ఆదర్శాత్మక సందేశంతో ముగుస్తుంది.

## VI.5. గౌస్ మొహిద్దీన్ - గుంగీధడ్‌కన్

గౌస్‌మొహిద్దీన్ రచన గుంగీధడ్‌కన్ కథ ఒక మధ్యతరగతి దిగువ కుటుంబాలలోని ఒడిదుడుకులతో సతమతమయ్యే ఒక యువకుడి అంతరంగాన్ని హేతుబద్దంగా ఆవిష్కరించిన కథ.

తండ్రికి కుటుంబ బాధ్యతలు ఎక్కువై కొంత తాగుడికి అలవాటుపడినాడు. కూతురికి ఎక్కువ కట్నం ఇవ్వలేక డిగ్రీ చేసి ఖాళీగా వున్న వ్యక్తికి ఇచ్చి చేస్తాడు. అప్పటి నుంచి అతని కష్టాలు మొదలౌతాయి. కూతురు అల్లుడు వచ్చి అతని దగ్గర కూర్చుని బిర్యానీలు ఆరగిస్తుంటే నిరుద్యోగి యువకుడైన అన్న లోపల మధనపడుతూ ప్రతి చిన్న పనికి ఇబ్బంది పడుతుంటాడు. చివరకు అతను తన స్వంతయింటిలో పరాయివాడైపోతాడు. ఆచారాల పేరిట సాంప్రదాయం పేరిట అల్లుళ్లు, మామల ఇండ్లలో తిష్టవేసుకొని కూర్చుని బాధించడం ఎంతో సహజంగా యీ కథలో చెప్పబడినది.

ఈ కథలో ఏదో విధంగా కూతురు పెండ్లిచేస్తాడు తండ్రి. అయితే అతని కొడుకు విషయంలో అన్యాయం జరుగుతుంది. పేద, మధ్యతరగతి కటుంబాలలో ఆడపిల్లలకు ఏదో ఒక రకంగా, అప్పో, సొప్పో చేసి పెండ్లిచేస్తే, మగపిల్లలకు అన్యాయం జరుగుతుంది. తల్లితండ్రులు మగపిల్లవాడిని సెటిల్ చేయాలని ప్రయత్నిస్తే ఆడపిల్లలు పెండ్లి కాకుండా 'ముదికన్యలు' అవుతారు. ఈ పరిస్థితుల్లో మధ్యతరగతి యువకుని మనస్తత్వాన్ని యీ వాక్యాల్లో రచయిత సహజంగా వర్ణించాడు.

"బావ మిఠాయి తింటుంటే నా జీవితంనే తింటున్న ఫీలింగ్,

నన్నే కొరుక్కుతింటున్న ఫీలింగ్,

మెదడ్లో ఏవో పురుగులు తొలుస్తున్న ఫీలింగ్

గుండెల్ని ముండ్ల కంపల్లో వేసి నల్పుతున్నట్లు"..

ముస్లిం యువకుని మనోగతం హేతుబద్ధంగా వుంది. ఏ కథలోనైనా పాత్ర చిత్రణ, సన్నివేశకల్పన, విషయ వివరణలో ఒక Reasoing వుండటం అవసరం. అటువంటి లక్షణాలు గౌస్ మోహిద్దీన్ కథలో వున్నవి.

## VI.6. యాకూబ్ - మన్నత్

ఈ కథ పేరు 'మన్నత్'. రచయిత యాకూబ్. ముస్లిం రచయితలు తమ కథలకు ఉర్దూ పేర్లు పెట్టడం వలన, సామాన్య తెలుగు పాఠకులకు అర్థం కాని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ప్రతి కథ క్రింది అధో సూచిక వేసి ఉర్దూలో పేరు వున్న తెలుగు కథకు అర్థానిస్తే పాఠకుడికి కొంత శ్రమ తగ్గుతుంది. కథలోని సారాంశం అర్థం ఔతుంది. లేకపోతే పాఠకుడికి ఆధునిక చిత్రకళ మాదిరిగా అర్థం అయి అర్థం కానట్లు వుండిపోతుంది. కథ పూర్తిగా చదివిన తరువాత 'శీర్షిక' అవగతం ఔతుంది.

ఈ కథ పేదముస్లిం తన కుటుంబాన్ని పైకి తీసుకురావాలని చేసిన ప్రయత్నాలు ఏమీ ఫలించవు. చివరకు భూమిని నమ్ముకుని కొంత కుటుంబ పరిస్థితిని కొద్దిగా చక్కదిద్దుకుంటాడు. ఈ కథలో కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేక భార్యభర్తలు పడే ఘర్షణను సహజంగా దృశ్యీకరించాడు.

ఈ కథలోని ప్రధాన పాత్ర మహమద్‌మియా ఒంటిమీది బట్టలతో ఒక కుగ్రామం చేరుకుంటాడు. అతనికి పిల్లనిచ్చి నిఖా చేశారుగాని, అతనికి జమానత్ ఇచ్చి కోమట్లచేత సామాను ఇప్పించలేక పోయారు అతనికి పిల్లనిచ్చిన మామగారు.

అక్కడ ఈ మహమద్ మియా బ్రతకలేక ఒక హిందూ స్త్రీ 'రామక్క' సహాయంతో వేరే వూరు వెళ్లి ఒక గుడిసె వేసుకొని తన జీవితాన్ని ప్రారంభించి ఐదుగురు కొడుకులను కని ఆడపిల్ల కోసం తాపత్రయపడి, చివరకు మన్నత్ చేసుకుంటే ఆడపిల్ల కలుగుతుంది.

ఈ కథలోని ప్రధానపాత్ర అయిన మహమద్‌మియాకు మతవిశ్వాసాలు హెచ్చు. ఉర్సులాంటి వాటికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి మతపరమైన 'మన్నత్' (Promise) లు చేసి కుటుంబం యొక్క ఆర్థిక పరిస్థితుల నుంచి బయటపడినట్లు చూపడం శ్రమకు మతాచారాలు తోడవటం వలన మనిషి విజయం సాధిస్తాడని చెప్పడం అంత సమంజసంగా కనిపించదు.

మామూలు మనిషికి, సామాన్యుడికి మతవిశ్వాసాలవలన కొంత ఊరట కలిగే మాట వాస్తవమే. అదే బలాన్నిచ్చి జీవితంలోని భయంకరమైన కష్టనష్టాలను అధిగమించే శక్తినిస్తుందనే సందేశంతో యాకూబ్‌వ్రాసిన 'మన్నత్' కథ ముగుస్తుంది. రచయిత మత విశ్వాసాల వైపు మొగ్గుచూపినా అది తన హద్దుల్లోనే వుంది.

## VI.7. దిలావర్ – ధోకా

దిలావర్ కవిగా ప్రసిద్ధుడు. వీరు కథలు వ్రాస్తారని కొంతమందికి తెలియదు. 'ధోకా' కథ దిలావర్ సృజన అంశం మోసం గురించి ఇందులో ఇతివృత్తము. ఇది కథ అయినా దిలావర్ ప్రధానంగా కవి గనుక, ప్రారంభంలో ఒక పాటతో ప్రారంభిస్తాడు.

దిలావర్ కథలోని రెండు పాత్రల్లో ఒకటి 'గురవడు' అనే పేరున్న మాదిగ కులానికి సంబంధించిన వ్యక్తి. రెండోవాడు పీరు సాయిబు. గురవడు, పీరుసాయిబు ఇద్దరి వృత్తీ యచకత్వమే. తత్వాలు పాడి డబ్బులు అడుక్కొని చాలీ చాలని ఆదాయంతో జీవిస్తుంటారు. ఇద్దరికీ చదువుకొనే కొడుకులున్నారు. మాదిగ గురవడు, పీరుసాహెబు పీర్లపండుగనాడు సంబరాలు చేసుకుంటారు. కలసి మెలసి సహజీవనం చేస్తూ కష్టనష్టాలు చెప్పుకుంటారు. ఈ రెండు కులాలకు సంబంధించిన వాళ్లు తినేది కూడా గొడ్డుమాంసమే! ఇంత సన్నిహితత్వం అన్నిటిలో వున్నప్పటికీ ప్రభుత్వం వీరిని సమానంగా చూడటం లేదని రిజర్వేషను ద్వారా గురువడికొడుకు ఉద్యోగం సంపాదిస్తే

పీరుసాయిబు కొడుకుకి మాత్రం ఎలాంటి ప్రభుత్వ సహాయం అందక పోవడం వలన వృద్ధిలోకి వచ్చే అవకాశం లేదు. ఎందుకీ వివక్షత అని దిలావర్ ప్రశ్నించడం సమంజసంగా వుంది. సహేతుకంగా వుంది. సమాధానం చెప్పవలసినది చట్టాలు, ప్రభుత్వాలు మాత్రమే! ఇది ప్రభుత్వం చూపిస్తున్న వివక్షత అని రచయిత భావన!

## VI.8. స్కైబాబా - దస్తర్

ప్రసిద్ధ కవి, విమర్శకుడు స్కైబాబ మంచి కథకుడనే విషయం ఆయన కథలే సాక్ష్యం ఇస్తాయి. ఎటువంటి కులవివక్షత లేకుండా అన్నదమ్ముల్లా మసలుకుంటూ వున్న ముగ్గురి స్నేహితుల కథ - ఆ ఊళ్లో యీ ముగ్గురు స్నేహితులు భిన్న కులాల వారు అయితే వారి స్నేహానికి కులం అడ్డు కాలేదు.

ఒకరి ఇంట్లో శుభకార్యానికి అయితే మిగతావారు కలసిమెలసి పెండ్లి పనులన్నీ చేస్తూ వుంటారు. అయితే ముస్లిం ఇంట్లో పెండ్లికి అందరూ కలిసి మెలసి పనిచేసినా ఎలాంటి పొరపొచ్చాలు రాలేదు. అయితే రెడ్లయింట పెండ్లి అయినప్పుడు మాత్రం ఒక మాదిగవాడితో మాకు వడ్డింపచేస్తారా? అని ప్రశ్నించడంతో అగ్రకులాలలో వున్న మేము గొప్పవారమనే అహంకారంతో చేసిన యాగి వలన అంతర్గతంగా దాగివున్న కులతత్వం బైటపడిపోతుంది. ఈకథను సిద్ధహస్తుడైన స్కైబాబ హేతుబద్దంగా, కథలోని అంశాన్ని సుకుమారంగా, కళాత్మకత చెదిరిపోకుండా రచించారు.

## VI.9. షాజహానా-సండాస్

ఈ కథలోని వస్తువు పెండ్లి కూతురుకి అత్తారింట్లో ఊళిరిజిలిశి లేకపోవడము అది ఆమె ఎవరికీ చెప్పుకోలేకపోవడము. రచయిత్రి స్వీకరించిన వస్తురీత్యా, ఇటువంటి దయనీయమైన పరిస్థితి వుంటుందా? అనే అనుమానం పాఠకుడికి రాకుండాపోదు. అయితే ఇంత నికృష్ట, జుగుప్సాకరమైన స్థితి మరీముఖ్యంగా పేదముస్లిం కుటుంబాలలో దళిత కుటుంబాలలో వుంది.

షాజహానా రాసిన యీ కథలో సారాంశం ఇది : షమీమ్ కొత్త పెండ్లి కూతురు. అత్తారింటికి వెళుతుంది. వలీమా జరగలేదు. కారణాలు చూస్తే భయంకరంగా వుంటాయి.

అత్తగారింట్లో ఉదయపు కాలకృత్యాలు తీర్చుకోవడానికి టాయిలెట్ ఉండదు. ఏదో నాలుగు కర్రలు కట్టి, పురుగులమధ్య, బొద్దింకల మధ్య కళ్లుమూసుకొని జుగుప్సాకరమైన, అపరిశుభ్రమైన వాతావరణంలో కార్యక్రమాన్ని పూర్తిచేయాలి. ముస్లిం స్త్రీలు మిగతా పేద కులాలలోని స్త్రీల మాదిరిగా స్వేచ్ఛగా బహిర్భుమికి వెళ్ళడానికి వీలు లేదు. కొత్తపెండ్లి కూతురికి టాయిలెట్ అసహ్యత నుంచి వత్తిడి నుంచి తప్పించుకోవడానికి పుట్టింటికి తిరిగి వస్తుంది. అన్న కూతురు పెండ్లికెళ్లిన తండ్రి సిరాజుద్దీన్ గుండెనొప్పితో మరణిస్తాడు.

ఈ విధమైన పరిస్థితుల్లోకి ఏదో విధంగా ముక్కుముసుకొని పనికానిద్దా మంటే ఆమె పరిస్థితి అందుకు అనుకూలంగా మారలేకపోయింది. మరలా దుస్సహంగా వాంతిచేసుకుంటుంది. మరలా పుట్టింటికి వస్తుంది. అక్కడకు వచ్చిన తరువాత కాలకృత్యాలు తీర్చుకోవడానికి అనువైన స్థలం కనుక కొంచెం ప్రశాంత పడ్డది. అయితే ఇటువంటి పరిస్థితుల్లో తండ్రి మరణించడం తర్వాత చేసిన పెండ్లి అప్పులకోసం ఇల్లు అమ్మటం అంతా జరిగిపోతుంది. మరలా కొత్త అద్దె ఇంట్లో టాయిలెట్ సౌకర్యం సరిగ్గా లేదని తెలసుకొని హతుశురాలైపోతుంది. ఒక టాయిలెట్ లేకపోవడం వలన ఆమె వివాహజీవితం భగ్నమయ్యే పరిస్థితి వచ్చింది. ఈ కథలో ఒక అసాధారణమైన వస్తువుని, పాఠకుడుకూడా ఊహించలేని వస్తువును తీసుకొని కథా కథనశిల్పంతో అద్యంతం షాజహానా ఒక అద్భుతమైన కథను సృజించి ముస్లిం పేదకుటుంబాలు ఒకవైపు ఇటువైపు మత కట్టుబాట్ల నుంచి బయటపడలేక, ఇంకొక వైపు తగిన కనీస సౌకర్యాలు ఏర్పరచుకోలేక ఎటువంటి క్లిష్ట పరిస్థితిల్లో జీవిస్తున్నారో అలోచించేవిధంగా షాజహానా రచించింది. షాజహానా శక్తివంతమైన కలం నుంచి వెలువడిన మంచి రచన యిది.

తండ్రి సిరాజుద్దీన్ ఒక్కమాటలోనే షమీమ్ పరిస్థితి అర్థమౌతుంది. "దీన్ని అడుక్కునేటోడికిచ్చినా ఏమనదుగాని ఇంట్లో పాయ్ఖానా మంచిగున్నోని కియ్యాల"- (షాజహానా, (సం) స్కైబాబా, 2002-04, పుట71) ఇదీ పరిస్థితి. పేదవర్గాలలో మిగతా కులాలలో ఏదో వీలుచూసుకొని ఉదయాన్నే బహిర్భుమికి వెళతారు. పేదముస్లిం కుటుంబాలలో స్త్రీలు బయటికి వెళ్ళడం నిషేదం కనుక ఈ దుర్భర పరిస్థితి, ఒకానొక సామాజిక రుగ్మతను షాజహానా చక్కగా వ్యక్తీకరించారు.

కథ ఊహాపోహల మీద ఆధారపడకుండా వాస్తవికాలపై నడిచింది.

# VI.10. జాకీరా – మున్నీమాకి కహానీ

జాకెరా వ్రాసిన యీ కథ “మున్నీమాకి కహానీ”. విషాద భరితమైనదే! ఈ కథలో ప్రధానపాత్ర పాతబస్తీలో ముస్లిం బాలికల దీనపరిస్థితులను ఇంటర్వ్యూ లాంటిది చేస్తుంది. ఈముస్లిం బాలికలు పెండ్లిండ్లుకాక, వాళ్ల కుటుంబ పరిస్థితులు సరిగ్గా లేక మధనపడుతుంటారు. ఈ పరిస్థితుల్లో వారి మనోస్థితి ఈ విధంగా వుంది. వారి మాటల సారాంశం ఇది. పాతబస్తీ ముస్లింబాలికల పరిస్థితి వారి మాటల్లో ఈ విధంగా వ్యక్తమైంది.

ఒక ముస్లిం బాలిక తన బాధ ఈ విధంగా చెబుతుంది. “మమ్మల్ని బైటకు పంపించరు. చదువుకుందామంటే మా దగ్గర అంత స్తోమత లేదు. అయినా చదివి ఏం చేస్తావు. ఎంతచదివినా వంట చేయడమే తప్ప మీ కేం పని వుంటుంది అంటారు. ఎక్కువనిగా ముస్లింఇండ్లలో ఇలాగే వుంటుంది. బైటతిరగడం వలన చెడిపోతామని మా వాళ్లంటారు. మామంచి చెడ్డలు అడిగి తెలుసుకుంటానని మా అమ్మీ అబ్బాలకు టైం వుండదు. అలాంటప్పుడు తమ కష్టసుఖాలు పంచుకుంటానికి కొందరమ్మాయిలు వేరేవాళ్ళకు దగ్గరవుతారు. వాళ్లుచెప్పే గాలిమాటలు నమ్ముతారు. అట్లాంటి కొందరమ్మాయిల వల్ల అందరికీ చెడ్డపేరు కూడా వస్తున్నది” (జాకెరా, పుట, 77)

ఇక్కడ, ఈ మాటల్లో ముస్లిం కుటుంబాల పరిస్థితి, తల్లిదండ్రుల అనాదరణ ఎక్కువగా ఆడపిల్లలమీద ఉండటం వలన వారు ప్రేమించే వారు లేకపోవడంవలన, ప్రేమ పేరుమీద ఎవరితో ఒకరితో స్నేహంచేసి,దిగజారి పోవడం పై మాటల్లో కనిపిస్తుంది. విపరీతమైన నైతిక ప్రాధాన్యత అనైతికతకు దారితీయడం కనిపిస్తుంది.

పాతబస్తీలో ఇంకొక ముస్లింబాలిక సల్మా మనోవేదన.“మా ఇంట్లో మా అబ్బారిక్షా నడిపిస్తాడు. మాకు సరిపడా అమ్దానీలేదు. మాకు తినడానికి అన్నం వుండదు. కట్టుకోడానికి బట్టలేదు. మేము ఐదుమందిమి. ఇంట్లోగడవక ఎప్పుడూ గొడవలే” (పైదే, పుట.75)

ఈ ముస్లింబాలిక అలోచన సవ్యంగావుంది. ఆర్థిక వెసులుబాటుకు ఏదైనా పని చేద్దామనే సంకల్పం వుంది. ఆచారాల పేరిట అడ్డుకట్ట వేస్తున్నారు. ఆ అమాయక నజ్మా మాటల్లోనే “బయటపనిచెయనియ్యరు కాబట్టి ఇంట్లో ఉండి చేసే పని ఏదైనా నేర్పిస్తారా? నేను బ్యూటీషను

నేర్చుకుంటాను. బ్యూటీ పార్లరు పెట్టుకోవచ్చుకదా. మావాళ్లు మాకు పెళ్లిచేయలేక కుమిలిపోతున్నారు. నాకంటూ పెద్దవాళ్ళు ఇంకాఇద్దరు అక్కలున్నారు. తిండికెల్తలేదు, బట్టలు సరిగా లేవు, ఆ అమ్మాయి కళ్లలో నీళ్లు పొంగుతున్నాయి" (పుట.75)

ఇంకో ప్రశ్నకు కేసర అనే అమ్మాయి ఆవేదన యీ విధంగా వుంది. "బైటికి వెళ్లకుండా ఇంట్లో వున్నా మనసులో వున్న కోరికెలు ఎవ్వరూ ఆపలేరుకదా. ఏమన్నా అంటే బైటి దేశానికి అమ్మివేస్తామని, ముసలివాళ్లకు ఇచ్చి చేస్తామని అంటారు. వయసు వచ్చిన తరువాత పెళ్లి చేసుకోలేని పరిస్థితులలో నరకం అనిపిస్తున్నది" (పుట, 75)

ఈ విధంగా అసలు తల్లిదండ్రుల పరిస్థితి, ముస్లిం బాలికల మనోవేదన నుంచే బయటపడింది. ముస్లిం బాలికలు తల్లిదండ్రుల కనుసన్నల నుంచి తప్పు కొనేట్లు కనిపించినా అరబ్బుషేకులకు పిల్లలను నిఖా పేరుతో అమ్ముకొనే దుర్భర పరిస్థితుల్లో పేదముస్లిం కుటుంబాలు వుంటున్నవి. ఆడపిల్లను ఎవడికిచ్చి పెండ్లి చేసినా ఆమె బాధలు ఆమెపడాల్సిందే! ఆమె కన్నీళ్లు అమెలో ఇంకిపోవలసిందే! పెండ్లికాని ఆడపిల్లల పరిస్థితి సాంప్రదాయం పేరిట, మతాచారాల పేరిట ఇట్లా వుంటే, ఇదే కథలో పెండ్లి అయిన ముస్లిం స్త్రీ కథ యీ విధంగా వుంది.

ఏడో తరగతి చదువుతో ఆమె చదువుబంద్ అయింది. పెండ్లి అయింది. ఇద్దరు పిల్లలు. భర్త యాక్సిడెంట్‌లో చనిపోతాడు. అత్తగారింట్లో ఏదైనా ఉద్యోగం చేసి పిల్లలను ఎక్కదీసుకుంటా మంటే అత్తమామలు ఈ విధంగా అన్నారు. 'రోజు ఒకరితో తిరగవచ్చు అని ఉద్యోగం చేస్తానంటున్నావు" (జాకెరా, (సం) స్కైబాబా, 2002-04, పుట 75)

చివరకు ఇద్దరు పిల్లల తల్లిని వయస్సు మళ్లినవాడికిచ్చి పెండ్లిచేస్తారు. అతను ఆస్తి తగాదాల్లో జైలుకెళతాడు. అసలు రచయిత జాకెరా ఈ కథలో ప్రత్యేకించి పెండ్లికాని ముస్లిం బాలికల, పెండ్లి అయి కష్టాలకడలిని యీదుతున్న ముస్లీం స్త్రీల యొక్క వేదనను ప్రధానంగా అక్షరీకరించారు.

ముస్లిం సమాజంలో అత్యంత క్లిష్టంగా నైతిక సూత్రాలను తమ పిల్లలు ముఖ్యంగా ఆడపిల్లలు అనుసరించాలనే తపన, ఇంకొక పక్క ముస్లిం మతాచారాల మధ్య యింట్లో పేదరికంతో ఇమడలేక, బయటకి వెళ్లి స్వతంత్రించి ఏదో ఒక పనిచేసి ఆర్థికంగా బాగుండాలనే ప్రయత్నాలు

కొనసాగించ లేక సతమతమవుతున్నారు. ఒక ప్రక్క మతాచారుల వత్తిడి ఇంకొక ప్రక్క ఆర్థిక పరిస్థితులు సమన్వయం చేయలేని పేద ముస్లిం బాలికల జీవితాన్ని హేతు బద్ధంగా అక్షరీకరించడంలో రచయిత విజయం సాదించాడు.

## VI.11. బుర్ఖా : యాస్మీన్‌బేగం

ఈ 'బుర్ఖా' ఆచారాన్ని గురించి ముస్లింకవులు, రచయితలు అనేకచోట్ల ప్రస్తావించారు. యాస్మీన్ బేగం ప్రత్యేకించి 'బుర్ఖా'మీద వ్రాసిన కథ ఇది. సాదాసీదా కథ. మంచి పాయింట్ మాత్రం వుంది! సమీన, సరిత స్నేహితులు. తలపై చున్నీ వేసుకొని 'సమీన' సరిత వెంట కాలేజీకి వస్తుంది. బుర్ఖా ధరిస్తే నేను నీవెంట రానంటుంది సరిత.

ఉదారవాద ముస్లిం కుటుంబం సమీనాది. సమీన అంటుందిలా "నాకు మాత్రము ఇష్టమా బుర్ఖా వేయడం. ఐన నా మనస్సుకు నచ్చని పని నేను ఆత్మవంచన చేసుకొన చేయలేను. అంతగా కావలిస్తే కాలేజ్ మానేస్తానుగాని బుర్ఖా మాత్రం ధరించను. ఐనా మా ఇంట్లో నాకా మాత్రం స్వేచ్ఛవుంది. నవ్వేం దిగులుపడకు. నడువు బజారుకెళ్లివద్దాం" (యాస్మీన్‌బేగం (సం) స్కైబాబా, 2002-04, పుట 78)

అయితే రచయిత్రి ప్రధానంగా చెప్పాల్సిన అంశం ఏమిటంటే ముస్లిం కుటుంబాలలో కొంతమంది ఆచారాల పట్ల పట్టుసడలించి ఉదారవాదులుగా వ్యవహరిస్తున్నా ముస్లిం తీవ్రవాదసంస్థలు బుర్కా వేసుకోక పోతే యాసిడ్ పోస్తామని బెదిరించడాన్ని యీ ముస్లిం బాలిక ఎదిరించాలని నిర్ణయించుకుని యీ విధంగా అంటుంది. "నేను మాత్రం ఏమైనా గాని బుర్ఖా ధరించను. యాసిడ్ పోసేవాళ్ళపై కేసుపెడతాను. లేదంటే వాళ్ళనీ మాలాగా బుర్కా ధరించమంటాను. (పుట,77)

ఇక్కడ సమీనా పాత్ర యొక్క భావోద్వేగాలు ఎంతో తర్కబద్దంగా న్యాయంగా వున్నాయి. రచయిత్రి 'సాధారాణీకరణ' ద్వారా ముస్లిం బాలికలు, స్త్రీలు యీ సమీనా పాత్ర ద్వారా బుర్కాకు దూరంగా వుండాలని ఒక గొప్ప సూచన చేసింది. చిన్న కథ అయినా హేతువాద దృక్పథం కలిగి సారవంతంగా వుంది - యాస్మీనా బేగం రచయిత్రి) అభినందనీయురాలు.

# VI.12. ఎం.ఎస్.బేగం - దిల్ ఔర్ జిందగీ

ముస్లిం రచయిత్రులు సాంసారిక జీవితంలోని ఒడిదుడుకులను ఎంతో సమర్ధవంతంగా చిత్రీకరించారనిపిస్తుంది. యం.ఎస్.బేగం 'దిల్ ఔర్ జిందగీ' కథలో మనస్సు-జీవితం అనే వాటిల్లో ఒక విధమైన సారూప్యత, సామరస్యం లేకపోతే ఏ విధంగా స్త్రీ జీవించాలి - తల్లి దండ్రులకు చెడ్డపేరు రాకుండా, పిల్లలకోసం సంస్కారంలేని భర్తతో కలసి రాజీమార్గంలో ఒక శిలలా, ఒక ప్రాణం లేని ప్రతిమలా, ఏవిధమైన స్పందనలు లేకుండా జీవించాలా? సమాజపు కట్టుబాట్లకు ఇంచుమించు శాడిస్టుగా వుండే భర్త ప్రవర్తన గురించి ఏం చేయాలి? తల్లిదండ్రుల దగ్గర, 8 సం॥లు వుండి, నెలరోజుల సంసారంతో గర్భవతి అయి, స్టేట్స్‌కి వెళ్ళిన భర్త తననూ, కూతురుని తీసుకు వెళ్ళితే, ఇక్కడ తన వాళ్లంతా తనంత అదృష్ట వంతురాలు లేదని అనుకుంటు వుంటే ఎలాంటి ప్రేమమయ స్పందనలు లేని భర్తతో, సంపాదనే పరమావధిగా బ్రతుకుతున్న భర్తతో ఏవిధంగా రాజీపడాలి? అది సాధ్యమేనా, జీవితాంతం మనసులేని భర్తతో బ్రతకడం సాధ్యమేనా? స్త్రీలు ఇటువంటి పరిస్థితుల్లో కూడా నోరు మెదపలేని స్థితిలో వుండటం ఎం.ఎస్.బేగం గారు చిన్న కథలోనైనా చక్కగా చిత్రీకరించారు. అమెరికాలో జీవిస్తున్న యీ పురుషాహంకర ముస్లిం యొక్క మనస్తత్వ చిత్రణ మూడు ముక్కల్లో యీ విధంగా చెప్పింది రచయిత్రి :

"మా అపార్టుమెంట్‌లో ఆడాళ్లందరూ నేను చాలా అందంగా ఉంటానని అనుకుంటారట. నాకు నవ్వొస్తుంటుంది. మా వారేమో మగవాడననే అధికారాన్ని చూపెట్టడానికి గతాన్ని తవ్వుతూ వేధిస్తుంటాడు. ఏదో ఒక వంకతో మా వాళ్ళందర్నీ తిడుతూ వుంటాడు. ఒకసారి నాపై చేయిచేసుకున్నాడు" (యం.ఎస్. బేగం, (సం), స్కై బాబా, 2002-04, పుట 81) ఇదీ ఆమె పరిస్థితి దుస్థితి - రాజీమార్గాన్ని అనుసరిస్తుంది. తన పాపకోసం తన తల్లిదండ్రుల కోసం, గౌరవ మర్యాదల కోసం - ఆమె మనసు వేరు - ఆమె జీవితం వేరు - ఈ రెంటికీ పొంతనలేదు - కోట్లాదిమంది స్త్రీల జీవితానికి అద్దం పట్టిన కథ - సమాజంలోని ఒక వాస్తవాన్ని, వాస్తవంగా చిత్రీకరించింది, ఎటువంటి స్వకపోల కల్పన లేకుండా!

## VI.13. హనీఫ్–నసీమా

ముస్లిం సంస్కృతిలో 'తలాఖ్' ఎంత తేలిగ్గా తీసుకోవచ్చు – తెలియపర్చే కథ యిది. మొదటి భర్తను వదిలిపెట్టిన స్త్రీ రెండవ భర్తను చేసుకున్నా ఆమె పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ కథలో ఒక విశిష్టత వుంది. వాస్తవంగా జరిగిన కథ శిల్పీకరించ బడిందేమోనని అనుమానం వస్తుంది. ఈ కథలో ముస్తాఫా, అతని స్నేహితుడు (పేరుపెట్టలేదు) అతని భార్యపేరు హస్నా – ముస్తాఫా భార్య నసీమా! గౌస్‌ఖాన్ అతని భార్య జరీనా! రెండు జంటలకు సంబంధించిన తలాఖ్ కార్యక్రమం, కారణాలు యీ కథ –

ఈ కథలో ముస్తాఫా, అతని స్నేహితుడు ఇద్దరూ సాహిత్యం పట్ల మక్కువ. బాగా చదువుకున్నవాళ్లూ. అయితే వాళ్ళలో సంకుచిత్వం మాత్రం ఎక్కువే! ముస్తాఫా స్నేహితుడు (రచయిత పేరు వ్రాయలేదు) కొంత ఆదర్శభావాలు వున్న వ్యక్తి అయినా మిగతావారి ప్రవర్తన మాత్రం అధోజగత్తులో వుటుంది. ముస్తాఫా (సాహిత్య జీవి) ప్రవర్తనకు ఒక మచ్చు తునక – "నీ మొదటిభర్త నాలాగే నిన్ను గాఢంగా ప్రేమించేవాడా? అని అడిగే సరికి విస్తుపోయి చూస్తుండి పోయాను. నోట మాట రావడంలేదు 'భోల్ మై కుచ్‌భీ సమ్‌జాంగా' రెట్టించాడు – తప్పదన్నట్లు 'అవునని' తలూపాను. నువ్వు అంతే గాఢంగా ప్రేమించేదానివా? బోలో బోలో ...... 'అవునని' తలూపాను (హనీఫ్, పుట, 101) ఇక్కడ నుంచి కష్టాలు మొదలు ఆ సాహిత్యజీవి ప్రవర్తనకు ఇంకొక సంఘటన–

"ఎప్పుడైనా అమ్మగారింటికి ఫోన్‌చేయడానికో, సినిమాకో వెళ్ళినా బజార్లో తనతో సమానంగా నడువనీయుడు. అతను ముందు తను పది అడుగుల వెనుక దూరం పాటిస్తూ నడవమని తాఖీదు ఇస్తాడు. పక్కపక్కన నడిస్తే ఎవరైనా తప్పుగా అనుకుంటారని అంటాడు. బాగా కొట్టేవాడు, వెంటనే తుడుచుకొని నవ్వమనేవాడు. వండిన అన్నం తనే తుడిచి పెట్టుకొని తిని డ్యూటీకి వెళ్తూ గ్యాస్‌రెగ్యులేటర్ వెంటతీసుకొని వెళ్తూ ఇంటి ముందు తాళం వేసి తాళంచెవి తనతోపాటు తీస్కొనిపోయేవాడు. రాత్రంతా కొట్టి, కొట్టి కొద్ది సేపట్లోనే నవ్వుతూ మంచం మీదకి వచ్చి పక్కలో పడుకోమని శాసించేవాడు. కళ్ళనీళ్లు తుడుచుకుంటానికైనా ఆ కొన్ని క్షణాలు గడపాలి" (హనీఫ్, (సం) స్కైబాబా, 2002–04, పుట,102)

ఒక సాహిత్య జీవి అయినా ముస్తాఫా ఈ విధమైన శాడిజంతో భార్యను వేధించడంలో ఎవరిలోనూ ఇంతకన్నా పరాకాష్ఠ ఉండదు. అతని ఉపచేతనలో స్త్రీని తృప్తి పరచలేనేమోననే అనుమానం బలంగా నాటుకుపోయింది. ఈ అనుమానంతో ఆమెను జీవచ్ఛవం చేసి తన కోర్కె తీర్చుకొనే పద్ధతిని కనిపెట్టి ఆచరించి చివరకు తలాఖ్ ఇచ్చాడు.

ఇదేకథలో ఇంకొక జంటకు తలాఖ్ మాములుగా నలుగురు కలసి టీ తాగినంత సులభంగా జరిగిపోతుంది – ముస్లిం స్త్రీల దుర్భర పరిస్థితిని, చేతగాని తనాన్ని, నిస్సహాయతను పురుషాధికారం ఏ విధంగా నాశనం చేస్తుందో సహజంగా, సరళంగా వాస్తవికంగా హేతుబద్దంగా రచయిత జీవం ఉట్టిపడేలా చిత్రీకరించాడు.

## VI.14. వలిహుస్సేన్ – 'బద్‌జన్వర్'

ఈ కథలోని లతీఫ్‌ఖాన్‌కు కొత్తగా పెండ్లి అయింది. ఖతీజాబేగం అతని భార్య. అయనకు ఆఫీసుకు వెళ్లి వచ్చే సమయంలో బస్సులో వేరొక అందమైన స్త్రీని చూసి కొద్దిసేపు తనను తాను మరచిపోయాడు. బస్సులో అతనుచూసిన స్త్రీ ఎంతో ఆకర్షణీయంగా మోడరన్‌గా వుంటుంది. కళ్లజోడు పెట్టుకుంటుంది. లిప్‌స్టిక్ వేసుకుంటుంది, టీషర్ట్, జీన్స్‌ప్యాంట్ వేసుకొంటుంది. ఆమెను చూసి ఆమె అందాలను తనవి తీరా అస్వాదిస్తాడు. బస్సులోనుంచి క్రిందపడబోయి తప్పించుకుంటాడు. అల్లాహ్ దయవలన తనకు గండం గడిచిందనుకొంటాడు.

ఆ మోడరన్ యువతి స్థానంలో తన భార్యను వూహించుకొని వణికిపోయాడు. అయితే తన భార్య సాంప్రదాయ బద్దురాలు గనుక ఆమె బుర్కా లేకుండా రాలేదు అని సంతోషపడతాడు. తానయితే ఇతర స్త్రీలను నిరాటంకంగా చూడవచ్చు. తన భార్య మాత్రం గడపకూడా దాటకూడదు. కనీసం పర్దా కూడా పక్కకు తీయకూడదు పొరపాటునైనా!

ఇటువంటి పరిస్థితుల్లో లతీఫ్‌ఖాన్ లేని సమయంలో అతని భార్య కూరగాయలు కొనడానికి పర్దాచాటునుంచి రావడం అమెను అక్కడ ఉన్న మౌలానా హాజీ ఆమెను 'బద్‌జన్వర్' అని తిట్టడం – ఆ విషయం ఆ కొత్త పెండ్లి కూతురువిని భర్తకు చెప్పడం – ఈ లతీఫ్‌ఖాన్ భయభక్తులతో హాజీ ఇంటికివెళ్ళి తన భార్య బుర్కా లేకుండా ఇంటి దగ్గర కూరగాయలు కొనడం హాజీ కళ్ళబడి, కోపోద్రిక్తుడై తరువాత ప్రసన్నుడై నీలాంటి వాళ్లు వుండబట్టే 'అల్లాహ్'

ఈలోకాన్ని వుంచాడని చెప్పడం వలన, తన భార్యప్రవర్తనను సరిదిద్దిన హాజీసాబ్ కాళ్లు మొక్కి, జన్మాంతం మీకు రుణపడివుంటానని కళ్లు చెమర్చి బయట పడుతాడు. మత మూర్ఖత్వాన్ని సున్నితంగా వలి హుస్సేన్ చెప్పడం, ఒక హేతువాద దృక్పథాన్ని చిన్న కథ ద్వారా వెలువడటం ఒక అనల్పమైన విషయం. మతధోరణులను రచయిత హేతుతత్వం ఏ విధంగా బహిర్గతం చేస్తుందో యీ కథాక్రమం వలన తేటతెల్లం ఔతుంది.

## VI.15. ఇక్బాల్‌చంద్ – మౌల్వీసాబ్

మతవిశ్వాసాల మీద అస్త్రంగా ఉపయోగించిన కథ. మౌల్వీలపై ఎంతటి వత్తిడి వుంటుందో వారి జీవితాలు సమాజంలోని నియమ నిబంధనలు వ్యక్తిగత అనుభూతుల మధ్య నలిగిపోయే పరిస్థితిని కవితాత్మకంగా ఇక్బాలచంద్ రాశారు.

మతంపై తిరుగుబాటు చేసిన యీ కథ మౌల్వీసాబ్ దగ్గర తండ్రి బలవంతంపై 'సూరాలను' నేర్చుకోవడానికి వచ్చిన యువకుడు మౌల్వీనే మార్చివేసి మతం అనే ఇరుకు గదిలోనుంచి, తన కవితలతో, సరస సంభాషణలతో మౌల్వీని విశాల ప్రపంచంలోకి తీసుకువస్తాడు. మౌల్వీ ఉద్యోగంపోయి జీవనసరళిలో ఒక విస్తృతి వస్తుంది. ఈ కథలో శైలి రసవంతంగా వుంది. 'వస్తువు' అభ్యుదయకర పంథాలో సాగింది.

## VI.16. సయ్యద్ ఖర్షీద్ – బౌవభూషి

ముస్లింలు రాజకీయంగా ఏకం కాలేరనే సందేశాన్ని ఇస్తుందీ కథ. ముస్లింల తెలివి తక్కువ తనం వలన వాళ్లు ఓట్లు చీలిపోతాయి. ముస్లింలు మార్కిస్టు దృక్పథంతో పనిచేసే వ్యక్తి ఓటు వేయకపోవడానికి కారణం అతను మసీదుకు రాకపోవడమే! ముస్లింలు మతదృక్పథం కలిగిన వ్యక్తిని ఎన్నుకొంటారు. ఓట్లు చీలి 'రవి' అనే వ్యక్తి ఎన్నికల్లో గెలుస్తాడు. తన ప్రతినిధిని ఎన్నుకోలేని ఆలోచనా శూన్యతను రచయిత సయ్యద్ ఖర్షీద్ చక్కగా చిత్రీకరించాడు. మత దృక్పథం రాజకీయాల్లో పనికిరాదని, కొంత 'ఎలివేషన్' ముస్లింలో వుండాలనే సూచనతో కథముగుస్తుంది. కథ హేతుబద్ధంగా వుంది.

## VI.17. స్కైబాబ - దావా

ఈ కథ కూడా ముస్లిం యువకుడ్ని అన్యాయంగా తీవ్రవాది అన్న పేరుతో జైలులో పెట్టి ఎవరికీ చూపకుండా ఎన్‌కౌంటర్ లాంటిది చేయడం జరుగుతుంది. ఒక ముసలితల్లి పోలీస్ స్టేషన్‌లో పెట్టిన తన కొడుకును చూడటానికి వచ్చి భంగపడుతుంది. ఒక ముసలి తల్లి కోర్కెను పోలీసులు తీర్చకపోగా కఠినంగా వ్యవహరిస్తారు. ఏ రాజకీయ నాయకుడు సహాయం చెయ్యడు. ముసలి తల్లి కూలిపోతుంది. కాకి పిల్లను కుక్కలు ఎటో ఎత్తుకెళ్ళి చంపివేసినయ్!

అన్యాయంగా కేసులు పెట్టి ముస్లిం యువకులను టార్చర్ పెట్టడంపై  నడిచిన యీ కథ ఒక ముసలి తల్లి ఆవేదన ద్వారా స్కైబాబ చక్కగా అభివక్త పరచి పోలీసు వ్యవస్థలో, అసలు రాజ్యవ్యవస్థలో వున్న అకారణ రాజ్యహింసను బయటపెట్టడం పాఠకులను ఆలోచింపజేస్తుంది. వ్యవస్థలోని లోపాలు ఒక దృక్కోణం నుంచి బహిర్గత మౌతాయి. కథలో సరియైన హేతువాద దృక్పథం వుండటం వలన సజీవంగా వుంది. కథకుగాని కవితకు గాని హేతువాద దృక్పథం ప్రాణం,  మూలధారమవుతుంది.

క్షుభిత అయిన మాతృ హృదయాన్ని యీ మాటల్లో 'స్కైబాబా' ఈ విధంగా ఆవిష్కరించారు. "సాబ్ మేరా బేటా ఛోలా ఛాలాహై సాబ్. ఏకీ బేటాహై సాబ్. ఆడు లేకుంటే ఇల్లంత చిన్నబోయిందిసాబ్. ఇంట్లో ఎవరికి అన్నం నీల్లు సయిస్తలేవ్‌సాబ్..అని చెల్లి అన్నంగూడ ముట్టలేదు సాబ్.. జర అన్ని ఎట్లన్న వదలి పెట్టురి సాబ్.. అను కుంట ఏడ్చుకుంట.. ఏడ్పుని ఆగబట్టుకుని 'ఆన్ని ఒక్కసారి చూసన్న పోతసాబ్.. ఇంట్ల అందర్కి జర భరోసాగుంటది.. జర చూడనీరె సాబ్". (స్కైబాబా, 2002-04, పుట 130-31)

ఆమ్మ హృదయం పోలీసులకు అర్థం కాకపోయినా పాఠకులకు హదృయ స్పందనను కలిగిస్తుంది. మాతృహృదయం పడే బాధను అక్షరాలలో బంధించి, అన్యాయాన్ని ఎదుర్కోలేని ఆ "ముసలితల్లి" నిస్సహాయత పఠితులను కదిలిస్తుంది.

## VI.18. అఫ్సర్ గోరీమా

సాహితీ ప్రపంచంలో అఫ్సర్ ప్రసిద్ధిగొన్న రచయిత. ఆయన వ్యాసాలు విశ్లేషణాత్మకంగా, విషయ పరిజ్ఞానంతో నిండివుంటాయి. కానీ కథకుడిగా ఆయన కొంత వెనుకబడి వున్నాడేమో నని పిస్తుంది. గోరీమా కథ. ఆమె సహృదయి. ఇతరులకు సహాయంచేసే వ్యక్తి. ఆమె ఇంటిని 'దేవుడు వెలిశాడని' కొంతమంది ఆక్రమించుకొంటారు. హిందూ మతంలోని ఒక వర్గం. ఆమె ఆ మూకలపై పోరాడుతుంది. అక్కడనేవుండి. ఆమె పోరాట పటిమ ముస్లింలపై జరిగే అన్యాయాలను ఎదిరించడానికి 'స్ఫూర్తి' దాయకం కావాలంటాడు. కథలో చదివించే గుణం మాత్రం పుష్కలంగా వుంది.

## VI.19. విన్నెస్ ఖలందర్ - పిల్లిమెడ గంట

ఈ కథ అంతా ప్రథమ పురుషంలోనే సాగింది. ఇండియానుంచి సౌదీ వెళ్ళి, ఇక్కడ పిల్లలను, భర్తను ఆర్థికంగా నిలబెట్టాలనే ఒక స్త్రీ మనోవేదన ఇది. అక్కడ పరిస్థితులు, అక్కడ మనుష్యుల కఠినత్వం, తన శీలాన్ని రక్షించు కోలేకపోవడం, రాత్రింబవళ్ళు ఎంత పనిజేసినా యజమానిని సంతృప్తి పరచలేక పోవడం హృద్యంగా వివరించబడింది.

భర్త సంపాదనాపరుడైతే అంతదూరం వెళ్ళాలిసిన పని ఏ స్త్రీకి వుండదు. సంసారం కోసం దూర ప్రాంతాలకు పోయి వళ్లు హూనం అయ్యేటట్లు పని చేస్తున్నా, వళ్లు అప్పగించినా కుటుంబం కూడా పైకి రాలేని స్థితిలో కూరుకు పోవడం చూస్తుంటే, యీ కథ వేలాదిమంది ఇతర దేశాలలో పనిచేసే స్త్రీల మనోవేదనగా, దుఃఖగాథగా వుంది. రచయిత విదేశాల మోజులో పడి, గత్యంతరం లేక జీవితాలను నాశనం చేసుకొనే ఆలోచన సరియైనది కాదని అంతన్యూతనంగా కనిపించే 'హేతువు' ద్వారా సృష్టీకరించాడు.

## VI.20. సత్యాగ్ని - యంత్రం

ఈ కథకు యంత్రం అని పేరుపెట్టడం లోనే ఎవరో ఒక వ్యక్తి యొక్క యాంత్రికవర్తనం గురించి కథ రాయబడి వుంటుందనే స్ఫృహ కలుగుతుంది. అది ముగ్గురు ఆడపిల్లలకు తల్లి అయిన స్త్రీకి, ఆడపిల్లలు పుట్టారనే కేవలం నెపంమీద భర్త ఇద్దరి పెద్దలతో వచ్చి 'తలాఖ్'చెప్పి వేస్తాడు.

ఆమె పుట్టింటికి వస్తుంది. తల్లీదండ్రి ఆమెకు మరలా పెండ్లి చేయాలనే ప్రయత్నంలో ఉంటారు. తన ముగ్గురు పిల్లలు దూరంగా వుండినా మాతృ హృదయంతో ఆమె వారిని దూరం అయిపోయి వేరే పెండ్లిచేసుకోవాలనే తల్లి తండ్రుల ఆలోచనను వ్యతిరేకించి 'లా'చదివి తనలాంటి స్త్రీలకు వెన్నుదన్నుగా వుండాలనే తన కాంక్షను చెప్పి తల్లి దండ్రులను ఒప్పిస్తుంది.

ఈ కథలోని విశిష్టత ఏమిటంటే మత సాంప్రదాయంలోని (విడాకులు ఇచ్చిన తరువాత పెట్టే గడువు ఇద్దతుకాలం గురించి, మగ్‌రీబ్ నమాజ్ (సూర్యస్తమయం తర్వాత చేసే ప్రార్థన గురించి, ఇసానమాజ్ (ఎనిమిది గంటలకు చేసే ప్రార్థన) జెహజు (వస్తుసామాగ్రి) గురించి మహరు గురించి చెప్పడం వలన ముస్లిం మతసాంప్రదాయం పాఠకుడికి తెలిసే అవకాశం వుంది. పదిసంవత్సరాలు అన్యోన్యంగా సంసారంచేసి, సౌందర్యవతి అయిన భార్య ద్వారా ముగ్గురు పిల్లలనుగని, ఆడపిల్లలు పుట్టారనే నెపం మీద 'తలాఖ్' ఇవ్వడం మూఢసమాజం తలవంచుకొనేటట్లు బలమైన అభివ్యక్తితో సత్యాగ్ని (హుస్సేన్) గారు ఈ కథను రచించారు.

పవిత్ర ఖురాన్ రెండవ కాండము 187 సురాలో చెప్పిన సూత్రం ఈ విధంగా వుంది "వస్త్రమునకును దేహమునకు ఎంత సమీప సంబంధమో భార్యా, భర్తల కంత సమీప సంబంధము గలదు. (అబ్దుల్ అలా మౌదుదీ మౌలానా సయ్యద్, 1996, కాండము-2 సూరా187) ఇటువంటి పవిత్ర వివాహ బంధాన్ని మూడుసార్లు తలాఖ్‌తో భార్యను వదిలించుకోవడం ఏమాత్రం మానవత్వం కాదు. అదే విషయాన్ని సత్యాగ్ని యీ కథలో సూచించారు. బలంగా యీ సాంప్రదాయాన్ని వ్యతిరేకించారు కూడా !

## VI.21. అక్కంపేట ఇబ్రహీం - ఫతహ్

భూస్వాముల క్రింద పనిచేయడమూ, వాళ్లు చెప్పుచేతల్లో పని గంటల్తో నిమిత్తం లేకుండా 'జీ హుజూర్' అనుకుంటు వాళ్లిచ్చే కూలిభత్యాల కోసం ఎదురు చూడడం ఇంతవరకూ జరుగుతుంది. అయితే మసీదులో కొత్తగా మైకు రావడం, ప్రార్థనా సమయానికి పిలవడం, రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తినవి. టైము ప్రకారం ముస్లిం కూలీలు యీ అజా విని పని విరామం తీసుకోవడానికి సంసిద్ధులు కావడం రైతులకు కొరకరాని కొయ్య అయిపోయింది. తమ ఇష్ట మొచ్చి నంత సేపు ముస్లిం కూలీలలను పట్టి ఉంచలేక పోతున్నారు. ఈ సందర్భంలో వారు ముస్లిం కూలీలను పనికి పిలవడం మానుకున్నారు. మౌల్విని పిలిచి ప్రార్థనా వేళలు

మానుకోమని, మార్చుకోమని బెదిరించారుకూడా! అయితే ఎప్పుడో నుంచి వస్తున్న ఆచారాన్ని మార్చడం కుదరదని ఖరాఖండిగా చెప్పడం హిందూ వర్గాలకు మరింత మండిపాటుకు గురిచేసింది. రైతులు ముస్లిం కూలీలను పని మాన్పించారు. ఈ సందర్భంలో కూలీపనులు లేక ముస్లిం కూలీలు కష్టాలు ప్రారంభమైనవి.

ఈ సమయంలో షాహీదా అనే ముస్లిం స్త్రీ అనారోగ్యంతో బాధపడుతున్న భర్తను, తిండిలేక అలమటిస్తున్న పిల్లలను రక్షించుకోవడానికి విస్తళ్లు కుట్టుకొని జీవించడం మొదలు పెట్టి తన కుటుంబం యొక్క ఆకలి బాధను తీర్చి, స్వతంత్రంగా బ్రతకడానికి మార్గం ఏర్పరచుకుంటుంది.

ముస్లిం 'అజా' సమయాన్ని మార్చమని పట్టుబట్టిన భూస్వాముల మాటను ముస్లిం సమాజం వ్యతిరేకిస్తూ మీ సుప్రభాతాలు, ప్రార్థనలు మార్చుకుంటారా అని ప్రశ్నించడం యీ కథలోని కొసమెరుపు. మతస్వాతంత్రానికి ఎవరికీ ఎవరూ అడ్డు రాకూడదనే ప్రజాస్వామిక సూత్రాన్ని యీ కథ వ్యక్తపరుస్తుంది. ఈ కథలో మతరీత్యా హేతువాద దృక్పథం ఇరువర్గాలకు లేకపోయినా, సామరస్య వాతావరణం లేకపోయినా మత పరిధిలోనే ముస్లిం జనాభా ఒక స్పష్టమైన వైఖరిని అవలంభించడం కనిపిస్తుంది. మతపరమైన విధానాలను అమలుపరచడంలో హిందువులకు ఎంత హక్కువుందో ముస్లింలకు కూడా అంతే హక్కు వుందని ఒక లాజిక్ ఈ కథలో కనిపిస్తుంది.

భూస్వాముల అణచివేత ధోరణిని ఒక పేదముస్లిం స్త్రీ ఎదుర్కొన్న తీరును రమణీయంగా వాస్తవంగా చిత్రీకరించాడు రచయిత!

## VI.22. షెహనాజ్ – స్వయంకృతం

విశాఖపట్నం రేవు ప్రాంతంలో కథ మొదలవుతుంది. కథలోని (ప్రధాన పాత్ర) అస్లం, తన భార్య అస్మా గురించి బాధపడుతూ వుండేవాడు. ఆమె తన దగ్గరున్నప్పుడు ఆమె విలువ తెలుసుకోలేక పోయాడు. ఆమె మృదుభాషిణి. ఎటువంటి కష్టనష్టాలను దిగమింగుకొని అతనితో ఓర్పుగా జీవించడానికి, మత కట్టుబాట్లలో స్త్రీలకు ప్రాముఖ్యత లేకపోవడం వలన, ఆమె తలయొగ్గి జీవించక తప్పడంలేదు. అదే సందర్భంలో అస్లం – ఆస్మా జీవితంలో వచ్చిన మలుపులు ఈ కథ సారాంశం.

భర్త అస్లం 'అసలు అతనికి మొదట్నుంచి ఆడవారిపట్ల చులకన భావమే. అడదానిని అదుపులో పెట్టుకోవాలి తప్ప స్వేచ్ఛ ఇవ్వకూడదన్న అభిప్రాయంలో ఉండేవాడు" (షెహనాజ్, (సం), స్కైబాబా, 2002-04, పుట.203) అస్లంకు, స్త్రీల పట్ల ఏహ్యాభావానికి కారణం అతని తల్లి ప్రవర్తన. తండ్రిపై ఆమె అడ్డూ ఆపులేని పెత్తనం - ఇవన్నీ చూశాక తన భార్యకూడా ఇట్లా చేస్తుందనే భయంతో అణిచివేసే కార్యక్రమం పెండ్లి అయిన దగ్గర నుంచి ప్రారంభించాడు. అయితే భార్య మంచితనం, తన కూతురిపైన ప్రేమ అతన్ని ఒక విచక్షణాయుత వ్యక్తిగా మార్చగా తన తప్పు తెలుసుకుంటాడు.

తన భార్యను, బిడ్డను తిరిగి తీసుకువచ్చి సుఖప్రదంగా జీవించాలని అందుకు కావలసిన మతరివాజుల కోసం మౌల్వీలను ఆశ్రయిస్తే "మత సూత్రాల ప్రకారం అతను తన భార్యను తిరిగి తన దగ్గరకు తీచ్చుకోవాలంటే ఆమెకు మరొక పెండ్లిచేసి, అతనితో ఒకరోజు సంసారం చేసిన తర్వాత 'తలాఖ్' పుచ్చుకొని తిరిగి మొదటి భర్తను వివాహం చేసుకోవచ్చని చెప్పిన మతాచారాన్ని విన్న అస్లంకు మతిపోయింది.

మత సూరాల్లోని అసంబద్ధతను నేరుగా చెప్పకుండా హేతువాద వైఖరితో కథను నడిపించి 'ఒక పశ్చాత్తాప్తుడైన ముస్లిం యువకుడి జీవితం ఏవిధంగా నాశనమైందో రచయిత సమర్ధంగా నిరూపించాడు.

## VI.23. ఎస్. నూరుల్లా - గరీబ్ జిందగీ

పండ్లు అమ్ముకొని జీవిస్తూ తన పిల్లవాడిని ఏ విధంగానైనా చదివించు కోవాలని తాపత్రయంతో ఉన్న వ్యక్తి అబ్దులా, అతని భార్య హజారా కూడా అతని సమస్యలను అర్థం చేసుకొని సహకారం అందించే వ్యక్తి.

తన కుమారుడి ఫీజు చివరిరోజు - ఏ విధంగానైనా పండ్లమ్మి కట్టాలని నిర్ణయించుకొని బయలుదేరిన అబ్దుల్లాకు పోలీసు బలవంతంగా లంచం తీసు కోవడంతో ఏమీ పాలుపోని పరిస్థితి. తనకు తెలిసిన మిత్రుల దగ్గరకు వెళ్ళి అప్పు తీసుకొని ఫీజు కట్టి వేస్తాడు.

అత్యంత పేదరికంలో పండ్లు అమ్ముకొంటూనో, సైకిల్ షాపుల్లో, రిక్షా లాగుతూనే బ్రతుకీడుస్తున్న పేద ముస్లింల పట్ల దయాదాక్షిణ్యాలు లేని వ్యవస్థ యొక్క తీరుకు అద్దం పట్టాడు

రచయిత. సమాజం యొక్క హృదయం లేని తీరుకు యీ కథ ఒక మచ్చుతునక! సమాజ దౌష్ట్యం పేదవాడి మీదనేనా? అనే వాస్తవిక సందేశం సూచ్యార్థంగా యీ కథ ముగుస్తుంది. నూరుల్లా కథ నూరుపాళ్లు మంచి కథ గరీబ్ జిందగి. పేదవాడి జీవితం సహజ దౌర్జన్యంతో మునిగి పోవలసిందేనా? అన రచయిత ప్రశ్నిస్తూ, దీనికి జవాబు వెదకమని పాఠకులకు ఒక చక్కటి సందేశం ద్వారా సూచిస్తున్నాడు.

## VI.24. వేంపల్లి ఖాదర్ - తుర్కోని సేద్యం

సామాన్యంగా సేద్యం ఖచ్చితంగా లాభాలు వచ్చేటట్లు చేయాలంటే కమ్మ, రెడ్డి కులాలే! సేద్యం విషయంలో మిగతావాళ్లు వాళ్ల తర్వాతననే అభిప్రాయం బాగా ప్రచలితం అయివుంది. ఈ కథ గురించి పూర్వ అధ్యాయంలో సమీక్షించడం జరిగింది. అందువల్లనే సంక్షిప్తంగా చెప్పవలసివుంది.

నీళ్ల సదుపాయం లేని పొలం గురించి నీళ్లకోసం, నూకలు కోసం తన పొలం పక్కన వున్న చలమారెడ్డిని ఆశ్రయిస్తాడు. అతను యీ పొలాన్ని మింగాలని ఎప్పుడునుంచో ప్రయత్నిస్తుంటాడు. ఎంత ప్రయత్నించినా అతని కుటుంబం ఆర్థికంగా ముందుకు పోదు. సాయిబు సేద్యం కొరకు ఎవరూ తోడ్పడరనే ముగింపు కథ వాస్తవికతకు ప్రతిబింబం.

## VI.25. ఇనాయతుల్లా - ఘోస్‌లా

ఈ కథ హృదయాన్ని కదిలించే కథ. ఈ కథలోని ప్రధాన బాలిక 'సైదాబి'. ఆమెకు వివాహంకాలేదు. పేదరికంతో మగ్గుతున్న కుటుంబం. తల్లి మాటల్లో కూతురి పెండ్లిగురించి యీ విధంగా అంటుంది. "ఏమోక్క- ఇంట్లో నుంచి పెద్దోదెల్లి పోయినాల్నించి నాకైతే మనసు మనసులో లేదు. ఆ మనిషిని సూస్తే సంసారమే పట్టదు. పొద్దుమాకుల ఆ మౌజిన్ పని చేయడం మశీదు ముందు టోపీలు అమ్మడం. ఆ వచ్చిన దాంతో నంజీర తెచ్చుకొని తినడం తప్పితే ఇంటి సింతనేల్యా" కరీమా కొంగు విసురుకొంటూ చెబుతుంది. (ఇనాయతుల్లా, (సం), స్కైబాబా, 2002-04, పుట, 217).

ఇంట్లో రెక్కలుకు అడ్డం వస్తాడన్న కొడుకు పరిస్థితి తల్లి మాటల్లో "ఎవుడో లత్‌కోరు ముండాకోడు జతాయెగదా వానికి. వాని దుందగల. ఆ బాడ్‌కాన్ బట్ట "నోట్ల ముప్పేవేలు తీస్కపోయి ముండమోపిచ్చే గదనే. ఆ మూడు గాసలోడు దుబాయ్‌కి పంపిస్త దుబాయ్‌కి

పంపిస్తే అని ఏటికో పాన్‌కోట యిప్పిత్సనని బొంబైకిపోయి అన్నుంటి అటే పారిపోయిండంట. ఈడు తిక్కతీత లెక్క తిర్గితిర్గి మాకెల్లి తిరిగి సూడకుండ ఎల్లిపోయె". (సైదే) ఇది ఆమె కొడుకు పరిస్థితి. ఇప్పుడు కూతురుకూడా కనిపించడంలా ఉదయాన్నించి.

అదే విషయంలో భార్య భర్తలిద్దరికి గొడవ జరుగుతుంది ఈ విధంగా. "సైదా ఇంట్లోంచి ఎల్లిపోయింది" కోపంగా చెప్పింది కరీమా. సగం తాగిన నీళ్లగ్లాసు కొందపెట్టాడు గోరేమియా. యాడికి పోయింది. కోపంగా అడిగాడు. నాకేంటితెల్సు. నాకేమన్న చెప్పిపోయిందా? యాడికి వురేగిందో నువ్వేమన్నా గాడ్దులు గాస్తున్నవా? నీయమ్మ.. నువ్వ తల్లివే జాన్వర్‌వా? గోరీమియా కొప్పు పట్టుకున్నాడు తీ ఇద్వ – ఇదొక్కటా నీకు చేతయింది". థూ.. నీయవ్వ ఇప్పుడైతే పగతీర్చుకోనీకి చేస్తుండవేమో! యిదంతా ఖబరకీ స్యారీ. నీ కసలు అఖ్ఖల్ అంతా పోయిందా? గొంతుపెంచాడు గోరేమియా. అవు! నాకు అఖ్ఖల్ యాడుంది. పోయింది. పేగు తెంచుకొని పుట్టిన బిడ్డలు. ఈ సేతుల్లో పెరిగిన బిడ్డలు. ఈ సేతుల్లో బువ్వ తిన్న పిల్లలు పెద్దగై కండ్ల ముందు నుండి పారిపోతుంటే యిగెక్కడి లఖ్ఖలు. కరీమా గొంతుమారింది వణుకు పుట్టింది. కళ్ళ నుండి బొటబొట మని నీళ్ళు కారినై". (పుట, 218–19)

పేదరికం వలన ఇంట్లో పిల్లలు, ఘర్షణలు పడలేక అర్ధిక పరిస్థితులను అధిగమించలేక ఏదో సంపాదించి ఇల్లును నిలబెట్టాలని, ఎవరినో ఒకిరిని పెండ్లి చేసుకుంటే తిల్లిదండ్రుల భారం తగ్గిపోతుందనో, యీ పేదరికం నుంచి బయటపడదామనో కోడుకూ కూతురూ ఎటో వెళ్ళ పోయారు – చివరకు మూడవ బిడ్డ సైదా కూడా కనిపించకుండా పోతుంది.

బంధువుల ఇంటికి వెళ్లిన సైదా ఎందుకు పారిపోయి వచ్చావన్న తండ్రి గాండ్రింపులకు ఆమె చెప్పిన సమాధానము గుండెలను కదిలిస్తుంది. "బా! అంత మాటనొద్దు బా. నేనెందుకీ మాట అంటుండనో అర్ధం చేసుకో ఏప్పుడూ.. నేన్చేప్పేది అర్ధం చేసుకోవు ఏడుస్తూ చెప్పింది సైదా. 'అన్నను దుబై పంపినాక ముప్పైవేలు ఆగమై పోయినై. యిపుడు నా నికా చేయడానికి ఇరవై వేలు కట్న మొప్పుకొన్నాడు. ఉండే ఆ పాత ఇట్లు గూడ నా పెండ్లి కోసం కుదవు బెడ్డనన్నాడు. నిన్నరాత్రి అమ్మ నాయన ఇద్దరు మాట్లాడుకుంటుంటే విన్నాను. వద్దు బా! నువ్వాపని చెయ్యొద్దు బా.. బిడ్డ పెండ్లి చేసి గొండి గొరేమియా ఇల్లు లేనోడు కాకూడదు బా. (పుట.223) తన తండ్లి ఇట్లా వాకిలీ లేకుండా వృద్ధాప్యంలో జీవించడం కష్టమని, పెండ్లి కాకపోయినా తల్లి

తండ్రి ఆ పాత యింట్లో కలోగంజో దాగి బతుకు తారన్న సైదా భావనకు తండ్రి బిడ్డను హత్తుకొని ఏడుస్తాడు. కూతురి రూపంలో వున్న తల్లిని చూస్తాడు గోరేమియా.

'వతన్' కథా సంపుటిలోని రచయితలు / రచయిత్రులు ముస్లిం సమాజంలోని ఆచార వ్యవహారాలను, బాధల గాథలను, అగ్రవర్ణ సమాజం వారిపై చూపే వివక్షతను, పేదరికంలో ఎలాంటి సహాయం అందక, ఆకాశం వంక నేలవంక చూసే పేద ముస్లింల జీవన పరిస్థితులను అక్షరీకరించి తెలుగు సాహిత్యాన్ని అమృతీకరించారు. అంతేకాక ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు కలిగిన తెలంగాణ, రాయలసీమ, కోస్తా ముస్లింల కథలను వేరువేరుగా గుదిగుచ్చారు. ఈ విభజన ప్రాంతీయపరమైన సూక్ష్మ సాంస్కృతిక తేడాలను కూడా పట్టి ఇచ్చింది ఇది ముదావహం.

'వతన్' కథల సంపుటి తెలుగు సాహిత్యంలో ప్రవేశించి మైనారిటీ రచయితల ప్రతిభా పాటవాలు ఏ ఇతర కథకులుకన్నా తక్కువగాదని, తమ వ్యథల్ని తామే కథలుగా మల్చుకొనే సత్తా పుష్కలంగా వుందని నిరూపించి సాహిత్యంలో అగ్రభాగాన నిలచింది. ముస్లిం రచయితలు కేవలం మతభావాలతో మునిగి పోయేవారు కాదని, మతాన్ని కూడా వారు ఎంతో సంయమనంతో అర్థం చేసుకొని, ముస్లిం జీవితాంకు మతభావనలతో సమన్వయం చేసుకొని చూసి అవి జీవితాలను పునర్ధరించడానికి అంతగా పనికి రావని తమ యొక్క హేతువాద, లౌకిక సామాజిక దృక్పథం ద్వారా గ్రహించారని తమ స్పజనను ప్రగతిశీల భావజాలం వైపు నడిపారని అవగతం చేసుకోవలసివుంది. ఎక్కువభాగం ముస్లిం రచయితల హేతువాద దర్పణం పరిణిత దశలో వుందని తేటతెల్లం ఔతుంది.

మానవ జీవితానికి, సాహిత్యానికి హేతువాదం ప్రాణం లాంటిది.

# VII. ముస్లిం రచయితల రాజకీయ ధోరణులు జాతీయ భావనలు

" రామ బాణంతో వాళ్ళు
విష్ణుచక్రంతో
కృష్ణచక్రంతో వాళ్లు
శివుని త్రిశూలంతో వాళ్లు
హనుమంతుని గదతో వాళ్లు
అయ్ అల్లా హొ
ఈ చేతులు పట్టిదువాకేనా?"

- ష్కై బాబ

మన ముస్లిం కవులు / రచయితలు ఎక్కువభాగం రాజకీయ నినాదాలు వైపుకి పోక సున్నితమైన అంశాలు, మైనారిటీజనులు ఎదుర్కొనే 'వివక్షత' వైపుకే తమ కలాన్ని ఒక ఆయుధంగా వాడారు. అందువలన ముస్లిం కవులకు / రచయితలకు రాజకీయ చింతన లేదనడం సాహసమే ఔతుంది. మార్క్సిస్టు కవులకున్నంత రాజకీయ దృక్పథం లేదని దీనర్థం. ఇదిలోపంకాదు.

భగవద్గీతలో, బైబిలులో, ఖురాన్‌లో ఆనాటి రాజకీయ పరిస్థితులు వ్యక్తమౌతాయి. అయితే మతగ్రంథాలను, దివ్యాలని, పవిత్రాలనే దృష్టితో మతవాదులు చదువుతారు గనుక వాటిల్లోని రాజకీయదృక్పథాన్ని విశ్లేషించే పనికి ఎవ్వరూ పూనుకోరు. ఆయా మతగ్రంథాలలోని చారిత్రక నేపథ్యాన్ని గాని, రాజకీయ నేపథ్యాన్ని గాని సమీక్షించడం దోషం కాదు. ముస్లిం రచయితల సాహితీరచనల్లోని రాజకీయ దృక్పథాన్ని వారియొక్క జాతీయ భావనలను పరామర్శించవలసివుంది.

ఎక్కువశాతం యీ నాటి సామాజికులు, ముస్లింలు మైనారిటీలు, అల్పసంఖ్యాక వర్గం గనుక, వీళ్లు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని వుండరని, రజాకారు ఉద్యమం లాంటి దాన్ని ప్రోత్సహించి వుంటారనే అపోహలు కలిగే ప్రమాదం వుంది. ఎవరో మత వాదులు తప్పితే, సామాన్యముస్లిం జనానీకం న్యాయం అనే సూత్రంపైనే జీవించారని, జీవిస్తున్నారని నిస్సంశయంగా పేర్కొన వచ్చును.

మొట్టమొదటిగా ముస్లింలు ప్రారంభించిన రాజకీయోధ్యమం 'ఖిలాఫత్' ఉద్యమంగా పేర్కొన వచ్చును. భారతీయ సమాజంలోని ముస్లింలు, తమ ప్రత్యేక మైన సంస్కృతిని

కాపాడుకుంటూ జాతీయభావలను కలిగి వున్నారనేది వాస్తవం. దీనికి ఖిలాఫత్ ఉద్యమమే సాక్షి. ఈ ఉద్యమంలో ముస్లింలు/ ముస్లిమేతరుల మధ్య సామరస్యానికి పునాదులు వేసింది. ప్రగతిపథాన ముస్లింలను, ముస్లిమేతరులను నడపడానికి ప్రయత్నించి కొంత సఫలతను సాధించింది.

రాజకీయోద్యమాలుగా సయ్యద్‌నశీర్ అహమ్మద్‌గారు అయిదింటిని పేర్కొన్నారు. (1) ఫకీర్ల తిరుగుబాటు (2) వహాబీలా పోరాటం (3) ఫరాజీల ఉద్యమం (4) మోప్లాల తిరుగుబాటు (5) ఖుదాయే చిద్మత్‌గార్‌ల అహింసా ఉద్యమం (సయ్యద్ నశీర్ అహమద్, 2003, పుట 1) ఈ ఉద్యమాల యొక్క వివరాలను చూస్తే, సమాంతరంగా ముస్లింలు స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్నారనే విషయం సువిదితం.

ముస్లింలు ఎక్కువగా రాజకీయాలు చేసి, సమాజాన్ని అతలాకుతలం చేస్తారనే అపప్రథవుంది. ముస్లింలు ఎక్కువగా వున్న హైదరాబాదు, నల్లగొండ లాంటి ప్రాంతాలలో ముస్లింలు కొంత ఐక్యతగా వుండి ఏదోసాధిస్తున్నారనే అపోహలు, ఊహలు సమంజసం కాదనిపిస్తుంది. చట్టసభల్లోను వీరి గళాలు ఒకటో, రెండో వుంటాయి గాని, ఎక్కువ సంఖ్యలో ఏమీ వుండవు. దీనికి ప్రధాన కారణం వీరి మతశాఖల్లోని, అంతర్గత విబేధాలు మాత్రమే! ముస్లిం కవులు, రచయితల్లో కూడా సమైక్యరాగం కూనిరాగంగా వినబడుతుందిగాని, శ్రుతి బద్ధంగా వినిపించదు. ఎందువల్లనంటే ముస్లింలు, ముస్లిం హిందూ సంస్కృతులను రెండింటినీ పాటించే దూదేకులు, కొంత భిన్నత్వం కలిగి వుండటమే! ఏదిఏమైనా, ముస్లిం కవులు, రచయితలు, సృజనాత్మక వైఖరికి భంగం కలగకుండా తమ రాజకీయ ధోరణిని వెల్లడించారు – అనేకచోట్ల!

మెహజబీన్ 'ఆకురాలుకాలం' కవితా సంపుటి ప్రసిద్ధమైనది. నక్సలిజాన్ని ఆమె సమర్థించిన తీరు పూర్వ అధ్యాయాలలో విస్తృతంగా చర్చించబడింది. తన ప్రేమికుడుతెచ్చే విప్లవగీతాలను, సరంజమాలను గురించి కవితాత్మకంగా వివరించింది. ఆమె గీతాల్లో మాటలు తూటాలుగా మారి సమాజం విప్లవ పంథాలోనే విముక్తం ఔతుందనే సందేశం ఇచ్చింది. అయితే ఆమె కవిత్వం ఔచిత్యానికి పెట్టనికోట!

అన్వర్, స్కైబాబాల సంపాదకత్వంలో వెలువడిన ప్రసిద్ధ కావ్యం "అజా" కూడా రాజకీయ భావాల సమ్మేళనమే! అన్వర్ "తడప్" అనే పీఠికలో అప్పుడు ఉన్న రాజకీయ గణాచారులపై ధ్వజమెత్తాడు. "దేశపతాకంలోని కాషాయం తెలుపును ఆక్రమించేస్తోంది. (పుట1, అజా-అన్వర్‌పీఠిక) ఇది .ఏదో సాధారణవాక్యం మాదిరిగా అనిపించినా, ఇందులోని వాస్తవం ఆలోచనా పరులకు గగుర్పాటు కలిగించేవిధంగా వుంది. అన్వర్ రాజకీయ ధోరణికి చిన్న ఉదాహరణ "ధైర్యంగా ముందుండి నిలబడటానికి ఒంటరైన ప్రధానికి తోడు, ఉపప్రధానిని దేశం మీద రుద్దారు. ఇప్పుడు ఈద్ వాళ్ళది. బారాత్ వాళ్లది" (అన్వర్, 2002,పుట,1) అదేచోట అన్వర్ అంటాడిలా "రామనామకె దో అక్షరమే సభసుఖశాంతి సమాయ" అని పరవశించిపోయిన మనమంతా "ఏకారణ్‌హై అబ్‌రోనేకే" - అంటూ గుజరాత్ విషాదానికి గుండెలు బాధుకుంటున్నాం. (పైదే)

రామమందిరం-బాబ్రీమసీదు లాంటి మతరాజకీయ చర్యలు, నినాదాలు భారతదేశాన్ని నిప్పుల గుండంలోకి నెట్టివేస్తున్నాయనే సత్యాన్ని చాలా మంది ముస్లిం కవులు, రచయితలు హెచ్చరిస్తూనే ఉన్నారు. ముస్లింలలో మితవాదులు, ఉదారవాదులే ఎక్కువ. వీరు కోరుకునేదేమిటంటే, మా ఆత్మగౌరవానికి భంగం కలిగించవద్దు. ఈ నేలా - యీ గాలి అందరిది కలిసి జీవించి అనుభవిద్దామనేదే. "హిందుస్తాన్ సబ్ కా నహీ కిసీ ఏక్ కా" (పుట, 2) ఇది సత్యం. ఈ వాక్యం ఒక శాసనంగా, అనుల్లంఘనీయ మహాధర్మంగా మారితే ఎంత బాగుణ్ణు అని అనిపిస్తుంది. గుజరాత్ గాయం మానిపోతుంది! అనే ఆవేదన కలుగకపోదు.

"కవులుగా ముస్లింలకు జరిగినదంతా చూపెడుతున్నామని కాదు. అతివాద, మితవాద, మతవాద రాజకీయాల నుంచి మానవీయత వైపుగా" పయనించాలనే కాంక్ష అన్వర్ మాటల్లో ప్రతిధ్వనిస్తుంది. ఇంచుమించుగా ముస్లింకవులు, రచయితలు ఇదే దిశగా పయనించారనడం వాస్తవమే! అయితే యీ రచయితల భిన్న గళాలలో పలికిన సమైక్యతారాగంలోని ఆరోహణ, అవరోహణలను గుర్తించవలసి వుంది.

స్కైబాబా 'అజా' సంపుటికి వ్రాస్తూ హింసకు గురైన గుజరాత్‌లోని ఒక చిన్న పిల్లవాడి గురించి రాశారు.

(గజరాత్) కాలోల్ తాలుకాలో ఇంతియాజ్ అనే 5ఏళ్ల పిల్లవాడు తన తల్లిని నరికి తగలబెట్టడం చూశాడు. అతని మానసిక పరిస్థితి తలక్రిందు లయింది. కనీసం మరో 20॥ ఏళ్ళ ఆ కుర్రవాడు PTSD(Post Trumatic Strem Disorder) అనే వ్యాధితో బాధపడుతాడని సైన్స్ చెబుతుంది. ఇది ఆయన మాటల సారాంశం. యీ రాజకీయాలపై దూకాలని, కవి కేమిటి, సామాన్యుడికి కూడా వుంటుంది. ఈ క్రమంలోనే 'అజా' కవితా సంపుటిలో కొన్ని ఉదాహరణలు :

గుజరాత్ ఘోరంచూసి కవి మహమూద్ అంటున్నాడిలా :

"నా పరమత సోదరులారా
ఈ దొంగప్రపంచంలో
మరణానికి మరో పేరు ముసల్మాన్" – అని అంటూ
"అల్లాసాక్షిగా జరగాల్సిందంతా జరిగిపోయింది.
రాముడిపేర అయోధ్యలో
బాబ్రీవిధ్వంసం జరిగినా
రాముడిపేరు జపిస్తూ
పదకొండు మానవాకార మృగాలు
పట్టపగలు ఖైరున్నిసా బెహన్ పై
అత్యాచారం జరిపినా
అల్లా చూస్తూనే వున్నాడు"
తొమ్మిది నెలలు
కౌసర్‌బెహన్ గర్భాన్ని చీల్చి
అజాను సైతం వినని
పసిగుడ్డును
ముక్కలు ముక్కలుగా కోసి
ఖబాబ్ ముక్కల్లా మంటల్లో వెదజల్లినా
అల్లా చూస్తూనేవున్నాడు" (మహమూద్ (సం), అన్వర్, 2002, పుట 55)

ఎన్నిఘోరాలు జరిగినా ఏ దేవుడూ ఏమీచేయలేడనే వ్యంగ్యం అల్లా చూస్తూనే ఉన్నాడు.

అనే మాటల్లో సూటిగా వ్యక్తమైంది. ఒకజాతిని ఇంకొక జాతి, ఒక మతస్థుని ఇంకొక మతస్థుడు హింసకు గురిచేసే పైశాచిక ఆనందాన్ని అనుభవిస్తూ, మత దురహంకారంతో జీవిస్తూ వుంటే ఏ మనిషి అయినా, ఇంకెవరైనా ప్రతిచర్యకుగాని రాజకీయ చర్యకు గాని ముందుకురుకుతారు. అందువలన ముస్లిం రచయితలు కూడా తమ కవితల్లో, కథల్లో "రాజకీయాంశాన్ని" కూడా ప్రధానంగా తీసుకున్నారు. అయితే అది నినాద ప్రాయంగా లేదు. కవితాత్మకంగా చిత్రీకరించబడింది. ఈ 'అజా' కవితా సంపుటిలో 'నిసార్' అంటుందిలా

"ఏ రాముడు నడిచిన బాటరాయిది?
ఏ కృష్ణుడు గీసిన గీతరా యిది?
ఒకప్పుడు రాక్షసుల గురించి చదువుకున్నది

ఇప్పుడు నీ రాజ్యంలో చూస్తున్న - దీనికి జవాబు ఏమిటి? (నిసార్, (సం) అన్వర్, 2002, పుట 54) మతదృక్పథంలో సామాజిక న్యాయం జరగదనే నిశ్చయానికి ముస్లిం రచయితల్లో హేతువాదులు నిర్ణయం చేశారు. ముస్లింలపట్ల సమాజంలో ఈ నిశ్చిత అభిప్రాయాలు ఉన్నవని స్మైల్ యీ అజా గ్రంథం పీఠికలో ఉటంకించారు. (స్మైల్, పుట.18)

1. ముస్లింలు ఎప్పుడూ శాంతి కాముకులు కారు.
2. ముస్లింలు రెండేసి, మూడేసి, నాలుగేసి పెళ్ళిళ్లు చేసుకుని పుంజీడు పిల్లల్ని కని దేశం అంతా వారే అయిపోతారు.
3. వీళ్ళకి ప్రత్యేక చట్టాలేమిటి?
4. వీళ్ళకి ప్రత్యేక మైనార్టీ హోదా ఏమిటి?
5. వీళ్లు Main Stream లో కలవరు.

ఈ ముస్లిం వ్యతిరేక రాజకీయ ధోరణికి స్మయిల్ గారు వివరణాత్మక ఖండన చేశారు. అయినా మరలా ముస్లిం వ్యతిరేకంగా ప్రబలిన ప్రచలిత అభిప్రాయాలు అన్నీ ఇంచుమించుగా కాలదోషం పట్టినవి. జీవన పోరాటంతోనే మనిషి అలసిపోతుంటే ఏ మతస్థుడైనా 'శాంతిగీతం' ఆలపించక ఏంచేస్తాడు. ఇంక రెండవ అభిప్రాయం ముస్లింలు నాలుగు పెళ్లిళ్లు చేసుకొని పిల్లల్ని కని భారతదేశాన్ని ముస్లిం దేశంగా మార్చాలని ప్రయత్నిస్తున్నారనే ఆరోపణ. ఇది

హాస్యాస్పదంగా వుంది. కొంతకాలం క్రింద ముస్లింలు పెళ్లిళ్లు రెండు, మూడు చేసుకొనివున్నా, ఈ రెండు, మూడు దశాబ్దాలనుంచి ముస్లింలైతేనేమి, ఎవరైనా ఒక్కపెండ్లి చేసుకోవడమే ఎంతో ఆలస్యంగా జరుగుతున్నది. జీవనభారం పెరిగిపోయి. ఇటువంటి ఆలోచనలు ఏమతస్థుడికీ రావడం లేదు. ఎక్కడో ఒకచోట జరిగితే అది ముస్లిం సమాజం తలకు చుట్టడం భావ్యమైన విషయం కాదు.

ఇంక మూడు, నాలుగు ప్రశ్నలు, ప్రత్యేక చట్టాల గురించి, మైనార్టీ హోదా గురించిన ప్రశ్నలు, ప్రత్యేక చట్టాలు వుంటేనే, మైనార్టీ హోదా వుంటేనే, హరిజనులు, గిరిజనులు, క్రైస్తవులు, ముస్లింల బ్రతుకులు కాలి బుగ్గి అవుతుంటే ఏ చట్టాలు, ఏ హోదాలు లేకపోతే, ఈ బడుగు బలహీన వర్గాల పరిస్థితి ఏమిటి? కన్నీళ్లను దిగమింగుకొని, కడుపులో కాళ్లు పెట్టుకొని, నెత్తిపై చేతులు పెట్టుకొని జీవించ వలసిందే! అందుకు సందేహం లేదు.

ఇకపోతే చివరి ఆరోపణ, ముస్లింల ప్రధాన స్రవంతిలో కలిసి జీవనం సాగించలేరని? ప్రధానస్రవంతి అంటే హిందూ స్రవంతియా? క్రైస్తవ, శిక్కు స్రవంతులా? -ఏమిటి? లౌకికసత్తా వైపు పయనించడం అని అర్థం చెప్పుకొంటే ముస్లింలు ఎప్పుడుకూడా, స్వాతంత్ర్యము వచ్చిన దగ్గరనుంచి గాంధీ, నెహ్రూ, ఇందరాగాంధీల బాటలో నడిచే పార్టీవైపే మొగ్గుచూపారు. తరువాత తమకు న్యాయం జరగటం లేదనే చింతతో ప్రాంతీయ పార్టీలవైపుకి, ఇతర దేశవ్యాప్తంగా ఉన్న పార్టీల వైపుకి మొగ్గుచూపారు. అందువల్లనే ఏకపార్టీ పాలన పోయి బహు పార్టీల పాలన భారతదేశంలో గత రెండు, మూడు ఎన్నికల నుంచి వచ్చిన ఫలితం! మైనారిటీలలో వచ్చిన మార్పుకి కలిగిన రాజకీయ కల్లోలం యిది.

అందువలన ముస్లిం రాజకీయ ధోరణులు ఖచ్చితమైన దిశగానే పయనిస్తున్నాయి. అయితే అన్నిమతాలు, కులాలలో వున్నట్లుగానే విబేధాలు వుండటం వలన ఏకమొత్తంగా ముస్లిం ఓట్లు ఒకే పార్టీకి పడటం లేదు.

ఇటువంటి పరిస్థితుల్లో ముస్లింకవులు, రచయితలు మాత్రం ఇంచు మించుగా రాజకీయ చిత్రాన్ని చిత్రం చేసి, ఒక మంచి రాజకీయ వ్యవస్థ కోసం, లేక ఒక మెరుగైన రాజకీయ ధోరణుల కోసం తమ కలాలను, గళాలను సంధించారనడం నిజం. రాజకీయ వ్యవస్థను ప్రక్షాళనం చేయడం కూడా రచనా ప్రక్రియలో ఒక భాగంగాను, రచయిత / రచయిత్రుల

నైతిక బాధ్యత అని కూడా యీనాడు ముస్లిం రచయితలు గుర్తించారు. రాజకీయ ప్రక్రియ ద్వారా ముస్లింను దువ్విన తీరుని ఎండగడుతూ కవి అన్వర్ ఈ విధంగా అంటున్నాడు.

"రంజాన్ చేసినట్లు బక్రీద్ చేసినట్టు
మనోడు దేశ ప్రథమ పౌరుడైనందుకు
ఖబర్‌స్తాన్‌లల్ల నుంచి కూడా ఈద్‌చేద్దాం" (అన్వర్, 2002, పుట.6)

– ఎంత సునిశిత వ్యంగ్యం. మన మతుస్థుడు దేశాధ్యక్షుడైనందుకు వల్లకాటిలో పండుగచేద్దామనే ధోరణిలో, యిటువంటి చిట్కాలతో మమ్మల్ని మోసం చేయవద్దనే హెచ్చరిక దాగుంది. 'ఖమోష్' కవితలో అబ్బాస్ – గుజరాత్ సంఘటన తర్వాత జరిగిన ఫలితాలను ఇలా కవిత్వీకరించాడు.

"ఎవ రది ఆ దీపం వెలిగిస్తున్నది?
ఆర్పండి ముందు
ఇక్కడంతా నిద్రపోతున్నారు
చప్పుడు చెయ్యకండి" (అబ్బాస్, (సం) 2002, పుట 10)

అలీ " ఈ దేశపు గోడ మీద/ ఉమ్మేసిన పాన్ మరకలా/ నేనిలా (అలి, (సం) స్కైబాబా, 1998, పుట 1) అని అంటూ – ఈ దేశంలో పుట్టిన ముస్లిం పాన్ మరకలా అసహ్యంగా చూడబడుతున్నానని చెప్పడం ఒక దౌర్భాగ్య స్థితి.

సయ్యద్ గఫార్ " అంగట్లో దొరికే కుంకుమ కాదు దేశభక్తి " అనే కవితలో.

" ఈ దేశ పటాన్ని చుట్టచుట్టి నీ తల క్రింద పెట్టుకోవడానికి
అదినీ అయ్య జాగీరు కాదు
అంగట్లో దొరికే కుంకుమకాదు దేశభక్తి
తెగిన దేశసరిహద్దు రేఖని
అతికిన వీరజవానుల్లో మేమూ ఉన్నాం
ఇక ఎవరి దేశభక్తి ఎన్ని పాళ్లో – నిక్కచ్చిగా తేలాలంటున్నాం" (సయ్యద్ గఫార్, (సం) స్కైబాబా, 1998, పుట 5-6)

ఒక ముస్లిం కవి మనోగతములో నుంచి వెలువడిన కవితా వాక్యాలను పరిశీలించవలసిన ఆవశ్యకతవుంది – ఈ దేశం నాది, నీదీ కూడా. ఇది ఎవరి అయ్య జాగీరు కాదు, కుంకుమ బొట్టు పెట్టుకోవడం కాదు దేశభక్తి, వీరజవాన్లుగా ముస్లింలు కూడా వుండి దేశరక్షణలో భాగం పంచుకుంటున్నారు. – మా దేశభక్తి , జాతీయ భావనలు శంకించరానివనే సందేశాన్ని ఇచ్చాడు సయ్యద్ గఫార్ . దేశభక్తి అంటే మాదే నంటున్నాడు!

సికిందర్ కవి “బాబర్‌కే ఔలాద్” కవితలో,

“ సందేహ జీవులకు సలాములు ....
నాతల్లి నరాలలో ఇంకా ఆమోల్ – హెల్మండ్ నదులే ప్రవహిస్తున్నాయా
సింధు కోయిల గానాన్ని గేలిచేసిన వాడా!
నా రక్తంలో గంగాయమున లున్నాయి చూడు
ఎస్కిమోలకే ఐస్‌ని అమ్మే నీ వాద పటిమ కట్టిపెట్టు” ( సికిందర్, పైదే, పుట–7,8)

నా జీవన ధారలో గంగాయమున లున్నాయనడం గొప్పజాతీయ భావనకు నిదర్శనం – ఇంకా సికిందర్ కవి యీ విధంగా అంటున్నాడు.

“ ఈ నేలనేమొలకెత్తి ఒకే పందిరికి తీగలైన వాళ్లం
ఇప్పుడు నా అస్తిత్వం హవాలా సొమ్మయినదంటే ఎలా
నా జాతీయతను నా ‘ పుటక మింగిస్తే
ఇక్కడ నేనెవర్ని? (పుట 8)

ఈ ప్రశ్నకు సమాధానం ఎవరు చెప్పలేరు – జాతీయతను ఎవ్వరూ కించపరచకూడదని మాత్రం విస్మరించరాదు.

గౌస్‌మొహియుద్దీన్ “ఖౌమి” కవితలో

తెల్లతోడేళ్లు కన్న తల్లిని
చెరబట్టి పీక్కుతింటూంటే
ప్రాణాన్ని సైతం ఉచ్చమడుగులోని
బుడగలా భావించి

హైదరాలీనై టిప్పుసుల్తాన్నై
నా సారేజహాసే అచ్ఛాను విడిచిపొమ్మంటే
ఇక సహించను సహించలేను
ఏకంగా నీకుత్తు కను ఖత్నాచేస్తాను" (గౌస్ మొహియుద్దీన్, (సం) స్కైబాబా, 1998, పుట 11)

ఆంగ్లేయుల నెదిరించి  మాతృదేశాభిమానాన్ని చాటుకొన్న హైదరాలీ, టిప్పుసుల్తాన్‌ల దారి నాదారి అంటూ యీ దేశం విడిచిపొమ్మని చెప్పే హక్కు గాని, అధికారంగాని ఎవ్వరికీ లేదని, ఎవరైనా అట్లానన్ను పరాయి వ్యక్తిగా భావిస్తే కుత్తుకల నరుకుతాను అని అనేక కోట్ల ముస్లిం  జనానీకం వాణిని తన వాణిలో వినిపించాడు గౌస్ మొహిద్దీన్ –

కవి దిలావర్ కూడా భారతీయ సాంప్రదాయంలో మమేకమై " అనివార్య హింసావృత్తిలో జీవన పరమార్థాన్ని దర్శించే/ ధర్మవ్యాధుడిగా దర్శనమిచ్చి, తన భారతీయత తిరుగు లేనిదని ధర్మసూత్రనిబద్ధమైన దని చెప్పడం అందరికీ తెలిసిన విషయమే!

హిందూత్వ వాదులపై ముస్లిం చాంధస వాదులు, ముస్లింలపై హిందూత్వ వాదుల దుష్ప్రచారాలన్నీ కేవలం ' భయాల ' వలన ' ఆపోహల ' వలన, అవగాహనారాహిత్యం వలన ఏర్పడినవే ! మచ్చుకి ముస్లింలు పిల్లలను ఎక్కువగాకని భారత దేశాన్ని ముస్లిం దేశంగా మారుస్తారనే ' భయానికి ' సమాధానంగా షెహనాజ్ మరియు ఆజం వ్రాసిన బట్టేభాజ్  కవితలో తీవ్ర స్వరంలో ఉన్న వాక్యాలు

" ప్రతి జననమూ మా రూపాయి మీద గుదిబండ అయినప్పుడు
ఇద్దరు అనే పదం చుట్టూ సైన్స్ వృత్తం గీస్తున్నప్పుడు
అరె బట్టేబాజ్!
నీ కళ్లకు పదిమందిని కనేవాళ్లంగా కనబడ్తున్నాంరా?
దేశాన్ని మా నలుసులతో నింపేవాళ్లంరా మేము?
ఈ వాక్యాలలో కవిత్వంతోపాటు నిజం కూడా వుంది. (షెహనాజ్ & ఆజం, (సం), స్కైబాబా, 1998, పుట, 44)

ఈ విధంగా ముస్లిం కవులు/రచయితలు సందర్భాను సారంగా దేశభక్తి, జాతీయ భావాలను వెల్లడించారు. ఇక్కడ సామాజిక బాధ్యత వుందని కవి తెలియపరుస్తున్నాడు.

జల్‌జలా (విధ్వంసం) కవితా సంపుటికి పీఠిక వ్రాస్తూ ఎం.టి.ఖాన్ గారన్న మాటలు శిరోధార్యాలు ఆయనంటారు. " భారతదేశ ముస్లింలను ఇతర ప్రజల నుండి వేరు చేసే ఒక భిన్నమైన " ఐడింటిటీ " వుందనే ఆలోచన సరి అయినది. కాదు. ఇస్లాంలోని 'ఉమ్మా' అనే భావనను తప్పుడు పద్ధతిలో అన్వయించడం ద్వారా దేశంలోని ముస్లింలను ముస్లిమేతరులను వేరుచేస్తున్నారు. ' ఉమ్మా ' అంటే అర్థం ప్రపంచంలో ముస్లింలు ఎక్కడవున్నా ఇస్లాం వారి మతం అని మాత్రమే ' ( ఖాన్ ఎం.టి, (సం), స్కైబాబా, 1998, పుట 88)

భారతీయ ముస్లింలు భారతీయులే అని మరలా మరలా చెప్పడం అసమంజసమైన విషయం ! బ్రాహ్మణ భావజాలం గురించి ప్రముఖ మేధావి కె. బాలగోపాల్ జల్‌జలా కవితా సంపుటికి లోతయిన పీఠిక వ్రాస్తూ యీ విధంగా అన్నారు. "బ్రాహ్మణీయ దృకృథంలో హెచ్చు తగ్గుల సంకుచిత్వమేకాక ప్రాదేశిక సంకుచిత్వం కూడ బలంగా వుంది. హిందువులుగా పుట్టి పెరిగిన వాళ్లకు తమలో ఈ దృష్టిలోపం ఉందని గ్రహించడం సహితం కష్టం హిందువుల మానసిక దృష్టిచుట్టూ కొన్ని గోడలుంటాయి. ఆ గోడలను దాటి ఆలోచించడం, సహానుభూతితో స్పందించడం హిందువులకు సహజంగా రాదు.... ఇస్లామిక్ సంస్కృతి దీనికి పూర్తిగా అతీతమని నా ఉద్దేశ్యంకాదు." ( బాలగోపాల్ .కె, (సం), స్కైబాబా, 1998, పుట 95)

ఈ పై వాక్యాలను వివరించవలసిన పని లేనంత స్పష్టంగా ఎటువైపు మొగ్గుచూపని పరిశోధనాత్మక భావజాలంగా వుంది. కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు రాజకీయాలకు దూరంగా వుండాలని, ఇటువంటి మేధోవర్గం రాజకీయాల్లోకి జొరపడితే వారి సృజనాత్మక కార్యక్రమాలు సరిగ్గా మనుగడ సాగించలేవనే ఒక వాదన ఉంది. కళ కళకోసమే, కళ సమాజం కొరకే అనే వాదనలు కూడా దశాబ్దాలనుంచి తెలుగు సాహిత్యరంగంలో ముమ్మరంగా రాజ్యమేలాయి.

ఈ చర్చ పురాతనమైనా, మరలా దీనిని పునః పరిశీలించ వలసిన ఆవశ్యకత కొంతలో కొంతవుంది. కళ సృజించేటప్పుడు కళాకారుని వ్యక్తి గతమై, సృజనాత్మక కార్యక్రమం రూపుదిద్దుకొన్న తరువాత అది సమాజగతం ఔతుంది.

సమాజగతం అయిన సాహిత్యంకాని, మరే ఇతర కళగాని వస్తురీత్యా కేవలం వైయక్తిక భావనలను వెలువరించకుండా సమాజ రుగ్మతలను, సమాజంలో జరిగే అన్యాయాలను, అక్రమాలను, దోపిడీలను, అట్టఅడగున 'ఆకలితో' మగ్గుతున్న అసంఖ్యాక బలహీన వర్గాల అధోజగత్తును గురించి తమ భావజాలం వెలువడినట్లయితే, సమాజానికి ఒక అట్ట అడుగున, కడుపు కాలుతున్న వ్యక్తుల చిధ్ర జీవితాలు వెలుగులోకి వస్తాయని, ఆ విధంగా రావాలని ప్రగతిశీల ఆలోచనా పరుల ఆలోచనా విధానం. అది ఎంతో సమంజసంగా సహేతుకంగా కూడా వుంది. ఇటువంటి స్థితిలో కవిగాని రచయిత గాని రాజకీయ వ్యవస్థ గురించి రాయకుండా, దానిలోని మంచి చెడులను విశ్లేషించ కుండా వుండలేడు. తనకెదురుగా జరిగే అక్రమాలకు, దోపిడీలకు ప్రతి స్పందించడము హృదయము ఉన్నవాని లక్షణము. అందువలన కవులు/ రచయితలు రాజీకీయ వ్యవస్థపై విల్లును ఎక్కుపెడతారు. ముస్లిం కవులు రచయితలు మినహాయింపుకాదు.

ఇక్కడ ఒకచిన్న సందేహం రావచ్చు, వైయక్తిక భావజాలంతో వ్రాసిన కవితలు, కథలు, ఇంకా అనేక విధాలైన కళాకృతులు సమాజానికి పనికిరావా? అనేది! వైయక్తిక భావజాలంతో వ్రాసిన కళాకృతులలోని, రచనలోని సాహిత్యపు విలువల దృష్ట్యా, వైయక్తిక అంశాలను సాధారణీకరణ చేయడం ద్వారా యిలాంటి రచనలు వగైరా సమాజానికి ఉపయోగపడతాయి. ఏదైనా రసానుభూతిని కలిగించి ఆలోచింపజేయడమే రచన యొక్క పరమావధి! అయితే సామాజిక బాధ్యత నుంచి కవిగాని రచయిత తపప్పుకొనే తత్వం క్షమించరానిది. ఇటువంటి సామాజిక బాధ్యతను ముస్లిం కవులు/రచయితలు చక్కగా నిర్వర్తించారనడం సమంజసమూ, సహేతుకం కూడా!

ముస్లిం రచయితలు / కవులు అనేక మంది సామాజిక దృక్పథంతో, సమకాలీన ముస్లిం జనుల బాధలను / కన్నీళ్లను కడగండ్లను అక్షరీకరించడంలో గొప్ప సఫలతను సాధించారనడం అతిశయోక్తికాదు. ఒక గొప్ప వాస్తవం కూడా! అసలు యీ పేదవర్గాలు ఈ విధంగా జీవితంలో వెనుకబడి పోవడానికి ప్రధాన కారణాలలో రాజకీయ వ్యవస్థకూడా ఒకటి.

ముస్లిం కవులు / రచయితలు ఎక్కువ మంది పేద, మధ్య తరగతి వర్గాల నుంచి వచ్చినవారే! ఇటువంటి పరిస్థితుల్లో వారు సహజంగా మార్క్సిజం వైపుకు మరలవలసిన ఆవశ్యకత

వుంది. అయితే ముస్లిం కవులు / రచయిత్రులు ఎక్కువభాగం మార్క్సిజం వైపుకు వెళ్లకపోవడం, దళితవాదంవైపుకి రావడం ఒకింత హర్షించదగిన పరిణామం. ఈ విధంగా మార్క్సిజంవైపుకి మొగ్గు చూపక పోవడానికి ప్రధాన కారణం, ఈ సిద్ధాంత ధోరణి కులవ్యవస్థను వ్యతిరేకించక పోవడం అనేది నిర్వివాదాంశం. అందువలన ముస్లిం కవులు / రచయితలు మేమూ దళితులమే ననే భావనను స్థిరీకరించుకొన్నారు.

సామాజిక పరిణామంలో ఎంతో ఉన్నతంగా ఆలోచించే మేధోజీవులైన కవులు/ కళాకారులు, ఇంకా ఎన్నో వర్గాలు నెత్తికెత్తుకున్న మార్క్సిజం-లెనినిజం- మావోయిజం, గోర్బచేవ్ ఫెరొస్త్రోయికా లాంటి మార్పులవలన రష్యా పతానాంతరం చీలిపోయిన తరువాత ఆంధ్రదేశపు రచయితల్లోనే కాకుండా, భారతదేశ రచయితలలో ఆలోచన పరుల్లో పెనుమార్పు వచ్చింది.

ఈ మార్పువలన మనిషిలోనూ, మానవసమూహంలోనూ మానవీయ గుణాల గురించి, మానవ సంబంధాల గురించి చర్చ విపరీతంగా సాగి, అలాంటి రచనలే ఎక్కువగా, ప్రామాణికంగా జీవితానికి, జీవనానికి, హృదయానికి, మేథకు సంబంధించిన రచనలు వెలువడి, మనిషియొక్క హృదయతత్వానికి ప్రాముఖ్యత పెరిగింది.

డా॥అంబేద్కర్ లాంటి మహామేధావి మాటలను కొంత మార్చి ఏ మార్చి ఆయనను ముస్లిం వ్యతిరేకిగా చిత్రీకరించడం ఒక గొప్పరాజకీయ పన్నుగడ. ఆయన హిందూ క్రైస్తవ, ముస్లిం మతాల లోని లోటుపాట్లను ఎత్తి చూపి, అవి చేసిన ఘర్షణల వలన మిగతా సభ్యప్రపంచానికి, ముఖ్యంగా బౌద్ధానికి జరిగిన చెడుగు దృష్ట్యా విమర్శించి ఉండవచ్చును. అది ప్రత్యేకించి ముస్లింలను ద్వేషించడంకాదు. ఇస్లాంను వ్యతిరేకించడం కాదు. మతానికన్నా ముందు మనిషిని ప్రేమించే తత్వమున్న డా॥ అంబేద్కర్ మతాలన్నిటిలో బౌద్ధం గొప్పదని, మానవాళికి శ్రేయం కూర్చడానికి అనువైనదని, హిందూత్వాన్ని గట్టిగా వ్యతిరేకించగలిగిన సత్తాకలిగినదని నిరూపించారు, ఆచరించారు. లక్షలాది దళితులను బౌద్ధంలోకి మార్చారు. ఈ క్రమంలో ఇస్లాం మత ద్వేషిగా, హిందూత్వ వాదులు పేర్కోనడం వర్గాల మధ్య చిచ్చు పెట్టడానికి, రాజకీయలబ్ది కోసమనే భావించాలి.

ఇందుకు డా॥ఆనంద్ తేల్‌తుంబ్డే ముస్లింలు - అంబేద్కర్ గ్రంథంలో (అనువాదం - చంద్రిక) ఈ విధమైన వివరణ వుంది. “అంబేద్కర్ కు చాలా ప్రీతి పాత్రమైన బౌద్ధంపై ముస్లిం

దండయాత్రల దాడికి సంబంధించిన అంశాలను వివరించేటప్పుడు కూడా ఆయన ఎక్కడా స్పష్టంగా కూడా ముస్లిం వ్యతిరేకత ప్రదర్శించలేదు, చేస్తేగిస్తే ఇంకా ఆయన బ్రాహ్మణ్యాన్ని వ్యతిరేకించారు. ఎందుకంటే బౌద్ధానికి ముస్లిం దండయాత్రికులు చేసిన చెడుపు కన్నా బ్రాహ్మణ్యం చేసినదే తీవ్రమైనది. పైగా వీటిని ఆయన అసలు దండయాత్రలు గా పరిగణించటానికే ఇష్టపడక పోవటాన్ని గుర్తించక తప్పదు" (ఆనంద్ తేల్‌తుంబ్డే, 2003, పుట 39) మనిషిని, మానవత్వాన్ని ప్రేమించే డా॥ అంబేద్కర్ సందర్భానుసారంగా చెప్పిన మాటలను, అక్కడి వరకే పరిమితం చేయాలిగాని, వ్యాప్తం చేయకూడదు.

ఇప్పటి ముస్లిం కవులు, రచయితలు తమరచనల్లో, ప్రసంగాల్లో , ఆచరణలో మేము కూడా దళితులమని పేర్కొనడం హర్షించదగిన విషయం . కులహీనుడి కన్నా గుణహీనుడే తక్కువ జాతి వాడని ప్రచారం చేయవలసిన ఆవశ్యకత ఎంతోవుంది. సమ్యక్‌దృష్టి లేనప్పుడు మనిషి ఆలోచనా జీవిగా గుర్తించబడడు.

ఇక్కడ పేర్కొనవలసిన అంశం మరొకటి వుంది. అంబేద్కర్ "హిందూ రాజకీయమనేది అస్తిత్వంలోకి వస్తే ఈదేశానికి ఖచ్చితంగా అదో పెద్ద విపత్తుగా తయారవుతుంది. హిందువులు ఎన్నిమాటలు చెప్పినా , హిందూ యాజమాన్యం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్యాలకు పెద్ద గొడ్డలి పెట్టు. ప్రజాస్వామ్యానికి హిందూయిజానికి అస్సలు పొసగదు.కాబట్టి ఎట్టి పరిస్థితులోనైనా సరే హిందూ రాజ్యాన్ని ఏర్పడకుండా చూడల్సిందే (డా. అంబేద్కర్, 1994, పుట 35) ఇదే భావాన్ని ముస్లిం రచయితలు ఎన్నో చోట్ల తమ కవితల్లో కథల్లో వ్యక్తీకరించడం గమనించవలసిన ప్రధానాంశం.

హిందూత్వ రాజకీయ ధోరణుల్ని వ్యతిరేకించడంలో, నిరసన తెలపడంలో, ఖండించడంలో ముస్లిం కవులదీ, రచయితలదీ ఒకే బాటని పూర్వ అధ్యాయాలలో ఇచ్చిన ఉదాహరణల వలన తేటతెల్లమౌతుంది. ముస్లిం రచయితల ఆలోచనా విధానం, రాజకీయ ధోరణులన్నీ హిందూత్వ విషయంలో ఏక కంఠంతో నినదించాయనడం ఎంతోవాస్తవం.

## VII.1. ముస్లిం రచయితలు – జాతీయ భావనలు

ముస్లింలు, ముస్లిం కవులు – రచయితలు జాతీయాభి మానంలేని వారని, వారికి దేశభక్తి లేదని, వాళ్ల చూపు అంతా ముస్లిం దేశాలవైపే వుంటుందని, భారత దేశాన్ని ముస్లిం

రాజ్యంగా మార్చడానికి పిల్లలను అసంఖ్యాకంగా పుట్టిస్తున్నారనే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అందువలన ముస్లిం కవులు / రచయితల గాఢ జాతీయ భావనలను కొన్ని పరిచయం చేయడం అవసరమైయున్నది.

ముస్లింలు భారతస్వాతంత్ర్యోద్యమాలలో ముఖ్యపాత్ర వహించారు. ఖిలాపత్ ఉద్యమం, ఫకీర్ల తిరుగుబాటు, వహాబీల పోరాటం, ఫరాజీల ఉద్యమం, మోప్లాల తిరుగుబాటు, ఖుదాయే-ఖిద్మత్‌గార్ల అహింసా ఉద్యమం లాంటివి ఎన్నదగినవి. ముస్లింలు మాతృదేశ విముక్తిలో తోడ్పడ్డారని, తమ ధన,మాన ప్రాణాలను వెచ్చించారని చెప్పడం ఒక సత్యం. దీనికి The Communal triangle in India అనే గ్రంథం లోని వాక్యాలు ఊతమిస్తున్నవి. ఆ గ్రంథంలో " Even in the case of Mutiny Sir John Kaye tells us that undoubtedly the prime movers in the rebellion of 1857 and those who most zealously formed its spark into flames, were undoubatedly WAHABIS" (Ashok Mehata and Achya Patwardhan, 1942, p.96)

ముస్లిం రచయితలు హిందూత్వం భావనను వ్యతిరేకిస్తున్నారు గాని హిందూదేశాన్ని లేక భారత దేశాన్ని వ్యతిరేకించడం లేదు. అనాదిగా ఇది హిందూ దేశం - భవిష్యత్తులో కూడా ఈ దేశ మనుగడ యీ విధంగానే వుంటుంది. ఎంత జనాభా పెరిగినా భారత దేశాన్ని, ముస్లిం దేశంగానో, క్రైస్తవ దేశంగానో మార్చే శక్తి ఏమతానికి గాని, పార్టీకిగాని వుండబోదు - ఒక వేళ అటువంటి ప్రయత్నాలు జరిగినా అవిఫలించేవి గావు - హిందూదేశం ముస్లిం దేశంగా మారిపోతుందనే " భయాన్ని" కలిగించడంలో కమలం పార్టీ విజయం సాధించింది. అందువల్లనే ఘర్షణలు మితి మీరుతున్నవి - మతాల మధ్య!

అయితే ముస్లిం రచయితల మాటలను ఆలకిస్తే అవి ఈ రీతి - రివాజులో ఉన్నవి. అందుకుముందుగా స్వామి వివేకానందుడు, ఇస్లాం మతం గురించి చెప్పిన మాటలు పరిశీలించవలసిన ఆవశ్యకత వుంది. వాస్తవికంగా నిత్యజీవన విధానంలో ఏ మాత్రం ప్రశంసనీయమైన స్థాయిలో నైనా సమానత్వాన్ని ఏ మతమైనా పాటిస్తోందంటే అది ఇస్లాం. కేవలం ఇస్లాం మాత్రమే. అని అనడం ఎంతో గభీరంగా ఆలోచించవలసిన విషయం - హిందూసిద్ధాంతకర్త నుంచి వచ్చిన యీ భావాలను పరిగణనలోకి తీసుకున్నా హిందూ - ముస్లిం మధ్య సామరస్య పూర్వక వాతావరణ ముండేది.

పెరియార్ అన్న మాటలు ఆలోచనీయాలు "ఇస్లాం హింసాత్మక ధోరణులను ప్రేరేపిస్తుందన్నమాట నిజమైతే అందులో చేరిన వాళ్లు కనీసం ఇక ముందైనా బానిసల్లా ప్రవర్తించకుండా వుంటారుకదా? అంతేకాదు ఇతర్లు ఇస్లాం హింసాత్మక స్వభావాన్ని చూసి భయంతోనైనా వాళ్లతో గౌరవంగా వ్యవహరిస్తారుకదా? ( పెరియార్, 2005, పుట 11)

ఏతావాతా తేలేదేమిటంటే క్రమశిక్షణా యుతమైన మతం నుంచి వచ్చిన ముస్లిం రచయితలు దేశాభిమానాన్ని జాతీయతను చూడడంలోనూ, ప్రగతిశీల భావవాదులుగా మారడంలోనూ ఒక క్రమం, నమ్రత దాగివుంటాయి – చిన్నప్పటి నుంచి సహజాతాలు మత భావాలతో పెనవేసుకొని పోవడం ప్రధాన కారణం ఔతున్నది.

సుప్రసిద్ధ కవితా సంపుటి అజాలో సయ్యద్ గఫాల్ కవిత అమ్మా...... నేనే..... నీలో యీ విధంగా అంటాడు...

" ఎన్ని దఫాలైనా<br>
ఈ నేల పైనే పుట్టి...... దోగాడాలని<br>
ఆశగా వుందే అమ్మా.... (సయ్యద్ గఫార్, 2002, పుట 89)<br>
ఈ నేలపైన ప్రేమ యీ వాక్యాల్లో కన్పిస్తుంది.

ఏమాత్రం ద్వేషం కనపడని కవితలో మెహమూద్ అంటాడిలా "ఉగ్రవాదం కాదురాగెలిచేది ఉదారవాదం మతతత్వం కాదురా మిగిలేది.... మానవత్వం అని ప్రభోదిస్తూ.. "మా పరివార్ ' నీ 'పరివార్' ని దీవిస్తున్నది... జీవించదని అని అంటాడు కవి – తనపై విషాన్ని చిమ్మిన వారికి అమృతాన్ని పంచుతానంటాడు –అన్ని మతాల సారం – అందరూ ఒక్కటే అనే భావన – జాతీయ భావనలకు దగ్గరగా వుండేది.

యాకూబ్ పౌరసత్వంపై మచ్చ అనే కవితలో అంటాడిలా...

" ఈ మట్టి నీది మాత్రమే కాదు నాది " అని సగర్వంగా చెబుతాడు. ఇంకా " నేనో ముస్లింనని, నేనోహిందువునని, నేనోక్రిష్టియన్‌ను తరచితరచి ఇంకా అందని స్వేచ్ఛమధ్య వెదుకులాడుకునే సన్నివేశంలోకి తోసేస్తున్నారెందుకు, నేను ఒక మనిషిని అని గర్వ పడేందుకు మన పిల్లలకోసం ఒక విశాల విశ్వం ఎదురు చూస్తూ వుంది" (యాకూబ్, (సం), అన్వర్ 2002, పుట 77)

మనందరి జాతీయత ఒకటేనని, మన పిల్లలకోసం మత విశ్వాసాలు అడ్డులేని ఒక విశాలవిశ్వం కావాలని ఆశిస్తాడు. " మాట్లాడేగాయం" కవితలో ఎం.డి.యాకూబ్ పాషా వాక్యాలు స్మరణీయాలు.

" ప్రతి ప్రశ్న శూలంలా వెంటాడుతుంది.
ప్రతి ప్రశ్న కరువులా వేధిస్తుంది.
సబర్మతి.... ఇంకేది మాగతి - (పుట 70)

రామానామంతో దేశం కోసం జీవితార్పణ చేసిన గాంధీజీని ఒక ముస్లిం కవి ప్రశ్నించడంలో మనోవిస్తృతి కనిపిస్తుంది. వర్ణాశ్రమ ధర్మాన్ని. హిందూమత దృక్పథాన్ని బలపరచడం వలన గాంధీజీలో సమైక్య దృష్టి కొంత తగ్గిందనే వాదన ఇప్పుడు అందరిలో కనిపిస్తుంది. గాంధీ 'హేరామ్' అన్నా! కమలం హేరామ్ అన్న ఒకటే లక్ష్యాన్ని సూచిస్తున్నాయని మైనారిటీ వర్గాల విశ్వాసంగా కనిపిస్తుంది.

జనాజ్ కవితతో మోహమూద్ అంటాడిలా.

"మతం ' డోలా'లో
జీవం కోల్పోయిన దేహాల మీద
సంఘీభావపు పూలగుచ్ఛం పెట్టండి
'కఫన్ ' కప్పబడిన సెక్యులరిజం జనాజాకు
మీ భుజం ఖాళీవుంటే పట్టండి" (మొహమూద్, పైదే, పుట 60)

మమ్మల్ని హింసించినా, చంపినా " సంఘీభావం" చూపండి సెక్యులరిజాన్ని సమాధి పెట్టెను మీ భుజంతో మోయండి - అనడంలో బాధ్యతగా సెక్యులరిజాన్ని రక్షిద్దామనే సందేశం ఈ దేశంలో మనందరిదీ అనే మైత్రీభావన, మన జాతీయత ఒకటేనని గుర్తుచేయడం సూచ్యమైంది. యీ కవితా వాక్యాల్లో. "వాడే మైనార్టీ " కవితలో బాషా అంటాడీ విధంగా "ఈ దేశంలో మనం మనలాంటి వాళ్ళు బతకాలంటే పోరాడక తప్పదు. (బాషా, పుట-56) ఈ దేశంలో బలహీనులు, సంఖ్యా బలంలేని వాళ్లు ఒక లౌకికతత్వంతో సమైక్యతతో పోరాడక తప్పదనే సంకేతం ఇస్తున్నాడుకవి. మార్కిస్టుల పోరాడటానికి ఆత్మ గౌరవం కొరకు పోరాడే మైనారిటీ బలహీన వర్గాలకు చాలా తేడా వుంది.

స్కైబాబా యీ కవితా సంపుటికి పీఠిక వ్రాస్తూ అంటాడిలా – " మనది లౌకిక దేశమనే ముస్లింలు ఇంకానమ్ముతున్నారు. తమకు అన్యాయం జరిగితే మాట్లాడే వాళ్లున్నారనే వాళ్లింకా నమ్ముతున్నారు. (స్కైబాబా, 2002, పుట 5) ఈ మాటలు చాలు ఎక్కువశాతం ముస్లింల మనోభావాలు దేశానికి, జాతీయతకు విరుద్ధమైనవి కావని తెలిపేందుకు! ఎక్కడైనా ఘర్షణలు జరిగినప్పుడే తాత్కాలికంగా భావోద్వేగాలు చెలరేగినా యీ దేశం నాది అని భావిస్తూ జాతీయ జెండాకు నమస్కరించడానికి సరియైన ముస్లిం వెనుకంజ వేయడనే సత్యాన్ని అందరూ అంగీకరించవలసిందే!

ఆటవిక దశనుంచి మానవుడు ఆహారం వెదకటం కోసమూ, క్రూర జంతువుల నుంచి రక్షణ కోసమో రాతి ఆయుధాలనో, ఇనుప ఆయుధాలనో ధరించి, మాంస భక్షణ కొరకు, ప్రాణ రక్షణ కొరకు ప్రయత్నించేవాడు, ఈనాడు వాటి అవసరం లేదు. అంతకన్నా అత్యంత ఆధునిక ఆయుధాల అవసరం మనిషికిలేదు. ఎందువల్లనంటే మనిషి నాగరీకుడైనాడు, సంస్కృతీపరుడైనాడు, పౌరుడైనాడు. అయితే మనిషిలో పూర్వపు ఆటవిక లక్షణాలు మాయంకావడంలేదు. గుజరాత్‌లో గాని బొంబాయిలో గానీ, హైదరాబాద్‌లోగాని, బెంగుళూర్‌లో గాని, జరిగే సంఘటనలు, అమానుష దాడుల పరంపరల పర్యవసానాన్ని అవలోకిస్తే యీ విషయం తేటతెల్లమౌతుంది. బలహీనుడిపై బలవంతుని అధికారం సాగుతుందని, మైనారిటీ ప్రజలపై మెజారిటీ ప్రజలు దౌష్ట్యం కొనసాగుతుందని, ఏ మాత్రం స్వల్ప ఇంగితమున్నా అర్థమైపోతుంది– ఇటువంటి పరిస్థితుల్లో, మనకు బాణాలుదాల్చిన వాళ్లు, చక్రాలు, త్రిశూలాలు గదలు ధరించిన ప్రతీకలతో, అవసరముందా? అని ప్రశ్నించుకుంటే అవసరంలేదనే జవాబు మాత్రం వస్తుంది.

ముల్కిసాహిత్య సంపుటికి ముందు పేర్కొన్న ముస్లిం కవి, కవితా వాక్యాలు పరిశీలిస్తే హిందూ – ముస్లిం మధ్యవున్న వైరుధ్యం అర్థమౌతుంది.

" రామ బాణంతో వాళ్ళు
విష్ణుచక్రంతో
కృష్ణచక్రంతో వాళ్లు
శివుని త్రిశూలంతో వాళ్లు

హనుమంతునీ గదతో వాళ్లు

అయ్ అల్లా హ్

ఈ చేతులు వట్టిదువాకేనా?" (స్కైబాబా, ముల్కి ముస్లిం సాహిత్య ప్రత్యేక సంచిక, 2003-04, పుట)

ఈ ప్రతీకల గురించి చెప్పిన తరువాత నేనేమీ చేయలేనా? " నా ప్రార్ధనచాలు' అనే సంయమన పూర్వక స్వరం ఇక్కడ కనిపిస్తుంది. ఈ సాహిత్య సంకలనంలో ఇంకా కొందరి రచయితల జాతీయ భావనను గురించి ప్రస్తావించబడినది.

'ఖబూతరా' కథలో షేక్ పులివీడు గఫార్ ఎంతో మైత్రిగా హిందూ ముస్లిం కుటుంబాల మధ్య డిశంబరు ఆరు సంఘటన ఏ విధంగా చిచ్చుపెట్టిందో దశాబ్దాల కాలం ప్రేమ, మమత పంచుకున్న ముస్లిం కుటుంబాలు విడిపోవడం –శాంతి సంకేతాలయిన పావురాలు (ఖబూతరాలు) రక్తం చింది చచ్చిపడిపోవడం పిల్లపావురాలు భయంకరంగా రోదించడము, శాంతి సమసిపోయిందనే ధ్వని వ్యక్తమై ఇటువంటి పరిస్థితులు రాకుండా హిందూ – ముస్లిం పౌరజీవనం సామరస్యంగా సాగాలనే సంకేతం, జాతీయ దృక్పధానికి దగ్గరగా వుంది.

కీ.కే. మద్దూరి నగేష్‌బాబు 'ముల్కి' ముస్లిం సాహిత్య సంకలనంలో " హిందువులమని చెప్తున్నవాళ్లు అస్సలు ఈదేశస్థులే కారు. వాళ్లు జర్మన్లు – ముస్లింలే అసలు భారతీయులు" అంటాడు. (నగేష్‌బాబు మద్దూరు, (సం) ఎల్లయ్య వేముల, 2005 పుట 43) ఈ కోణం నుంచి చూస్తే అంతా ఉల్టా సీదా అవుతుంది.

హెచ్చార్కె 'ముల్కి' గ్రంధానికి పీఠిక వ్రాస్తూ ఈ విధంగా అన్నారు. " ఇన్నాళ్లూ అగ్రవర్ణుల దృక్కోణంలోంచి ప్రపంచాన్ని చూశారు. ఇన్నాళ్ల ఆలోచనలకు కేంద్రం అగ్రవర్ణులే? దీన్ని డీ సెంటర్ చేసి.... కేంద్రాన్ని మార్చి.. యిప్పుడే దళితులు దృక్కోణం లోంచి చూస్తాం అన్నారు. దళితవాదులు. ఆ పని చేసేసరికి యిన్నాళ్లు న్యాయం అనుకున్న పలు అంశాలు అన్యాయాలుగా అన్యాయం అనుకున్నవి న్యాయాలుగా కనిపించడం మెదలుపెట్టాయి. (హెచ్చార్కె, (సం), ఎల్లయ్య వేముల, 2005, పుట 44) ఇక్కడ దళితులు అన్న పదం క్రింద " ముస్లింలు " అని చెప్పుకుంటే ఆయన వాదం సమంజసం అనిపిస్తుంది. ఎందుకంటే ఈ దేశంలో ముస్లింలు, క్రైస్తవులు అందరూ నిరుపేద దళితులే కనుక.

ప్రముఖ పాత్రికేయులు కె.శ్రీనివాస్ గారు "ముస్లిములను విజాతీయులుగా , విదేశీ ఏజెంట్లుగా దేశ విచ్ఛిన్నకులుగా హింసా రాధకులుగా చిత్రంచడము హిందూత్వ ఫాసిస్టు శక్తులు పని గట్టుకొని చేస్తూ వచ్చారు. స్వాతంత్ర్యానంతరము కూడా ఒక పరంపరగా సాగుతూ వస్తున్న హింసాకాండలో అత్యధికంగా బాధితులైన ముస్లింలలో కూడా ప్రతి ఘటనా తత్వం పెరుగుతూ వస్తున్నది.... (శ్రీనివాస్ .కె, (సం), ఎల్లయ్య వేముల, 2005, పుట 48)

జె.సుభద్ర ఈ విధంగా అన్నారు. " హిందూ వాదులు, వాళ్ల సంస్థలు ముస్లింలను వేరే మతంగా కాకుండా వేరేజాతిగా చూసే క్రమాన్ని వెదజల్లుతున్నారు. దీన్ని దెబ్బ కొట్టేందుకు భారత ముస్లింల యీ దేశకుల వ్యవస్థను దిక్కరించి ' ముస్లింలుగా స్థిరపడ్డ దళితులనే తాత్విక వాస్తవాన్ని ఎక్కుపెడుతూ ఆ పునాదుల తాత్వికతను ప్రశ్నించేదిశగా ఎదగాలిసిన అవసరముంది" (సుభద్ర జె, పైదే, పుట 53).

ఇటువంటి భావజాలం వ్యాప్తి అవుతున్న దశలో, ఏదిశగా పయినించాలో సుభద్ర గారు సూచించడం సమంజసంగా వుంది. ముస్లింలో ఎక్కువ భాగం సరిహద్దు గాంధీగా ప్రసిద్ధుడైన, ఖాన్ అబ్దుల్ గఫార్ఖాన్ అహింసా మార్గాన్ని అనుసరిస్తారు.

ముస్లిం / కవులు / రచయితల జాతీయ భావనలు ప్రశ్నించ వీలులేనివి – అదేవిధంగా ముస్లిం మతస్తులే గాని, వారంతా భారతజాతి బిడ్డలే! సమగ్రతాత్విక, ఆర్థిక, సాంస్కృతిక భారత్ పురోభివృద్ధిలో ముస్లింలు అందరి మాదిరిగా భాగస్వామ్యులే! ఇది కాదనలేని సత్యం.

వైదిక సాంప్రదాయంలో, హిందూధర్మ శాస్త్రాలలో దర్శనాలలో " నిర్గుణతత్వం' అనేది అస్తిత్వం కలిగి వుందని అందరికీ తెలిసిందే! బౌద్ధం ' శూన్యత' ను బోధిస్తుంది. అదీ ' నిర్గుణతత్వమే! ఇస్లాం బోధించేది కూడా నిర్గుణ తత్వమే ఈ దిశగా, ఈదృక్కోణం నుంచి చూసిన మతాల మూలాలు ఇంచుమించుగా ఒక్కటి గానే భాసిస్తాయి.

సమాజంలో , మతాల ప్రభావం తగ్గి పోయినప్పుడు మహా మానవతా వాదంతో సమాజం లోని వర్గాలను, వర్ణాలను సమీక్షించినప్పుడు, అన్ని మతాలలో , మనుష్యుల్లో మానవీయ గుణాలు వ్యక్తమౌతాయి. ఇది ఒక ఆదర్శం మాత్రమే.

ముస్లిం కవులు/రచయితలు, తెలుగు భాషకు, తెలుగు సంస్కృతికి, తెలుగు సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయాలు అభ్యుదయ వాదులు, మీడియా ఇతర రచయితలు వారి కృషిని సముచిత రీతిలో సమాజానికి తెలియజేప్పాల్సిన అవసరం ఇవాళ ఏర్పడి ఉంది. అందువల్ల మెజారిటీ ప్రజలలో ముస్లింలపై ఏవైనా అపోహలు ఉంటే అవి దూరమౌతాయి. ఈ మార్గంలో ముస్లిం రచయితలు, మేధావులు, ఎప్పుడో తమ కృషిని ప్రారంభించారు. ఇక మిగిలి ఉన్నది మెజారిటీ వర్గ మేధావుల కృషే. అయినా ఖలీల్ గిబ్రాన్ లేని ప్రపంచ సాహిత్యాన్ని, తాజ్‌మహల్ లేని భారతదేశాన్ని ఊహించగలమా ! అవి కేవలం ముస్లింలకు మాత్రమే సంబంధించినవని అనగలమా !

# ముగింపు

ముస్లిం రచయితల సాహితీ సృజన, సంప్రదాయ సాహిత్యంతో ప్రారంభమయి నేటి ఆధునిక సాహిత్యం వరకు అవిరామంగా సాగిపోతుంది. అందులో ఎటువంటి సందేహం లేదు. నేను ఈ పిహెచ్‌డి పరిశోధనకు పూనుకుంటున్నప్పుడు నాకు ముస్లిం సాహిత్యంతో పెద్ద పరిచయం లేదు. వారికి ఏదో అన్యాయం జరుగుతుందనే స్వల్ప అవగాహన తప్ప. పరిశోధన మొదలు పెట్టిన తరువాత డా॥ షేక్ మస్తాన్‌గారి పరిశోధన గ్రంథం “తెలుగు సాహిత్యం ముస్లింల సేవ” చదవటం తటస్తించింది. వారిని అనుసరించి దొరికినంతమేర సంప్రదాయ ముస్లిం రచయితల రచనలు సేకరించి చదవడం జరిగింది. ఈ పరిశీలనలో బయల్పడిన అంశం ఏమిటంటే ఆనాటి ముస్లింలకు మెజారిటీ వర్గమైన హిందూవులపై ఎటువంటి వ్యతిరేకత భావం లేకపోవడం. పైపెచ్చు వారు హిందుత్వంతో మమేకమై అనసూయ దేవి, మహభారత కౌరవరంగంవంటి గ్రంథాలు రచించడం ఇంకొందరు ఇంకో అడుగు ముందుకేసి అక్బర్‌ని బాల కృష్ణునితో పోల్చడం వంటివి చేసారు. ఇది అప్పటి దశ.

ఈ సంప్రదాయ సాహిత్యాన్ని దాటి ఆధునిక సాహిత్యంలోకి వచ్చేసరికి ముస్లిం రచయితల రచనల్లోని వస్తువు మారిపోయి ఉంది. వారు ఈ దేశానికి చెందినవారై కూడా మేము కూడా భారతీయులమని గొంతు చించుకొని అరవాల్సిన దుర్గతి ఏర్పడింది. మేము నవాబులం కాదు పేదలమని చెప్పుకోవలసిన అవసరం ఏర్పడింది.

ఆశ్చర్యకరమైన ఈ మార్పు ఎలా సంభవించింది. ఈ సంస్కృతిలో, సమాజంలో భాగంగా కలిసిపోయినా, తమకో ప్రత్యేకమైన ఉనికేది లేదనుకున్న ముస్లింలు ఇప్పుడు మైనారిటీ వర్గమై ఎందుకు నినదిస్తున్నారు. కాలానుగుణంగా నాగరికత, సంస్కృతి అభివృద్ధి చెందాలికాని తిరోగమించటం ఏమిటనే ప్రశ్నలు నాముందు నిలిచాయి.

ఈ ప్రశ్నలకు సమాధానాలను వెతుకుతూ, నేను అనేక కథలను, కవితలను చదివాను. ముస్లింలపై అంబేద్కర్, పెరియార్ వంటి అనేక మంది మేధావుల అభిప్రాయాలను పరిశీలించాను. ఆశ్చర్యకరంగా అంబేద్కర్ హిందూ పరిపాలన అసలు భారతదేశానికి సరిపడదని ఖచ్చితంగా చెప్పేయగా, పెరియార్ తన సహజసిద్ధమైన కరకు స్వరంతో ఇస్లాం హింసాత్మక స్వభావాన్ని

ప్రేరేపిస్తుందా, ప్రేరేపించనీయండి ఆ భయంతో అయినా ఆ మతంలో చేరినవాళ్ళని (అంటే దళితులనని ఆయన ఉద్దేశ్యం కావచ్చు). ఇతరులు గౌరవిస్తారు కదా అనేశాడు.

హేతువాదము, తర్కబుద్ధి కలిగిన ఎవరికైనా భారతదేశంలో నివసించే ముస్లింలు భారతీయులేనని అర్థమైపోతుంది. కాకపోతే సాధారణ ప్రజలందరు నిలకడైన తర్కాన్ని హేతువును కలిగి ఉండరు కనుక ప్రధాన స్రవంతి మేధావులు ఈ మైనారిటీ మేధావులతో గళం కలపాల్సిన అవసరం ఉందని ఈ పరిశోధన వలన నాకు తోచింది.

నన్నయ్యకు, తిక్కనకు ప్రతి తెలుగు పాఠ్య గ్రంథంలోను సముచిత స్థానాన్నిచ్చి గౌరవించే ప్రభుత్వం "మతము వేరైనా జాతి సమ్మతముగాదే" అని ప్రశ్నించిన ఉమర్ అలీషా లాంటి కవులను కూడా అంతే సముచిత రీతిన గౌరవించాల్సిన అవసరం ఉందని గుర్తించాలి. ఈ మైనారిటీ మేధువులు కూడా ప్రభుత్వాన్ని ఆ దిశగా నడిపించేందుకు గళాలు కలపాలి అనే ఒక అభిప్రాయం నాకు కలిగింది.

నా ఈ పరిశోధన కోసం అనేక కవితా సంకలనాలను కథా సంకలనాలను, విస్తృతంగా అధ్యయనం చేశాను. అందులో ప్రధానమైన, బలమైన గళాలను ఇక్కడ వినిపించాను. నా పరిశోధనాంశం ప్రధానంగా సమాజానికి, సంస్కృతికి సంబంధి కనుక ఇతర ప్రక్రియలలో కృషి చేసిన మైనారిటీ రచయితల రచనలను ఇక్కడ ప్రస్తావించలేదు.

ఏది ఏమైనా ఈ పరిశోధనలకు నేను పరిపూర్ణ న్యాయాన్ని చేకూర్చానని ఘంతాపథంగా చెప్పలేను. ఎందుకంటే సంపూర్ణత అనేది అన్ని విషయాలలోను, అన్నిసార్లు సాధ్యంకాదు గనుక. అదీ కాక, ఇది ఇప్పుడింకా నడుస్తున్న ఉద్యమం కనుక. కాకపోతే నాకు వీలైనంత వరకు ఈ రాష్ట్రంలోని సంప్రదాయ, ఆధునిక ముస్లింల సంస్కృతులను సమాజాన్ని అందులో మార్పు చేర్పులను వీలైనన్ని ఉదాహరణల ద్వారా సమర్థవంతంగా విశ్లేషించానని చెప్పగలను. ఇందుకు నా శక్తిమేర కృషి చేశానని భావిస్తున్నాను.

# ఉపయుక్త గ్రంథ సూచిక


1. అబ్దుల్ ఖాదర్ వేంపల్లి – చినుకు, విశ్వంబర పబ్లికేషన్స్, తిరుపతి, 2003.
2. అబ్దుల్ అలా మౌదూది మౌలానా సయ్యద్ ; (అను) హమీదుల్లా షరీఫ్ – దివ్య ఖురాన్, తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్, హైదరాబాద్ 1996
3. అన్వర్ (ప్ర.సం.) స్కై బాబ – అజా, దర్జి పబ్లికేషన్స్, హైదరాబాద్, 2002
4. అంబేద్కర్ – అంబేద్కర్ రచనలు, ప్రసంగాలు 1 & 4 సంపుటాలు, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణలు, హైదరాబాద్, 1994
5. ఆనంద్ తేల్‌తుంబ్డే (అను) చంద్రిక – ముస్లింలు – అంబేద్కర్ అపోహలు–వాస్తవాలు, కుల నిర్మూలనా ప్రచురణలు, హైదరాబాద్, 2003
6. ఇక్బాల్ చంద్ – ఆరోవర్ణం, మన్సూర్ ప్రచురణలు, సత్తుపల్లి, 2001
7. ఇస్మాయిల్ – నత్త ప్రణయ యాత్ర, ట్వింకిల్ పబ్లికేషన్స్, కాకినాడ,2004
8. ఉమర్ అలీషా – అనసూయాదేవి, ఉమర్ అలీషా కవి గ్రంథ ప్రచురణ సంఘం, పిఠాపురం, 1951
9. - do - – చంద్రగుప్త, ఉమర్ అలీషా కవి గ్రంథ ప్రచురణ సంఘం, పిఠాపురం, 1955
10. - do - – మహాభారత కౌరవ రంగం, శ్రీవిజ్ఞాన విద్యాపీఠం పిఠాపురం, 1936
11. - do - – ఖండకావ్యములు, శ్రీ విజ్ఞాన విద్యాపీఠం పిఠాపురం
12. - do - – బ్రహ్మ విద్యా విలాసం, ఉమర్ అలీషా కవి గ్రంథ ప్రచురణ సంఘం, పిఠాపురం, 1951
13. - do - – తత్వ సందేశం, ఉమర్ అలీషా కవి గ్రంథ ప్రచురణ సంఘం, పిఠాపురం, 1956
14. ఎల్లయ్య వేముల (సం) స్కైబాబ – ముల్కి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్ 2005
15. కవిత్రయం – ఆంధ్ర మహాభారతం, తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ, హైదరాబాద్, 2003
16. కరిముల్లాషేక్ – సాయిబు, మదర్ షంషూన్ ప్రచురణలు, వినుకొండ, 2004
17. కాత్యాయని విద్మహే (సం) – 20వ శతాబ్దము, రాజకీయార్థిక పరిణామాలు, తెలుగులో స్త్రీల సాహిత్యం, కాకతీయ యూనివర్సిటీ, వరంగల్, 2003

18. క్రాంతికార్ – ప్రపంచ ముస్లిం మేధావుల దృష్టిలో ఇస్లాం అంటే, హిమకర్ పబ్లికేషన్స్, రాజమండ్రి 2003

19. క్రాంతికార్(సం & సం) – నేనే తస్లిమా నస్రీన్‌ని, స్వీయ ప్రచురణ, ఖమ్మం, 2008

20. కృష్ణారావు జి.వి. – జేగంటలు, ప్రజా ప్రచురణలు, ఏలూరు, 1963

21. ఖదీర్‌బాబు మహమ్మద్ – ధాకన్, సాహితీ స్రవంతి ప్రచురణ, హైదరాబాద్, 2004

22. ఖదీర్‌బాబు మహమ్మద్ – పోలేరమ్మ బండ కథలు, కావలి ప్రచురణలు, కావలి, 2004

23. ఖదీర్‌బాబు మహమ్మద్ – దర్గామిట్ట కథలు, కావలి ప్రచురణలు, కావలి, 1999

24. ఖాదర్ మొహిద్దీన్ – పుట్టుమచ్చ, కవిత్వం ప్రచురణలు, విజయవాడ, 1991

25. ఖాసిం షేక్ – సాధుశీల శతకం, స్వీయ ప్రచురణ, నందిగామ

26. ఖాజా – ఫత్వా, కళా పబ్లికేషన్స్ పాల్వంచ, 1998

27. గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం – మానవహక్కుల వేదిక ప్రచురణలు, హైదరాబాద్.

28. గోపాలకృష్ణారావు కె. – తెలుగుపై ఉర్దూ పార్శికముల ప్రభావము, వెంకటరమణ ముద్రాణాలయం, వరంగల్ 1968

29. జాషువా – ఖండ కావ్యాలు, 2, చంద్రికా పబ్లిషింగ్ కంపెని, గుంటూరు సర్వధారినామ సం॥

30. దిలావర్ – గ్రౌండ్ జీరో, సమతా ప్రచురణలు, ఖమ్మం 2004

31. దిలావర్ – కర్బలా, సమతా ప్రచురణలు, ఖమ్మం, 1999

32. తిక్కన – నిర్వచనోత్తర రామాయణం, టిబిఆర్‌కె ప్రచురణ, గుంటూరు 2005

33. నజీర్ అహ్మద్ సయ్యద్ – భారత స్వాతంత్ర్యోద్యమం, ముస్లిం ప్రజా పోరాటాలు, ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, 2003

34. నూరాని.ఎ.జి. (అను) కలేకూరి ప్రసాద్ – ఇస్లాం – జిహాద్, ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్ 2003

35. పెరియార్ (అను) ప్రభాకర్ మందార – పెరియార్ దృష్టిలో ఇస్లాం అంటే, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 2005

36. బ్రహ్మ సూత్రాలు – సుఖబ్రహ్మాస్త్రం ప్రచురణలు, ఏర్పేడు, 1921

37. బుడెన్ సాహెబ్ షేక్ – జలాల్‌నామా, స్వీయ ప్రచురణ, 1969

38. బుడెన్ సాహెబ్ షేక్ – కుతుబ్‌నామా, స్వీయ ప్రచురణ, 1965

39. డా॥ మస్తాన్ షేక్ – తెలుగు సాహిత్యం, ముస్లింల సేవ, కరీమా పబ్లికేషన్స్, 1981

40. మహతి – యువభారతి ప్రచురణలు, హైదరాబాద్ 1972

41. మహేంద్ర దేవ్ – అభివృద్ధి, పేదరికం, ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్, 2008

42. మంజులత.ఎ (సం) - తెలుగులో కవితోద్యమాలు, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2003

43. మెహజబీన్ - ఆకురాలు కాలం, ప్రత్యామ్నాయ ప్రచురణలు, 1997

44. మైత్రేయోపనిషత్ (వ్యా) ఇరగం వీరభద్ర కవి - నవరత్న పబ్లికేషన్స్, విజయవాడ, 1992

45. యాకూబ్ - సరిహద్దు రేఖ, మాధ్యం ప్రచురణ, హైదరాబాద్ 2002

46. యాకూబ్ (ప్ర.సం.) నిర్మల కొండేపూడి - గుజరాత్ గాయం, లౌకిక ప్రజాస్వామిక, సాహిత్య సాంస్కృతిక వేదిక, హైదరాబాద్ 2002

47. రహమతుల్లా - బా, జంగ్లీ పబ్లికేషన్స్, హైదరాబాద్ 2004

48. రహమతుల్లా షానీ - భారతీయ ముస్లింలు నిన్న నేడు రేపు, ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్ 2000

49. రొమిలా థాపర్ సుమిత్ సత్కార్ - సెక్యులరిజం జీవనవిధానం, ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్, 1993

50. లక్ష్మీకాంతం - పింగళి - సాహిత్య శిల్ప సమీక్ష, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1991

51. వంశీకృష్ణ, అఫ్సర్, సీతారాం, ప్రసేన్ - కవిత్వం, రవళి ప్రచురణలు, ఖమ్మం 2001

52. వాల్మీకి (వ్యాఖ్యానం) వావిలి కొలను సుబ్బారావు - రామాయణం, శ్రీకోదండరామా సేవక్ సమాజం, తెనాలి 1964

53. విరసం - జిహాద్, విరసం ప్రచురణలు, ప్రకాశం, 1997

54. వెంకటేశ్వర రావు దార్ల - వీచిక, సాహితీ విమర్శ వ్యాసాలు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ 2009

55. సత్యాగ్ని - పాచికలు, మిత్ర సాహితీ సమితి, కడప, 1989

56. సతీష్ చంద్ర - మధ్య యుగాల భారతదేశ చరిత్ర, ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్ 2005

57. సదాశివ .ఎం - ఉర్దూ కవుల కవితా సామగ్రి, ఆంధ్ర సాహిత్య అకాడమీ, హైదరాబాద్ 1970

58. సలీం - నీలోకి చూసిన జ్ఞాపకం, కిన్నెర పబ్లికేషన్స్, హైదరాబాద్ 1999

59. సంజీవ దేవ్ - సంజీవదేవ్ వ్యాసాలు, తెలుగు అకాడమీ, హైదరాబాద్ 1999

60. సెర్గియ్ తకరోవ్ (అను) ఫాతిమా - చరిత్రలో మతాలు, ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్ 1998

61. స్కైబాబా (సం) - వతన్, కితాబ్‌గత్, నల్గొండ 2002-2004

62. స్కైబాబా (సం) - జల్‌జలా, నీల్‌గిరి సాహితీ నల్గొండ 1998
63. స్కైబాబా - లోహం, గోల్కొండ ముద్దెర, హైదరాబాద్ 2004
64. షమీఉల్లా .ఎన్ - మైనారిటీ కవిత్వం, తాత్విక నేపథ్యం, మెహరున్నీసా ప్రచురణలు, సికింద్రాబాద్ 2005
65. షాజహానా - నఖాబ్, కితాబ్ ఘర్, హైదరాబాద్ 2005
66. హనీఫ్ - ముఖౌటా, ఆసిఫ్ ప్రచురణలు, కొత్తగూడెం, 2002
67. హరికిషన్ .ఎన్ - నయా ఫత్వా, కర్నూల్ బుక్ ట్రస్ట్, కర్నూల్, 2001

ఇంగ్లీష్
The Communal Triangle in India - Ashok Mehta & Acharya Patwardan Kitabistan Publishings, Allahabad, 1942

పత్రికలు
మిసిమి - 2008 జూన్
ఆంధ్ర జ్యోతి - 1998, నవంబర్
ప్రజాశక్తి - 2003, జనవరి
ముల్కి - సాహిత్య ప్రత్యేక సంచిక, 2003-2004
ఇండియా టుడే - 1999

VI.13. హనీఫ్–నసీమా 224–225
VI.14. వలిహుస్సేన్ – 'బద్‌జన్వర్' 225–226
VI.15. ఇక్బాల్‌చంద్ – మౌల్విసాబ్ 226
VI.17. స్కైబాబ – దావా 227
VI.18. అఫ్సర్ గోరీమా 228
VI.19. విన్నెస్ ఖలందర్ – పిల్లిమెడ గంట 228
VI.20. సత్యాగ్ని – యంత్రం 228–229
VI.21. అక్కంపేట ఇబ్రహీం – ఫతహ్ 229–230
VI.22. షెహనాజ్ – స్వయంకృతం 230–231
VI.23. ఎస్. నూరుల్లా – గరీబ్ జిందగీ 231–232
VI.24. వేంపల్లి ఖాదర్ – తుర్కోని సేద్యం 232
VI.25. ఇనాయతుల్లా – ఘోస్‌లా 232–234

**VII. ముస్లిం రచయితల రాజకీయ ధోరణులు జాతీయ భావనలు 237–248**
VII.1. ముస్లిం రచయితలు – జాతీయ భావనలు 249–257
ముగింపు
ఉపయుక్త గ్రంథ సూచిక